


మనసులో
# మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 198: మంగళవారం 17 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు32:- వెలరూ/ 9-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

## ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి

ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు



4

## గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

తైవాన్ దిశగా నౌకలు, విమానాల మొహరింపు



4

## అన్ని రాష్ట్రాల్లోనూ గ్యాస్ నిల్వలు

వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన



4



పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ

# ఓ చరిత్ర

## స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం

- అహింసా మార్గంలో ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి
- 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం
- అమరావతిలో ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, మార్చి 16(మనసులో మాట):** అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహా విష్కరణ ఒక చరిత్ర అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణిం చారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామ కరణం చేశామని చెప్పారు. అహింసా మార్గంలో ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాముల త్యాగం ఈ తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో అమరజీవి పొట్టి శ్రీరాముల 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మిగతా 2 లో

## ఒక మనిషి త్యాగం.. ఒక జాతి గౌరవం

నివాళి అర్పించిన మంత్రి లోకేశ్ 2



## తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు

నివాళి అర్పించిన డిప్యూటీ సీఎం పవన్ 2



నలుగురికి
## యావజ్జీవ కారాగారం

కడియం మహిళ హత్యాచారం కేసులో రాజమండ్రి కోర్టు సంచలన తీర్పు

.. వివరాలు 3లో



## వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు విచారణ

19వ తేదీలోపు అఫిడవిట్ ఫైల్ చేయాలని ఆదేశం

.. వివరాలు 3లో



లొంగిపోయిన
## సిద్ధార్థ్ రెడ్డి

నటి ప్రత్యూష కేసులో మరో కీలక పరిణామం

.. వివరాలు 3లో



## శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు

యాగప్రవేశంతో ప్రారంభం

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ఆలయ యాగశాలలో అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వివరాలు 2వ పేజీలో

## దడపుట్టిస్తున్న పెద్దపులి సంచారం

17 రోజులుగా శ్రమిస్తున్న అటవీ అధికారులు



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 17 రోజులుగా పెద్దపులి సంచారం అక్కడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. పులిని పట్టుకునేందుకు అటవీశాఖ ప్రత్యేక బృందాల ప్రయత్నాలు కొనసాగుతున్నా ఇప్పటివరకు ఫలితం లేదు. ఆదివారం రాత్రి శంఖవరం మండలం మండపం వద్ద పోలం బూరయ్య అనే రైతు గేదె దూడపై పులి దాడి చేసింది. ప్రస్తుతం శంఖవరం మండలం, జి.కొత్తపల్లి సమీపంలో పెద్దపులి, ప్రత్తిపాడు లేదా రౌతులపూడి మండలాల వైపు పులి ప్రయాణించే అవకాశముందని, మూడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరికలు జారీ చేసింది. 2



## పదోతరగతి పరీక్షలు ప్రారంభం

- గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- అర గంట ముందుగానే లోపలికి అనుమతి
- క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతి
- విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్

3

హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో
## కీలక ఘట్టం

స్టీల్ డయాగ్రిడ్ పనులను ప్రారంభించిన మంత్రి నారాయణ 2





## జూన్ కోటా శ్రీవారి ఆర్జిత సేవలు

18న ఆన్‌లైన్‌లో విడుదల 3

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# ఒక మనిషి త్యాగం.. ఒక జాతి గౌరవం

## నివాళి అర్పించిన మంత్రి లోకేశ్

**అమరావతి, మార్చి 16(మనసులో మాట):** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా అమరావతి లోని శాఖమూరులో 58 అడుగుల ఎత్తైన భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను 'ఉస్తాద్ భగత్ సింగ్' అని మంత్రి సంబోధించారు. 'ఒక మనిషి త్యాగం ఒక జాతి గౌరవం. ఒక మనిషి మరణం ఒక రాష్ట్రం' అని అమరజీవి త్యాగాన్ని స్మరించుకున్నారు. 'అమరజీవి... చిరంజీవి' అని పేర్కొన్నారు. ఈ విగ్రహానికి 'ఏపీ ఆత్మగౌరవం స్టాట్యూ ఆఫ్ సాక్రి÷ల్గ÷స్' అనే పేరు పెట్టాలని కోరినట్లు లోకేశ్ తెలిపారు. యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను కలసి హామీ ఇచ్చానని.. 'అమరావతిలోనే పొట్టి శ్రీరాములు విగ్రహం పెడతామని చెప్పి.. చేసి చూపించాం' అని మంత్రి గుర్తుచేశారు. ఒక రోజు ఉపవాసం చేయాలంటే ఇబ్బంది పడతామని... కానీ తెలుగు ప్రజల కోసం, జాతి కోసం పొట్టి శ్రీరాములు దీక్ష చేశారన్నారు. ఈ చరిత్రను భావితరాలు గుర్తుపెట్టుకునే విధంగా ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేశామని వెల్లడించారు. అనుకున్న సమయానికి విగ్రహం సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. ఆర్యవైశ్య సోదరులను ఆదర్శంగా తీసుకోవాలని సీఎం క్యాబినెట్‌లో చెప్పానని లోకేశ్ పేర్కొన్నారు. దళితులకు ఆలయ ప్రవేశం కోసం అమరజీవి కృషి చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే యువగళం పాదయాత్ర చేశానని చెప్పుకొచ్చారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం మొదటి అడుగు ఆయనే వేశారన్నారు. పొట్టి శ్రీరాములు పేరుతో ఒక కాయిన్ రిలీజ్ చేయాలని కోరానని.. కేంద్రంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు

## యాగప్రవేశంతో ప్రారంభం



**నంద్యాల, మార్చి 16 (మనసులో మాట)::** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ఆలయ యాగశాలలో అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాల ప్రవేశంతో ఉగాది మహోత్సవాలకు ఆలయ ఈవో శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు. నేటి సాయంత్రం స్వామి, అమ్మవారికి భృంగి వాహన సేవ ఘనంగా నిర్వహించనున్నారు. తర్వాత పురవీధుల్లో శ్రీస్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉగాది మహోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీ కారణంగా నేటి నుంచి ఈ నెల 20 వరకు భక్తులందరికీ శ్రీస్వామివారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. స్పర్శ దర్శనం, సాధారణ దర్శనంపై పరిమితులు విధించారు. ఆలయ క్యూలైన్లు కన్నడ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నల్లమల అడవి మార్గాల ద్వారా పాదయాత్రగా వచ్చిన లక్షలాది కన్నడ భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. స్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతోంది. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో 16 నుంచి 20 వరకు ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# నెల్లూరు వైసిపి నేత కామిరెడ్డి అరెస్ట్



**నెల్లూరు, మార్చి 16 (మనసులో మాట)::** నెల్లూరు జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, చిల్లకూరుకు చెందిన కీలక నేత కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. సత్యనారాయణ రెడ్డి ప్రయాణ సమాచారం అందుకున్న పోలీసులు, ఆయనను రేణిగుంట విమానాశ్రయం వద్ద అదుపులోకి తీసుకున్నారు. కలవకూరు సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద గతంలో జరిగిన ఒక దాడి ఘటనకు సంబంధించి నమోదైన కేసులో ఈ అరెస్ట్ జరిగినట్లు తెలుస్తోంది. కనది పరివాహక ప్రాంతంలో జరిగిన ఘర్షణలు, భౌతిక దాడులకు సంబంధించి నమోదైన కేసులో సత్యనారాయణ రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదే కేసులో పెళ్లకూరు మండల ఎంపీపీ శేఖర్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లాలో బలమైన పట్టున్న కామిరెడ్డి అరెస్ట్ తో స్థానిక వైసీపీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది.

# పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఓ చరిత్ర

మొదటి పేజీ తరువాయి

నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, టీజీ భరత్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరు సమీపంలో 6.8 ఎకరాల్లో నిర్మిస్తున్న స్మృతివనంలో అమరజీవి 125వ జయంతి వేడుకలను భారీస్థాయిలో నిర్వహించడానికి ఆర్యవైశ్య సంఘాలు, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పొట్టి శ్రీరాములు అందరివాడని భావించి.. ప్రతి ఒక్కరూ ఈ విగ్రహావిష్కరణ కోసం కృషి చేశారన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తయితే ఈ విగ్రహం మరింత అద్భుతంగా కనిపిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. స్ఫూర్తికి మారు పేరు ఆర్యవైశ్య సంఘమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు పనిచేశారని తెలిపారు. అలాగే అనేక సామాజిక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధించి పెట్టారని చెప్పారు. ఇక రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతోమంది రైతుల త్యాగం ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారీ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించారని వివరించారు.




రాజధాని లేని రాష్ట్రంలో వైసీపీ.. మూడు ముక్కలాట ఆడిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని గత పాలకులు స్మశానం అని అవహేళన చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని వివరించారు. రెండో దశ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ వినియోగించారని సీఎం చంద్రబాబు చెప్పారు. గత ప్రభుత్వం పాలనతో బ్రాండ్ దెబ్బతిన్నదని.. తెలుగు జాతి ఇబ్బంది పడిందని గుర్తించి తాను, పవన్ కళ్యాణ్ ఇద్దరం కలసి నిలబడి.. బీజేపీతో కలిసి కూటమిగా జత కట్టామని వివరించారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అమరావతిని మూడు ఏళ్లలో ఒక స్థాయికి తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో ఖర్చు ప్రభుత్వం డబ్బు కాదని.. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని ఏపీ సీఎం వివరించారు. అమరావతి వల్ల సంక్షేమం సక్రమంగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మొన్నటి వరకూ ఆర్య వైశ్యులు వ్యాపారాలు చేసుకోవాలన్నా భయపడుతూ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రూ. 10 సంపాదిస్తే అందులో రూ.2 దానం చేసేది ఆర్య వైశ్య కులమని తెలిపారు. ఆర్య వైశ్యులను అనేక విధాలుగా పిలుస్తారని.. అందరిని అదే పేరుతో పిలచేలా త్వరలోనే జీవో జారీ చేస్తామని ప్రకటించారు. పొట్టి శ్రీరాములకు నిజమైన నివాళి ఇవ్వడమంటే.. ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమేనని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు




- నివాళి అర్పించిన డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి, మార్చి 16(మనసులో మాట)::** తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మద్రాస్ ప్రెసిడెన్సిలో తెలుగు ప్రజల ఇబ్బందులను ఆయన గుర్తించి.. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళిగా 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన 125వ జయంతి సందర్భంగా అమరావతిలోని శాఖమూరులో ఈ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. పొట్టి శ్రీరాములు మన గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహానుభావుడని అన్నారు. స్వాతంత్ర్య సమర కాలంలో మహాత్మా గాంధీ 'నా వెంట 11 మంది ఉంటే దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాగలను' అన్న మాటలను గుర్తుచేశారు. అలాంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక

# దడపుట్టిస్తున్న పెద్దపులి సంచారం

## 17 రోజులుగా శ్రమిస్తున్న అటవీ అధికారులు

**కాకినాడ, మార్చి 16 (మనసులో మాట):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 17 రోజులుగా పెద్దపులి సంచారం అక్కడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. పులిని పట్టుకునేందుకు అటవీశాఖ ప్రత్యేక బృందాల ప్రయత్నాలు కొనసాగుతున్నా ఇప్పటివరకు ఫలితం లేదు. ఆదివారం రాత్రి శంఖవరం మండలం మండపం వద్ద పోలం బూరయ్య అనే రైతు గేదె దూడపై పులి దాడి చేసింది. ప్రస్తుతం శంఖవరం మండలం, జి.కొత్తపల్లి సమీపంలో పెద్దపులి, ప్రత్తిపాడు లేదా రౌతులపూడి మండలాల వైపు పులి ప్రయాణించే అవకాశముందని, మూడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరికలు జారీ చేసింది. కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గత 16 రోజులుగా పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజల్లో భయందోళనలు సృష్టిస్తున్న ఈ పులి ప్రస్తుతం శంఖవరం మండలంలోని ఉరకొండ పరిసరాల్లో కనిపించినట్లు సమాచారం. అటవీశాఖ అధికారులు పులిని పట్టుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఇప్పటి వరకు అవి ఫలించలేదు. ఈ పరిస్థితి అధికారులకు పెను సవాల్‌గా మారింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీశాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా పర్యవేక్షణ చేపట్టి పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. 16 రోజులుగా ఈ పెద్దపులి పలు గ్రామాల్లో సంచరిస్తోంది. మొదట అడవులకు సమీపంలోని గ్రామాల్లో కనిపించిన పులి, క్రమంగా మానవ నివాసాల దగ్గరకు రావడం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది. గ్రామస్థులు



రాత్రి సమయంలో బయటకు వెళ్లడానికి కూడా భయపడుతున్నారు. కొంతమంది రైతులు తమ వ్యవసాయ పనులను వాయిదా వేసుకున్నారు. పశువులను బయట మేపేందుకు కూడా భయపడుతున్న పరిస్థితి ఏర్పడింది. అటవీశాఖ అధికారులు మొదటి రోజు నుంచే పులిని గుర్తించేందుకు, దాని కదలికలను గుర్తించేందుకు ప్రయత్నాలు చేశారు. పులి అడుగుల ముద్రలు, కెమెరా ట్రాప్‌లు, స్థానికుల సమాచారం ఆధారంగా దాని సంచారాన్ని గమనిస్తున్నారు. అయినప్పటికీ పులి అధికారుల నుంచి తప్పించుకుంటోంది. ప్రస్తుతం ఈ పులి శంఖవరం మండలంలోని ఉరకొండ ప్రాంతంలో తిరుగుతున్నట్లు సమాచారం. ఇది అడవులతో కూడిన కొండ ప్రాంతం కావడంతో పులికి దాక్కునేందుకు అనుకూలంగా ఉంది. అదే సమయంలో ఈ ప్రాంతానికి సమీపంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఉండటం అధికారులను మరింత అప్రమత్తం చేసింది. ఉరకొండ సమీపంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్టీవో, ఐసీడీఎస్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, విద్యుత్ శాఖ కార్యాలయాల వంటి ప్రభుత్వ విభాగాలు ఉన్నాయి. అదేవిధంగా ఎస్సీ బాలుర హాస్టల్, కస్తూర్బా పాఠశాల, కళాశాలలు కూడా ఈ ప్రాంతంలో ఉన్నాయి. అందువల్ల విద్యార్థులు, ఉద్యోగుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ట్రాంక్విలైజర్ గన్స్‌తో కూడిన సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. పులి తరచూ సంచరిస్తున్న ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశారు. పులి అడుగుల జాడలను పరిశీలిస్తూ దాని కదలికలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే పులిని పట్టుకునేందుకు బోన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే పులి చాకచక్యంగా ఉండటంతో ఇప్పటి వరకు ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కొన్నిసార్లు పులి కనిపించినట్లు సమాచారం వచ్చిన వెంటనే అధికారులు అక్కడికి చేరుకునే సరికి అది మరో ప్రాంతానికి వెళ్లిపోతుంది. ప్రస్తుతం పులి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు, అది రౌతులపూడి మండలంలోకి వెళ్లే అవకాశం ఉందా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఉరకొండ నుంచి ఆ ప్రాంతానికి వెళ్లే అడవి మార్గాలు ఉన్నందున అటువైపు కూడా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో రౌతులపూడి మండలంలోని గ్రామాల్లో కూడా అప్రమత్తత చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగం సూచించింది. గ్రామాల్లో మైకుల్లో ప్రకటనలు చేయిస్తూ ప్రజలను జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

# హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం

## స్టీల్ డయాగ్రిడ్ పనులను ప్రారంభించిన మంత్రి నారాయణ

**అమరావతి, మార్చి 16 (మనసులో మాట):** రైతులకు ఇచ్చిన మాట ప్రకారమే రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం చోటు చేసుకుంది. టవర్ -1కు మొదటి స్టీల్ డయాగ్రిడ్‌ను అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రారంభించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతిలో జీఏడీ, హెచ్ఓడీలకు మొత్తం 5 టవర్లు డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మిస్తున్నామని తెలిపారు. జీఏడీ టవర్ మొత్తం 47 అంతస్తులతో మిగిలిన టవర్లు 40 అంతస్తులతో నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. మొత్తం 53 లక్షల చదరపు అడుగు బిల్ట్ ఏరియాతో ఈ ఐదు టవర్ల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా ఈ టవర్ల నిర్మాణం ఎ÷-లాన్ చేశామన్నారు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా ఒకే చోట అన్ని కార్యాలయాలు ఉండేలా డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు. 2028 అక్టోబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిందని తెలిపారు. ట్రంక్ రోడ్లు, లేఅవుట్ రోడ్లతోపాటు ప్రైవేట్ సంస్థల నిర్మాణాలు సైతం ప్రారంభమయ్యాయన్నారు. రాజధాని అమరావతిలో డయాగ్రిడ్ విధానంలో ఐదు ఐకానిక్ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.



## అమరజీవి విగ్రహంపైనా విమర్శలా

**దోపిడీ న ఏతలకు త్యాగాలు ఎలా రుచిస్తాయి**

**వైసిపి నేతల తీరుపై మండిపడ్డ మంత్రి నిమ్మల**

**అమరావతి,మార్చి16 (మనసులో మాట):** అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న విమర్శలు అత్యంత దుర్మార్గమని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. కేవలం దోపిడీలు, లూటీలకు అలవాటుపడిన వైసీపీ నేతలు, దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాల విలువ ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. సోమవారం అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పాలనపై, ఆయన వ్యక్తిత్వంపై నిమ్మల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ద్రోహం, ఎవరికీ సాయం చేయకూడదనేది జగన్ డీఎన్ఏలోనే ఉంది. సొంత తల్లి, చెల్లిని కూడా మోసం చేసిన చరిత్ర ఆయనది. గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం సుమారు రూ.14 లక్షల కోట్ల అప్పులు చేసి, ఏపీ ఆర్థిక వ్యవస్థను కుప్ప కూల్చారు. రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టి అడ్డగోలుగా అప్పులు చేశారు. ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయో జగన్ సమాధానం చెప్పాలి. పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేస్తే.. జగన్ అధికారం కోసం ఆస్తులను, వ్యవస్థను దోచుకున్నారు. త్యాగధనుల విగ్రహాలపై విమర్శలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. వైసీపీ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ప్రజల సొమ్మును రక్షిస్తాం' అని అన్నారు.

## వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు విచారణ

**19వ తేదీలోపు అఫిడవిట్ ఫైల్ చేయాలని ఆదేశం**



**హైదరాబాద్, మార్చి 16(మనసులో మాట)::** సోమవారం సీబీఐ ప్రత్యేక కోర్టులో మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను నిందితులకు అందజేశామని సీబీఐ అధికారులు కోర్టుకు తెలిపారు. ఇదే సమయంలో నిందితుల తరఫు లాయర్లకు కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సీబీఐ నుంచి కేసు వివరాలు అందినట్లు అఫిడవిట్ ఫైల్ చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ నెల 19వ తేదీ లోపు అఫిడవిట్‌ను సమర్పించాలని స్పష్టం చేసింది. కేసులో తదుపరి న్యాయ ప్రక్రియలు కొనసాగేందుకు అవసరమైన పత్రాలను సమయానికి దాఖలు చేయాలని కూడా కోర్టు సూచించింది. నిందితుల నుంచి అఫిడవిట్లు వచ్చిన అనంతరం తదుపరి దశలో విచారణ కొనసాగిస్తామని పేర్కొంది. తదుపరి విచారణను బుధవారానికి సీబీఐ కోర్టు వాయిదా వేసింది. దీంతో వివేకా హత్య కేసు విచారణలో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని అభిప్రాయ పడుతున్నారు. రోవైపు వివేక హత్య కేసుపై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పలు వ్యాఖ్యలు చేశారు. 'వివేకా కేసులో సునీత పోరాటం న్యాయం కోసమేనా?. ఆమె ప్రతిసారి కోర్టుకు వెళ్తూ దర్యాప్తును అడ్డుకుంటున్నారు. మేము నిర్దోషులం అని నిరూపించుకుంటాం. సీబీఐ, కోర్టును విమర్శించేలా సునీత మాట్లాడారు. గుండెపోటు స్టోరీ పుట్టించిందే సునీతా రెడ్డి. వివేకా వేరే సంబంధాల గురించి దస్తగిరి చెప్పినా... ఆ కోణంలో దర్యాప్తు చేయడం లేదు' అని ఎంపీ అవినాష్ రెడ్డి అన్నాడు.

## అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

**నంద్యాల, మార్చి 16(మనసులో మాట)::** మండలంలోని ముత్తలూరు గ్రామ మెట్ట సమీపంలో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు. ఆదివారం రాత్రి అహోబిలం వైపు నుంచి ఆళ్లగడ్డ కు వస్తున్న కారు ముత్తలూరు మెట్ట మలుపు దగ్గర అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలు అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడినవారిని 108 వాహనం ద్వారా ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అన్నారు. కారులో ప్రయాణిస్తున్నవారు తెలంగాణ వాసులుగా తెలుస్తోంది. ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జూన్ కోటా శ్రీవారి ఆర్జిత సేవలు

- 18న ఆన్‌లైన్‌లో విడుదల

**తిరుమల,మార్చి16 (మనసులో మాట):** భక్తుల సౌకర్యార్థం జూన్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ టికెట్లకు ఎలక్ట్రానిక్ డిప్‌లో పేర్ల నమోదు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే వెబ్‌సైట్‌లో ప్రారంభం కానుంది. ఈ టికెట్లకు ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం డిప్‌లో ఎంపిక చేస్తారు. డిప్‌లో ఈ-టికెట్లు పొందిన వారు మార్చి 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. 23న ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24 ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో



విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. భక్తులు టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

# పదోతరగతి పరీక్షలు ప్రారంభం

- గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- అర గంట ముందుగానే లోపలికి అనుమతి
- క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతి
- విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్



**అమరావతి, ఫిబ్రవరి 16 (మనసులో మాట):** ఏపిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం నాడు ప్రారంభం అయ్యాయి. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యా శాఖ అధికారులు సూచించడంతో గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను వారి తల్లి తండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు వెంట వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చారు. బస్సులో, ఆటోల్లో, బైక్ లు మీద తల్లి తండ్రులు, ప్రైవేటు స్కూళ్లు యాజమాన్యాలు విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు హాల్ టికెట్స్ నెంబర్ ఆధారంగా రూం కేటాయింపు చూసుకున్నారు. అనంతరం ఆరగంట ముందు విద్యార్థులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. విద్యార్థులు దగ్గర ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయా అనేది చెక్ చేసి పరిశీలించి లోపలికి పంపించారు. బాలురకు పురుషులు, బాలికలకు స్త్రీ సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఏప్రిల్ 1వ తేదీతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో 10 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థుల హాల్ టికెట్ చూపించి, ఆర్టీసీ బస్సుల్లో పరీక్షా కేంద్రాలకు ఉచితంగా చేరుకోవచ్చు. ఈ ఏడాది మొత్తం 6,40,916 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు వెంట వచ్చిన తల్లి తండ్రులు,ఉపాధ్యాయులు స్నేహితులు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ వారికి ధైర్యం చెబుతూ శుభాకాంక్షలు తెలియజేసారు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఏ మాత్రం ఒత్తిడికి గురికావద్దు. ప్రశాంతంగా ఉండండి అంటూ విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. ఈ పరీక్షల్లో 100 శాతం మీ ప్రతిభను ప్రదర్శించే సమయం ఇదని విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు రాయండంటూ వారికి ఆయన స్పష్టం చేశారు. విజయం మీదే. ఆల్ ది బెస్ట్ అంటూ వారికి మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా 10వ తరగతి విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు.

### పరీక్ష హాలులో పాము ప్రత్యక్షం

**కడప:** కడప జిల్లా బి.కోడూరులోని పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి పాము రావడం కలకలం రేపింది. పామును చూసిన విద్యార్థులు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. వెంటనే అక్కడి సిబ్బంది పామును చంపి బయటపడేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉదయమే పరీక్షకు హాజరైన విద్యార్థులు తమకు కేటాయించిన రూమ్‌లోకి ఎంటర్ అయ్యారు. అక్కడ లోపల ఉన్న పామును చూసి అరుస్తూ విద్యార్థులు బయటకు పరుగులు తీసారు. విషయం తెలిసిన అధికారులు వెంటనే పామును పట్టుకునే ప్రయత్నం చేశారు. పామును పట్టుకుని తరలించడంతో ఊపిరి పీల్చుకున్నారు. చివరకు ప్రశాంతంగా పరీక్షహాల్లోకి ఎంటర్ అయ్యారు.



## నలుగురికి యావజ్జీవ కారాగారం

**కడియం మహిళ హత్యాచారం కేసులో రాజమండ్రి కోర్టు సంచలన తీర్పు**



**రాజమండ్రి, మార్చి 16 (మనసులో మాట):** తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీలో గతేడాది వివాహితపై జరిగిన సామూహిక అత్యాచారం మరియు హత్య కేసులో రాజమండ్రి కోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. నిందితులైన నలుగురు యువకులకు మరణం వరకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన రౌతు కస్తూరి (43) స్థానిక నర్సరీలో పని చేసేవారు. 2024 అక్టోబర్ 15న ఆమె పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో, మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు ఆమెను అడ్డగించారు. ఆమె కాళ్లు చేతులు కట్టేసి నర్సరీ మొక్కల మధ్యకు తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం తమ నేరం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో ఆమెను హత్య చేసి, సమీపంలోని ప్రధాన పంట కాలువలో పడేశారు. అక్టోబర్ 17న ఆమె మృతదేహం లభ్యమవ్వడంతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఈ కేసులో బుర్రిలంకకు చెందిన దేవర యేసు (21), వెలుబుడి ప్రవీణ్ (21), లోకిన జయప్రసాద్ (19) మరియు పొట్టిలంకకు చెందిన దాసరి సురేష్ (22)లను అరెస్ట్ చేశారు. సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ నేతృత్వంలో పోలీసులు వేగంగా దర్యాప్తు పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు. రాజమండ్రి నాలుగవ అదనపు జ్యుడీషియల్ కోర్టు ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో విచారించింది. నిందితుల నేరం రుజువు కావడంతో, న్యాయమూర్తి వారికి మరణం వరకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ప్రకటించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ, మహిళలపై జరిగే నేరాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కేవలం 11 నెలల్లోనే విచారణ పూర్తి చేసి, మొత్తం 14 నెలల్లోనే బాధితురాలి కుటుంబానికి న్యాయం చేకూర్చామని ఆయన వెల్లడించారు. జిల్లాలో పోక్సో మరియు మహిళా వేధింపుల కేసులు తగ్గుముఖం పట్టేలా కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

# లొంగిపోయిన సిద్ధార్థ్ రెడ్డి

**నటి ప్రత్యూష కేసులో మరో కీలక పరిణామం**

**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):** తెలుగు రాష్ట్రాలో ఒకప్పుడు సంచలనం సృష్టించిన సినీనటి ప్రత్యూష మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడిగా ఉన్న సిద్ధార్థ్ రెడ్డి 24 ఏళ్ల తర్వాత మీడియా ముందుకు వచ్చాడు. సుప్రీంకోర్టు తుది తీర్పు మేరకు ఆయన హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. ఈ కేసు రెండు దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో కొనసాగుతోంది. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తుది తీర్పుతో కేసులో మరో కీలక మలుపు తిరిగింది.

**అమెరికాలో స్థిరపడిన సిద్ధార్థ్ రెడ్డి**

నటి మరణ ఘటన తర్వాత సిద్ధార్థ్ రెడ్డి అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. చాలాకాలంగా విదేశాల్లో ఉన్న ఆయన, సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో భారత్‌కు వచ్చి కోర్టులో లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని చెప్పడంతో, ఆ గడువు లోపే నాంపల్లి కోర్టుకు వచ్చి సమర్పణ చేశాడు. ఈ ఘటన 2002 ఫిబ్రవరి 23వ తేదీన జరిగింది. అప్పట్లో నటి ప్రత్యూష, సిద్ధార్థ్ రెడ్డి ఇద్దరూ కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన తర్వాత ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రత్యూష ప్రాణాలు కోల్పోయింది. అయితే సిద్ధార్థ్ రెడ్డి చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ సంఘటన ఆ సమయంలో తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద సంచలనంగా మారింది. ప్రత్యూష మృతి తర్వాత ఆమె కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆమె తల్లి ఈ ఘటనపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదని, హత్య జరిగి ఉండొచ్చని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమె తల్లి న్యాయపోరాటం ప్రారంభించారు. కేసును కోర్టులో కొనసాగిస్తూ నిజం బయటకు రావాలని పట్టుదలగా పోరాడారు. పోలీసుల దర్యాప్తు అనంతరం సిద్ధార్థ్‌రెడ్డిపై ఆత్మహత్యకు ప్రేరేపించినట్లుగా అభియోగాలు నమోదయ్యాయి. కేసు ట్రయల్ కోర్టులో విచారణకు వచ్చింది. ట్రయల్ కోర్టు విచారణలో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.

**హైకోర్టు శిక్ష తగ్గింపు**

ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును పరిశీలించిన తెలంగాణ హైకోర్టు శిక్షను కొంత తగ్గించింది. ఐదేళ్ల జైలు శిక్షను రెండు సంవత్సరాలకు తగ్గిస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థ్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు చాలాకాలం పాటు సుప్రీంకోర్టులో విచారణలో కొనసాగింది. చివరకు సుప్రీంకోర్టు హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సిద్ధార్థ్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

**నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం..**

తుది తీర్పులో భాగంగా సుప్రీంకోర్టు సిద్ధార్థ్‌రెడ్డికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. నాలుగు వారాల్లోగా కోర్టులో లొంగిపోవాలని



ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు ఆయన హైదరాబాద్‌కు వచ్చి నాంపల్లి కోర్టులో లొంగిపోయారు.

**24 ఏళ్ల తర్వాత మరోసారి చర్చలో కేసు..**

దాదాపు 24 ఏళ్ల తర్వాత ఈ కేసు మళ్లీ వార్తల్లోకి వచ్చింది. నటి ప్రత్యూష మరణం అప్పట్లో తెలుగు సినీ పరిశ్రమను కుదిపేసిన ఘటనగా గుర్తింపు పొందింది. ఇప్పుడు సుప్రీంకోర్టు తుది తీర్పుతో ఈ కేసులో న్యాయపరమైన ప్రక్రియ కీలక దశకు చేరుకుంది.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# మరికొన్నాళ్లు గ్యాస్ సంక్షోభం

దేశంలో గ్యాస్ కోసం ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. కమర్షిల్ గ్యాస్ అస్సలు లభించడం లేదు. దీంతో హోట్ పరిశ్రమ కుదేలయ్యింది. దేశవ్యాప్తంగా హోటళ్లు మూతపడ్డాయి. కార్మికులు రోడ్డున పడ్డారు. తిరిగి క ట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నారు. తీవ్ర కాలుష్యంతో ఢిల్లీలో కట్లె పొయ్యిలను అనుమతించని ప్రభుత్వం తిరిగి అక్కడ కట్టెల పొయ్యిలకు అనుమతించింది. దీంతో గ్యాస్ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవచ్చు. దీనికి ఎవరిని నిందించి కూడా ప్రయోజనం లేదు. ఉన్న గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. పానిక్ బుకింగ్స్ వల్ల చాలామందికి ఇబ్బంది ఎదురవుతోంది. అలాగే సిలిండర్లను బ్లాక్‌లో అమ్ముకుం టున్నారు. దీనికి ముందుగా చెక్ పెట్టాలి. గ్యాస్ సరఫరాలపై విజిలెన్స్ నిఘా పెట్టాలి. నల్లబజారుకు తరలకుండా చూడాలి. అలాగే హోటల్ పరిశ్రమను ఆదుకునే ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో రెండు ఇంధన నౌకలు హర్మూజ్ జలసంధి దాటి భారత్ చేరుకున్నాయి. ఇది కొంత ఊరటనిచ్చే అంశం. పర్షియన్ గల్ఫ్ నుంచి బయటకు వెళ్లే ఏకైక సముద్ర మార్గమైన హోర్మూజ్ జలసంధిని మూసివేస్తు న్నట్లు ఇరాన్ ప్రకటించింది. జలసంధి నిండా వందలాది ట్యాంకర్లు నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధర యుద్ధానికి ముందు బ్యారెల్‌కు 65 అమెరికన్ డాలర్లుగా ఉండగా, ఇప్పుడది వంద డాలర్లకు పెరిగింది. ఇదే పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో ధర మరింతగా పెరగడం ఖాయమన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఇరాన్‌కు సమీపంలోని 33 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో దాదాపు ఐదవ వంతు సాగుతుంది. మన దేశం రోజుకు సగటున 40 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకుంటూ ఉండగా, అందులో 55 శాతం దీని ద్వారానే వస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడితో మన దేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమ ఆసియా అంతా యుద్ధ మేఘాలు విస్తరిస్తున్నాయి. అమెరికా ఇరాన్‌పై చేసిన దాడి 16వ రోజుకు చేరుకుంది. ప్రతి బ్యారెల్ చమురు ధరలో ఒక డాలర్ పెరుగుదల చోటుచేసుకున్నా, భారత్‌పై సంవత్సరానికి 200 కోట్ల రూపాయల అదనపు దిగుమతి భారం పడుతుందని అంచనా! అధికారిక సమాచారం ప్రకారం 2024–25లో చమురు దిగుమతుల కోసం మన దేశం సుమారుగా 11.5 లక్షల కోట్ల రూపాయల (137 బిలియన్ డాలర్లు)ను ఖర్చు చేసింది. ఏకపక్షంగా యుద్ధానికి కాలుదువ్విన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ప్రస్తుతం నాలుగు నుండి ఐదు వారాలు' కొనసాగవచ్చని చెబుతున్నారు. ఇరాన్ ప్రతిఘటన తీరును గమనిస్తున్న పరిశీలకులు యుద్ధం అంతకన్నా ఎక్కువ రోజులే సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా పెరిగే దిగుమతి ఖర్చుల వల్ల విదేశీ లోటు పెరిగి వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తుందని, రూపాయిపై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దేశీయ ట్రేడ్ సూచికలు పతనోన్ముఖానే వున్నాయి. మరోవైపు మన దేశం వద్ద ఉన్న చమురు నిల్వలు మరో 40–45 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా వద్ద దాదాపు ఆరునెలలకు సరిపడే నిల్వలు ఉండటం అక్కడి పాలకుల ముందు చూపునకు నిదర్శనం. రష్యా నుండి దిగుమతులుతగ్గాయి. ఇప్పుడు ఇరాన్‌పై అమెరికా చేసిన దాడి, హోర్మూజ్ జలసంధి మూసివేతతో మన దేశ ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారినప్పటికీ ఇరాన్ భారత్ పట్ల అనుకూలత ప్రదర్శించింది. 40 రోజులకు సరిపడే నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ యుద్ధ తీవ్రత కొనసాగితే పెట్రో ధరలు పెరగక తప్పవన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే దాని ప్రభావంతో నిత్యావసర వస్తువులతో పాటు, అన్ని రకాల వినియోగ సరుకుల మీద ఉంటుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే జరిగితే, దేశ వ్యాప్తంగా సామాన్యుల కష్టాలు మరింత పెరగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంధన సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చమురు సరఫరా వనరులను విస్తరించేందుకు కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా హోటల్ పరిశ్రమలను ఆదుకోవాల్సి ఉంది. అయితే పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్‌కు డిమాండ్ అమాంతం పెరిగిందని కేంద్రప్రభుత్వం అంగీకరించింది. అయినప్పటికీ వంట గ్యాస్ పంపిణీలో ఇబ్బంది లేదని భరోసా ఇచ్చింది. దేశీయంగా వంట గ్యాస్ ఉత్పత్తి 30శాతం మేర పెంచినట్లు తెలిపింది. వాణిజ్య సిలిండర్ల కొరత ఉండడంతో హోటళ్లు, ఆహార పరిశ్రమ ఇబ్బందులు పడుతోందని అంగీకరించారు. అందువల్ల వాణిజ్య సిలిండర్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించామని చెప్పారు. ప్రాధాన్య క్రమంలో అవి పంపిణీ చేస్తాయని తెలిపారు. ఆస్పత్రులు, విద్యా సంస్థలకు వంట గ్యాస్‌ను అందజేస్తామని ప్రకటించారు. ఇక, ఇళ్లకు పైపుల ద్వారా సరఫరా అయ్యే పైప్డ్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్‌జీ), వాహనాలకు వినియోగించే కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)ల సరఫరాకు ఎలాంటి అంతరాయాలు లేవని తెలిపింది. పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న వారికి గ్యాస్ సిలిండర్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తంగా ఈ సంక్షోభం ఇంకెంతకాలం అన్నది యుద్ధ తీవ్రతను బట్టి మాత్రమే మారుతుందన్నది నిజం.

డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

**దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి**

**ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు**



**టెహ్రాన్, ఫిబ్రవరి 16:** ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడుల ను తీవ్రతరం చేసింది. తన పొరుగుదేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ దాడులు చేసింది. ఈ సందర్భంగా ఒక డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బందికి సేఫ్టీ నోటీస్ జారీచేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచనచేశారు. అంతేగాక పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కీలకమైన ఇతర మౌలిక సదుపాయాల వద్ద భద్రత పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్

- ఖతార్ నుంచి గ్యాస్‌తో వచ్చిన నౌక
- భారత్‌కు దక్కనున్న భారీ ఊరట




**ముంద్రా, ఫిబ్రవరి 16:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్మూజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్‌పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్–లోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్–అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది.

# హార్మూజ్ జలసంధి వద్దకు యుద్ధనౌకలు

- ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా
- సంయమనం పాటించాలన్న జపాన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** హోర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను మిత్ర దేశాలు తిరస్కరించాయి. ప్రస్తుతానికి తమకు ఆ ఆలోచన లేదని తేల్చి చెప్పాయి. ట్రంప్ అభ్యర్థనను ఆస్ట్రేలియా తోసి పుచ్చింది. తాము యుద్ధ నౌకలను పంపబోమని స్పష్టం చేసింది. 'ఆ జలసంధి ఎంత కీలకమో మాకు తెలుసు. కానీ అక్కడకు మేము యుద్ధ నౌకలను పంపబోము. అసలు యుద్ధ నౌకల కోసం మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు' అని ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ చెప్పారు. ట్రంప్ అభ్యర్థనపై జపాన్ ఆచితూచి స్పందించింది. ఈ విషయంలో సంయమనం అవసరమని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము మేరిటైమ్ చర్యల గురించి ఆలోచించట్లేదని పేర్కొంది. ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్టు తెలిపింది. అమెరికాతో మరిన్ని చర్చల తరువాత ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తామని దక్షిణ కొరియా పేర్కొంది. సమగ్ర సమీక్ష తరువాత ఈ విషయంలో ముందడుగు వేస్తామని వెల్లడించింది. బ్రిటన్ కూడా ఈ విషయమై ఆచితూచి స్పందించింది. యుద్ధ నౌకలను పంపించే విషయంలో ట్రంప్‌తో చర్చిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కూడా చర్చించినట్టు తెలిపారు. సోమవారం జరగనున్న సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చిస్తామని అన్నారు. హోర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపించాలని పలు దేశాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం అభ్యర్థించిన విషయం తెలిసిందే. తమ పరిధిలోని ప్రాంతాన్ని ఆయా దేశాలు రక్షించుకోవాలని అన్నారు. ఇంధన అవసరాల కోసం హోర్మూజ్ జలసంధిపై అమెరికా అంతగా ఆధారపడలేదని అన్నారు. ఇతర దేశాలకే ఆ అవసరం ఎక్కువని కామెంట్ చేశారు. ఈ సందర్భంగా చైనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా దిగుమతుల్లో అధిక శాతం హోర్మూజ్ మీదుగానే వెళుతున్నాయని అన్నారు. అయితే, హోర్మూజ్ జలసంధిని తెరిపించే ప్రయత్నాల్లో చైనా భాగం అవుతుందా? లేదా? అనే విషయంపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు.

# గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

**తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మోహరింపు**

**తైపీ, ఫిబ్రవరి 16:** గల్ఫ్ యుద్ధంతో అంతా అటువైపు దృష్టి పెట్టగా చైనా మరోమారు తైవాన్‌పై దృష్టి సారించింది. గత రెండు వారాలుగా కొంత నిశ్శబ్దంగా ఉన్న చైనా సైన్యం.. మళ్ళీ తైవాన్ సరిహద్దుల్లో తన ప్రాబల్యాన్ని చాటుకోవడం మొదలుపెట్టింది. తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత 24 గంటల్లో భారీ సంఖ్యలో , నౌకలు చైనా యుద్ధ విమానాలు తైవాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. కాగా, ఫిబ్రవరి 27 నుండి మార్చి 13 వరకు తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ విమానాల రాక గణనీయంగా తగ్గింది. సాధారణంగా ప్రతిరోజూ పదుల సంఖ్యలో విమానాలను పంపే చైనా, ఈ 16 రోజుల కాలంలో కేవలం 7 విమానాలను మాత్రమే పంపింది. అయితే, ఈ ఆకస్మిక విరామానికి కారణమేంటో రక్షణ నిపుణులకు సైతం అంతుచిక్కలేదు. కానీ, ఆదివారంనుండి చైనా మళ్ళీ తన దూకుడును పెంచింది. తైవాన్ చుట్టూ సుమారు 26 చైనా సైనిక విమానాలను గుర్తించారు. వీటిలో 16 విమానాలు తైవాన్ నైరుతి ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ లోకి ప్రవేశించాయి. విమానాలతో పాటు 7 చైనా యుద్ధ నౌకలు కూడా తైవాన్ సముద్ర తీరానికి సమీపంలో చక్కర్లు కొడుతున్నాయి. ఫిబ్రవరి 25న 30 విమానాలు వచ్చిన తర్వాత, మళ్ళీ ఈ స్థాయిలో విమానాలు రావడం ఇదే తొలిసారి. ఇలాఉండగా, మార్చి 31న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఇక, చైనా విమానాలు లేని సమయంలో కూడా వారి యుద్ధ నౌకలు సముద్రంలోనే ఉన్నాయని తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ స్పష్టం చేశారు. చైనా నుండి ముప్పు ఏమాత్రం తగ్గలేదని.. తాము నిరంతరం అప్రమత్తంగానే ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

# దుబాయ్ విమానాల రద్దు

**ఢిల్లీ:** సోమవారం తెల్లవారుజామున దుబాయ్ ఎయిర్ పోర్టు సమీపంలో ఇంధన ట్యాంక్‌పై డ్రోన్ దాడి జరిగింది. విమానాశ్రయ పరిసర ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఎయిర్ పోర్టును మూసివేస్తున్నట్లు దుబాయ్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. దుబాయ్ వెళ్లే విమానాలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, అబుదాబి, రస్ అల్‌ఖైమా, షార్జాలకు విమానాలు యథావిధిగా కొనసాగుతాయని ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు తిరువనంతపురం నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ విమానం కూడా ఆగింది. టీఆర్వీ--డీఎక్స్‌బీవిమానం353 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బందితో ఇవాళ ఉదయం 4:40 గంటలకు బయలుదేరి.. దుబాయ్ ఎయిర్ పోర్టు మూసివేయడంతో ఉదయం 8:40 గంటలకు తిరిగి వచ్చింది. అలానే కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరిన మరో ఎమిరేట్స్ విమానం ఈకే533 కూడా వెనక్కి వచ్చేసింది.

# అన్ని రాష్ట్రాల్లోనూ గ్యాస్ నిల్వలు ఉన్నాయి

**వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన**



**న్యూఢిల్లీ, మార్చి 16:** వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని తెలిపింది. హర్మూజ్ దగ్గర భారత నౌకలన్నీ క్షేమంగానే ఉన్నాయని, శివాలిక్ నౌకలో 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉందని కేంద్రం వెల్లడించింది. కాగా, ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన 'శివాలిక్' నౌక సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపి వేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. హాస్టల్స్ మెనూను పూర్తిగా మార్చేశాయి. కేవలం ఒక కర్రీతో సరిపెడుతున్నాయి. గ్యాస్ కొరత కారణంగా పలు దేవాలయాలు తాత్కాలికంగా ప్రసాదం తయారీని నిలిపివేశాయి. సీఎన్‌జీ బంకుల్లోనూ గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. దీని కారణంగా గ్యాస్‌తో నడిచే వందలాది ఆటోలు నిలిచిపోతున్నాయి. డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు కూడా కష్టాలు తప్పటం లేదు. బుకింగ్, డెలివరీ విషయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. యుద్ధ పరిస్థితులకు తోడు.. పండుగ సమయం కావటంతో గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి సిలిండర్ తీసుకుంటున్నారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం


# ఆంధ్రప్రదేశ్ అవతరణకు పొట్టి శ్రీరాములు కృషి

## • ఘనంగా 125వ జయంతి వేడుకలు




**అల్లూరి సీతారామరాజు జిల్లా / రంపచోడవరం , మార్చి 16 (మనసులో మాట) :** ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమర జీవి పొట్టి శ్రీరాములు వారికి తెలుగు ప్రజలు ఎప్పటికప్పుడు గుర్తుంచుకునే బాధ్యత మన అందరిపై ఉందని రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్టేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు వారి చిత్రపటానికి రంపచోడవరం శాసనసభ్యులు లెజిస్టేటివ్ చైర్మన్ మిరియాల శిరీష, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు పండ వెంకటలక్ష్మి, రంపచోడవరం పంచాయతీ సర్పంచ్ మంగ బొజ్జయ్య, ఎపిఓ జనరల్ డిఎన్వి రమణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్టేటివ్ చైర్మన్ మిరియాల



శిరీష దేవి మాట్లాడుతూ ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు వారు 1901 మార్చి 16న నెల్లూరు గ్రామంలో జన్మించారని అదేవిధంగా 1952 డిసెంబర్ 15వ తేదీన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి అమరులైనారని ఆమె అన్నారు. పొట్టి శ్రీరాములు వారికి అమరజీవి ఆంధ్ర జాతిపిత బిరుదు కలదని ఆమె అన్నారు. భారతదేశానికి స్వతంత్రం కోసం క్విట్ ఇండియా ఉద్యమంలో ఉప్పు సత్యాగ్రహం మొదలగు స్వాతంత్ర ఉద్యమాలలో పాల్గొన్నారనీ ఆమె అన్నారు. అదేవిధంగా జాతిపిదిత మహాత్మా గాంధీకి పొట్టి శ్రీరాములు వారు ప్రియ మిత్రుడు అని ఆమె అన్నారు. తెలుగువారిపై తమిళ్యుల నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని బులుసు సాంబమూర్తి ఇంటి వద్ద నిరాహార దీక్ష 58 రోజులపాటు చేయడం జరిగిందని అదేవిధంగా 1952 డిసెంబర్ 15వ తేదీన మరణించారని మరణంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని ఆమె అన్నారు. పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన తర్వాత తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని నిరాహార దీక్ష చేసి అమరులైన పొట్టి శ్రీరాములు వారికి తెలుగు ప్రజలందరూ గుర్తుపెట్టుకునే బాధ్యత మన అందరిపై ఉందని ఆయన అన్నారు. ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు వారు 1901వ సంవత్సరం మార్చి 16వ 9వ పేజీలో



## నర్సీపట్నం నూకాలమ్మ జాతర
# ఏర్పాట్లను పరిశీలించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం రూరల్ , మార్చి 16 (మనసులో మాట) :** స్థానిక అబీద్ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి పండుగ ఈనెల 18న జరగనున్న నేపధ్యంలో సోమవారం గౌరవ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలని, తాగునీరు మరియు ప్రసాదం వితరణలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని దేవదాయశాఖ, మున్సిపల్ కమిషనర్ మరియు పోలీసు యంత్రాంగానికి పలు సూచనలు చేశారు.

ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఆలయ కమిటీ సభ్యులు మరియు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన కోరారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎక్కడ అసౌకర్యము కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డి.ఎస్.పి పి శ్రీనివాసరావు, పట్టణ సీఐ ఎస్ కే గఫూర్, మున్సిపల్ కమిషనర్ జె సురేంద్ర, ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాస్ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ లో వచ్చే ఫిర్యాధులను పరిష్కరించుటకు మండల పరిధిలో
# కమిటీలను ఏర్పాటు చేసి, సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి
## జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



**పాడేరు , మార్చి 16 (మనసులో మాట) :** ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల పేషీల నుండి వచ్చే ప్రజల ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని, పిజిఆర్ఎస్ నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించుటకు మండల స్థాయిలో మండల ప్రత్యేక అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి మండల పరిధిలో ప్రణాళికలను తయారు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లా రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిజిఆర్ఎస్, ఐవిఆర్ఎస్, ఆర్ఓఎఫ్, రెవెన్యూ సంబంధిత సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ,మంత్రుల, శాసన సభ్యుల నుండి వచ్చే పిజిఆర్ఎస్ అర్జిలను సమస్యలను పరిశీలించి మండల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కొయ్యూరు, చింతపల్లి, పాడేరు, హుకుంపేట, పెదబయలు మండలాల్లో ఎక్కువ ఫిర్యాధులు ఉన్నాయని, ఆయా మండలాల రెవెన్యూ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిం చుకోవాలన్నారు .మండలం పరిధిలో రోజు వంద మందికి ఫోన్ చేసి ఫిర్యాధులకు సంబంధించిన విషయాలను తెలుసుకోవాలన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ లో ప్రజల సంతృప్తి స్థాయి పెంచాలన్నారు.క్షేత్ర స్థాయి ఫిర్యాదు దారుని సమస్య పరిష్కరించేటప్పుడు వారి ప్రతి స్పందనను వీడియో రూపంలో, వాయిస్ రికార్డు రూపంలో భద్రపరచాల న్నారు. మళ్లీ మళ్ళీ వచ్చే అర్జీల విషయంలో ఫిర్యాదు దారులతో ప్రత్యేకంగా మాట్లాడి, సివిల్ వివాదాలు , భూ వివాదాలను సివిల్ కోర్ట్ ల వివాదాలు పరిస్కారమయ్యే విధముగా చొరవ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, పాడేరు ఇంచార్జ్ ఆర్డివో ఎమ్ వి ఎస్ లోకేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఎ పిడి వి. మురళి, డ్వామా పిడి విద్యాసాగరరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి బాబు, మండల ప్రత్యేక అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య అవగాహన కార్యక్రమం
# చౌడుపల్లిలో గాడిదలమెట్టలో ఉచిత పశువైద్య శిబిరం




**చింతపల్లి , మార్చి 16 (మనసులో మాట) :** పశు సంపద ఎక్కడైతే ఆరోగ్యంగా ఉంటుందో ఆ గ్రామం పాడిపంటలతో వర్ధిల్లుతుందని పాడేరు ఏఎంసీ చైర్‌పర్సన్, రాష్ట్ర ఏఎంసీ ఉపాధ్యక్షురాలు మచ్చల మంగతల్లి అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ గాడిదలమెట్ట గ్రామంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం, జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంగతల్లి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులకు, పశుపోషకులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు సరైన సమయంలో టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి వాటిని కాపాడుకోవచ్చని సూచించారు. చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ, టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని రైతులకు పశువైద్యం చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పల్లెల్లో పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ఆకాంక్షించారు. అనంతరం వెటర్నరీ వైద్యులు లోకుల. రమేష్ .నేతృత్వంలోని సిబ్బంది గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వెటర్నరీ సిబ్బంది, చౌడుపల్లి పంచాయతీ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చంద్రబాబు పాయకరావుపేట నియోజకవర్గం పర్యటన నేపథ్యంలో సమీక్ష సమావేశం

- భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయాలి
- కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : మంత్రులు

**నక్కపల్లి , మార్చి 16 (మనసులో మాట) :** ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాయకరావుపేట నియోజకవర్గం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై సోమవారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో కూటమి నేతల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లి రవీంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో భద్రతా బందోబస్తు, కార్యక్రమ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. పర్యటనకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో జనసమీకరణ, ఆహారం, రవాణా తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి తొలిసారి పాయకరావుపేటకు వస్తున్న నేపథ్యంలో భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి అనిత అధికారులకు సూచించారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో జిల్లాలో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రణాళికలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ లక్ష్యాలను ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ ఆశయాలు, ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో జోన్-1 కోఆర్డినేటర్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కార్పొరేషన్ చైర్మన్లు మల్ల సురేంద్ర, పి.జి.వి.ఆర్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## 84వ వార్డులో 10.50 కోట్ల అభివృద్ధి పనులకు
# శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి టౌన్ , మార్చి 16 (మనసులో మాట) :** పట్టణం లోని అనకాపల్లి 84 వ వార్డు పరిధిలో సుమారు 10.50 కోట్ల రూ"తో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సారధ్యంలో , మాజీ శాసనసభ్యులు ఏపీయూఎఫ్ఐ డిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ , మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్ ,రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర చేతుల మీదగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జీవీఎంసీ, సిరసపల్లి సీతారామ గుడి వద్ద సిసి రోడ్డు కాలువ నిర్మించుట, స్మశానవాటికకు ప్రహరీ గోడ కొరకు ప్రారంభోత్సవం, సిరసపల్లి సచివాలయం ముందు ఎన్టీఆర్ కాలనీ జంక్షన్ నుండి పోర్టు కాలనీ బస్ స్టాప్ వరకు కాలువ, కళ్యాణ మండపం మిగిలి ఉన్న పనుల నిర్మాణం నకు ప్రారంభోత్సవం, కేఎన్ఆర్ పేట ఆర్ సి సి కాలు



వలు, కమ్యూనిటీ హాల్, వాటర్ ట్యాంక్, జీవి పైప్ లైన్, ఓపెన్ జిమ్ నిర్మాణం కొరకు శంకుస్థాపన, కొత్తపేట రామాలయం నుండి ఎన్ హెచ్ 16 రోడ్డు వరకు రోడ్డు కాలవలు, కల్వర్టులు నిర్మాణం నకు శంకుస్థాపన కొప్పాక నందు ఎస్ డబ్ల్యు కాలవ హిందూ క్రిస్టియన్ స్మశాన వాటిక ప్రహరీ గోడ, ఓపెన్ జిమ్ సిసి రోడ్లు నిర్మాణం కొరకు శంకుస్థాపన, అనకాపల్లి రింగ్ రోడ్ నుండి మార్కెట్ యార్డ్ గేట్ వరకు బీటీ రోడ్ వెడల్పు చేయడం కాలువలు, ఫుట్ పాత్ కొరకు అభివృద్ధికి శంకుస్థాపన, స్థానిక అనకాపల్లి పెంటకోట కన్వెన్షన్ హాల్ నుంచి హిమ శేఖర్ డిగ్రీ కాలేజ్ వరకు బిటి రోడ్డు, రీలయింగు మరియు ఆర్ సి సి కాలువ, ఇతర అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాలకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డ్ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీల బాబు , జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి , జీవీఎంసీ అధికారులు, 84 వార్డ్ జనసేన పార్టీ ఇంచార్జ్ చేబ్రోలు దుర్గ ప్రసాద్ , 84 వార్డు కూటమి నాయకులు, పాల్గొన్నారు.

# 66వార్డ్ లో అభివృద్ధి పనుల శంకుస్థాపన



**గాజువాక , మార్చి 16 (మనసులో మాట) :** అభివృద్ధి లో భాగంగా మన (వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం) ఎదురు ఉన్న బీటీ రోడ్డు, అలాగే అజిమాబాద్ ప్రాంతంలో పలు రోడ్లకి, కల్వర్టుకి ఒక కోటి 24 లక్షల రూపాయలతో పనులకి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు శ్రీ పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా పూజా కార్యక్రమం జరిగింది, పల్లా మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం వచ్చి 20 నెలలలో మొత్తంగా గాజువాక నియోజవర్గం లో 240 కోట్ల రూపాయలతో ఎంతో బాధ్యత తో,వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుచున్నాయి, అలాగే ఈ 20 నెలల్లో66 వార్డుల్లో కోట్ల రూపాయలతో కూడుకున్న అభివృద్ధిని చేసి పెట్టాం, అలాగే ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నాయి ఇవి కూడా పూర్తి చేస్తామని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పాడైపోయిన ప్రతి రోడ్డుని అభివృద్ధి చేసి చూపెడతామని ఈ కూటమి ప్రభుత్వం (భద్రత, బాధ్యత, సంక్షేమం,అభివృద్ధి )మన యువత భవిష్యత్తు, మొత్తం కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటూ, అభివృద్ధికి సహకరిస్తున్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసారు. పల్లా శ్రీనివాసరావు అలాగే ఇంత మంచి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులకు స్థానిక నాయకులకు , వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులందరికీ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేసారు.

# రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- సెక్షన్ 22 ఏ నిషేధిత జాబితా నుండి 13 మంది రైతులకు విముక్తి
- లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేసిన చేసిన జిల్లా కలెక్టర్

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చి 16 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రెవెన్యూ క్లినిక్స' కేవలం ఫిర్యాదులు స్వీకరించడమే కాకుండా, వాటికి శాశ్వత పరిష్కారాన్ని చూపుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (PGRS) మరియు 'రెవెన్యూ క్లినిక' కార్యక్రమంలో భాగంగా, 22ఎ నిషేధిత జాబితా నుండి విముక్తి పొందిన 13 మంది రైతులకు ఆయన ఉత్తర్వు పత్రాలను పంపిణీ చేశారు. సాంకేతిక లోపాలు మరియు సరైన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో, గతంలో ఈ 13 మంది రైతులకు చెందిన సొంత జిరాయితి (పట్టా) భూములు పొరపాటున సెక్షన్ 22ఎ (నిషేధిత జాబితా)లో చేర్చబడ్డాయి. దీనివల్ల ఆ భూములపై రైతులకు క్రయవిక్రయాలు చేసుకునే అధికారం గానీ, బ్యాంకుల నుండి రుణాలు పొందే అవకాశం గానీ లేకుండా పోయింది. కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని ఈ సమస్య, రెవెన్యూ క్లినిక్స్ ద్వారా సులువుగా ముగిసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ మరియు సర్వే విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పాత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అవి ప్రభుత్వ భూములు కావని నిర్ధారించిన అనంతరం, ఉన్నతాధికారుల అనుమతితో నిషేధిత జాబితా నుండి ఆ భూములను తొలగించారు. సాధారణంగా ఏళ్ల తరబడి పట్టే ఈ ప్రక్రియను రెవెన్యూ క్లినిక్స్ ద్వారా కేవలం కొన్ని రోజుల్లోనే పూర్తి చేయడం విశేషం. లబ్ధిదారుల హర్షం : కలెక్టర్ చేతుల మీదుగా హక్కు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.."చాలా కాలంగా సాగు చేసుకుంటున్న భూమి నిషేధిత జాబితాలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా నయా పైసా ఖర్చు లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మాకు న్యాయం జరిగింది" అని కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు కురుబిల్లి సత్యనారాయణ, పోలమరశెట్టి అప్పారావు (జాకీరు వేపాడ మండలం) మాట్లాడుతూ చాల కాలం నుండి సాగు చేసుకుంటున్న భూమి రికార్డుల్లో నిషేధిత జాబితాలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మాకు నయాపైసా ఖర్చు లేకుండా, మధ్యవర్తుల



ప్రమేయం లేకుండా న్యాయం జరిగిందని జిల్లా కలక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు ఉప్పల శ్రీధర్ (పొలిపల్లి, భోగాపురం మండలం) మాట్లాడుతూ రైతుల చిరకాల కోరికను నేరవెర్చుతు వివాదరహిత జిరాయితి భూములను 22ఎ నిషేధిత జాబితా నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేసారు. రైతు రౌతు లక్ష్మీబాయి (గుంకలాం, విజయనగరం) మాట్లాడుతు పారదర్శకమై సర్వే ద్వారా ప్రతి రైతుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాగం న్యాయం చేస్తు రైతుల భూముల సర్వే సమస్యలు త్వరితగతిన పరిష్కరించడం, తమ భూములపై పూర్తి హక్కులు పునరీద్దంచడంపట్ల తన ఆనందం వ్యక్తం చేసారు. రైతు దాడిచి భగీరధకుమార్ (కొటారుబిల్లి, గంట్యాడ మండలం) మా ట్లాడుతూ తమ భూములపై హక్కులు కల్పించడం వలన భూమి అమ్మకం, కొనుగోలు, మరియు బ్యాంకు ఋణాలు పొందే సౌలభ్యం కలుగు తుం దని జిల్లా కలక్టరుకు కృతజ్ఞ తలు



తెలిపారు. ఈ సందర్భ ంగా జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు పాలనను చేరువ చేయడమే కాకుండా, భూ వివాదాలు లేకుండా చేయడమే రెవెన్యూ క్లినిక్స్ ప్రధాన ఉద్దేశంమని, రీ సర్వే, భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా అర్హులైన ప్రతి రైతుకు వారి హక్కులను కల్పించడమే మా ప్రాధాన్యత అన్నారు. ఈ 13 మంది రైతు ల విజయం మిగిలిన సమస్యల పరిష్కారానికి స్ఫూర్తిని స్తుందన్నారు. ఇప్పుడు వీరికి భూమి క్రయవిక్రయాలు మరియు బ్యాంకు రుణాలు పొందే సౌలభ్యం కలుగుతుందని, పారదర్శకమైన సర్వే ద్వారా అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని జిల్లా కలక్టరు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, రెవెన్యూ డివిజనల్ అదికారులు, సర్వే శాఖ ఎ.డి. ఆర్. విజయకుమార్, జిల్లా అధికారులు, లబ్దిదారులు తదితరులు పాల్గోన్నారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## డైరీ పార్లర్ ల విస్తృత తనిఖీ




**చీడికాడ , మార్చి 16 (మనసులో మాట) :** ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం చీడికాడ గ్రామం లో పాలు పాల పదార్థాలు అమ్మే షాపులను సహాయ సంచాలకులు డా. చిట్టి నాయుడు, పశు వైద్య శస్త్ర చికిత్స సహాయకులు డా. కె.వి. ఎస్. రాఘవమ్మ , డా. ఏ. సీ హెచ్. ఎస్ . గణేష్ తనిఖీలు చెయ్యడం జరిగింది. పాల ప్యాకెట్లు ఉంచే ఫ్రీజర్లు పాల ప్యాకెట్ లు, ఇతర పదార్థాల యొక్క ఎక్స్పయిరీ తేదీలు, ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్లు తనిఖీలు చెయ్యడం జరిగింది. అనధికారికంగా ఎక్కడైనా పాలు పాల పదార్థాలు అమ్మకం జరిపితే వెంటనే దగ్గర్లోని పశు వైద్య శాల కు తెలియజెయాలని సూచించడమైనది.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు



**విమాడుగుల , మార్చి 16 (మనసులో మాట) :** ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన భాషా సంయుక్త రాష్ట్రాల పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం మాడుగుల వేణుగోపాల స్వామి వారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల లేసి ఆర్యవైశ్య మహాసభ వాసవి క్లబ్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు శ్రీ నాదు శ్రీనివాస రావు (దేవరపల్లి శ్రీను) వాసవి క్లబ్ జోన్ చైర్మన్ పుట్ట మాధవి. వాసవికపు వనిత క్లబ్ ప్రతినిధులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు,

## అమరజీవి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి వేడుకలు

**- చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఇంచార్జ్ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర్లు**



**పాడేరు ,మార్చి 16 (మనసులో మాట) :** స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంచార్జ్ ప్రాజెక్టు అధికారి ఏం.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.త్యాగానికి ప్రతిరూపం పొట్టి శ్రీరాములని, ఆయన ఆశయాలను గౌరవించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి ఆయన పట్టుదల, త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీతారాం, గ్యాస్ గోడం మేనేజర్ శ్రీనివాస్ కుమార్, కామేశ్వర రావు, కొండ బాబు, కార్యాలయ సిబ్బంది, ఇతర ముఖ్య నేతలు పాల్గొని అమరజీవికి నివాళులు అర్పించారు.

## దేవరాపల్లి మార్కెట్లో చింతపండుకు తగ్గని గిరాకీ

**దేవరాపల్లి , మార్చి 16 (మనసులో మాట) :** దేవరాపల్లి వారాంతపు సంతలో చింతపండుకు విపరీతమైన గిరాకీ కనిపించింది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి సరుకు తక్కువగా రావడంతో కొనుగోలు దారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చింతపండును కొనుగోలు చేశారు. సరఫరా తగ్గిపోవడంతో ధరలు కూడా గణనీయంగా పెరిగాయి.సంతలో పది కిలోల చింతపండు రూ.800 నుంచి రూ.1000 వరకు అమ్ముడైంది. సాధారణంగా దేవరాపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులతో పాటు అనంతగిరి మండలంలోని ఏజెన్సీ గ్రామాల నుంచి గిరిజనులు చింతపండును తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. అయితే ఈ ఏడాది ఏజెన్సీ ప్రాంతాల్లో పంట తగ్గిపోవడంతో మార్కెట్‌కు సరుకు రాకపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు పేర్కొన్నారు.

## రాష్ట్ర హైకోర్టు సహాయ సోలిటరీ జనరల్ గా చంద్రమౌళి

**- క్రమశిక్షణ నీతి నిజాయితీకి పెట్టింది పేరు చంద్రమౌళి**
**- పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడంలో ఆయన ముందుంటారు**
**- అనకాపల్లి బిజెపి నాయకుల ప్రశంసలు**



**అనకాపల్లి రూరల్ , మార్చి 16 (మనసులో మాట) :** క్రమశిక్షణ కు, నీతి నిజాయితీకి పెట్టింది పేరు అలాగే పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడంలో అందరికంటే ముందుండే పట్నాయకుని చంద్రమౌళి అని అనకాపల్లి బిజెపి నాయకులు పుట్ట గంగయ్య, బొడ్డేడ నాగేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు ప్రశంసిం చారు. సోమవారం అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సహాయ సొలిటరీ జనరల్ ఆఫ్ ఇండియా నియమితులైన పట్నాయకుని చంద్రమౌళిని ఘనంగా ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులు అలాగే మాకు ఆప్తుడు అయిన ఫణీంద్రరావు కుమారుడు పట్నాయకుని చంద్రమౌళి అని తెలియజేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించి, పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో అంచె అంచెలుగా ఎదిగి ఉన్నత స్థానానికి చేరుకున్నా రన్నారు. 2002లో న్యాయవాదిగా, రాష్ట్ర బార్ కౌన్సిల్ లో నమోదయారన్నారు. 2012లో ఏపీ హైకోర్టు న్యాయవాదిగా నమోదు చేసుకొని అటు పార్టీకి ఇటు పేద ప్రజలకు ఉచిత న్యాయ సేవ అందించడం గొప్ప విషయమన్నారు. విశాఖ బార్ అసోసియేషన్ లో 2002లో నమోదు కాబడిన నాటినుండి నేటి వరకు రాష్ట్రవ్యాప్తంగా తన ప్రతిభ చాటుతూ, వివాద రహితుడిగా, పేద ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. చంద్రమౌళి అంచలంచులుగా ఎదుగుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ క్రిమినల్ న్యాయవాది గా గుర్తింపు కొందరన్నారు. 2012లో మాస్టర్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లో ఎమ్ బి ఎ పట్టా పొందా రన్నారు. చంద్ర మౌళి ప్రతిభకు గుర్తించిన కేంద్ర న్యాయశాఖ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ సంస్థ తరఫున వాదించడానికి అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో చంద్రమౌళి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగాపదోన్నతులు వరించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి, గొంతిన భక్త సాయిరాం, భానుమతి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కరరావు, ఐటీ సెల్ కన్వీనర్ కొణతాల సాయి ప్రసాద్, మారిశెట్టి భాస్కరరావు, ఈశ్వర ప్రసాద్, వానబోయిన నర్సింగ్ యాదవ్, బొడ్డేడ శేషగిరిరావు, రాజు, అయ్యప్ప గుప్తా, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కొయ్యూరులో పదో తరగతి పరీక్షా కేంద్రాలపై సీఐ ఆకస్మిక తనిఖీ



**కొయ్యూరు , మార్చి 16 (మనసులో మాట) :** మండలంలోని సీఏహెచ్ స్కూల్, గవర్నమెంట్ హై స్కూల్, ఏపీటిడబ్ల్యూఆర్ పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలను కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్షల నిర్వహణ విధానాన్ని సీఐ సమగ్రంగా పరిశీలించారు. పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని ఆయన తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పరీక్షలను క్రమశిక్షణతో నిర్వహించేందుకు అవసరమైన సూచనలు ఇచ్చారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, తల్లిదండ్రులు, ప్రజలు పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడకుండా పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ క్రాంతి కుమార్,కొయ్యూరు ఎస్.ఐ కిషోర్ వర్మతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడుదాం

**- మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షులు కాటపల్లి అప్పారావు పిలుపు**



**దేవరావల్లి , మార్చి 16 (మనసులో మాట) :** ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధనకై ఐక్యంగా కలిసి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షులు కాటపల్లి అప్పారావు అన్నారు. మండల కేంద్రం దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద సోమవారం సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను 25 శాతంకు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారం గా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో (సెక్షన్ 41) స్టేషన్ బెయిల్ రద్దు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన 28 రకాల ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తక్షణమే మంజూరు చేసి దళిత, గిరిజన వాడాలను అభివృద్ధి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజలంతా అంబేద్కర్ రాసిన రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఉద్యమించా లని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయ కులు మచ్చా రామారావు, ఉల్లి శ్రీను, కాటపల్లి సన్యాసిరావు, తెరపల్లి శ్రీరామ్, పల్లా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## శృంగారపు కోట ఆర్టీసీ డిపో సిబ్బంది రిలే నిరాహార దీక్షలు



**శృంగారవు కోట , మార్చి 16 (మనసులో మాట) :** శృంగవరపుకోట ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ సిబ్బంది రెండు రోజుల రిలే నిరాహార దీక్ష చేపట్టారు..ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ భానుమూర్తి గారు... జోనల్ అధ్యక్షులు కే ఎస్ రావు..కార్యదర్శి కొల్లి కోటేశ్వరరావు గారు మాట్లాడుతూ వారి యొక్క ప్రధాన డిమాండ్లు చెప్పారు 1. ఎస్ కోట విశాఖ రూట్ సర్వే చేయాలి, 2. ఎస్ కోట ధర్మవరం విజయనగరంరూట్లో ట్రిప్పు లు తగ్గించాలి , 3. ఎస్ కోట విశాఖ రూట్లో టైమింగ్ పెంచాలి, 4. ఎస్ కోట విశాఖ రూట్లో బస్సుల సంఖ్య పెంచాలి ,5. ధర్మవరం రూట్ సర్వే చేయాలి టైమింగ్ పెంచాలి. 6. అరకు ఘాట్ రోడ్ లో డ్రైవర్లకు కండక్టర్లకు రక్షణ కల్పించాలి . 7. Kmplపై వేధింపులు విడనాడాలి , 8. కొత్త బస్సులు తెప్పించాలి వెహికల్ కండిషన్ మెరుగు పరచాలి, 9. గ్యారేజ్ ఉద్యోగుల పని భారాన్ని తగ్గించాలి, 10. కండక్టర్లకు లీవ్ ఇవ్వాలి ,11. ఫుట్ బోర్డు ప్రయాణం విషేధించాలి , 12. పైన పేర్కొన్న డిమాండ్లన్నీ సత్వరమే పరిష్కరించకపోతే రాష్ట్రంలో ఉన్న అన్ని డిపోలను కలుపుకొని సమ్మెకు దిగుతామని హెచ్చరించారు

## భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు పొట్టి శ్రీరాములు

**- ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు**



**నెల్లిమర్ల , మార్చి 16 (మనసులో మాట) :** తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపీడీఓ రామకృష్ణ రాజు ఆధ్వర్యంలో జరగగా, ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కర్రోతు బంగార్రాజుతో పాటు విశాఖ నార్త్ నియోజకవర్గ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి గేదెల రాజారావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. బంగార్రాజు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణత్యాగం చేసిన ధీశాలి పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన చేసిన బలిదానం కేవలం ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాది వేసిందని గుర్తు చేశారు. సమాజ హితమే పరమావధి: “మనిషి కేవలం తన కోసం మాత్రమే కాకుండా, సమాజం కోసం బ్రతికినప్పుడే మరణించినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లెంక అప్పల నాయుడు, పోతల రాజప్పన్న, కాళ్ల రాజశేఖర్, తాడ్డి సత్య నారాయణతో పాటు పలువురు మండల అధికారులు మరియు ప్రజలు పాల్గొని అమరజీవికి స్మృత్యంజలి ఘటించారు.

## గంజాయి అక్రమ రవాణాదారులపై అనకాపల్లి జిల్లా పోలీసుల ఉక్కుపాదం

**ఇద్దరు నిందితులపై ‘పిట్ ఎన్.డి.పి.ఎస్’ చట్టం ప్రయోగం**




**చీడికాడ , మార్చి 16 (మనసులో మాట) :** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, జిల్లాలో గంజాయి అక్రమ రవాణా విక్రయాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా, వరుస నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులలు పిట్ ఎన్ డి పి ఎస్ చట్టం కింద ఉత్తర్వులు జారీ చేసి, వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితుల వివరాలు లోకి వెళితే మండలంలో బయలుపూడి గ్రామానికి చెందిన విస్సరపు లింగేశ్వరరావు (23) ఇతనిపై గతంలో కశింకోట, నర్సీపట్నం టౌన్ చీడికాడ పోలీస్ స్టేషన్లలో మూడు వేర్వేరు గంజాయి కేసులు నమోదై ఉన్నాయి. నిత్యం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇతనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకున్నారు. గుమ్మిడి నిరంజన్ నాయుడు (27):బైలపూడి గ్రామం, చీడికాడ మండలం. ఇతనిపై చీడికాడ, యెర్పేడు (తిరుపతి జిల్లా), సీతానగరం (తూర్పుగోదావరి జిల్లా) పోలీస్ స్టేషన్లలో పలు గంజాయి కేసులు ఉన్నాయి. ఇతని పై కూడా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పిట్ ఎన్.డి.పి.ఎస్ చట్టాన్ని అమలు చేశారు. విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు కె.కోటపాడు ఇన్స్పెక్టర్ కె.కృష్ణ చీడికాడ ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించబడింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిందితు లిద్దరినీ అరెస్ట్ చేసి, పటిష్ట భద్రత నడుమ విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు.జిల్లాలో గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా లేదా విక్రయించి నా సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు. అలవాటు పడిన నేరస్తులపై కేవలం సాధారణ సెక్షన్లే కాకుండా, ఇలాంటి కఠినమైన చట్టాలను ప్రయోగిస్తామని, వారి ఆస్తుల జప్తుకు కూడా వెనకాడబోమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు



**కశింకోట , మార్చి 16 (మనసులో మాట) :** మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 102 పరీక్ష కేంద్రాల్లో 20,577 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షల కు సన్నదమయ్యారు . జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరీక్షలకు ముందు రోజు ఆదివారం కశింకోట పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. దూర ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వం ఫ్రీ బస్సులు ఏర్పాటు చేసింది. సోమవారం నుండి ప్రారంభమవుతున్న ఈ పరీక్షలు 9:30 కు ప్రారంభమై 12.45 వరకు సాగుతాయి. ఈ పరీక్షలు నిర్వహణ ఈ నెల ఆఖరి వరకు ఉంటాయి. ఈ సందర్భంగా ఎంఈవో సురేష్ బాబు విద్యార్థుల వివరాలను తెలుపుతూ మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలైన కశింకోట గర్ల్స్ హైస్కూల్, డిపిఎన్ స్కూల్,కర్నూల్ పాలెం, తాళ్లపాలెం ,నరసింగబిల్లి లో 1041 మంది విద్యార్థులు పరీక్షల రాయవలసి ఉండగా ఇద్దరు ఆబ్సెంట్ అయ్యారని 1039 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పరీక్ష కేంద్రాల్లో 144 సెక్షన్ ఏర్పాటు చేశారు.

## అమర జీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులు



**విజయనగరం , మార్చి 16 (మనసులో మాట) ప్రతినిధి :** స్వర్గీయ పొట్టి శ్రీరాములు 125 వ జయంతి ఉత్సవం సందర్భంగా పొట్టి శ్రీ రాములు చిత్ర పటానికి పూల మాలలు వేసి సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తది తరులు ఘనంగా నివాళులు అర్పి ంచారు. అమరావతిలో పొట్టి శ్రీ రాములు విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ , ఆర్య వైశ్య సంఘం సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు సి.పీ.ఓ బాలాజీ, ఆర్య వైశ్య సంఘం సభ్యులు రవ్వ శ్రీనివాస్, బండారు చంద్ర శేఖర్, ఎస్ వి ఎన్ శివ, కాపుగంటి ప్రకాష్, చెరుకూరి నాగార్జున, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం



**దేవరావల్లి , మార్చి 16 (మనసులో మాట) :** మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ఎస్ఓ కె.లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆరవ తరగతి ప్రవేశం కోసం 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 40 సీట్లు ఉన్నాయని ఎస్ఓ పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థునులు ఏప్రిల్ ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కోసం స్థానిక విద్యాలయంలో సంప్రదించాలన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## రైతన్న మీ కోసం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పర్యటన

- రైతన్న మీ కోసం ఇంటింటి అవగాహన!



**హుకుంపేట , మార్చి 16 (మనసులో మాట)** : హుకుంపేట మండలంలోని సంతారి, దుర్గం, సూకూరు పంచాయతీలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీడీఎస్ నందు సోమవారం సందర్శించారు. "రైతన్న మీ కోసం" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి సర్వే నిర్వహించి రైతుల సమస్యలు, పంటల పరిస్థితులను తెలుసుకున్నారు. చింతలవీధి గ్రామంలో రైతులతో సమావేశమై ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి ఎవరికైనా అందకపోతే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి రైతుకూ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ పథకాలు, రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు వంటి అంశాలపై రైతులకు వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పంట ఉత్పత్తి పెంచుకోవాలని సూచించారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వ్యవసాయ శాఖ సుధాకర్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రులకీ ఆదేశాలు




**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 16** : జిల్లాలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్, ల్యాబ్స్, స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా టారిఫ్ బోర్డులను (ధరల పట్టిక) పెట్టాలని హాస్పిటల్ తీసుకుంటున్న ప్రైస్ వివరాలను పూర్తిగా అందరికీ కనబడే విధంగా ప్రదర్శించాలని (డిస్ప్లే చేయాలని) అలాగే జిల్లాలో గల స్కాన్ సెంటర్ వారందరూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జీవన్ రాణి తెలిపారు. పి.సి.పి. ఎన్.డి.టి చట్టం 1994 ను అనుసరించి స్కాన్ గది తప్పనిసరిగా స్కాన్ చేసే వారికి, గర్భిణీలకు సౌకర్యంగా ఉండేలా యాజమాన్యం తప్పక ఏర్పాటు చేయాలన్నారు. ఐ.ఇ.సి బోర్డులను స్కాన్ సెంటర్ బయట వేచియుండు గది నందు, స్కాన్ రూమ్ లోపల, తప్పనిసరిగా డిస్ప్లే చేయాలని అలాగే లింగ నిర్ధారణ - చట్టరీత్యా నేరం అనేటువంటి బోర్డులను ఇంగ్లీష్ మరియు తెలుగులో ప్రచురించి ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతీ హాస్పిటల్ నకు ఫైర్ చీూజ తప్పనిసరిగా ఉండాలని, అలాగే ఎవరైనా సంతాన సాఫల్య కేంద్రాలు నడుపుతుంటే ేూ=ు మరియు SURROGACY చట్టం అనుసరించి జాతీయ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకోవాలని హాస్పిటల్ లో మీూ నిర్వహిస్తున్న వారు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేదంటే ఎడల క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటన లో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ వారు మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (యం.టి.పి) రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేయించుకొని ఐదు సంవత్సరాలు నిండిపోయిన వారు రెన్యువల్ చేయించుకోవాలని ఆమె ఆదేశించారు.

## ప్రశాంతంగా గా పది పరీక్షలు



**ఎస్.రాయవరం ,మార్చి 16 (మనసులో మాట)** : ఎస్. రాయవరం మండలంలోని 5 పరీక్షాకేంద్రాల్లో పదవతరగతి పరీక్షలు సోమవారం మొదటి రోజు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని ఎస్. రాయవరం, ధర్మవరం అగ్రహారం, కోరుప్రోలు, దార్లపూడి జిల్లాపరిషత్ హైస్కూల్స్ తోపాటు తిమ్మాపురం ఆదర్శ పాఠశాలలో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసారు. పరీక్షా కేంద్రాలుకు గంట ముందుగానే విద్యార్థులు చేరుకున్నారు. మండలంలో 1055 మంది విద్యార్థులుకు గాను మొదటిరోజు పరీక్షకు 1053 మంది హాజరుఅయ్యారని, ఇద్దరు పరీక్షగు గైర్హజరైనట్లు విద్యాశాఖాధికారి తెలిపారు.

## ఎంపీడీవో కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు



**వి మాడుగుల , మార్చి 16 (మనసులో మాట)** : మాడుగుల మండలం కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కొంకిఅప్పారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు, ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలు అర్పించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన భాష ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి వేడుకల్లో మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ బండారు సత్య నారాయణమూర్తి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం



లో మండల అధికారులు తాసిల్దార్ రమాదేవి మరియు మండల ఎంపీపీ తాళపు రెడ్డి రాజారాం ఎన్డీఏ కూటమి నాయకులుమార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు. కింతలి పి ఎస్ సి ఎస్ అధ్యక్షులు మరియు పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉందరు దేవుడు.టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ.టిడిపి మండల అధ్యక్షులు నందారపు సన్యాసిరావు. హాస్పిటల్ కమిటీ సభ్యులు లెక్కలకు కాశిబాబు. ఎస్సీ సెల్ మరువాడ ఈశ్వర రావు.నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది

## న్యాయం చేయాలని 8 రోజుగా ఐటీడీఏ ముందు బాధితులు ఆందోళన



**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు , మార్చి 16 (మనసులో మాట)** : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం జలగల గెడ్డ ఆదిమజాతి (పి వి టీ జి ) గిరిజనులపై నాన్ ట్రైబ్ దాడిని ఖండిస్తూ 8వ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుంది.మూసివేసిన జలగలగడ్డ గ్రామ ప్రధాన రహదారిని వెంటనే తెరిపించాలి.దాడికి పాల్పడిన గిరిజనేతరులు గూడూరు కిషోర్, పండు ఒ కో అను వీరి నుండి ప్రాణహాని ఉన్నది. తక్షణమే రక్షణ కల్పించాలి.అల్లూరి... జిల్లా చింతపల్లి మండలం జలగలగడ్డ గ్రామ (పివిటీజి )అదిమాజాతి గిరిజనప్రజలపై దాడి చేసిన గిరిజ నేతరులు గూడూరు కిషోర్, పండు & కో లపై ఎస్ సి ,ఎస్ టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, దశాబ్దాలుగా మేము నడుస్తున్న రోడ్డు మార్గాన్ని అక్రమంగా కంచెవేసి ముసివేశారని, మూసివెయ్యడమే కాకుండా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, కుల దూషణకు చేస్తూ , మాపై విచక్షణ రహితంగా దాడిచేసి హత్యాయత్నం చేసారని, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా తమను పట్టించుకో పోవడంలేదనీ , తిరిగి మాపైనే తప్పుడు కేసులు పెడుతున్నారని వాపోయారు. ఎనిమిది రోజులుగా పాడేరు ఐటీడీఏ ముందు తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న తమను దీక్ష ఎందుకు చేస్తున్నారని అడిగే నాధుడే లేరని,అన్నారు. ఎనిమిది రోజులు గా రాత్రి, పగలు ఈ టెంట్ లోనే చంటి పిల్లలతో సహా ధర్నా చేస్తున్న జిల్లా కలెక్టర్ తోసహా ఏ అధికారి పట్టించుకోవడం లేదన్నారు. తమకు న్యాయం జరిగేవరకు పోరాడతామని అన్నారు.

## కట్టుదిట్టమైన భద్రత మధ్య పదవ తరగతి పరీక్షలు



**మల్కాపురం , మార్చి 16 (మనసులో మాట)** : విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతంలో మల్కాపురం, శ్రీహరిపురం, ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పలు పాఠశాలల్లో, పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు ఈ పరీక్షలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో స్థానిక మల్కాపురం పోలీసులు ప్రతి పాఠశాలలో వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాశారు. గాజువాక పోలీసులపై ప్రశంసలు వెల్లువ....విద్యాశాఖ అధికారుల పొరపాటుకు ఓ విద్యార్థిని గాజువాక జిల్లా పరిషత్ పాఠశాల కు తన



తల్లిదండ్రులతో చేరుకొని పరీక్షా కేంద్రం లోకి పంపి తల్లిదండ్రులు వెళ్లిపోవడం జరిగింది. తీరా లోపలికి వెళ్లేసరికి అక్కడే పరీక్షా కేంద్రం పరిశీలకులు హాల్ టికెట్ ను చూసి తన పరీక్షా కేంద్రం ఇక్కడ కాదని అగనంపూడి కనితిలో గల పాఠశాలలో పరీక్షలు రాయాలని అధికారులు తెలుపుగా ఆ విద్యార్థిని కన్నీరు పెట్టుకుంటూ బయటకు రావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు విషయాన్ని తెలుసుకొని వెంటనే ఆ విద్యార్థిని వెంటబెట్టుకొని కనితి పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్లి అక్కడ విద్యాశాఖ అధికారులతో మాట్లాడి వెంటనే విద్యార్థిని పరీక్ష రాసేటట్లు సహకరించడంతో గాజువాక పోలీసుల పనితీరును పలువురు కొనియాడారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు



**కోటవురట్ల , మార్చి 16 (మనసులో మాట)** : మండల కేంద్రమైన కోటవురట్లలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక ప్రభుత్వాలు హైస్కూల్, స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా కేటాయి ంచారు. రెండు కేంద్రాల్లో 451 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం ఎనిమిది గంటలకు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉత్సాహంగా చేరుకున్నారు. పలువురు తల్లిదండ్రులు విద్యార్థులను స్వయంగా పరీక్షా కేంద్రాలకు తీసుకువచ్చారు. చాలామంది వివిధ గ్రామాల నుంచి ఆటోల్లో వచ్చారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి తొమ్మిది గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. వాచ్ లు, కాలిక్యులేటర్లు మొబైల్ ఫోన్లను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మంచినీరు విద్యుత్తు సౌకర్యం కల్పించారు. ఒక ఏఎన్ఎంతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్ ను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం అమలు చేసిన వందరోజుల ప్రణాళిక బాగా ఉపయోగపడిందని పరీక్ష రాసిన విద్యార్థులు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే 144 సెక్షన్ అమలులో ఉంది

## వైబి పట్నం గ్రామం లో డ్రైనేజీ మరియు రోడ్డు లకు 20 లక్షలు మంజూరు



**నాతవరం , మార్చి 16 (మనసులో మాట)** : వైబి పట్నం గ్రామంలో బీసీ కాలనీ లో ఆంధ్ర రాష్ట్ర శాసన సభపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు రోడ్లు మరియు డ్రైనేజీలుకు 20 లక్షల రూపాయల మంజూరు చేయడమైనది. ఈ రోజు కొబ్బరి కాయలు కొట్టి పనులు స్టార్ట్ చెయ్యడం జరిగింది. అయ్యన్నంటే అభివృద్ధి, అభివృద్ధిఅంటే అయ్యన్న, అన్న ప్రజలు ఈ గ్రామానికి అభివృద్ధి చేయడానికి ఎంతగానో కూటమి ప్రభుత్వం ముందు కొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు కోరుప్రోలు మణిబాబు, కోరుప్రోలు దొరబాబు, ముస్లిం నాయకులు షేక్ కొండబ్బాయి, వెంకటేష్, దాసు, మల్లిబాబు పాల్గొన్నారు



## జనసేన కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాముల 125వ జయంతి వేడుకలు



**అనకాపల్లి టౌన్ , మార్చి 16 (మనసులో మాట)** : ఆంధ్ర రాష్ట్రం ప్రత్యేక ఏర్పాటు కొరకు 56 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పిం చి, అమరజీవి యైన మహా పురుషుడు. ఆంధ్రులకు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనవాడు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు అమరజీవి శ్రీ శ్రీ పొట్టి శ్రీరాములు (ఆంధ్రా జాతిపిత)లి 125 జయంతోత్సవం సందర్భంగా సోమవారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి టౌన్ ,మార్చి 16 (మనసులో మాట)** : ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లను పర్యవేక్షించుటకు, మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ విచ్చేశారు, వీరికి ఆలయ కార్యవర్గం సిబ్బంది రామకృష్ణకు పూర్ణకుంభంతో మంగళ వాయిద్యా లతో స్వాగతం పలికారు, శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే త్వరలో నిర్వహించే అమ్మ వారి జాతర మహోత్సవ ఏర్పాట్లు కోసం ప్రభుత్వ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పండ గకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సదుపాయాలు ఏర్పాటు చేయమని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఏర్పాటు ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడివిశాఖ, విజయనగరం జిల్లాల డిసి సుజాత , డి.ఎస్.పి శ్రావణి,డి.ఏం డిహెచ్ఓ జోనల్ కమిషనర్ చక్రవర్తి , ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను,కార్యనిర్వాహణ అధికారి వై శ్రీధర్ , పట్టణ రూరల్, ట్రాఫిక్ అండ్ లా అండ్ ఆర్డర్ సీఐలు, ఎస్సై లు, డిఈఏఈ , ఇతర అధి కారులు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.





## పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**విజయనగరం , మార్చి 16 (మనసులో మాట) జిల్లా ప్రతినిధి** : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ ఎన్.రాంసుందర్ రెడ్డి సోమవారం స్వయంగా పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా 119 కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. విజయనగరం పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక బిపిఎం ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడ పరీక్షలు జరుగుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా గదుల్లో వెలుతురు, గాలి తగిలేలా వసతులు ఉన్నాయా లేదా అని చూశారు. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీరు, ఓఆరఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా చిన్నపాటి లోపాలు కూడా తలెత్తకుండా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడును కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

## ఘనంగా అరకులోయ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు




**అరకులోయ ,మార్చి 16 (మనసులో మాట)** : అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకులోయ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భరత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ని ఘనంగా నిర్వహించారు .ముందుగా ప్రిన్సిపల్ అధ్యాపకులు కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేను సత్యం కోసంనా ప్రజల కోసం నా ప్రాణాలను అర్పించటా నికి సిద్ధంగా ఉన్నానని తన ప్రాణాలను అర్పించి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు కృషిచేసిన గొప్ప మహా నీయుడు వ్యక్తి పొట్టి శ్రీరాములు అని అన్నారు.ఎన్ ఎస్ ఎస్ పిఓ లు పి.నాగబాబు, వై విజయలక్ష్మి, ఎం అనిత కుమారి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహనీయులు మరియు భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎల్ ఎం ఎస్ గణేష్, పి సుందరి రాణి,బి లచ్చన్న, సి హెచ్ వన్య పాల్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## డోర్ టు డోర్ క్యాంపెన్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు



**వి మాడుగుల , మార్చి 16 (మనసులో మాట)** : మాడుగుల మండలం కేంద్రంలో స్థానిక గవర వీధిలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతన్న మీకోసం కార్యక్రమంలో సోమవారం భాగంగా డోర్ టు డోర్ క్యాంపెన్లో మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని రైతులతో మాట్లాడడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు. టిడిపి మండల అధ్యక్షులు నందారపు సన్యాసిరావు. టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ. హాస్పిటల్ కమిటీ సభ్యుల లెక్కల కాశి బాబు. మరువాడ ఈశ్వరరావు. మండల ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది,



## రోలుగుంట మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం 24 అంశాలపై చర్చ



**రోలుగుంట , మార్చి 16 (మనసులో మాట) :** రోలుగుంట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య (17.03.2026) ఉదయం 11 గంటలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) నేతృత్వంలో జరగనుంది. 24 కీలక అంశాలపై వివిధ శాఖల పనితీరు, గ్రామీణాభివృద్ధి పథకాల స్థితిగతులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలును సమీక్షించేందుకు ఈ సమావేశం నిర్వహించబడుతుంది. సర్పంచులు, గ్రామ ప్రజల ప్రతినిధులు, శాఖ అధికారులు పాల్గొంటారు. మొదటి అంశంగా గ్రామీణ మంచినీటి సరఫరా పథకాల పురోగతి, లోపాలు, రిపేర్ పనులు చర్చకు వస్తాయి. రెండోటి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఆజీఏ)లో కార్యదినాల లక్ష్యాల సాధన, చెల్లింపులు, పనుల నాణ్యతపై మండల అధికారులు నివేదిక ఇస్తారు. మూడో అంశంగా వ్యవసాయ శాఖ సంబంధిత పంటల సమస్యలు, ఆవిష్కరణలు, రైతుల అవసరాలు పరిష్కరించేందుకు చర్చించబడతాయి. రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ శాఖల్లో భూమి రికార్డుల సవరణలు, ఆధార్ కార్డుల పంపిణీ, ఆహార ధాన్యాల సరఫరా పథకాల స్థితిని సమీక్షిస్తారు. నీటిపారుదల శాఖలో కాలువలు, చెరువులు, రెసర్వాయర్ల పురోగతి, నీటి వనరుల సమర్థవంతమైన ఉపయోగం అంశాలు చర్చకు వస్తాయి. విద్యా శాఖలో పాఠశాలల మౌలిక సదుపాయాలు, ఉపాధి లోపాలు, విద్యార్థుల హాజరు పెంపు కార్యక్రమాలు పరిశీలిస్తారు. ఆరోగ్య శాఖలో ఆసుపత్రి సేవలు, టీకాలు, మహిళా-శిశు ఆరోగ్య కార్యక్రమాలపై చర్చ జరుగుతుంది. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలో అంగన్వాడీ కేంద్రాలు, పోషకాహారం పంపిణీ, స్వీయ సహాయక బృందాల అభివృద్ధి అంశాలు ఉన్నాయి. విద్యుత్ శాఖలో సరఫరా అవకాశాలు, ట్రాన్స్ ఫార్మర్ సమస్యలు, బిల్లింగ్ లోపాలు సమీక్షించబడతాయి. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్లో రోడ్లు, డ్రైనేజ్, మౌలిక సదుపాయాల నిర్మాణ పనుల పురోగతి చర్చకు వస్తుంది. డి.ఆర్. డి. ఏ. వెలుగు కార్యక్రమం గ్రామీణాభివృద్ధి పథకాలు, పశుపోషణ శాఖలో పశు సంరక్షణ, ఆవు- ఆడపిల్లల అభివృద్ధి, గృహ నిర్మాణ పథకాలలో పి ఎం ఏ వై ఇళ్లు, రవాణా శాఖలో రోడ్లు, రహదారులు, భవనాల నిర్మాణం, సాంఘిక సంక్షేమం, అటవీ సంరక్షణ, ఎక్సైజ్ ఆదాయాలు, అగ్నిమాపక సేవలు, లేబర్-పోలీసు శాఖలు, మత్స్య పరిశ్రమ, హార్టికల్చర్ పండ్ల తోటలు, పరిశ్రమల అభివృద్ధి, అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలు అంతా సమీక్షలో భాగం. రోలుగుంట మండలంలోని 28 గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల వేగవంత అమలుకు ఈ సమావేశం మార్గదర్శకంగా నిలుస్తుంది.

## కేజీబీవీలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పేద విద్యార్థినులకు సువర్ణావకాశం



**మాకవరపాలెం , మార్చి 16 (మనసులో మాట) :** మాకవరపాలెం మండలం భీమబోయిన పాలెంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో 2026 -27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలలో మొత్తం 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో 36 సీట్లు ఉన్నాయని చెప్పారు. అర్హత గల బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో విద్యతో పాటు వసతి, భోజనం వంటి సౌకర్యాలు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుండటంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల బాలికలకు ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అభ్యర్థులు ఏప్రిల్ 1వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. పేద విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు నిర్మించు కోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కేజీబీవీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

## ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిలరెడ్డి ఎంజిఎన్ఆర్ఈజిఏ పరిరక్షణ యాత్రను విజయవంతం చేద్దాం

- ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి పిలుపు

**అరకులోయ,మార్చి 16 (మనసులో మాట) :** ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం (ఎంజిఎన్ ఆర్ఇజిఎ) చట్టాన్ని రద్దుచేసి ఆ పథకం పేరును మార్పుచేసి బలహీనపరచే చర్యలకు పాల్పడుతూ పథకం పేరులోని మహాత్మా గాంధీ పేరును తొలగించే ప్రయత్నం చేయడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన గురి చేస్తుందని ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి తెలిపారు.ఈ నేపథ్యంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ చీఫ్ వై.ఎస్. షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ యాత్ర నిర్వహించబడుతున్నదన్నారు. అందులో భాగంగా నేడు (మంగళవారం) మధ్యాహ్నం 3 గంటలకుఅరకులోయనియోజకవర్గంలోని మాడగడ గ్రామంలో రచ్చబండకార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట శాంతకుమారి, అల్లూరి సీతారామరాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సతక బుల్లిబాబు, అరకులోయ నియోజక





వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శెట్టి గంగాధర్ స్వామి పాల్గొనిహట్టగూడ,దళపతిగూడ, మాడగడ ప్రాంతాల గ్రామస్తులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ కార్మికులకు ఉపాధి హామీ కల్పించే ఈ చట్టాన్ని రక్షించుకోవడం ప్రతి భారత పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకుందాం గ్రామీణ పేదల హక్కులను కాపాడుకుందాం అనే నినాదంతో ఈ యాత్రకొనసాగుతుందన్నారు. అలాగే షర్మిల రెడ్డి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలనాయకులు, మహిళా కాంగ్రెస్, విద్యార్థి విభాగం, కార్మిక విభాగం, కిసాన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శాంతకుమారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తెల్లగంజి సోమేశ్వర రావు, పాంగి గంగాధర్,కన్నూరి ప్రవీణ్, కిల్లో జగన్నాథం,టి. భీమరావు, మజ్జి అర్జున్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు లేక ప్రజలే యంత్రాలు..శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు

- ఎన్ని ప్రభుత్వాలు మారిన కష్టాలు తీరడం లేదు

**హుకుంపేట , మార్చి 16 (మనసులో మాట) :** హుకుంపేట మండలం గన్నేరు పుట్టు పంచాయతీ పరిధిలోని గొప్పుగరువు, పొర్లు గ్రామాల గిరిజనులు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిరసనగా స్వయంగా రోడ్డు మరమ్మతులు చేపట్టారు. సోమవారం గ్రామ ప్రజలు సుమారు మూడు కిలోమీటర్ల మేర శ్రమదానంతో రోడ్డు పనులు ప్రారంభించారు. మనుషులే యంత్రాలుగా మారి బండరాళ్లను గునపాలతో పెకలిస్తూ రోడ్డు సరిచేయడానికి పూనుకున్నారు. గొప్పుగరువు, పొర్లు గ్రామాల్లో మొత్తం 34 కుటుంబాలు, సుమారు 70 మంది జనాభా స్థిరనివాసం ఉంటున్నారు. ఈ గ్రామాల్లో పీవీటీజీ కొండదొర తెగకు చెందిన గిరిజనులు నివసిస్తున్నారు. గతంలో వేసిన మట్టి రోడ్డు ఐదు సంవత్సరాలుగా మరమ్మతులు లేక వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో గ్రామానికి రాకపోకలు తీవ్రంగా ఇబ్బందిగా మారాయి. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అంబు





లెన్స్ కూడా గ్రామానికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఎవరో వచ్చి చేస్తారని ఎదురు చూడకుండా, "మన పని మనమే చేయాలి" అన్న సంకల్పంతో గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఇద్దరు చొప్పున సుమారు 50 మంది కలిసి శ్రమదానం ద్వారా రోడ్డు పనులు చేపట్టారు. ఏ ప్రభుత్వం వచ్చినా మారుమూల ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా రోడ్డు నిర్మాణం చేయకపోతే ఓటు అడగడానికి రావొద్దని కూడా గ్రామస్తులు హెచ్చరించారు.

ఇదిలా ఉండగా గ్రామంలో సీఎం జన్మన్ పథకం ద్వారా 8 మందికి ఇళ్ల మంజూరు అయ్యాయని తెలిపారు. అయితే రోడ్డు లేకపోవడం వల్ల నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇసుక లోడు రూ.12,000, చిప్స్ లోడు రూ.12,500 అవుతుండగా, హుకుంపేట నుంచి గొప్పుగరువు, పొర్లు గ్రామాల వరకు ఒక సిమెంట్ బస్తా రవాణా చేయడానికి రూ.100 ఖర్చవుతోందని తెలిపారు. రోడ్డు సౌకర్యం కల్పించి గ్రామ ప్రజల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గ్రామ పెద్దలు సాగరి మచ్చన్న, పాంగి మోహన్‌రావు కోరారు.

## పాఠశాల భవన నిర్మాణం వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం , మార్చి 16 (మనసులో మాట) :** ఎచ్చర్ల వీధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్‌తో కలిసి స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ద్వారా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎచ్చర్ల వీధి పాఠశాలకు నిర్మిస్తున్న నూతన భవనం విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో





పాటు, ఉత్తమ విద్యా వాతావరణాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఆలస్యం లేకుండా భవనాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడితే విద్యార్థుల హాజరు, చదువు పట్ల ఆసక్తి కూడా పెరుగుతుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.

## డెంకాడ పీహెచ్‌సీలో బ్లాక్ పబ్లిక్ యూనిట్ నిర్మాణానికి ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శంకుస్థాపన

**డెంకాడ , మార్చి 16 (మనసులో మాట) :** విజయనగరం జిల్లా డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.57 లక్షల 80 వేల వ్యయంతో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ యూనిట్‌కు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి గారు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ యూనిట్ పూర్తయితే స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డెంకాడ ఎంపీపీ బండుపల్లి వాసుదేవరావు ,టీడీపీ సీనియర్ నాయకులు కంది



చంద్రశేఖరరావు , పాణి రాజు , పల్లె భాస్కరరావు , వైద్య సిబ్బంది మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా పిర్యాదులను ప్రాదాన్యత క్రమంలో పరిష్కారం చూపాలి

- పోలీసు పబ్లిక్ గ్రీవెన్స్‌లో 62 పిర్యాదులు స్వీకరణ

**శ్రీకాకుళం , మార్చి 16 (మనసులో మాట) :** ప్రజా పిర్యాదులను ప్రాదాన్యత క్రమంలో పరిష్కారం పరిష్కారం చూపాలి అని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదులు స్వీకరణ మరియు పరిష్కారం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపిఎస్ గారు 62 మంది ప్రజల నుంచి నేరుగా పిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి మొత్తం 62 పిర్యాదులు స్వీకరించి, పిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రతి పిర్యాదును పరిగణనలోకి





తీసుకుని, త్వరితగతిన, న్యాయపరంగా పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాల ని సంబంధిత అధికారులను ఆదేశించారు .జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,..ప్రజల సమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యత గా బావించి,పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి పిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి" అని స్పష్టం చేశారు.అలాగే, పిర్యాదుల పరిష్కారంలో అలసత్వం, నిర్లక్ష్యం సహించబోమని, నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూ సమస్యలు, ఆస్తి తగాదాలు, కొట్లాటలు,వ్యక్తిగత తగాదాలు, మోసపూరితమైన పిర్యాదులు,కుటుంబ సమస్యలు వంటి పిర్యాదులు స్వీకరించడం జరిగింది .

### ఆదివాసులకు 100% రిజర్వేషన్ సాధనకు

## ఉద్యమం ఉధృతం చేస్తాం!

- ఆదివాసీ మాతృ బాష ఉపాధ్యాయలకు లోకేష్ ఇచ్చిన హామీ అమలు చేయాలి
- 36 మంది ఆదివాసీ ఉద్యమా కారులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసు కొట్టివేత
- అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు!

**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు , మార్చి 16 (మనసులో మాట) :** ఆదివాసీలకు నూరు శాతం రిజర్వేషన్ పునరుద్దరణ కు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలనీ,మాతృభాష ఉపాధ్యాయులకు జీతాలు పెంచాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నరస ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న నాయకులు, కార్యకర్తలపై ప్రభుత్వాలు తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందుల కు గురి చేయడం ప్రభుత్వాలు మానుకోవాలాని కోరారు. 2021లో పాడేరు పోలీస్ స్టేషన్ వద్ద ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయుల రెన్యువల్ చేయాలనీ , జీవో నెంబర్ 3 (100% రిజర్వేషన్ పునరుద్ధరణ) కోరుతూ రాష్ట్రవ్యాప్త మన్యం బందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు కేంద్రంలో శాంతియుతంగా నిర్వహించిన బందును బలవంతంగా అడ్డుకున్నట్లు, ప్రజలకు ఇబ్బంది కలిగించినట్లు, పోలీసు విధులకు భంగం కలిగించినట్లు ఆరోపణలతో 36 మంది ఉద్యమకా



రులపై నాటి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టింది.ఇందులో ఆదివాసి అధిక రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నరస, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి. లక్కు, కె.నరసయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిల్లో ప్రభుదాసు, పి.సింహాద్రి, పి.వరహాల బాబు, ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి చిట్టిబాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీదారి జగన్, పాంగి శ్రీను, పాంగి కుమారి, సర్బనాయుడు తదితరులతో పాటు 28 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారు. సుమారు ఐదు సంవత్సరాల సుదీర్ఘ విచారణ అనంతరం, ఈ రోజు పాడేరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో జడ్జి గారు తీర్పు ఇచ్చారు. పోలీసులు తగిన ఆధారాలు చూపలేకపోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. అనంతరం ఆదివాసి గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు.సమావేశంలో పి. అప్పల నరస మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాటి ప్రతి పక్ష నాయకులు లోకేష్ రాష్ట్రములో ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టినట్లు, వాటిని రద్దు చేస్తామని నాడు ప్రకటించినప్పటికీ, నేటి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా రెండు సంవత్సరాల విచారణ తర్వాత జడ్జి వాస్తవాలు గ్రహించి తీర్పు ఇచ్చారు. అయితే, గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయకపోగా, నేటి ఉద్యమకారులపై కూడా తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎదుర్కొనే ఇబ్బందులను భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలతో ఎదుర్కొంటామని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు (ముఖ్యంగా జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, ముఖ్యమంత్రి హామీలు) అమలు కోసం ఉద్యమిస్తామని తెలిపారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయులకు వేతనాలు పెంచాలని, యువగలం పాదయాత్రలో వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని నారా లోకేష్ ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడే ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టడం ఆపాలని,ఆదివాసీలకు న్యాయం జరగాలని కోరారు.

## త్యాగధనుడు, నిత్యస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 16 :** తెలుగు వారి ఔన్యత్యానికి ప్రతీక, త్యాగధనుడు, పొట్టి శ్రీరాములు నిత్య స్మరణీయుడని మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కె వెంకటలక్ష్మీపతిరాజు పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో కోటలో గల మోతీ మహల్‌లో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీ రాములు 125వ జయంతి ఉత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వంటి నిస్వార్థపరులైన దేశభక్తులు పది, పన్నెండుమంది తన అనుచ రులుగా ఉంటే స్వరాజ్యాన్ని ఏనాడో సాధించి ఉండేవాణ్ణి అని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను ప్రస్తావించారు. తన ప్రాణాన్ని తృణప్రాయం గా త్యజించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు పట్టుదలను, కార్యదీక్షను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముందుగా మహారాజా అటానమస్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సాంబశివరావు జ్యోతి



ప్రజ్వలనం చేసి మాట్లాడుతూ స్వార్థ రాహిత్యం, పట్టుదల, నిరాడంబరత, మొక్కవోని నమ్మకం, ఆగని పరిశ్రమ, సూక్ష్మమైన బుద్ధి వంటి అంశాలు పొట్టి శ్రీరాములు నుండి నేటి యువత అలవరుచుకోవాలని అన్నారు. సమితి అధ్యక్షులు గురుప్రసాద్ మాట్లాడుతూ పురాణాలలో మనం విన్న దధీచి,శిబి చక్రవర్తి కంటే పొట్టి శ్రీరాములు గొప్పవాడని, త్యాగనిరతికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు, పొట్టి శ్రీరాములు జీవితవిశేషాలపై ప్రత్యేకంగా పేపర్ ప్రెజెంటేషన్ విద్యార్థులకు పతకాలను, బహుమతులను, ప్రశంసాపత్రాలను ప్రదానం చేసారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. సుమారు 110 మంది విద్యార్థులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమంచి సుబ్బారావు, వనితావాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సుభద్రాదేవి, లక్ష్మీ రామదాసు, దాసరి పద్మ, సమైక్య భారతి సమన్వయర్త కన్నయ్య, అధ్యక్షులు సత్యనారాయణ,ధవళ సర్వేశ్వరరావు, కాగుపాటి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల తెలుగు విభాగం అధిపతి డాక్టర్ ఎస్ సూర్యకాంతి సమన్వయకర్తగా వ్యవహరించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

## నేడు మునగపాక శ్రీ పరదేశమ్మ పండుగ మహోత్సవం



**మునగపాక , మార్చి 16 (మనసులో మాట)** : మండల కేంద్రం మునగపాక లో మంగళవారం శ్రీ పరదేశమ్మ పండుగ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్ణయించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వీలుగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన అన్నారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా వివిధ సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సంతబైల విశాలాంధ్ర స్టేజిపై విల్లూరి లీల జగన్నాథరావు ఆధ్వర్యంలో నాటకం ప్రదర్శించబడుతుందని తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ను ఆహ్వానించడం జరిగిందని ఆయన తెలిపారు

## తాటి చెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడు మృతి



**మాకవరపాలెం , మార్చి 16 (మనసులో మాట)** : మాకవరపాలెం మండలం జి. వెంకటా పురం గ్రామానికి చెందిన పొలూరపు రాంబాబు (45) తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని కలిగించింది. గ్రామంలో కల్లుగీత కార్మికుడిగా పనిచేస్తున్న రాంబాబు సాధారణంగా లాగే తాటి చెట్టెక్కి పని చేస్తుండగా ఒక్కసారిగా జారి కిందపడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రమాదంలో రాంబాబు తీవ్రంగా గాయపడగా, అక్కడ ఉన్న వారు వెంటనే గమనించి చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో రాంబాబు కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో కూడా విషాద వాతావరణం నెలకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## నూకాంబికా జాతరకు ముస్తాబైన ఆలయాలు



**ఎన్.రాయవరం, మార్చి 16 (మనసులో మాట)**:కొత్త అమావాస్య సందర్భంగా మండలంలోని పలుగ్రామాల్లోఈనెల 18 వతేదీ బుధవారం శ్రీనూకాంబికా అమ్మవారి జాతరను నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేసారు. జాతరలో భాగంగా మంగళవారం జాగరణోత్సవం నిర్వహిస్తారు .గ్రామాల్లో అమ్మవారి ఘటాలు ఊరేగింపు నిర్వహిం చారు. దార్లపూడి, పెద్దగుమ్ములూరు, చిన్నగుమ్మా లూరు, తిమ్మాపురం, ఎస్. రాయవరం, గోకులపాడు, గెడ్డపాలెం, పేటసూదిపురం, సైతారుపేట తదితర గ్రామాల్లో జాతర సందర్భంగా విద్యుత్ దీపాలుతో అలకరించారు.

## స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి : ఎమ్మెల్యే నాగ మాధవి




**డెంకాడ , మార్చి 16 (మనసులో మాట)** : స్వచ్ఛ ఆంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ముందుకు సాగాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పిలుపునిచ్చారు. డెంకాడ మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లకు ఉపయోగపడే స్వచ్ఛ రథం రిక్షాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడటంలో ప్రజలు ముందుండాలని ఆమె పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ ఆంధ్ర సాధన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని, అందరూ కలిసి గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు.

## ఆంధ్రప్రదేశ్ అవతరణకు పొట్టి శ్రీరాములు కృషి



**ఐదు తరువాయి** తారీఖున నెల్లూరు గ్రామంలో జన్మించారని ఆయన అన్నారు అదేవిధంగా 1952 డిసెంబర్ 15వ తారీఖున తెలుగు ప్రజల కోసం, తెలుగువారి ఆత్మగౌరవం కోసం సుమారు రెండు నెలల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేయడం జరిగిందని ఆయన అన్నారు. పొట్టి శ్రీరాములు వారి ఆమరణ నిరాహార దీక్ష ఫలితమే ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయిందని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ నెంబర్ గొర్లె సునీత మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తెలుగు ప్రజల హక్కుల కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు వారికి తెలుగు ప్రజలందరూ ఎప్పటికప్పుడు స్మరించుకోవాలని ఆమె అన్నారు. పొట్టి శ్రీరాములు వారి ఆశయాలు మన ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత మన అందరిపై ఉందని ఆమె అన్నారు. ముందుగా మన గ్రామాలు, మన మండలాలు, మన జిల్లా, మన రాష్ట్రం, మన దేశాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత ప్రతి భారతీయుడు పై ఉందని ఆమె అన్నారు. అదేవిధంగా ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు పండ.వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగ బొజ్జయ్య, ఏఎంసీ చైర్మన్ లోత లక్ష్మణ్ పొట్టి శ్రీరాములు వారి ఆశయాలపై ప్రసంగించడం జరిగింది. అనంతరం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వివిధ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా అమరావతి నుండి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వారి ప్రసంగం, డిప్యూటీ ముఖ్యమంత్రి వారి ప్రసంగం వచ్చేవాళ్లు ప్రోగ్రాం ద్వారా ప్రజలకు వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ జనరల్ డివిస్వి రమణ, తాసిల్దార్ పి. బాలాజీ,ఎంపీడీవో ప్రసాద్, ఐటీడీఏ పరిపాలన అధికారి ఎర్రంశెట్టి రాజు, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు,ఏపీవో బి. సత్యనారాయణ, ఏఎస్ఓ విజయ భాస్కర్, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, పండ చెల్లన్న దొర, గణపతి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్.నిర్మల, వీఆర్వోలు శివకుమార్, ఏ చిన్న రాజు, సూపర్వైజర్ జి.కుసుమ సచివాలయాలకు సంబంధించిన సిబ్బంది, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి 125 వ జయంతి వేడుకలు



**విజయనగరం , మార్చి 16 (మనసులో మాట)** : దేశానికి స్వాతంత్రం తెచ్చిన స్వతంత్ర సమర యోధుల్ని ఏ విధంగా గుర్తు తెచ్చుకుంటున్నామో.. అదేవిధంగా ఈ రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములును కూడా గుర్తించుకోవాల్సిన బాధ్యత, అవసరం ఎంతైనా ఉందని మాజీ డిప్యూటీ స్పీకర్, సీఈసీ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. సోమవారం నాడు ఆయన నివాసంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం శాసనసభ నియోజక వర్గం తరపున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్రుల గౌరవాన్ని ప్రత్యేకతనిస్తూ మద్రాస్ రాష్ట్రంలో కలిసి ఉన్న తెలుగు మాట్లాడుతున్న ప్రజలకు తగు ప్రాముఖ్యత ఇవ్వడం లేదని, తగిన అభివృద్ధి జరగటం లేదని, అన్నీ కూడా తమిళూలే అనుభవిస్తున్నారనీ, తెలుగు మాట్లాడే ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, తెలుగు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఒక ఉద్యమాన్ని నడిపించిన నేతగా మన అందరికీ పొట్టి శ్రీరాములు తెలుసని, అప్పటి ప్రభుత్వం ఆ ఉద్యమాన్ని అణగదొక్కాలనే పరిస్థితిలో ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆయన ప్రాణాన్ని సైతం త్యాగం చేసి ప్రత్యేక తెలుగు రాష్ట్రాన్ని సాధించిన ఘనత పొట్టి శ్రీరాములు దేనని ఆయన అన్నారు. ఆయన సాధించిన ఈ రాష్ట్రానికి ఆయన శాశ్వతంగా గుర్తుండాలని ఆలోచనతో స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన పుట్టిన నెల్లూరు జిల్లాని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్చడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎవరైనా ఏదైనా సాధించేటప్పుడు దానివల్ల ఉపయోగం పొందిన ప్రతి ఒక్కరూ గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అటువంటి మహనీయుల చరిత్ర రేపటి తరాలకు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందని, ఆయన సాధించిన ఈ తెలుగు రాష్ట్రం, తరువాత రెండుగా విభజన జరిగినప్పటికీ, రెండు రాష్ట్రాల ప్రజలు ఆయన గురించి ఘనంగా చెప్పుకునే పరిస్థితి ఎప్పటికీ ఉంటుందని, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అనేక రంగాల్లో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందిందని, ఈ అభివృద్ధికి మూలకారకుడు పొట్టి శ్రీరాములు లే అని, ఆయన జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి రాజేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రెడ్డి బంగారు నాయుడు, యువజన మరియు విద్యార్థి విభాగాలు ఇంచార్జ్ ఈశ్వర్ కౌశిక్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మామిడి అప్పలనాయుడు, వైసిపి మండలాధ్యక్షులు కెల్లా త్రినాధరావు, వైసిపి పట్టణ కార్పొరేటర్లు, యువజన విభాగం నాయకులు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

## వికలాంగులకు సొంత నిధులతో బ్యాటరీట్రై సైకిల్ పంపిణీ



**గాజువాక , మార్చి 16 (మనసులో మాట)** : గాజువాక నియోజవర్గానికి చెందిన ఐదుగురు వికలాంగులు తాము పడుతున్న ఇబ్బందులు శాసనసభ్యులు ఆంధ్ర ప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకుని వచ్చిన పిమ్మట తక్షణమే స్పందించి 25వేల రూపాయలు విలువచేసే ఐదు బ్యాటరీ బ్యాటరీ ట్రై సైకిల్ ను గాజువాక కార్యాలయంలో ఈరోజు వారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇతరు దివ్యాంగులు నా దృష్టికి తీసుకుని వస్తే సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,69వ కార్పొరేటర్ కాకి గోవింద్ రెడ్డి, 86వ టిడిపి ఇన్చార్జ్ నల్లూరి సూర్యనారాయణ,85వ టిడిపి అధ్యక్షులు కర్రీదసేంద్ర, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం నూకరాజు, జిల్లా మహిళా నాయకురాలు అనంతలక్ష్మి జిల్లా టిఎన్ఎస్ అధ్యక్షులు ఎస్ రతన్కాంతు గాజువాక బిసి సెల్ అధ్యక్షులు తమిరి శివప్రసాద్ గాజువాక మహిళా అధ్యక్షురాలు కనక భవాని. గాజువాక బిసి నాయకులు పోతిన వెంకటరావు దొడ్డి సత్య రావు తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ



**మునగపాక , మార్చి 16 (మనసులో మాట)** : మండలంలో ఉమ్మలాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలలో భాగంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతం అభివృద్ధి చెందాలని కర్రి సాయికృష్ణ అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మొల్లేటి గణేష్, మందా రాము, కాంద్రేగుల గణేష్, మొల్లేటి గోపాల్, రమణ, ఏడిద నాగేశ్వరరావు, భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, యువత, గ్రామ పెద్దలు మరియు భక్తులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం వేగవంతం చేయండి : ఐటీడిఏ పిఓ స్మరణ రాజ్



**అల్లూరి సీతారామరాజు జిల్లా / పోలవరం జిల్లా రంపచోడవరం , మార్చి 16 (మనసులో మాట)** : ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల దరఖాస్తులు వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాలు అన్వేషించి సమస్యలు పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఏ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్,ఏపీఓ జనరల్ డివిస్వి రమణ, పిజిఆర్ఎస్ ఇన్చార్జి అధికారి టి. శ్రీనివాస్ విశ్వనాథ్ నిర్వహించారు.ఈ సందర్భంగ పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈ వారం సుమారు 56 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రంపచోడవరం మండలం రంప గ్రామంలోని దొర వీధి సమీపంలో ఉన్న కాలువపై కల్వర్ట్ లేక రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని వెంటనే కల్వర్టు ఏర్పాటు చేయాలని అదేవిధంగా రంప గ్రామంలోని రామాలయం ఏర్పాటు చేయాలని తీగల బుల్లియమ్మ, మిరియాల సోమన్న దొర, తీగల శ్రీనివాస్ దరఖాస్తు సమర్పించారు. దేవి పట్టణ మండలం రామన్నపాలెం నుండి నూనెపల్లి గ్రామ వరకు నాలుగు కిలోమీటర్లకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ టి. శిరీష, కే సత్యం రాజు, కుంజం.శివరామకృష్ణ దొర, తోకల శ్రీను, సాధల వెంకటరెడ్డితో పాటు వందమంది దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలం ఇవ్వంపల్లి, ఐ.భీమవరం గ్రామాలకు సంబంధించిన 90 మంది గిరిజన కుటుంబాలకు వివిధ రకాలైన ఉత్పత్తులు ప్రాసెసింగ్ చేసుకొనుటకు డ్రై మిషన్లు ఏర్పాటు చేయాలని ఈత పల్లి సత్యనారాయణరెడ్డి దరఖాస్తు సమర్పించారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన వల్ల వీరారెడ్డి 18 సంవత్సరాల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. దేవీ పట్టణ మండలం జీ.తాటివాడ గ్రామానికి చెందిన కారం బాలు దొర, ముర్రం పోతన్న దొర, మడకం లచ్చన్న దొర వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలంలోని మారేడుమిల్లి గ్రామంలో మా కుటుంబంలోని ఇద్దరు గత సంవత్సరం చనిపోవడం జరిగిందని డెత్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని లక్కొండ డేవిడ్ రాజు, లక్కొండ ప్రసాద్ రావు దరఖాస్తు సమర్పించారు. ఈకార్యక్రక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డిఎం అండ్ హెచ్ఓపి. సరిత,ఏజెన్సీ, డిఆర్డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, జిసిసి డిఎం జయశ్రీ,పిఏఓ ఎల్.రాంబాబు, తహసిల్దార్ పి.బాలాజీ,ఎంపీడీవో ప్రసాద్ ,సిడిపివోలు క్రాంతి కుమారి,ప్రత్యక్ష లక్ష్మి,కె.ఉమా, శాంతి కుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, బివి రమణ, రవికుమార్, సుబ్బయ్య,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి. వెంకటరమణ, మల్లికార్జునరావు, సుబ్బారావు, భవాని, వైద్యాధికారులు డేవిడ్, స్పందన, డివిజనల్ సివిల్ సప్లై అధికారి విజయ భాస్కర్, అన్ని మండలాలకు సంబంధించిన తాసిల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తహసిల్దార్లు రవీంద్రబాబు, స్వామి, త్రిమూర్తులు, శ్రీధర్, సబ్ రిజిస్టర్ ఉపేంద్ర, పీఎంయు అధికారులు చంద్రకళ, మోహన్, సూపర్డెంట్ బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## 30 లక్షలతో రాచపల్లి పంచాయతీలో అభివృద్ధి పనులు



**మాకవరపాలెం , మార్చి 16 (మనసులో మాట)** : మాకవరపాలెం మండలం రాచపల్లి పంచాయతీలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టగా, ప్రస్తుతం రాచపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులను అధికారులు పరిశీలిస్తూ పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ పథకం కింద పంచాయతీలోని పలు వీధుల్లో సిమెంట్ రోడ్లు, వరద కాలువల నిర్మాణ పనులు చేపట్టబడుతున్నాయి. మొత్తం రూ.30 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం జరుగుతుండగా, మరో రూ.20 లక్షలతో కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే గ్రామంలో రహదారి సౌకర్యం మెరుగుపడి ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. గ్రామస్తులు కూడా ఈ పనులపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నాయకుడు రుత్తల జోగుపాత్రుడు గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తూ ఈ పనులు జరిగేలా కృషి చేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఆయన సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రోలుగుంటలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం..144 సెక్షన్తో భద్రత



**రోలుగుంట , మార్చి 16 (మనసులో మాట)** : రోలుగుంట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం పూర్తి శ్రద్ధగా, ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.. పరీక్షా హాల్లో అన్ని వ్యవస్థలు బాగా ఏర్పాటు చేయబడ్డాయి. పరీక్షా కేంద్రం ఆవరణలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ను సమర్థవంతంగా అమలు చేశారు.. కేంద్రం పరిసరాల్లో, అనవసర గొడవలు రాకుండా దట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు సమీపంలోని అన్ని జెరాక్స్ సెంటర్లను ముందస్తుగా మూసివేయించారు. నిబంధనలు ఉల్లంఘించినవారిపై కఠోర చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ భద్రతా చర్యలను స్వాగతించారు. మండల విద్యాశాఖ అధికారులు కేంద్రాన్ని స్వయంగా పరిశీలించి, అందరికీ అభినందాలు తెలిపారు. పరీక్షా వాతావరణం వల్ల విద్యార్థులు మరింత ధైర్యంగా పరీక్షలు రాస్తున్నారని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన పరీక్షలు కూడా ఇలాంటి వాతావరణంలో సాగనున్నాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పోలీస్, విద్యాశాఖ చర్యలను ప్రశంసించారు.

## పార్టీ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు




**రావికమతం , మార్చి 16 (మనసులో మాట)** : రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న మహిళలకు తమ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు తెలిపారు. మండల కేంద్రం ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం స్థానిక సంస్థలకు చెందిన మహిళ ప్రజా ప్రతినిధులు సర్పంచ్, ఎంపీటీసీ లను ఆయన సన్మానించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిపాలనలో మహిళల రక్షణ, సంక్షేమం కోసం చట్టాలను రూపొందించే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యం ఉండాలని టిడిపి పార్టీ కోరుకుంటుదన్నారు. ఈ కారణంగానే చట్టసభలలో మహిళల రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి తమ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని చెప్పారు రానున్న స్థానిక ఎన్నికలలో వార్డ్ మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు పోటీ పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండనాయుడు రావికమతం సూపర్ సర్పంచ్ గెంజి మోది నాయుడు, టెలికం అడ్వైజరీ బోర్డు మెంబర్ గల్లా రాజేశ్వరరావు, మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు గుటాల చిన్న, మేడివాడ సూపర్ సర్పంచ్ వి మూర్తి తదితరులు పాల్గొన్నారు

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

## సంప్రదాయ పంటలతో పాటు లాభాదాయక పంటలపై రైతులు దృష్టి సారించాలి

### జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర



**అనకాపల్లి , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 16 :** రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతన్న మీకోసం' కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రైతులకు చేసిన మేలును వివరించడం లక్ష్యంగా గన్నవరంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్రంలో సుమారు 46.83 లక్షల మందికి అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశాం. తొలి విడతలో రూ.7000 చొప్పున రూ.3174 కోట్లు, రెండో విడతలో రూ.3,135 కోట్లు మూడో విడతలో రూ.6000 చొప్పున రూ.2600 కోట్లు చొప్పున సుమారు రూ.9000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అనకాపల్లి జిల్లాలో రూ.132 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఎపుడూ లేని విధంగా రైతు సంక్షేమం కోసం రూ.53 వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టాం అన్నారు. ప్రస్తుతం పంటల దిగుబడి కోసం రసాయనాల వినియోగం తీవ్రంగా చేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం. రసాయన వినియోగం పెంచితే భవిష్యత్ అగమ్యగోచరం అవుతుంది. పంజాబ్ లో ఏం జరిగిందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి రోజు క్యాన్సర్ బాధితులతో ఒక రైలు డిల్లీ వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. అందుకే ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. తద్వారా దిగుబడులు పెంచుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం. మొన్నటి వరకు వ్యవసాయం అంటే గోదావరి జిల్లాలు మాత్రమే గుర్తొచ్చేవి. కానీ నేడు అనంతపురం హార్టికల్చర్ ద్వారా గోదావరి జిల్లాలకు పోటీగా నిలుస్తోంది. స్ప్రింక్లర్స్, డ్రిప్ ఇరిగేషన్ కు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి. 2027 నాటికి పోలవరం పూర్తి చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. లెఫ్ట్ కెనాల్ ద్వారా అనకాపల్లి జిల్లాకు పుష్కలంగా సాగు నీరు అందించే అవకాశం ఉంది. బిల్ గేట్స్ ఏపీ పర్యటనలో వ్యవసాయ అవసరాలకు సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకొచ్చారు. పంటలను అమ్ముకోవడం కాకుండా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనతో ' రైతులకు అవగాహన కలిగించడం రైతన్న మీకోసం.' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్నిప్రోత్సహిస్తున్నా మన్నారు. మరింత విస్తీర్ణంలో ప్రకృతి సాగుచేసేలా రైతులలో అవగాహన పెంచాలని వ్యవసాయాధికారులు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పొలంపిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాలు నిర్వహించి సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించడమే కాక 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రెండు విడతలలో 2,42,536 మంది రైతులకు 134.27 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, జిల్లాలో 60 డ్రోన్లను రైతులకు అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయంలో సాంకేతికత, ఆహార శుద్ధి, ప్రభుత్వ మద్దతు. పాడి రైతులకు అండ వంటి పంచ సూత్రాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు, వాటిని ప్రతీ రైతు వినియోగించుకునే విధానాలపై రైతుల ఇంటివద్దకు వెళ్లి ప్రతీ రైతుకు వ్యవసాయ, అనుబంధాల రంగాల సిబ్బంది 15 రోజులపాటు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆదారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెస్సింగ్, ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని, కావున రైతు సోదరులు ఈ కార్యక్రమమ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి ఆశాదేవి, వివిధ రాష్ట్ర కార్పొరే షన్ల చైర్మన్లు బత్తుల తాతీయ్య బాబు, పీలా గోవిందా సత్యన్నారాయణ, మళ్ల సురేంద్ర, డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ఆదివాసీ గిరిజన సంఘం



- పీపుల్స్ హెల్త్ సొసైటీ సౌజన్యం తో ఉచిత మెడికల్ క్యాంప్
- 150 మంది రోగులకు వైద్యం అందించడం జరిగింది
- 20 మంది కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఫ్రీ ఆపరేషన్ కి శ్రీ నేత్ర ఐకేర్ విశాఖపట్న సిఫార్సు

**పెదబయలు , మార్చి 16 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా ,ఆదివాసీ ప్రజలకు సామజిక సేవ కార్యక్రమం నిర్వహణ లో ఆదివాసీ గిరిజన సంఘం ముందంజ లో ఉందని జిల్లా అధ్యక్షులు ఎస్. ధర్మన్న పడాల్ అన్నారు. నేడు పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ కేంద్రంలో గల కిముడుపల్లి గ్రామంలో ఆదివాసీ ప్రజలకు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ను పీపుల్స్ హెల్త్ సొసైటీ సౌజన్యం తో ఆదివాసీ గిరిజన సంఘం, మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించింది.ఈ మెడికల్ క్యాంపులో లో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. ధర్మన్న పడాల్ , మాజీ జిల్లా అధ్యక్షులు బోండా సన్నిబాబు మాట్లాడుతూ, సామాజిక సేవలో ఆదివాసీ గిరిజన సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఇప్పటికి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం లో మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగిందాని, ఇప్పటికి సుమారు 5 వేల ముందుకి ఉచితంగా చికిత్స, మరియు మందులు అందించమని, దాతలు, సామజిక సేవకుల సహకారం తో ఆదివాసీ ప్రజలకు సేవ అందించడం చాలా సంతోషం గా ఉందని అన్నారు.అందులో భాగంగానే పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో, ప్రజా ఆరోగ్య వేదిక మరియు ఆదివాసీ గిరిజన సంఘం సంయుక్తంగా కిముడుపల్లి గ్రామాల్లో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడింది. విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం ఆదివాసీ పేద ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు అందించారు. ఈ ప్రాంతంలో తీవ్రమైన తాగునీటి కొరత ఉండటం వల్ల ప్రజలు వాగు నీటిని వినియోగించవలసి రావడంతో టైఫాయిడ్ వంటి విష జ్వరాలు సాధారణంగా వస్తున్నాయని శ్రీ ధర్మన్న పడాల్, బొండ సన్నిబాబు, ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సుమారు 150 మంది ఆదివాసులకు వైద్య పరీక్షలు చేయగా 20 మంది కంటి సమస్యతో బాధపడుతూ ఉండటం వల్ల కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తూ వీరికి శ్రీ నేత్ర ఐ కేర్, శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి కంచరపాలెం విశాఖపట్నంలో ఉచితంగా కంటి ఆపరేషన్ చేయుటకు సిఫార్సు చేస్తూ ఏప్రిల్ 1 వా తేదీన విశాఖపట్నం కంటి ఆసుపత్రికి ఫ్రీ బస్సు ఫ్రీ ఆపరేషన్ అన్ని రకాల సౌకర్యాలు చూసుకుంటూ తీసుకెళ్లటానికి శ్రీ నేత్ర ఐ కేర్ డాక్టర్లు ముందుకు వచ్చి సేవలందించుటకు వైద్యులు ముందుకు వచ్చారు వారికి ఆదివాసి గిరిజన సంఘం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు , రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్యం బృందం కంటి పరీక్షలు, బిపి, షుగర్ కాన్సర్, ఈసీజి టెస్ట్ లు నిర్వహించారు.. వైద్య సిబ్బంది డాక్టర్ భాగ్యరాజు, రిషి, కిరణ్ కుమార్, పుష్ప గిరి, ఏం ఎస్ ఎల్ రాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మాన పడాల్, మాజీ జిల్లా అధ్యక్షులు బోండా సన్నిబాబు, బి. గంగాధరం, పి సునీల్ కుమార్, గ్రామ పెద్దలు కే శివలింగం నాయుడు, ఎల్ లక్ష్మీ నాయుడు, ఓ దిలీప్ కుమార్, వి.మహేష్,సి హెచ్.ఓ, స్థానిక పంచాయతీ ఏఎన్ఎం.వరాహాలమ్మ, ఆశ వర్కర్లు అంగన్వాడీలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'రైతన్న మీ కోసం' సదస్సులో భవిష్యత్ ప్రణాళికల వివరణ

### - సాగును లాభసాటిగా మార్చడమే లక్ష్యం: అధికారులు, ప్రజాప్రతినిధులు చౌడుపల్లిలో



**చింతపల్లి , మార్చి 16 (మనసులో మాట) ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతన్న మీకోసం' కార్యక్రమం సోమవారం మండలంలోని చౌడుపల్లి పంచాయతీలో వైభవంగా జరిగింది. సాగు కష్టాలను తీర్చి, రైతును రాజును చేయడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ప్రజాప్రతినిధులు, అధికారులు నేరుగా క్షేత్రస్థాయికి చేరుకుని అన్నదాతల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం వాటాను పెంచి, రైతుల తలసరి ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. స్థానిక సర్పంచ్ గేమ్మెలి లలిత, ఏఎంసీ చైర్మన్ కిల్లో ఊర్మిళ, టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరైన ఈ సదస్సులో సాగులో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను వివరించారు. సర్పంచ్ లలిత మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి రైతుకూ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా, ఏఎంసీ చైర్మన్ ఊర్మిళ మార్కెట్ కమిటీల ద్వారా దళారీ వ్యవస్థను అరికట్టి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో వ్యవసాయ రంగంలో ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యమని, అందుకోసం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని పూర్ణచంద్రరావు వివరించారు. ముఖ్యంగా చిరుధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, మిగిలిన వారికి 90 శాతం వరకు రాయితీలను ప్రభుత్వం పునరుద్ధరించిందని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు బేతాళుడు, బీసీ సెల్ అధ్యక్షులు నాగభూషణం, నాయకులు మధు తదితరులు పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహించి వినతులు స్వీకరించారు. అనంతరం వ్యవసాయ శాఖ ప్రతినిధి (విహెచ్ఏ) వంపురు శోభన్ బాబు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. సాగుకు సాంకేతికతను జోడించి డ్రోన్ల వినియోగం, సూక్ష్మ సేద్యం, శాటిలైట్ టెక్నాలజీ ద్వారా పంటల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే విధానాలను వివరించారు. చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం నేరుగా తమ ముంగిటకే వచ్చి భరోసా కల్పించడం పట్ల అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

## జి.సి.సి. కాఫీ కొనుగోలు చేయకపోతే ముట్టడి తప్పదు!

- ఇళ్లలోనే మూలుగుతున్న 70 టన్నుల కాఫీ నిల్వలు
- ధర ప్రకటించి చేతులెత్తేసిన అధికారులు
- గిరిజన రైతుల ఆవేదన.. ఆదివాసీ గిరిజన సంఘం హెచ్చరిక



**చింతపల్లి , మార్చి 16 (మనసులో మాట) ప్రతినిధి :** మన్యంలో గిరిజన రైతులు పండించిన కాఫీ పంటను కొనుగోలు చేయడంలో గిరిజన సహకార సంస్థ (జి.సి.సి.) తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, తక్షణమే స్పందించకుంటే చింతపల్లిలోని జి.సి.సి. డివిజనల్ కార్యాలయాన్ని రైతులతో కలిసి ముట్టడిస్తామని ఆదివాసీ గిరిజన సంఘం హెచ్చరించింది. సోమవారం చింతపల్లిలో జరిగిన సమావేశంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి మాట్లాడుతూ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్గానిక్ సర్టిఫికెట్లు ఉన్న కాఫీ రైతులకు కిలో చెర్రీ ధర రూ. 270గా ప్రకటించి, డిసెంబరు నెలాఖరులోనే తూకాలు వేసినప్పటికీ.. నేటికీ బస్తాలను తరలించకుండా రైతుల ఇళ్లలోనే ఉంచడం దారుణమన్నారు. కేవలం గతంలో తాము ఇచ్చిన అప్పుల మేరకు మాత్రమే కాఫీ గింజలు తీసుకుంటామని, మిగిలిన నిల్వలను వదిలేస్తామని అధికారులు చెప్పడం గిరిజనులను వంచించడమేనని మండిపడ్డారు..ముఖ్యంగా ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్రబంద గ్రామంలో సుమారు 70 టన్నుల ఆర్గానిక్ కాఫీ నిల్వలు రైతుల ఇళ్లలోనే మూలుగుతున్నాయని, అటు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోలేక, ఇటు జి.సి.సి. తీసుకోక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి నుంచి మే వరకు గిరిజనులకు వివాహాలు, గృహ నిర్మాణాల వంటి అవసరాలకు నగదు ఎంతో అవసరమని, జూన్ నెలలో వర్షాలు మొదలైతే నిల్వ ఉన్న గింజలు తేమ బారిన పడి పాడైపోయి రైతులకు తీరని నష్టం వాటిల్లుతుందని గుర్తు చేశారు. సర్వసభ్య సమావేశంలో ఎర్రబొమ్మల ఎంపీటీసీ సెగ్గే సత్తిబాబు ఈ సమస్యపై తీర్మానం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని విమర్శించారు. లాభాలు వస్తే ఎగబడే అధికారులు, కష్టాల్లో ఉన్న గిరిజనులను ఆదుకోవడంలో ముఖం చాటేస్తున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా అధికారులు స్పందించి కొనుగోళ్లు చేపట్టాలని, లేనిపక్షంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండలరావు, మాజీ ఎంపీటీసీ రమణమూర్తి, భద్రం, రాజారావు, రాజబాబు, బాలకృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిందాల్ పీవోటి రైతులకు న్యాయం చెయ్యండి! : జిల్లా కలెక్టర్ కి వినతి



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 16 :** జిల్లా ఎస్.కోట మండల పరిధిలోని బొడ్డవర ప్రాంతంలో 2009 లో ఏటా 1.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం తో జిందాల అల్యూ మినా కర్మాగారం ఏర్పాటు చెయ్యాడానికి రాష్ట్ర ప్రభుత్వం జరిపిన భూ సేకరణ లో అనేక అవకతవకలు జరిగాయని వాటిపై తరచూ లోక్ సత్తా ప్రశ్నిస్తూనే ఉందని లోకసత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి భాబ్జి జిల్లాకలెక్టరేకు ఇచ్చిన వినతిపత్రం లో ప్రశ్నించారు.రెవెన్యూ అధికారులు, జిందాల్ యజమానులు చేసిన తప్పుల వలన సుమారు 18 మంది పీవోటి రైతులు 74.15 ఎకరాల భూమిని కోల్పోయిన పరిస్థితి నెలకొందని నేటికి జిందాల్ భూ సేకరణ జరిగి 17 సంవత్సరాలు పూర్తి అయినా పీవోటి రైతులకి న్యాయం జరగక తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కొంతమంది రైతులు చనిపోయారని, వెంటనే పీవల్ రైతుల తో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేసి రైతులకు తగిన న్యాయం చేస్తూ కొంత పారితోషికం విడుదల చేయాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా కలెక్టర్ ని కోరారు ఈమేరకు కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందచేశారు అనంతరం భీశెట్టి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన పార్టీల నాయకులకు రైతుల పట్ల కనీస ఆదరణ లేని కారణంతో ఎవరు అధికారంలో ఉన్నా జిందాల్ రైతులకు తీరని అన్యాయం జరిగిందని, పారితోషకం, ఫలసాయం పొడకుండానే రైతులను పోలీసులు, జిందాల్ యజమానులు అడ్డుకున్నారని ఇది మంచిపద్ధతి కాదని త్వరలోనే జిందాల్ భూ సేకరణ ప్రాంతంలో చిన్న పరిశ్రమలు వస్తాయని ప్రభుత్వం ప్రకటించిందని శంకుస్థాపన జరిగే లోగా జిందాల్ పీవోటి రైతులకు న్యాయం చెయ్యాలని భీశెట్టి కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ని కోరారు.

## కన్యక మిల్లెట్స్ పై అవగాహన సదస్సు



**మునగపాక , మార్చి 16 (మనసులో మాట) :** మండల కేంద్రమైన మునగపాక అయ్యప్ప స్వామి దేవాలయ ఆలయ ప్రాంగణంలో ఆదివారం కన్యక మిల్లెట్స్ పై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ఆంధ్ర యూనివర్సిటీ ప్రముఖ న్యూట్రిషన్ నిస్టు ఎం హారిక ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రజలకు ఆరోగ్య సమస్య ఎక్కువగా ఉన్నాయని, వీటిని అధిగమించాలంటే పూర్వపు రోజుల్లో మనం ఏ ఏ ఆహార పదార్థాలు తిన్నామో, ఇప్పుడే అవి ఉపయోగపడుతున్నాయని, కొలెస్ట్రాల్, బీపీ,షుగర్, కీళ్ల నొప్పులు, మొదలైన వాటితో బాధపడే వారికి చిరుధాన్యాలు, మొలకెత్తే విత్తనాలతో, తయారు చేసే కన్యక మిల్లెట్స్ ఉపయోగపడతాయని అన్నారు, మరో అతిథి ఉత్తరాంధ్ర యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ ఆళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వరోగ నివారణకు ఉపయోగపడే ఈ కన్యకామిల్లెట్స్ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా, తయారుచేసి, ఆర్గానిక్ పద్ధతులతో, ఎటువంటి కెమికల్స్ కలపకుండా నేచురల్ గా తయారుచేసి అందుబాటు ధరలోనే నా మిత్రుడు బుద్ధ విశ్వనాథం తయారు చేయడం అభినందనీయమని అన్నారు, ఈ మిల్లెట్స్ లో రాగులు, సజ్జలు, కొర్రలు, చాలా రకాల, పదార్థాలతో తయారుచేసి బిస్కెట్స్, అందుబాటు ధరలో తయారు చేయడం అభినందనీయమని అన్నారు, ఈ కార్యక్రమంలో రావి దేముడు, రాపేటి రామకృష్ణ, బుద్ధ కుమారి,కర్రీ దుర్గా,శరగడం దేవి, రాపేటి భార్గవి,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పరీక్షలకు హాజరు సమయంలో భారీ వాహనాలు అనుమతించవద్దు

- పట్టణంలో ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్న విద్యార్థులు
- ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు



**అనకాపల్లి రూరల్ , మార్చి 16 (మనసులో మాట) :** పదవ తరగతి పరీక్షలు జరుగు తేదీలలో అనకాపల్లి పట్టణంలో భారీ వాహనాలు అనుమతించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను వేడుకున్నారు. సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునే క్రమంలో పరీక్ష కేంద్రం ఉన్న దూరం బట్టి ముందుగానే బయలుదేరుతున్నారు. పరీక్షలకు ఉదయం 9 గంటలు లోగా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవలసి ఉంది. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను తీసుకొస్తున్న తల్లిదండ్రులు ట్రాఫిక్ లో చిక్కుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పరీక్షలకు ఉదయం 9 గంటల సమయం కంటే ముందుగానే హాజరు కావలసి రావడంతో కేంద్రం ఉన్న దూరాన్ని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు ఉదయం 7 గంటల నుంచే విద్యార్థులను వెంటబెట్టుకొని ద్విచక్ర వాహనాలు, కార్లతో బయలుదేరడం మొదలు పెడుతున్నారు. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులు ఎక్కడ కానరాగపోవడంతో భారీ వాహనాలు యధా ప్రకారం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్యలను అధిగమించాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థులను వెంటబెట్టుకున్న తల్లిదండ్రులు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో రద్దీ పెరుగుతుంది. ట్రాఫిక్ లో ఇరుక్కుంటున్న కారణంగా ఆలస్యం కావడంతో అటు తల్లిదండ్రులు ఇటు విద్యార్థులు సమయానికి హాజరు కాగలమా అనే సందేహం తలెత్తడంతో ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా పదవ తరగతి పరీక్షలు జరుగు తేదీలలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని వారు అధికారులను వేడుకుంటున్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహణ



**మాకవరపాలెం , మార్చి 16 (మనసులో మాట) :** మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, అధికారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల కోసం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు నిరంతరం పోరాడిన మహనీయుడని పలువురు గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించిన త్యాగమూర్తి అని పేర్కొన్నారు. ఆయన త్యాగం వల్లే తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు చూపిన త్యాగస్ఫూర్తి, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది మరియు పలువురు పాల్గొని మహనీయునికి ఘనంగా నివాళులు

## పిజిఆర్ఎస్‌లో మూడు ఫిర్యాదులు



**ఎస్.రాయవరం , మార్చి 16 (మనసులో మాట) :** మండలంలోని అడ్డురోడ్డు జంక్షన్ అర్డీఓ కార్యలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో మూడు దరఖాస్తులు అందినట్లు డిప్యూటీ తహశీల్దారు జి. నానాజీ తెలిపారు. రివెన్యూ, భూసంబంధిత ఫిర్యాదు లు అందినట్లుఆయన తెలిపారు. కాగా సోమవారం జరిగిన పిజిఆర్ ఎస్ లో ఎస్. రాయవరం మండలం తిమ్మాపురం, పెద్దగుమ్మూలూరు గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, చెరువులు, గోర్జులువివరాలు తెలపాలంటూ సామాజిక కార్యకర్త బివివి సత్యనారాయణ దరఖాస్తు అందచేసారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
మంగళవారం 17 మార్చి 2026


తెలుగు యూనివర్సిటీలో..



# అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఆవిష్కరణ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రాంగణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సోమవారం ఘనంగా ఆవిష్కరించారు.
రూరల్ శాసన సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య డీ మునిరత్నం నాయుడు ఆధ్వర్యంలో ఈ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. ఈ విగ్రహ నిర్మాణ అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, విశిష్ట అతిథిగా మండలి బుద్ధ ప్రసాద్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తెలుగు విశ్వ విద్యాలయాన్ని రాష్ట్రానికి తలమానికంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందని, అందులో భాగంగా ప్రజాప్రతినిధుల సహకారం అభినందనీయమని తెలిపారు. సభాధ్యక్షుడు, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ తెలుగు విశ్వ విద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నందమూరి తారక రామారావు చొరవతో రాజమండ్రి రూరల్ పరిధిలో అనేక ప్రముఖ విద్యా సంస్థలు ఏర్పాటు కావడం జరిగిందని గుర్తు చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో తెలుగు ఔన్నత్యం కోసం కృషి చేస్తున్న మండలి బుద్ధ ప్రసాద్ హాజరు కావడం పట్ల జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విశ్వ విద్యాలయాలు విద్యా బోధనతో పాటు చరిత్రను, మహనీయుల త్యాగాలను గుర్తుచేసే కేంద్రాలుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ విగ్రహం విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంపొందించే దిశగా దోహదపడుతుందని తెలిపారు. తెలుగు భాషను వారసత్వ సంపదగా భావించి భవిష్యత్తు తరాలకు అందించడం మనందరి గురుతరమైన బాధ్యత అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం తనకు గౌరవంగా భావిస్తున్నానన్నారు. తెలుగు జాతి గౌరవం కోసం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని నివాళులర్పించారు. ఆయన త్యాగం భారత చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోయిందని, అలాంటి మహానుభావుడి విగ్రహాన్ని విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించడం యువతలో స్ఫూర్తిని నింపుతుందని తెలిపారు. పొట్టి శ్రీరాములు ఆశయాలను నేటి తరానికి పరిచయం చేయడం అత్యంత అవసరమని సోము వీర్రాజు అన్నారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణం చేసిన శిల్పి రాజ్‌కుమార్ కృషిని ప్రజాప్రతినిధులు అభినందించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలకు సజీవ రూపం తీసుకువచ్చి భవిష్యత్తు తరాలకు అందించడంలో శిల్పుల పాత్ర అభినందనీయమన్నారు. వీసీ డీ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ 8 అడుగుల ఎత్తుతో రూపొందించిన కాంస్య విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డీ రాజ్‌కుమార్ వుడయార్ తన శిల్పశాలలో ప్రత్యేకంగా రూపొందించారన్నారు. ఇప్పటికే విగ్రహాన్ని విశ్వ విద్యాలయ ప్రాంగణానికి తరలించి, ప్రత్యేకంగా నిర్మించిన పీఠంపై ప్రతిష్ఠించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో సుమారు 25 పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాలను రూపొందించినట్లు శిల్పి రాజ్‌కుమార్ తెలిపారు.
నన్నయ్య యూనివర్సిటీ వీసీ వీ ప్రసన్నశ్రీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.



# సమన్వయంతో నగర అభివృద్ధికి కృషి చేయాలి

**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్ మీనా**

**- ఆర్ఎంసీ కార్యాలయంలో సీవీఏపీ ఛాంబర్ ప్రారంభం**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** నగర అభివృద్ధి కోసం అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ (సీవీఏపీ) యూనిట్ ను కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. తొలుత పూజా కార్యక్రమాలను నిర్వహించారు.
అనంతరం ఎమ్మెల్యే, సీవీఏపీ ఛైర్మన్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి, ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించడంలో సీవీఏపీ యూనిట్ దే ముఖ్య భూమిక అన్నారు. ప్రజల సమస్యలను సమగ్రంగా గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని వెల్లడించారు. నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో సీవీఏపీ యూనిట్ ముఖ్యమైన వేదిక కానుందని చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పౌరునికి చేరేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఈఈ మదర్సా అలీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో అమరజీవికి ఘన నివాళి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:**అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ దృశ్య మాధ్యమ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ, , జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, కలెక్టరేట్ ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన అతిథులు మాట్లాడుతూ భాషా రాష్ట్రం సాధన కోసం ఆత్మ త్యాగం చేసిన మహోన్నత మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 125వ జయంతిని ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా అమరావతిలో 58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దుష్ప్రచారాలు నమ్మవద్దు..

**- ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



**హైదరాబాద్/ఏలూరు, మార్చి 16(మనసులో మాట)..** హైదరాబాద్ మొయినాబాద్ లో నిన్న జరిగిన జరిగిన డిన్నర్ పార్టీ సంఘటనలో తనపై వచ్చిన కథనాలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఖండించారు. ఆదివారం పోలీసు విచారణ ముగించుకుని హైదరాబాద్ లోని తన నివాసానికి చేరుకున్న ఎంపీ మీడియాకు వీడియో ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ఎలాంటి వ్యక్తినో రెండేళ్లుగా ఏలూరు ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు అందరికీ తెలుసునన్నారు. తనకు ఎటువంటి దురలవాట్లు లేవని, ఏ తప్పు చేయలేదని, కేవలం ఒక స్నేహితుడు పిలిస్తే కలవడానికి మాత్రమే మొయినాబాద్ వెళ్ళానని, కలిసి వచ్చే సమయంలో జరిగిన కొన్ని సంఘటనలపై మీడియాలో రకరకాల కథనాలు వచ్చాయని, వాటిని ఎవ్వరూ నమ్మవద్దని, పోలీసు విచారణకు సహకరిస్తానని, పూర్తి వివరాలతో త్వరలో ప్రజల ముందుకు వస్తానని ఎంపీ తన ప్రకటనలో తెలిపారు. నిజం గెలుస్తుందని, ఎటువంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు, అభిమానులకు ఎంపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



# పాడా' కొత్త పీడీగా భవానీ శంకర్ నియామకం

**పిఠాపురం,( మనసులో మాట) మార్చి 16 :** పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బి.హెచ్. భవానీ శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విశాఖపట్నం జిల్లా రెవెన్యూ అధికారి గా పనిచేసిన భవానీ శంకర్‌ను, తక్షణమే పిఠాపురంలో 'పాడా' పీడీగా బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది.



# ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గని తొలి రోజు విచారణ చేసిన సిట్ అధికారులు

**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మిదుర్గని సిట్ అధికారుల ఎదుట తొలి రోజు విచారణ సోమవారం ముగిసింది. లక్ష్మీ దుర్గ ను దాదాపు 6 గంటల పాటు సిట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మనీష్ దేవరాజ్ పాటిల్ విచారించారు. ఆయన విచారణలో కనుక్కున్న అంశాలను మహిళా ఎస్సైలు రికార్డింగ్ చేశారు. అలాగే లక్ష్మీ దుర్గ ను ప్రశ్నించిన సిట్ అధికారులు న్యాయవాది సమక్షంలో లక్ష్మీ దుర్గని సిట్ బృందం విచారించారు.ఆమె చెప్పిన సమాధానాలు పోలీసులు వీడియో రికార్డింగ్ కూడా చేశారు.ఈ నెల 16 వ తేది నుంచి మార్చి 29 వరకు ప్రతీ రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణకు వెళ్లాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఎమ్మెల్సీ అనంత బాబు భార్య లక్ష్మీ దుర్గ ను ఆదేశించింది. సిట్ అధికారులు లక్ష్మీ దుర్గ స్టేట్మెంట్ ని కూడా ఇద్దరు మహిళ ఎస్సైలు రికార్డ్ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

### పదవ తరగతి పరీక్షలలో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా

# సిసి కెమెరాలతో నిఘా పెట్టాలి

**- ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్, కేంద్రం పర్యవేక్షకులపై చర్యలు**

**- సమస్యలు ఏమైనా ఉంటె 9491395377 కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేయండి**

**- ఏలూరులోని పదవ తరగతి పరీక్షల నిర్వహణను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**



**పెదవేగి/ ఏలూరు, మార్చి , 16 (మనసులో మాట)..** జిల్లాలో పదవ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పెదవేగిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో సోమవారం పదవ తరగతి పరీక్షల నిర్వహణను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీ రూమ్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు 24 వేల 19 మంది విద్యార్థినీ విద్యార్థులు 133 పరీక్షా కేంద్రాలలో హాజరవుతున్నారన్నారు. ఈనెల 16వ తేదీ నుండి ఏప్రిల్,1వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రాల హాల్స్ లో సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటుచేయడం జరిగిందని, ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్ పై చర్యలు తీసుకుంటామని,ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు పర్యవేక్షించాలన్నారు.పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ లను ఎట్టిపరిస్థితులలోనూ అనుమతించవద్దన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్ల ను పరీక్ష ముగిసేవరకు ఆయా షాపులను మూసివుంచాలన్నారు.వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, పారిశుద్యం ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని సమస్యలు ఏమైనా ఉంటె 9491395377 కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేయాలన్నారు.అనంతరం పాఠశాలలోని సిసి కెమెరాల పర్యవేక్షణ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు.

# ఆధ్యాత్మిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

**- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం - ఎమ్మెల్యే ఆదిరెడ్డి దంపతులు**

**- రూ. 16 లక్షలతో జాంపేట రామాలయం వద్ద షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** స్థానిక జాంపేట పోలీసు క్వార్టర్స్ ఆవరణలోని రామాలయం వద్ద రూ.16 లక్షలు భవానీ ఛారిటబుల్ ట్రస్టు నిధులతో నిర్మించనున్న షెడ్డు నిర్మాణం కోసం ఆదిరెడ్డి దంపతులు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయితేనే మంచి వాతావరణంతో సమాజం ముందుకు సాగుతుందన్నారు. భక్తుల సౌకర్యం కోసం ఇక్కడ షెడ్డు నిర్మిస్తామని తాము గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, ఈ రామాలయం అభివృద్ధికి భవానీ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.16 లక్షలు కేటాయించామన్నారు. ఈ షెడ్డు పూర్తయితే, భక్తులు వర్షాలు, వేసవి నుంచి కాపాడుకుని సేవలు చేసుకోవచ్చన్నారు. ఇది స్థానిక పోలీసు కుటుంబాలు, పొరుగు ప్రజలకు మరింత సౌకర్యం అందిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ మాట్లాడుతూ తమ కుటుంబం ఎప్పుడూ ప్రజా సేవలో ముందుండి, ఆధ్యాత్మిక విలువలను పాటిస్తూ పని చేస్తోందన్నారు. ఈ రామాలయం జాంపేట ప్రాంతంలో ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ షెడ్డు నిర్మాణం కోసం సహకారం అందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాతలు సహకారం అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాగా ఆలయ అర్చకులు ఆదిరెడ్డి దంపతులను పూర్ణ కుంభం, వేద మంత్రాలతో స్వాగతించారు. శంకుస్థాపన అనంతరం ఆలయంలో వారు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, పోలీసు అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# జోహార్ కృష్ణకు పీహెచ్‌డీ అవార్డు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ లోని ఎంబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న ఎం జోహార్ కృష్ణ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పూర్తి చేశారని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ అభినందనలు తెలిపారు. సోమవారం యూనివర్సిటీలో వీసీ చేతుల మీదగా పీహెచ్‌డీ అవార్డు పత్రాన్ని ఆయన అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీ అవార్డును ఎం జోహార్ కృష్ణ పూర్తి చేశారని తెలిపారు. ప్రొఫెసర్ పీ పూర్ణ చంద్రరావు మార్గదర్శకత్వంలో "పర్యాటక గమ్యస్థానాల ఎంపికలపై సోషల్ మీడియా ప్రభావంపై అధ్యయనం (గోదావరి జిల్లాలు, ఆంధ్రప్రదేశ్)" అనే పీహెచ్‌డీ థీసిస్‌ను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. ఈ సందర్భంగా జోహార్ కృష్ణకు రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ ఆచార్య డీ జ్యోతిర్మయి, విభాగ అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# కల్తీ పాలు 'అనూరియా' కేసులో చికిత్స పొందిన వ్యక్తి కోలుకుని డిశ్చార్జ్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** రాజమహేంద్రవరం నగరంలో నమోదైన 'అనూరియా' కేసులపై నవీకరించిన వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎన్ కొండబాబు (64) అనూరియా (కల్తీ పాలు ఘటన) సమస్యతో కిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ పూర్తిగా కోలుకున్నారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, వైద్య అధికారుల సూచనల మేరకు ఆయనను సోమవారం డిశ్చార్జ్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కే వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వ్యక్తిగత పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆసుపత్రి వర్గాలతో సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు అందించారని తెలిపారు. చికిత్స అందించిన వైద్యుల సేవలకు కొండబాబు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైద్య సేవలు అందించే క్రమంలో ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కిమ్స్ వైద్యులు సమర్థవంతంగా చికిత్స అందించినట్లు వెల్లడించారు. కల్తీ పాలు ఘటనకు సంబంధించిన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో వైద్య సేవలు అందిస్తున్నామని, వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా వైద్య సేవలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ నిఘా





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** జిల్లాలోని పదవ తరగతి వ్రాత పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాతో తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ పర్యవేక్షిస్తున్నారు. సోమవారం నుంచి టెన్త్ పరిక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బందితో పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు పటిష్ట పోలీసు భద్రతా బందోబస్తు తోపాటు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను తూర్పు గోదావరి జిల్లా పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. కాగా ఏప్రిల్ 1వ తేదీ వరకూ నిర్వహించే టెన్త్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్టు జిల్లా విద్యా శాఖాధికారి కే వాసుదేవరావు తెలిపారు. పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలోని 19 మండలాల్లో మొత్తం 138 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు సోమవారం ప్రశాంతంగా కొనసాగినట్టు చెప్పారు. జిల్లా మొత్తం 24,566 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, వీరిలో బాలురు 12,568 మంది, బాలికలు 11,998 మంది ఉన్నారని డీఈఓ తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలోని 138 కేంద్రాల్లో సుమారు 1600 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. పరీక్షల పర్యవేక్షణ నిమిత్తం ఒక విద్యా శాఖ అధికారి, ఒక రెవెన్యూ అధికారి, ఒక పోలీసు అధికారితో కూడిన అయిదు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ను ఏర్పాటు చేశారు. అలాగే 18 సిట్టింగ్ స్క్వాడ్స్, 18 రూట్ ఆఫీసర్లను నియమించారు. జిల్లాలో 8 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించి అక్కడ సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారు.

# పేదల కోసం అందించే ఆహారంలో రాజీ పడవద్దు..

**- ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదు - అన్నా క్యాంటీన్ ను తనిఖీ చేసిన కమిషనర్ రాహుల్ మీనా**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** పేదల కోసం అందించే ఆహారం నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. సోమవారం ఉదయం క్వారీ మార్కెట్ జంక్షన్ లోని అన్నా క్యాంటీన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన పదార్థాలు రుచిగా ఉంటున్నాయా లేదా.? అక్కడికి వచ్చిన వారిని ఆరా తీశారు. ప్రజలకు ఐదు రూపాయలకే నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు అందించేలా ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. అన్న కాంటీన్లను శుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే నిర్ణీత సమయంలో ఆహార పదార్థాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారమే భోజన పదార్థాలు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. క్యాంటీన్ల పరిసరాలలో స్వచ్ఛత, టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశం, టాయిలెట్లు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఆర్వో వాటర్ ఫిల్టర్ ను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని.. పాత్రలు, ప్లేట్లను వేడి నీటితోనే కడగాలన్నారు. ప్రజలు తమ సూచనలు క్యాంటీన్ లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా తెలియజేయవచ్చన్నారు. అలాగే ప్రతి రోజూ అన్నా క్యాంటీన్లను పరిశీలించి, ఏ మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా భోజన అనంతరం వ్యర్థాలను బిన్ లలో వేయవలసిందిగా కమిషనర్ రాహుల్ మీనా సూచించారు.

# వాహనాలన్నీ కండిషన్ లో ఉండేలా చూడాలి

**- కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** క్వారీ మార్కెట్ లోని వెహికల్ యార్డును సోమవారం ఉదయం కమిషనర్ రాహుల్ మీనా సందర్శించారు. ఈ సందర్భంగా యార్డులో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, మూవ్‌మెంట్ రిజిస్టర్ ను పరిశీలించారు. ప్రస్తుతం ఎన్ని వాహనాలు వినియోగంలో ఉన్నది?.. ఎంత మంది డ్రైవర్లు అందుబాటులో ఉన్నారో?.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి అక్కడ అందుబాటులో ఉన్న పరికరాలు, వాటిని ఏవిధంగా డివిజన్లకు సరఫరా చేస్తున్నది, అందుబాటులో గల స్టాక్.. రికార్డు ప్రకారముగా ఉన్నదా లేదా..? పరిశీలించారు. చెత్త సేకరణకు వినియోగించు వాహనాలను డివిజన్ లకు కేటాయించు విషయంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా, వాహనాల కండిషన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ఏ చిన్న రిపేర్ వచ్చినా.. వెంటనే వాటికి మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అలాగే ప్రస్తుతం 3 స్వీపింగ్ మెషిన్లు వినియోగంలో ఉన్నట్లు సిబ్బంది వివరించగా.. మిగిలిన రెండింటికి కూడా మరమ్మత్తులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటిస్తూ, వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఉన్నారు.

## 'ఆపరేషన్ వజ్ర ప్రహార్' పేరుతో

# జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు

**- డ్రగ్స్ నివారణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసుల సోదాలు**

**- గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల సరఫరాకు చెక్ పెట్టే దిశగా కార్యాచరణ**

**- నాటు సారా విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** జిల్లా వ్యాప్తంగా 'ఆపరేషన్ వజ్ర ప్రహార్' పేరుతో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణచివేసేందుకు గాను సోమవారం తెల్లవారు ఝామున స్థానిక ప్రకాష్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో గల నారాయణపురం వాంబే గృహాలు, టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆల్కాట్ గార్డెన్స్, అనపర్తి పోలీసు స్టేషన్ పరిధిలో గల కరివేపాకుపేట ప్రాంతాల, నిడదవోలు పోలీసు స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది సంయుక్తంగా టీములుగా ఏర్పడి విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ టీమ్‌లు కలిసి గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 120 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాల వివరాలు, అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 300 మంది వ్యక్తులను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 54 వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులను వారి ఇళ్ల వద్ద స్పాట్ లో పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టబడ్డాయి అని, తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టే దిశగా "ఆపరేషన్ వజ్ర ప్రహార్" కింద ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్ లో ఇన్స్పెక్టర్ (వన్ టౌన్) మురళీకృష్ణ, ఇన్స్పెక్టర్ (ప్రకాష్ నగర్) బాజీ లాల్, ఇన్స్పెక్టర్ (టూ టౌన్) శివ గణేష్, ఇన్స్పెక్టర్ (కడియం) వెంకటేశ్వరరావు, ఇన్స్పెక్టర్ (అనపర్తి) సుమంత్, ఇన్స్పెక్టర్ (నిడదవోలు) తిలక్, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# యుద్ధం పేరుతో 'దోపిడీ'!

**- తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కి నర్సరీ అసోసియేషన్ వినతి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** రాజమహేంద్రవరం రూరల్ కడియం మండలంలో మొక్కల కవర్లు ఫ్యాక్టరీ నిర్వాహకులు, షాపుల యజమానులు అందరూ కలిసి..యుద్ధం నెపంతో భారీగా రేట్లు పెంచేశారని నర్సరీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క సారిగా రూ.3,200ల నుండి 3300లు ఉండే కవర్ల బస్తాలు రేట్లు రూ.4,800ల నుండి 5000ల వరకు పెంచి నర్సరీ రైతులకు చేస్తున్న దోపిడి గురించి సోమవారం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని కలసి వినతి పత్రం అందజేశారు. తక్షణమే దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నర్సరీ రైతుల వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి రైతులకు మేలు జరిగే విధంగా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ పాలకవర్గ వైస్ ప్రెసిడెంట్ బోడపాటి గోపి, జనరల్ సెక్రటరీ కొండేపూడి నాగు, జాయింట్ సెక్రటరీ గాజుల రత్తయ్య, ట్రెజరర్ రత్నం బాబ్జీ, జాయింట్ ట్రెజరర్ పిల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు అడ్డగర్ల రమేష్, మల్లు శివ నారాయణ, గాద నాగేశ్వరరావు, కో ఆప్షనల్ మెంబర్ క్రొవ్విడి వాసు, రైతులు పాఠంశెట్టి సుబ్బారావు, పాఠంశెట్టి వాసు, ఈలి బేబీ, పాఠంశెట్టి వెంకన్న, సుంకర గోవింద్, తాళం నరేష్, మన్యం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ, అమరజీవి విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** జాతిపిత మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ళ గ్రామ సచివాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం నెలకొల్పిన త్యాగమూర్తుల విగ్రహాలను ఎమ్మెల్యే గోరంట్ల సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ అహింసా వాదంతో భారత బానిస శృంఖలాలు ను తెంచి ఆంగ్లేయులను తరిమికొట్టారని, తన ప్రాణ త్యాగం ద్వారా భాషా ప్రాతిపదికన ఆంధ్ర రాష్ట్ర అవతరణకు కృషి చేసిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని గోరంట్ల గుర్తు చేశారు. గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు, రైతు సంఘాలు వారి సమస్యలను ఎమ్మెల్యే కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాబీ, సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఏపీఐసీసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, కూటమి నాయకులు కొండయ్య మాస్టారు, ఈదర నందబ్బు, సూరపురెడ్డి భరత్, తూము శ్రీనివాసు, రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ సభ్యురాలు గ్రంధి విజయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వారణాసి శ్రీనివాస్ గుప్తా, ఆర్యవైశ్య నాయకులు తమ్మన హరిబాబు, ఓబిలిశెట్టి రమేష్, తహసీల్దార్ సునీల్ కుమార్ ఎంపీడీఓ రమేష్ తదితరులు ఉన్నారు.

# ప్రతి వ్యక్తికి ఇన్సూరెన్స్ ఉండాలి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండటం చాలా అవసరమని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాజమండ్రి రూరల్ బ్రాంచ్ మేనేజర్ రఘు అన్నారు. ఎల్ఐసీ ప్రచార రథాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రాజమండ్రి రూరల్ పరిధిలో ఉన్న ఐదు మండలాల్లో ఈ ప్రచార రథం ఎల్ఐసీ పాలసీలపై అవగాహన కల్పిస్తుందన్నారు. కోరుకొండ, సీతానగరం, రాజా నగరం, కడియం, రాజమండ్రి రూరల్ మండలాల్లో ఎల్ఐసీ అందిస్తున్న సేవలను అందరికీ అర్థమయ్యేలా తెలియజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం వలన ప్రజల్లో ఇన్సూరెన్స్ పట్ల అవగాహన తప్పని సరిగా వస్తుందన్నారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అబ్రహం, ఎల్ఐసీ ఏజెంట్లు ఏసు,గంగారామ్, రవి, ఎల్ఐసీ యూనియన్ నాయకులు సాయి బాబా పాల్గొన్నారు.

# మహిళా మోర్చానూతన అధ్యక్షురాలుగా తులసి సాయి అపర్ణ



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 16..** రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మరియు రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషిదా రాజు ఆదేశాలు మేరకు సోమవారం భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశేశ్వర్ రావు ఆధ్వర్యంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు తులసి సాయి అపర్ణ నూతన కమిటీని అధికారికంగా ప్రకటించడం జరిగింది. మహిళల సాధికారత, సమాజ సేవ మరియు దేశాభివృద్ధిలో మహిళల పాత్రను మరింత బలపర్చే దిశగా ఈ కమిటీ పనిచేస్తుంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మహిళలకు లభిస్తున్న అవకాశాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లడం మా ప్రధాన లక్ష్యం. కొత్తగా నియమితులైన సభ్యులందరికీ అభినందనలు తెలుపుతూ, మహిళా మోర్చాను మరింత శక్తివంతంగా ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా తెలియపరచడం అయినది. ఈ కార్యక్రమంలో స్టేట్ సోషల్ మీడియా కన్వర్ యార్లగడ్డ రామ్ కుమార్ జిల్లా జనరల్ సెక్రటరీలు చోడిశెట్టి రమేష్ కుండల సాయి సాహితి వర్మ పాల్గొన్నారు. మరియు జిల్లా వైస్ ప్రెసిడెంట్ పెండెం శ్రీదేవి గూడూరు పద్మ పాల్గొనడం జరిగింది.



# ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు సహకరించాలి
- ప్రాంతీయ పరిపాలనాధికారి శివరాజ్ మీనా

**యానాం (మనసులో మాట) మార్చి 16:** పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రజలు కచ్చితంగా ఎన్నికల నిబంధనలను పాటించాలని ప్రాంతీయ పరిపాలన అధికారి శివరాజ్ మీనా కోరారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు తక్కువ రోజులు మాత్రమే ఉండడంతో రాజకీయ పార్టీలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికల కోసం నామినేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమై, మార్చి 23 వరకు కొనసాగుతుందని తెలిపారు. మార్చి 24న నామినేషన్ల పరిశీలన, మార్చి 26న ఉపసంహారణకు చివరి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.. అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. డబ్బు లేదా మద్యం పంపిణీ వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్లు 2321223, 2323200కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఎన్నికల నిర్వహణకు సి.ఐ.ఎస్.ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు పహారా కాస్తున్నట్లు తెలిపారు. మీడియా సహకారం కూడా కోరారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంగించిన వారిపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు శివరాజ్ మీనా తెలిపారు.

## ప్రశాంతంగా పదో తరగతి తెలుగు పరీక్ష



**రౌతులపూడి, (మనసులో మాట )మార్చి 16:** మండలంలోని ములగపూడి ఏ మల్లవరం రౌతులపూడి గ్రామాల్లోనీ పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు జరిగాయని ఎంఈఓ 2 గాడి కొండబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రౌతులపూడి పరిక్షా కేంద్రంలో 215 మందికి గాను 215 మంది ములగపూడి పరీక్ష కేంద్రంలో151 ఏమల్లవరం పరీక్ష కేంద్రంలో173 గాను 171 మంది హాజరయ్యారని మొత్తం మండల వ్యాప్తంగా 545గాను 543 మంది హాజరయ్యారని ఇద్దరు గైహాజర్ అయ్యారని కొండబాబు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలవకుండా మంచినీటి సౌకర్యం అలాగే మెడికల్ క్యాంపు కూడా నిర్వహించామని కొండబాబు తెలియజేశారు.

## ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

- తొలిరోజు ఆరుగురు గైర్హాజరు

**తాళ్ళరేవు (మనసులో మాట) మార్చి 16:** మండల పరిధిలో పదవ తరగతి మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు మండల విద్యా శాఖాధికారులు ఎ. మంగాయ్యమ్మ, ఎం. ఉమ తెలిపారు. మండల పరిధిలో మొత్తం 7 కేంద్రాలలో 1465 ( 686 బాలురు, 779 బాలికలకు) మందికి గాను, 1459 (683 బాలురు, 776 బాలికలు) మంది హాజరైనట్టు తెలిపారు. తాళ్ళరేవు కేంద్రం నందు 4, పి. మల్లవరం కేంద్రం నందు 1, పటవల కేంద్రం నందు 1 హాజరు కానట్టు తెలిపారు. ఇలావుండగా తాళ్ళరేవు కేంద్రం నందు కేటాయించబడిన 8 మంది ప్రైవేట్ (గత సంవత్సరం ఫెయిల్డ్ క్యాండిడేట్స్) కాండిడేట్ లకు గానూ కేవలం ఒకరు మాత్రమే హాజరైనట్టు వారు తెలిపారు.

## ప్రారంభమైన పది పరీక్షలు

**ప్రశాంత వాతావరణంలో మొదటిరోజు పరీక్ష**

**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 16..** జగ్గంపేట మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రశాంత వాతావరణంలో మొదటి రోజు పరీక్ష నిర్వహించడం జరిగిందని జగ్గంపేట ఏం.ఈ.ఓ తెలియజేశారు. జగ్గంపేట మండలంలో గల 6 సెంటర్లలో 1272 మంది విద్యార్థులకు గాను 1259 మంది విద్యార్థులు హాజరయ్యారని 13 మంది విద్యార్థులు బాలురు -6. బాలికలు 7 గైర్హాజరయ్యారని తెలియజేశారు.మొత్తం మీద తెలుగు పరీక్ష మండలంతో ప్రశాంతంగా జరిగిందని ఈ సందర్భంగా అయన తెలియజేశారు.

# ఫులే ద్వి శత జయంతి సంవత్సర వేడుకలు

- ప్రభుత్వం అధికారికంగా ఫులే ద్విశత దినోత్సవం నిర్వహించాలి
- ఏప్రిల్ 11న రాజమండ్రిలో జాతీయ సదస్సు - ఫులే సామాజిక చైతన్య వేదిక తీర్మానం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** దేశంలో అణచబడ్డ ప్రజల అభ్యున్నతికి పాటుపడిన తొలి సామాజిక విప్లవకారుడు, ఆధునిక భారత జాతిపిత జోతిబా ఫులే ద్వి శత జయంతి వేడుకలకను ఈ సంవత్సరం ఏప్రిల్ 11 నుండి 2027 ఏప్రిల్ 11వరకూ ఏడాది పొడవునా ఘనంగా నిర్వహించాలని ఫులే సామాజిక చైతన్య వేదిక నిర్ణయించింది. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు అధ్యక్షతన ఫులే, అంబేద్కర్ భవన్ లో వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 39 మంది ముఖ్య నాయకులతో జరిగిన సమావేశం ఈ మేరకు తీర్మానించింది. రాష్ట్ర ప్రభుత్వం ఫులే ద్వి శత జయంతి సంవత్సర వేడుకలకను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. అలాగే ఏప్రిల్ 11 వ తేదీ మధ్యాహ్నం రాజమండ్రి గోదావరి గట్టున ఉన్న ఫులే-అంబేద్కర్ భవన్ లో జాతీయ స్థాయి "సామాజిక న్యాయం" పై సెమినార్ నిర్వహించాలని నిర్ణయించినట్లు నయనాల కృష్ణారావు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా ప్రొఫెసర్ సూరజ్ మండల్ యాదవ్ ను, మరి కొంతమంది ఇతర రాష్ట్రాల ప్రముఖులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఫులే వంటి గొప్ప సంఘ సంస్కర్త పేరున ద్వి శత జయంతి సంవత్సర వేడుకలకను నిర్వహించే అవకాశం తమకు దక్కడం గొప్ప విషయమని సమావేశంలో పాల్గొన్న వక్తలు అన్నారు. గ్రామ గ్రామాన్నా ఫులే గురించి ప్రచారం చేయాలని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ప్రజల ఐక్యతకు మరింతగా కృషిచేసి బడుగులకు రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా ఫులే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు మాట్లాడుతూ గోదావరి గట్టున నిర్మిస్తున్న ఫులే ఆంబేద్కర్ భవన్ నిర్మాణానికి ప్రభుత్వ పరంగా స్థలం కేటాయించి సహకరించారని ఆ నిధులతో ఒక అంతస్తు పూర్తయిందని, మిగతా మూడు అంతస్తులు పూర్తి చేసేందుకు, ప్రస్తుత రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి,రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ( వాసు) పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. 2005 లో రాజమండ్రిలో నెల కొల్పిన ఫులే కాంస్య విగ్రహం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేసిన తొలి విగ్రహమని ఆయన చెప్పారు. ఫులే సామాజిక చైతన్య వేదిక, బామ్-సెఫ్ కలిసి ఫులే అంబేద్కర్ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశామని చెప్పారు. సమావేశంలో ఎలక్ట్రికల్ ఎస్ఈ కే తిలక్‌కుమార్, డైట్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ అప్పారి జయప్రకాష్, కేఎస్ఆర్ హాస్పిటల్ కొమ్మా శ్రీనివాసరావు, రాష్ట్ర దేవాంగ సంఘం ప్రధాన కార్యదర్శి, పుచ్చల రామకృష్ణ, కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన, కడలి వెంకట్రావు, యువర్ హోమ్ కడియాల గోపాలకృష్ణ, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ బుడ్డిగ రవి, రత్నం పెన్స్ కోసూరి గోపాలరత్నం, పీ గంగాధరం, కేవీఎన్ మూర్తి, వీ రాజుబాబు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి మాదిగ, ఆంధ్రప్రదేశ్ రెల్లి కుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెన్నా వెంకటరమణ, రెల్లి యూత్ చెన్నా శ్రీధర్ గణేష్, ప్రముఖ చిత్రకారులు కన్నాబత్తుల రామ్మోహన్, కే వెంకటరమణ, బీవీ రమణారావు, మతల అనిల్‌కుమార్, అత్తిలి శ్రీను, బీసీ పోరాట సమితి రేలంగి శేఖర్, కే మేగేంద్ర, రాజ్యాంగ పరిరక్షణ సమితి మేకల లక్ష్మీపతిరావు, రెల్లి యూత్ బీ చంద్రశేఖర్, వైరాల రమేష్, రచయిత చిలుకోటి కూర్మయ్య, కోనాల లాజరు, డీ సురేంద్రబాబు, మాజీ కార్పొరేటర్ పీ హరినాథ్, ఏఈఈ కే బాపిరాజు, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ డీజీఎం సీహెచ్ సుబ్బారావు, అడ్వకేట్ మర్రి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములు

- మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125 వ జయంతి వేడుకలు



**భీమవరం, (మనసులో మాట) మార్చి 16 :** అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానుభావులని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, కారుమూరి సత్యనారాయణ, పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. పులవర్తి రామకృష్ణ, గాదె నాగేశ్వరరావు లు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమైన ఘట్టమని అన్నారు. కంచర్ల భాస్కరరావు, చవ్వ శ్రీనివాససుబ్బారావు, బొండాడ బంగారాజు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం, భాషా గౌరవం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలను ప్రతి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనంద రిదన్నారు. అమంచి కృష్ణమోహన్ మాస్టారు మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం పొట్టిశ్రీరాములు అమరణ నిరాహార దీక్షచేసి అమర జీవిగా మారారని, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన పొట్టి శ్రీరాములు పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. కార్యక్రమం లో వబిలిశెట్టి వెంకటేష్, గుండు సుధీర్,బంగారు ప్రసాద్,బొండాడ సుబ్బారావు, జూలూరి రాజా, కారుమూరి బదరి, కొల్లేపర్ల సుబ్బారావు సభ్యులు పాలుగొన్నారు.

# పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్‌లు

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 16..** స్థానిక కాకినాడ రోడ్ లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నా క్యాంటీన్ కు ఈ వారం దాతలు జగ్గంపేట పట్టణ టిడిపి నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాంద్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ వారం అన్న క్యాంటీన్ కు ముఖ్యఅతిథిలు గా జగ్గంపేట పట్టణ టిడిపి నేతలు హాజరై పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ వి ఎస్ అప్పలరాజు మాట్లాడుతూ గత వైయస్సార్ ప్రభుత్వం అన్నా క్యాంటీన్ రద్దు చేస్తే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత అన్నా క్యాంటీన్ కు జగ్గంపేట టౌన్ టిడిపి నాయకులు ఆర్థిక సహాయం తో 500 మందికి అన్నదానం నిర్వహించామని తొందర్లోనే ప్రభుత్వ అన్న క్యాంటీన్ ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పిలా మహేష్, వేములకొండ జోగారావు, రాయి సాయి, దాపర్తి సీతారామయ్య, రీసు రమణ, నల్ల చిరంజీవి, సందక శంకర్, వెలిశెట్టి బుజ్జి, కోడూరి రమేష్, బండారు నాని, సాంబత్తుల చంద్రశేఖర్, చెలికాని హరిగోపాల్, వానశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ కలెక్టరేట్ వద్ద ఐఎఫ్టియు మహాధర్నా




**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలనిగతంలో రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఐఎఫ్టియు మహా ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాను ఉద్దేశించి ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు, కార్మిక వర్గానికి, రైతాంగానికి అనేక హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం వాటిని అమలు చేయకుండా పెట్టుబడిదారుల సేవలో తరిస్తున్నారని ఒడ్డుదాటే వరకు ఓడ మల్లయ్య, ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కరోనా కష్టకాలంలో ప్రజలు ప్రాణాల అర చేతిలో పెట్టుకుని వైద్యం కోసం, ఆక్సిజన్ కోసం అల్లాడి పోతుంటే మోడీ ప్రభుత్వం పార్లమెంట్లో 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్లను ఆమోదించడం గర్హనీయం అన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్ లను ఏప్రిల్ 1 వ తేది 2026 నుంచి అమలు చేస్తామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల సంక్షేమం కోసం అని చెప్పడం దెయ్యాల వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

నాలుగు లేబర్ కోడ్ లు అమల్లోకి వస్తే, కార్మికులు సంఘం పెట్టుకొనే హక్కును, సమ్మె చేసే హక్కును, కనీస వేతనం అడిగే హక్కును, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటి, బోనస్, పెన్షన్ వంటి చట్టబద్ధ హక్కులు కోల్పోతారని, కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికి ఉపయోగపడతాయని విమర్శించారు. పాత కార్మిక చట్టాలను అమలు చేయకపోతే యాజమాన్యాలకు పెనాల్టీలు, శిక్షలు వేసే వారని, ఈ లేబర్ కోడ్ల లో యజమానులకు వేసే శిక్షలు రద్దు చేశారని, ఇవి యజమానుల కోసం తప్ప కార్మికుల కోసం కాదని ఎద్దేవా చేశారు. లేబర్ కోడ్ ల రద్దు కోసం ఐఎఫ్టియు జాతీయ కమిటీ దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చిందని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కూడా ఈ నెల 16వ తేదిన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద మహాధర్నాలు, మార్చి 23 భగత్ సింగ్ వర్ధంతి రోజు విజయవాడ లో కార్మికు ర్యాలీ నిర్వహించాలని పిలుపు నిచ్చారని ఆ గ్రూపులో భాగంగా సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఈ ధర్నా జరిగిందని వివరించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం ఏసు, కోశాధికారి జి. ఆదినారాయణ, రాష్ట్ర నాయకులు ఆర్ రఘువులు, పప్పు ఆదినారాయణ, ఐ ఎఫ్ యు నాయకులు కే నరసింహ, ఎల్లారావు, తాతారావు, ప్రసాద్, సత్తిబాబు, కోదండ, కృష్ణ, రాగుల మరిసిల్లి, సంపంగి జాను, పెండ్యాల రాము, శివ, వెంకటరమణ తదితరులు నాయకత్వం వహించారు.



## పొట్టి శ్రీరాములు ఆశయాల సాధనకు కృషి

**సామర్లకోట (మనసులో మాట) మార్చి 16..** రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాల సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నట్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప తెలిపారు. సామర్లకోట మఠం సెంటర్ వద్ద సోమవారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయులు చేసిన పోరాటాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరు శ్రీరాములు లక్ష్యసాధనకు కృషి చేయాలని రాజప్ప కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయటం, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేయడం, వంటి ఎన్నో పనులను శ్రీరాములు బాటలో నిర్వర్తించడం విశేషమని ఎమ్మెల్యే చినరాజప్ప కొనియాడారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయ రంగనాగ్ మాట్లాడుతూ యువత రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ముందుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో నేతలు బడుగు శ్రీకాంత్ కంటే జగదీష్ మోహన్ యార్లగడ్డ రవిచంద్ర, అడబాల కుమార్ స్వామి, కాపవరపు కుమార్, జార్జ్ చక్రవర్తి, మహిళా నేత రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భగవంతుడు బందీ అయ్యేది భక్తి పాశానికే కోదండ రామాలయానికి ఉత్సవ విగ్రహాలు అందజేత



**భీమవరం, (మనసులో మాట) మార్చి 16 :** భగవంతుడు బందీ అయ్యేది భక్తి పాశానికేనం, నవవిధ భక్తిమార్గాల ద్వారా దైవాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తుంటారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం సుంకర పద్దయ్య వీధిలోని శ్రీకోదండ రామాలయానికి పట్టణానికి చెందిన డా యిర్రింకి లక్ష్మి, నరేష్ దంపతులు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను సోమవారం అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు శ్రీకోదండ రామునిని దర్శించుకుని ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసి దాతలను అభినందించారు. అనంతరం అర్చకులు కలవగుంట నారాయణ చార్యులు పూజలను నిర్వహించి స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

## రేపు విశ్వనాథ గోపాలకృష్ణకు రాకా పురస్కారం

- ఎస్పీ బాలు స్మారక సాంస్కృతిక మందిరంలో..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** తెలుగు నూతన 'పరాభవ' నామ సంవత్సరం ఆగమన వేళ..రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రిని 'రాకా' పురస్కారం వరించనుంది. 'రాకా' సాంస్కృతిక సంస్థ, రాజమహేంద్రవరం గోదావరి కల్చరల్ అసోసియేషన్ (ధవళేశ్వరం) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ పురస్కార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక గోకవరం బస్టాండు సమీపంలో ఉన్న డాక్టర్ కంటే వీరన్న చౌదరి హాస్పిటల్ రెండవ అంతస్తు ఎస్పీ బాలు స్మారక సాంస్కృతిక మందిరంలో ఈ పురస్కార మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ నాటి సభకు శ్రీ గౌతమి ప్రాంతీయ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ అరిపిరాల నారాయణరావు పురస్కార గ్రహీత పరిచయ కర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు, మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగం అధికారిణి డాక్టర్ ఏ వినూత్న హాజరు కానున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉగాది సందర్భంగా చిరంజీవి నాగ శ్రీశయన్, నూజెళ్ళ సూరిబాబు, సీహెచ్ గాంగేయ శాస్త్రి, పాడి రామారావు కవితా గానం చేస్తారని 'రాకా' అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, ప్రధాన కార్యదర్శి జీవీ రమణ తెలిపారు.

## ఘనంగా గంగమ్మ సంబరాలు

- పాల్గొన్న జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 16..** జగ్గంపేట గ్రామంలో వైబోగుల వారి శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సంబరానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ మెంబర్ జ్యోతుల చంటిబాబు హాజరయ్యారు.ఈ సందర్భంగా చంటిబాబుకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జగ్గంపేట గ్రామంలో కాకినాడ రోడ్ లో గల పెద్ద గొల్ల వీధి లో వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం ప్రతి సంవత్సరం మార్చి 15వ తేదీ ఆదివారం నుండి మార్చి 16వ తేదీ సోమవారం వరకు ఘనంగా నిర్వహిస్తామని. మా సాంప్రదాయ అట అయిన తప్పిడి గుళ్ళు తో గంగమ్మ తల్లి సంబరం అద్భుతంగా నిర్వహిస్తామని,సంబరం అనంతరం భారీ అన్నదానం నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి జ్యోతుల చంటిబాబు విచ్చేయడం మాకు ఆనందకరమని వారు తెలియజేశారు.ఈ సందర్భంగా జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ వైబోగుల కుటుంబ సభ్యులకు మరియు వారి కాలనీలో నివసిస్తున్న ప్రజలకు కోరికలు తీర్చే అమ్మగా వారి కులదైవం వారి కుటుంబ దైవం వారి ఆరాధ్య దైవంగా అమ్మవారిని పూజిస్తారని,ఈ గంగమ్మ తల్లి మహాశక్తివంతురాలని ఇటువంటి సంబరం వైభోగుల వారు నిర్వహించడం ఆనందకరమని ఇందులో ప తప్పిడి గుళ్ళు ఆట వారి సాంప్రదాయంగా భావించి ఆడుతారని ఈ కార్యక్రమానికి మమ్మల్ని ఆహ్వానించడం మాకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా, సంజయ్,సందడి శీను, శివ, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.



## సంత పాటదారుల పై చర్యలు తీసుకోవాలి

**- కోటి 25 లక్షల సొమ్మును రికవరీ చేయాలి**

**- ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల డిమాండ్**

**గోకవరం (మనసులో మాట), మార్చి 16 :** మండల కేంద్రం గోకవరం మేజర్పంచాయతీలో వారపుసంత పాటలు పాడుకున్న పాట దారుల పై చర్యలు తీసుకొని, మొత్తం సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పంచాయతీ సెక్రటరీకి ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 నుంచి ఇప్పటివరకు గోకవరం సంతలో గేదెలు, మేకలు, కోళు ,, నిత్యవసర, అత్యవసర దుకాణాల పేరుతో ప్రతి సంవత్సరం పంచాయతీ వారు పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతివారం పాటదారులు ఆశీల పేరుతో దుకాణదారుల దగ్గర నుంచి డబ్బును కట్టించుకుంటున్నారని, ఒకవేళ దుకాణదారుడు ఆ డబ్బు కట్టకపోతే దుకాణం వేయకుండా చేసి, వారి పొట్ట కొడుతున్నారన్నారు. కానీ పాటదారులు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో పాటు రాజకీయ నాయకుల అండదండలతో ఇప్పటివరకు కోటి 25 లక్షలకు పైగా సొమ్ము పంచాయతీకి చెల్లించలేదంటే ఎంత నిర్లక్ష్య వైఖరి, ఎంత దోపిడీతనం కనబడుతుందో తెలుస్తుందని ఆయన విమర్శించారు. కోటి 25 లక్షల సొమ్మును చెల్లించకుండా, మరల పాటలు పెట్టడానికి చూస్తున్నారంటే పంచాయతీ వారికి ఏ విధంగా, ఎంత మొత్తంలో ముడుపులు అందుతున్నాయో ప్రజలు తెలుసుకోవాలని ఆయన తెలిపారు, తక్షణమే పాటదారుల పై చర్యలు తీసుకొని, పంచాయతీకి రావలసిన సంత సొమ్ము కోటి 25 లక్షల రూపాయలను రికవరీ చేయాలని, బకాయిలు చెల్లించిన తర్వాతనే కొత్త పాటలు పెట్టాలని ఈ సందర్భంగా పంచాయతీ అధికారులకు తెలిపారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు హెచ్చరించారు

## ఉగాది పురస్కారాలతో మహిళలకు సన్మానం



**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు 2026 పేరున వారి వారి రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళా శిరోమణులను ఉగాది పురస్కారంతో సన్మానించదల్చామని సంఘ అధ్యక్షులు డాక్టర్ ఐ వి రావు, కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వర రావు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం యువ ప్రతిభావంతులను బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా ఉగాది పురస్కారంతో సన్మానించిన విషయాన్ని గుర్తు చేస్తూ ఈ సంవత్సరం వివిధ రంగాల ద్వారా సమాజానికి విశేష సేవలు అందిస్తున్న మహిళ లను ఎంపికచేసి వారిని సత్కరించదల్చామన్నారు. ఈ నెల 19 వ తేదీ గురువారం ఉగాది పండుగ రోజు ఉదయం 9:30 గంటలకు దంటు కళాక్షేత్రం లో నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూ ప్రొఫెసర్,డా. కె.వి .జి.ఎస్ మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

ఈ కార్యక్రమములో భాగంగా దేశ విదేశాలలో అనేక నాట్య ప్రదర్శనలు ఇచ్చి ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకున్న ప్రముఖ నాట్యకళాకారిణి, నాట్యమయూరి, నాట్య శిరోమణి బిరుదాంకితురాలు అయిన నదియా చే శాస్త్రీయ నృత్యప్రదర్శనను ఏర్పాటు చెయ్యడం జరిగిందని అన్నారు. నగరం ప్రజలు, భరద్వాజ సేవా సంఘం సభ్యులందరూ కుటుంబసభ్యులతో విచ్చేసి ఈ ఉగాది పురస్కారాలు కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించండి

**- ఆర్డీఓ కార్యాలయ పరిపాలనా అధికారి ఎం సుజాత**

**- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 1 అర్జీ - రెవెన్యూ క్లినిక్‌లో 3 అర్జీల స్వీకరణ**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లలో ప్రజలు సమర్పించిన అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పరిపాలన అధికారిణి ఎం సుజాత సూచించారు. సోమవారం ఉదయం ఆర్డీవో కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ క్లినిక్, పీజీఆర్ఎస్‌కు సంబంధించిన ప్రజా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం నాలుగు అర్జీలు అందగా, వాటిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఒక అర్జీ, రెవెన్యూ క్లినిక్ ద్వారా మూడు అర్జీలు స్వీకరించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరిపాలన అధికారిణి ఎం సుజాత ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు సూచనలు జారీ చేశారు. అందిన ఫిర్యాదులపై తక్షణ విచారణ చేపట్టి, సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అందించాలన్నారు. అర్జీల పరిష్కారాన్ని లక్ష్యంగా పెట్టుకుని 100 శాతం ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ముందు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పరిపాలన అధికారిణి సుజాతతో పాటు ఇతర శాఖల అధికారులు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సామర్లకోట మండలంలో ఇంటింటా రైతన్న మీకోసం



**సామర్లకోట, (మనసులో మాట) మార్చి 16;** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సామర్లకోట మండలంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి మురళీధర్ రావు ఆధ్వర్యంలో ఇంటింట రైతన్న మీకోసం కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని అచ్చంపేట, నవర, చంద్రపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ రైతన్న మీకోసం అంటూ... రైతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ, వ్యవసాయరంగా అభివృద్ధికి రైతుల సంఖ్య మనకి కృషి చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళీధర్ రావు తెలిపారు. స్మార్ట్ ఫార్మర్ యాప్, యాంత్రికరణ పథకం, ఆధునిక టెక్నాలజీ పథకాలను రైతులకు వివరిస్తూ, సేవలపై రైతులకు అవగాహన అవగాహన కల్పించినట్లు మురళీధర్రా తెలిపారు. సామర్లకోట మండలంలో మార్చి 25 వరకు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప, ఇతర ప్రజా ప్రతినిధులు సహకారంతో వ్యవసాయ శాఖ అందిస్తున్న, విశిష్ట కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మురళీధర్రావు తెలిపారు. కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్, కాకినాడ ఏడిఏ దుర్గా లక్ష్మి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మురళీధర్ రావు తెలిపారు. రైతులంతా వ్యవసాయ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# డ్రైన్ క్లియర్ చేయకుండా చప్టాను పగలగొట్టారని కలెక్టర్ కు ఫిర్యాదు



**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** కాకినాడ గాంధీ నగర్లోని రైతు బజార్లో డ్రైన్ను క్లియర్ చేయకుండా తాను నిర్మించుకున్న చిన్నపాటి చప్టాను పగలగొట్టడంపై జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి దుకాణ యజమాని వెన్న గంగాభవాని సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేసింది.

తాను మహిళా శక్తి డ్వాక్రా సంఘం గ్రూప్లో సభ్యురాలని తనకు గాంధీనగర్ రైతు బజార్లో ఉల్లిపాయలు, బంగాళదుంపలు, అల్లం, పచ్చిమిర్చి వ్యాపారం చేసుకునేందుకు దుకాణం కేటాయించినారని కలెక్టర్'కు తెలియజేసింది. ఆ బజార్లో మురికి నీరు పాదచారులకు ఇబ్బందిగా మారుతుందని అందువల్ల నేను తాత్కాలికంగా ఖాతాదారులు ఇబ్బందులు పడకుండగా చప్టాను ఎత్తు చేసు కున్నానన్నారు. మూడు రోజుల క్రితం తనకు ఎవరూ తెలియజేయకుండా చప్టాను పగలగొట్టారని గంగాభవాని కలెక్టర్'కు తెలియజేసింది. డ్రైన్ క్లియర్ చేయకుండా చప్టాను పగలగొట్టడం వల్ల ఏ విధంగా ప్రయోజనం లేదని మళ్లీ వర్షం వచ్చినా తన దుకాణం ముందు నీరు నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజార్లో పలువురు దుకాణదారులు దారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని అందువల్ల వాటిని తొలగించి డ్రైన్లను క్లియర్ చేయాలని గంగాభవాని కోరారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్షలను తనిఖీచేసిన కలెక్టర్





**అమలాపురం మనసులోమాట మార్చి 16 :** పదవతరగతి పబ్లిక్ పరీక్ష లను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తనిఖీచేసారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి పబ్లిక్ పరీక్షలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువులకు భవిష్యత్తుకు పదవతరగతి పరీక్ష లు అత్యంత కీలక మైనవని, వీటిని అత్యంత పారద ర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిడికి లోనవ్వ కుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని కోరారు. అనవసర ఆందోళన పడకుండా ప్రశాంతంగా సమాధానాలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సీసీ టీవీ కెమెరాల నిఘా ఉంటుందని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు మరియు ప్రాథమిక ఆరోగ్య చికిత్సలు అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అను మతించబోరని స్పష్టం చేశారు. పరీక్షకు వెళ్లే ముందు హాల్ టికెట్, అవసరమైన స్టేషనరీని సరిచూ సుకోవా లన్నారు. ప్రశ్నపత్రాన్ని అందిన వెంటనే కంగారు పడకుండా, 15 నిమిషాల పాటు పూర్తిగా చదువుకో వాలన్నారు. పరీక్షల సమయంలో సరైన ఆహారం, నిద్ర తీసుకోవడం ద్వారా ఏకాగ్రత పెరుగు తుందని గుర్తుంచుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలు రాయి అని. కాబట్టి నమ్మకంతో, ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. కష్టపడి చదివిన వారికి ప్రతిఫలం తప్పకుండా మీకు లభిస్తుందన్నారు ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా సమాధానాలు రాయాలన్నా రు. పరీక్షా కేంద్రాలలో క్రమశిక్షణ, పార దర్శకత మరియు న్యాయ బద్ధత తప్పనిసరిగా ఉండాల న్నారు.. విద్యార్థులు ధైర్యంగా, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ కోరారు. నిర్ణీత సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవడం, సెల్ ఫోన్‌లు లేదా ఎల్రక్టానిక్ పరికరాలు తీసుకెళ్లకుండా ఉండడం వంటి నియమాలు పాటించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతికి ఈ పరీక్షలు కీలకమని, అందుకే అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ రాంబాబు, ప్రధానోపాధ్యా యురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని సిఐటియు ధర్నా..

**- గ్యాస్ కొరత లేకుండా సరఫరా చేయాలని డిమాండ్...**

**- సి.ఎన్. టీ. యు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకట రమణ**




**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** సిఐటియు రాష్ట్ర పిలుపు మేరకు కార్మికులు పని ప్రదేశాల్లో గ్యాస్ ధరలు పెంపుదలకు వ్యతిరేకంగా నిరసన ధర్నాలు చేయాలనే పిలుపును కాకినాడ జిజిహెచ్ శానిటేషన్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యం లో సోమవారం చేపట్టారు. ఈ నిరసన ధర్నాను ఉద్దేశించి సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివేల వీరబాబు మాట్లాడుతూ ఇరాన్ లో జరుగుతున్న యుద్ధ పరిణామాల నేపథ్యంలో గ్యాస్ ధరను పెంచడం చాలా దారుణమని అన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు రోజురోజుకు పెరుగుతున్న గాని దానికి అనుగుణంగా వేతనాలు మాత్రం పెంచడం లేదని అన్నారు. గ్యాస్ ను వినియోగదారులు ఆన్లైన్లో బుక్ చేసుకుంటే కొంతమంది బుకింగ్ అవ్వట్లేదని తెలియజేశారు అన్నారు. గ్యాస్ కొరత లేకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికే గ్యాస్ ధర పెరగడంతో హోటల్స్ లో రేట్లు పెంపుదల జరిగిందని ఇది సామాన్య ప్రజలపై మరొక భారంగా ఉంటుందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వం మన కాకినాడ జిల్లాలో గాడి మోగలో ఉన్న గ్యాస్ను గుజరాత్ కు తరలించకుండా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు చెందే విధంగా చర్యలు తీసుకుంటే అతి తక్కువ ధరకే గ్యాస్ అందుబాటులోకి వస్తుందని అన్నారు. కాకినాడ జిల్లాలో నుంచి ఎక్కడో గుజరాత్ తరలించక పోవడంతుంటే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం సరైనది కాదని అన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరను తగ్గించే విధంగా కేంద్రంతో మాట్లాడాలని ప్రభుత్వాలు కోరారు. ఇప్పుడు ఉన్నటువంటి గ్యాస్ పరిస్థితిలు మరింత ఉధృతం అవుతే భవిష్యత్తులో ఈ పోరాటం మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రవి, వాసు, తలుపులమ్మ, భాగ్యం, శ్రీను, జ్యోతి, లక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.



# విభిన్న ప్రతిభావంతులకు సహాయక ఉపకరణాల పంపిణీ

**- జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్**

**- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** తూర్పు గోదావరి జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేతుల మీదుగా సుమారు రూ.82 వేలు విలువజేసే 5 వినికిడి యంత్రాలు, 10 కృత్రిమ అవయవాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఆత్మ విశ్వాసంతో స్వయం సమర్థులుగా ఎదగడానికి అవసరమైన సహాయక ఉపకరణాలు అందించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. దివ్యాంగుల దైనందిన జీవితాన్ని సులభతరం చేయడం, వారి సామర్థ్యాలను పెంపొందించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. దివ్యాంగుల ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అవసరమైన వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు, ఇతర సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటోందని ఆయన అన్నారు. సమాజంలో దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి దివ్యాంగుడికి అవసరమైన ఉపకరణాలు అందేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**రౌతులపూడి, (మనసులో మాట )మార్చి 16:** మండలంలోని ములగపూడి రౌతులపూడి గ్రామాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రౌతులపూడి తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎస్ వి నరేష్, ములగపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ రౌతులపూడి మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్వీ నరేష్, తమరాల సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది. తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన సేన సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు

# ఆర్థిక భరోసా



**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** భారత దేశం లో ఏ రాజకీయ పార్టీ చేయని రీతిలో కార్యకర్తల సంక్షేమం కుటుంబ సభ్యుల భద్రతకు పెద్దపీట వేసిన చరిత్ర పవన్ కళ్యాణ్ కు దక్కిందని రేలంగి బాపిరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో అన్ని వర్గాల వారిని, అన్ని రంగాల వారిని కలుపుకుని పార్టీ సభ్యత్వం నమోదు చేయడం అభినందనీయమని దీనివలన క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం కానుందని అన్నారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితునై తాను మరికొందరు ప్రముఖులు సభ్యత్వం స్వీకరించామని బాపిరాజు తెలిపారు .ఈ కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్, శిరీష, రాజా, సిహెచ్ సుబ్బారావు, పార్థసారథి, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు ,ఆగేటి సత్యనారాయణ, ఆనాల సత్తిబాబు, పిడుగు సూర్యనారాయణ మూర్తి, సత్తి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## కాకినాడ ఎస్.టి కళాశాల వసతి గృహాల్లో కనీస సదుపాయాలు కల్పించాలి

**- పీ. డీ. ఎస్. యూ ఫిర్యాదు...**

**- ఎస్. టీ బాయ్స్ కళాశాల వసతి గృహాల్లో తక్షణమే అర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి...**

**కాకినాడ (మనసులో మాట) మార్చి ..** కాకినాడ జిల్లా గిరిజన సంక్షేశాఖ అధికారి ఎన్. నాగ మల్లేశ్వర రావు కి గిరిజన విద్యార్థులకు వసతి గృహాలలో కనీస సదుపాయాలు కల్పించాలని బాయ్స్ వసతి గృహాలలో తక్షణమే ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని కోరుతూ పి.డి.ఎస్. యు డిమాండ్ చేస్తూ సోమవారం వినతి పత్రం అందజేశారు. కాకినాడ పట్టణంలోని ఎస్.టి కళాశాల వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు అర్జీ సమర్పించినట్లు వారు పేర్కొన్నారు. బి. సిద్ధూ మాట్లాడుతూ కాకినాడ పట్టణంలో మొత్తం నాలుగు ఎస్.టి కళాశాల వసతి గృహాలు ఉన్నాయని, అందులో రెండు బాయ్స్ వసతి గృహాలు, రెండు లేడీస్ వసతి గృహాలు ఉన్నాయని తెలిపారు.

అయితే ఈ నాలుగు వసతి గృహాల్లో కూడా సరైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాయ్స్ కళాశాల వసతి గృహాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, శుభ్రమైన తాగునీరు అందుబాటులో లేక విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతున్న దన్నారు. కాబట్టి వెంటనే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా ఈ నాలుగు వసతి గృహాలకు మున్సిపల్ కుళాయి నీటి కనెక్షన్ లేకపోవడంతో విద్యార్థులు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే మున్సిపల్ కుళాయి నీటి కనెక్షన్ కల్పించాలని కోరారు. అలాగే ఎస్.టి బాయ్స్ కళాశాల వసతి గృహం నెంబర్2 కు స్వంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఇంకా ఈ వసతి గృహాల్లో రెగ్యులర్ సిబ్బంది అయిన కుక్, కమాటి లేకపోవడంతో పరిపాలనా సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కాబట్టి వెంటనే రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్.టి కళాశాల వసతి గృహాల్లో మెస్ మరియు కాస్మోటిక్స్ చార్జీలు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాబట్టి ఈ సమస్యలను ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలని పీ.డీ.ఎస్.యూ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యూ నాయకులు జి. హరీష్, కె. రోహిత్, ఎం.సాయి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు విధులకు గైర్హాజరు అయితే చర్యలు తప్పవు

**- కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**



**కాకినాడ (మనసులో మాట ) మార్చి 16..** ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు అయ్యే పారిశుధ్య కార్మికులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ హెచ్చరించారు.సోమవారం ఉదయం 12వ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్ బాల భవన్ సమీపంలో ఉన్న మస్తార్ కేంద్రాన్ని కమిషనర్ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నలుగురు పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కాక పోవడం గమనించిన కమిషనర్, వారికి నోటీసులు జారీ చేయాలని సంబంధిత శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా నగరంలోని ప్రధాన రహదారులు ప్రతి రోజు తెల్లవారుజామునే శుభ్రం చేయాలని సూచించారు.ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు అయ్యే కార్మికులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్ లో కాకినాడ నగరానికి మంచి ర్యాంకు రావాలంటే పారిశుధ్య కార్మికుల కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు తదితరులు కమిషనర్ వెంట ఉన్నారు.

## రైతన్నలు మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు

**- తాడేరులో రైతన్న నీకోసం" కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు, కలెక్టర్ నాగరాణి**





**భీమవరం, (మనసులో మాట) మార్చి 16 :** రైతన్నల ప్రయోజనాలను కాపాడుతూ మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించే దిశగా ప్రభుత్వం నిరంతరాయ చర్యలు చేపట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం తాడేరు గ్రామంలో వీరభద్ర స్వామి దేవాలయం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతన్న నీకోసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలను చేస్తున్నారని, దీనిలో భాగంగా అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్క రైతు ఖాతాలో మూడు విడతలుగా రూ 20 వేలను పెట్టుబడి సాయంగా జమ చేయడం జరిగిందన్నారు. పోలవరం పూర్తి అయితే మూడు పంటలు పండించుకునే అవకాశంతో పాటు పంట భూముల విలువ కూడా పెరుగుతాయన్నారు. మార్కెట్లో డిమాండ్ ఆధారిత పంటలు, సన్న రకాలను పండించాలని సూచించారు. మన జిల్లాలో పండించేది ఎక్కువగా ఎగుమతికి వెళుతుందని, స్థానిక ప్రజలు వినియోగించే రైతులను మాత్రమే పండించాలని సూచించారు. జిల్లాలోని పంట భూములకు అనువైన సన్న రకాలను పండించడానికి వ్యవసాయ శాఖ పూర్తి సహకారం అందించాలని అన్నారు. రైతులకు మేలు జరిగే విధంగా పుంత రోడ్లను మార్కెట్ యార్డ్స్ ద్వారా నిర్మించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వారి ఆదేశాల మేరకు పుంత రోడ్ల నిర్మాణాలు జరుగుతాయని, జిల్లాలో సాగునీరు పారుదలలో ఇబ్బంది కారణంగా పొలాలు దెబ్బతింటున్నాయని, కాలువలు, డ్రెయిన్ లు పూడికతీత పనులు, సీమౌత్ డ్రగ్గింగ్ పనులు, ఉప్పుటేరు ప్రక్షాళన పనులను చేయాలని రాష్ట్ర మంత్రితో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వివరించడం జరిగిందన్నారు. వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాన్ ఆక్వా జోన్లో కూడా విద్యుత్ సబ్సిడీ పై అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ముందుకు వస్తే సబ్సిడీతో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రైతులు సాంకేతికను అందిపుచ్చుకుని పెట్టుబడిని తగ్గించుకోవాలని, డ్రోన్ వినియోగంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు నని అన్నారు. ప్రభుత్వం 6 రోజులపాటు రైతన్న నీకోసం కార్యక్రమాన్ని చేపట్టడానికి నిర్దేశించిందని, 16,17, 18, 23,24, 25 తేదీలలో వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులు, సిబ్బంది జిల్లాలోని ప్రతి రైతు ఇంటికి వెళ్ళి రైతు ప్రయోజనాలను, వ్యవసాయంలో సాంకేతికత జోడింపు, పంట మార్పిడి ప్రయోజనాలు, రైతు యాప్ ప్రయోజనాలు, తదితర అంశాలపై రైతులకు వివరించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు యాప్ ను డౌన్లోడ్ చేసుకుని వినియోగించేలా విఎఎలు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కరపత్రాన్ని ఆవిష్కరించారు. అధికారులు, గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు - ఎమ్మెల్యే



**పెద్దాపురం (మనసులో మాట) మార్చ్ 16;** ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల హెచ్చరించారు. సోమవారం పెద్దాపురం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నందున ప్రభుత్వ వైద్యులు కూడా మంచి సేవలు అందించాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు వైద్యుల వివరాలు ఇతర అంశాల ఆసుపత్రి సూపరిండెంట్ ఉమామహేశ్వరి ఎమ్మెల్యే చినరాజప్ప కు, కమిటీ సభ్యులకు వివరించారు. త్వరలోనే పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే చినరాజప్ప హామీ ఇచ్చారు. పాలకవర్గ సభ్యులు కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వైద్యులకు, పేదలకు సహకారం అందించాలని ఎమ్మెల్యే చినరాజప్ప ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు రంది సత్యనారాయణ, వంగలపూడి సతీష్ డాక్టర్ రాజకుమార్ డాక్టర్ శ్రీనివాస్ ఐ సి టి సి కౌన్సిలర్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు సంజీవ్ జైన్ మేడిశెట్టి కుమారి నందిక లోవరాజు రామలింగేశ్వర చౌదరి, కోరుపూరి రాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## తెలుగు రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి

**పొట్టి శ్రీరాములు త్యాగస్ఫూర్తి భావితరాలకు ఆదర్శం - మాజీ ఎమ్మెల్యే పిల్లి**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించేందుకు తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా కాకినాడ రూరల్ మండలం వాకలపూడి మహాలక్ష్మి నగర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పిల్లి దంపతులు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం రావాలని డిమాండ్ చేస్తూ ఆయన చేపట్టిన నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని నాయకులు గుర్తుచేశారు. 1952లో ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్షను 58 రోజుల పాటు కొనసాగించి చివరికి తన ప్రాణాలను అర్పించిన ఆయన త్యాగం ఫలితంగానే 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. అమరజీవి త్యాగం తెలుగు జాతికి గర్వకారణమని, ఆయన చూపిన త్యాగస్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమరావతిలోని శాఖమూరు పార్కు వద్ద స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైజ్' పేరుతో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన 125వ జయంతిని పురస్కరించుకుని ఆ విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా 6.8 ఎకరాల విస్తీర్ణంలో స్మృతివనాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగరాలను సుందరీకరిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి...

**చలో రాజమండ్రి బస్సులకి ఏఐటీయూసీ జెండా ఊపి ప్రారంభించిన మున్సిపల్ నేతలు**




**కాకినాడ (మనసులో మాట) మార్చి16..** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభ సోమవారం ఉదయం కాకినాడలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పాత కార్యాలయం నుండి యూనియన్ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరావు అధ్యక్షత న రెండు బస్సులు బయలుదేరారు. ముందుగా ఈ బస్సులను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేత కిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఏఐటియుసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పట్ల చులకనా భావంతో మొండి వైఖరిగా వ్యవహరిస్తుందని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో పాలకులకు విఫలం చెందారని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో ఆప్కాస్ వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింప చేస్తావని హామీలు ఇచ్చారని కానీ ఎక్కడ అమలు చేయలేదని వారన్నారు. అందుకే ఆ పార్టీ కనుమరుగే పరిస్థితి వచ్చిందని, మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన కైతే ఈ ప్రభుత్వాన్ని పడుతుందని వారు హెచ్చరించారు. ప్రతిరోజు తెల్లవారు జామున నగరాలు సుందరకరిస్తున్నారని, డ్రైనేజీలు శుభ్రపరుస్తున్నారని, ఇంటింటా తడి పొడి చెత్తను సేకరిస్తున్నారని, సిబ్బంది తక్కువైనా ఆ పని వారం మోస్తూ విధులను కర్తవ్యం గా భావిస్తూ విధులు నిర్వహిస్తున్నారని, 60 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా ప్రజా శ్రేయస్సుకే పని చేస్తున్నారని అటువంటి కార్మికులను ప్రభుత్వం గుర్తించి, సన్మానించి జీతాలు పెంపుదల చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వస్తున్న అన్ని రాయితీలు ఆప్కస్ వర్కర్స్ కు వర్తింపచేయాలని వారన్నారు. పర్మినెంట్ ఎంప్లాయిస్ రిటైర్మెంట్ రోజున రిటైర్మెంట్ బెనిఫిట్ వర్తింప చేయాలని, మున్సిపల్ కాలనీ ఏర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని వారన్నారు. రాజమహేంద్రవరంలో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్తు పోరాట ఉద్యమ కార్యచరణ వెల్లడిస్తామని, వారి సమస్యలు పరిష్కారం చేసేందుకే ఉద్యమిస్తామని, ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారన్నారు.

ఈ కార్యక్రమంలో బంగారు రాజేష్, బొబ్బిలి ఈశ్వరరావు, నిమ్మకాయల ఈశ్వరరావు, ముద్దాడి కృష్ణ, కొలు శీను, గంటా నాగేశ్వరరావు, నక్క లక్ష్మణ్, జని పల్లి అప్పన్న, మణికంఠ, గంటా రాంబాబు, తదితర 14 సర్కిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## నగరంలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వాసు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సోమవారం స్థానిక 2వ డివిజన్లో పర్యటించారు. ఈ సందర్భంగా నారాయణపురం, ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే 2వ డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఒక మద్యం దుకాణం పక్క రోడ్డులో నిత్యం వాహనాలు నిలిపి వేయడం వల్ల అటుగా రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దృష్టికి తీసుకురాగా ఆయన పోలీసులకు ఫోన్ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, నిత్యం ఆ ప్రాంతంలో రక్షక్ ఉంచాలని సూచించారు. నాయకులు, స్థానిక ప్రజలు, నగర పాలక సంస్థ అధికారులు ఎమ్మెల్యే వాసు వెంట ఉన్నారు.

## సమాజ సేవలతోనే భగవంతునికి మెప్పు



**కాకినాడ (మనసులో మాట ) మార్చి 16..** సమాజ సేవలో ప్రధాన మైనది మానవ సేవ అని వీటితోనే భగవంతుని అనుగ్రహం లభిస్తుందని సినీ నిర్మాత గొర్తి భాస్కరరావు పేర్కొన్నారు. రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ప్రవాస ఆంధ్రుడు కంచర్ల సత్యనారాయణ సౌజన్యంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు సోమవారం పంపిణీ చేసారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే ప్రతి పనిలో దైవ సంతోషమే ప్రేరణగా ఉండాలని అన్నారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రవాస ఆంధ్రుడు అయిన సత్యనారాయణ మన సంస్కృతి సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సంక్రాంతి సందర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడమే గాక పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారని అన్నారు. ఉగాది సందర్భంగా పేదలకు నూతన వస్త్రాలు ,ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు సమకూర్చడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ప్రసాద్ నాయుడు ,చింతపల్లి సుబ్బారావు, పి. ధర్మచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు ఆశయాల సాధనకు కృషి చేయాలి



**పెదపూడి, (మనసులో మాట) మార్చి 16;** ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలు లక్ష్యాల సాధనకు యువత కృషి చేయాలని పెదపూడి మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఒబిలిశెట్టి మల్లికార్జునరావు కోరారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సోమవారం పెదపూడి ఎల్లంపేట ప్రాథమిక పాఠశాల వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని స్మృతి వనాన్ని ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. ఆర్యవైశ్య సంఘం నేతలు బోడా రాంబాబు, సిరిశెట్టి సూర్య ప్రకాష్, ఓబిలిసిటీ గోపాలకృష్ణ, ఒబిలి శెట్టి ప్రసాద్, ఓబిలిశెట్టి సత్యనారాయణ, వారణాసి నాగేంద్ర, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షలు ప్రారంభం

**- ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు**



**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 16:** పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఐదు కేంద్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన యానాం లోని రెండు పరీక్షా కేంద్రాలలో 1465 విద్యార్థులకుగానూ 1459 విద్యార్థులు హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారు. మండల పరిధిలోని తాళ్లరేవు, ఇంజరం, పటవల, పి. మల్లవరం, బొడ్డుచిన వెంకటాయపాలెం కేంద్రాలతోపాటు యానాంలోని రీజెన్సీ హైస్కూల్లోని రెండు సెంటర్లలో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8.30 గంటలకల్లా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థుల హాల్ టిక్కెట్లు, తదితర పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షాకేంద్రంలోకి పంపించారు. మండల కేంద్రమైన తాల్లరేవు హైస్కూల్లో నలుగురు, పి.మల్లవరం కేంద్రంలో ఒకరు. పటవల పరీక్షా కేంద్రంలో ఒకరు పరీక్షకు హాజరు కాలేదు. తాళ్లరేవు కేంద్రంలో గత ఏడాది ఫెయిల్డ్ అయిన 8 మంది విద్యార్థులకుగానూ ఒకరు మాత్రమే పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓలు మంగాయమ్మ, ఉమ తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లరేవులోని నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




## సువర్ణ ఇండియా కేసులో నిందితులకు జైలు శిక్ష

**అమలాపురం( మనసులోమాట) మార్చి16:** అమలాపురం కేంద్రంగా సువర్ణ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఖాతాదారుల నుండి 14కోట్లరూపాయలు ఫిక్సిడ్ డిపాజిటలు, రికరింగ్ డిపాజిట్ (=ణ) ల రూపంలో ఆ సంస్థ ఎండి బూసి వేణు 10 ఏళ్ళ క్రితం వసూళ్లు చేసారు. అమలాపురం లో సువర్ణ ఇండి యా కంపెనీ ప్రధాన కేంద్రం గా పెట్టి ఉత్తర కోస్తాంధ్ర శ్రీ కాకుళం,విజయనగరం, విశాఖపట్నం వరకూ ఈ సువర్ణ ఇండియా కంపెనీ బాధితులు ఉన్నారు. అప్పట్లో ఈ కంపెనీ సుమారు 14 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులు సువర్ణ ఇండియా కంపెనీ యజమాని బూసి వేణుపై అమలాపురం లో 2015 లో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేసి కంపెనీకి చెందిన వారందరిపై కేసు నమోదుచేసి వారిని అరెస్టు చేసి కోర్టు కు తరలించారు.అప్పటి నుండి ఈకేసుకు సంబంధించి కోర్టులో వాదోపవాదనలు జరగగా నేడు ఈ కేసుకు సంబంధించి రాజమహేంద్రవరం జిల్లా కోర్టు తీర్పు ను ఇచ్చింది. రాజోలు మండలం శివకోటి గ్రామానికి చెందిన ఆసంస్థకు ఎండీ బూసి వేణు కు 7 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయలు జరినామ, డైరెక్టర్లుగా ఉన్న అతని భార్య భూసి రాజ్యలక్ష్మి కి ఐదు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, 50 వేలు జరిమాన, అతని కుమార్తె భూసి గౌతమి కి 3 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, మరియు 50 వేలు జరినామ విధిస్తూ సోమవారం రాజమహేంద్రవరం జిల్లా న్యాయస్థానం తీర్పు ను ఇచ్చింది. సువర్ణ ఇండియా బాధితుల పిర్యాదు మేరకు 2015 లో అప్పటి అమలాపురం పట్టణ సీఐ వై.ఆర్. కే శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

## అంధకారంలో జగ్గంపేట ఎస్. సి కాలనీ

**- వారంరోజులుగా వీధిలైట్లు వెలగని వైనం**
**- చీకట్లో అవస్థలు పడుతున్న కాలనీ వాసులు**



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 16..** వారం రోజులుగా వీధి లైట్లు వెలగకపోయిన పట్టించుకొనే నాదులే కరువయ్యారని జగ్గంపేట ఎస్.సి కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు పంచాయతీ సిబ్బందికి తెలియజేసిన ఏ ఒక్కరూ పట్టించుకొన్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.గర్భిణీలు,పిల్లలు రాత్రి వేళల్లో తిరగలేక అవస్థలు పడుతున్నారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. వీధి కుక్కలు రోడ్లపై పడుకొం టున్నాయని, చీకట్లో వాటిని తొక్కితే కుక్కకాటుకు గురి అవుతామని, ఇప్పటికయినా పంచాయతీ అధికారులు స్పందించి తక్షణం వీధి లైట్లు మరమ్మత్తులు చేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



# చావు దెబ్బ తింటున్న పేదల గూడు...

### కలెక్టర్‌కు మొరపెట్టుకున్న - పిల్లి సత్యనారాయణ మూర్తి



**కాకినాడ (మనసులో మాట)మార్చి 16..** కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామంలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలపై ఒక్కసారిగా ముంచుకొచ్చిన తొలగింపు నోటీసుల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత 35, 40 ఏళ్లుగా డ్రెయిన్ పక్కన సిమెంట్ రోడ్డు నిర్మించుకుని, ప్రభుత్వ పట్టాలతో పక్కా గృహాలు నిర్మించుకున్న 23 కుటుంబాలకు డ్రైనేజీ విభాగం నుంచి వచ్చిన నోటీసులు వారిని ఆందోళనలోకి నెట్టాయి. ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. గతంలో పిల్లి అనంతలక్ష్మి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, అప్పటి కలెక్టర్ అరుణ్ కుమార్ దృష్టికి ఈ నిరుపేదల సమస్యను తీసుకెళ్లి, అన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరికి 23 పట్టాలను మంజూరు చేయించడం జరిగింది. ఈ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం, ఇంటి పన్ను వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ఇన్నేళ్లుగా సాఫీగా సాగుతున్న వీరి జీవితాల్లోకి ఇప్పుడు నోటీసులు రావడం అర్థరహితమని సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ముఖ్యంగా ఇది కాకినాడ ఉప్పుటేరుకు కలిసే ఒక డెడ్ ఎండ్ డ్రెయిన్ అని, దీనివల్ల ఎవరికీ ఎలాంటి ఆటంకం లేదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో, ముఖ్యంగా ఎస్.ఆర్ నగర్ వంటి చోట్ల డ్రెయిన్లపై మూడంతస్తుల మేడలు నిర్మించిన వారిని వదిలేసి, కేవలం ఈ 23 మంది పేదలపైనే అధికారులు ఎందుకు ప్రతాపం చూపిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కొవ్వూరు నుంచి అరట్లకట్ట వెళ్లే మెయిన్ రోడ్డు వెంబడి గోదావరి కాలువ గట్టుపై ఉన్న ఆక్రమణల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని, అక్కడ చర్యలు తీసుకోవడం కోసం నోటీసులు ఇచ్చారన్నారు. కానీ ఎవరికీ ఇబ్బంది లేని చీడిగ గ్రామంలోని పేదలను టార్గెట్ చేయడం అన్యాయమని అన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత విభాగంతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, బాధితులకు అండగా పోరాటం కొన సాగిస్తామని పిల్లి సత్యనారాయణమూర్తి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## సిపిఎం నేత కామ్రేడ్ వాసంశెట్టి సూర్యారావు 7 వ వర్ధంతి నివాళి



**కాకినాడ (మనసులో మాట ) మార్చి 16..** సిపిఎం నేత కామ్రేడ్ వాసంశెట్టి సూర్యారావు 7 వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం సుందరయ్య లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా సూర్యారావు చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వ శేషబాబ్జి, నగర కమిటీ సభ్యుడు కె. సత్తిరాజు లు పూలమాల వేసి జోహార్లు అర్పించారు.

ఈ సందర్భంగా శేషబాబ్జీ మాట్లాడుతూ ట్రెజరీ లో ఉద్యోగి అయిన సూర్యారావు నిజాయితీ గా పనిచేసారన్నారు. ఎమర్జెన్సీ కాలంలో సిపిఎం లో చేరి ఒకప్రక్క ఉద్యోగ సంఘం నాయకుడుగా, మరొక ప్రక్క ట్రేడ్ యూనియన్ నాయకుడుగా విశేషమైన కృషి చేసారని కొనియాడారు.

అదే విధంగా విద్యార్థి, యువజన, మహిళా ప్రజా సంఘాల నిర్మాణంలో, కార్యకర్తల కష్టసుఖాలను అర్థం చేసుకుని సహాయం చేయడంలో తనదైన శైలిలో పనిచేసారన్నారు. సిపిఎం కాకినాడ పట్టణ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యుడు గా పనిచేసిన సూర్యారావు ఆచరణ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు సిహెచ్. రమణి తో పాటు కె. వీరబాబు, కె. సత్తిరాజు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ సూర్యారావు నిరాడంబరంగా జీవించారని, కాకినాడ పరిసరాల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా కుటుంబ సభ్యులు, బంధువులను కూడా పార్టీ మార్గంలో నడిపించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సిహెచ్. రాజ్ కుమార్, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, సిహెచ్. వేణు, కె. నాగ్ జ్యోతి లతో పాటు ఎం. నాగలక్ష్మి, టి. రాణి, జి. భూలక్ష్మి, గణపతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

# రేపు గుబ్బాలమ్మ జాతర



**గోకవరం (మనసులో మాట), మార్చి 16 :** ఏజెన్సీ ముఖద్వారం మండల కేంద్రం గోకవరం గ్రామ దేవత మాతృశ్రీ గుబ్బాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు ఈనెల 18 నుండి ప్రారంభం అవుతున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి జాతర కూటమి ప్రభుత్వంలో శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆచంట రాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 18 నుండి 23వ తేదీ వరకు గ్రామదేవత మాతృశ్రీ గుబ్బాలమ్మ జాతర మహోత్సవాలు ఎంతో ఘనంగా జరగనున్నవని, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మరింత ఘనంగా ఉత్సవాలను జరుపుతామన్నారు. గరగ నృత్యములతో, భారీ బాణాసంచాతో, జానపద, పౌరాణిక నృత్యములతో, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో , అకాడమీ ఆటలతో, ఆర్కెస్ట్రా మ్యూజిక్ లతో జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. 26వ తారీఖున అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు. 1972లో గ్రామ దేవత ఉత్సవాలు ప్రారంభమైనవని తొలినాళ్ల నుండి ఇప్పటివరకు దినదినాభివృద్ధి చెందుతూ గోకవరం గుబ్బాలమ్మ జాతరకు భక్తులు విశేషంగా పెరిగారన్నారు. కోరిన కోరికలు తీర్చే దేవత గుబ్బాలమ్మ అమ్మవారిని, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం భక్తులు పెరిగే అవకాశముందని, అమ్మవారి దర్శనంనకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ గన్రెడ్డి సన్యాసిరావు, సెక్రటరీ ముమ్మిడివరపు నారాయణరావు, కమిటీ మెంబర్ నాగేశ్వరరావు (శేషు), వీరబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## అమరావతిలో స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్ పేరుతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన... అమర్ జీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహావిష్కరణ వీక్షించిన ప్రముఖులు..



**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్ పేరుతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వర్చువల్ గా వీక్షించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తదితరులు పాల్గొని వీక్షించారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని కోరుతూ పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమరావతిలో ఏర్పాటుచేసిన పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్. ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వైశ్య ప్రతినిధులు, అధికారులతో కలిసి వర్చువల్ గా వీక్షించారు.తొలుత జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, వైశ్య ప్రతినిధులు ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు ఇతర ప్రజాప్రతి నిధులతో కలిసి విగ్రహ విష్కరణ చేశారు. 6.80 ఎకరాల విస్తీర్ణంలో విగ్రహంతో పాటు స్మృతి వనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి. తిప్పేనాయక్, కేఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి, బీసీ సంక్షేమ అధికారి జి. శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో ఎస్ రామ్మోహన్ రావు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో అంగరంగ వైభవంగా గంగమ్మ గావు సంబరం

### హాజరైన ప్రముఖులు వేలాదిమందికి అన్న సమారాధన



**జగ్గంపేట మనసులో మాట మార్చి 15 ..** జగ్గంపేటలో వైభోగుల వారి ఆడపడుచు గంగమ్మ గావు సంబరం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళల నైవేద్యాలతో యాదవుల సాంప్రదాయ కళలు తప్పిడి గుళ్ళు ఆట ద్వారా పలు గ్రామాల నుంచి హాజరైన కళాకారులు అత్యంత వైభవంగా అమ్మవారికి నీరాజనాలు పలికారు. జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షుడు జీను మణిబాబు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, నియోజక వర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేములకొండ జోగారావు తదితరులు సంబరానికి హాజరయ్యారు. వారికి పూలదండలతో స్వాగతం పలికిన ఆలయ కమిటీ పెద్దలు వైభోగుల, పెద్ద గొల్ల అప్పారావు, వైభోగుల నారాయణమూర్తి, వైభోగుల వీరపండు, వైభోగుల సత్తిబాబు, వైభోగుల గంగరాజు ఈ సందర్భంగా శ్రీ గంగమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జగ్గంపేట కాకినాడ రోడ్ లో గల కో-ఆపరేటివ్ బ్యాంక్ పక్కన పెద్ద గొల్ల గారి వీధి లో వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ గావు సంబరం మార్చి 15వ తేదీ ఆదివారం నుండి మార్చి 16వ తేదీ సోమవారం వరకు ఘనంగా నిర్వహించుకున్నమని మా సాంప్రదాయ ఆట తప్పిడి గుళ్ళు తో గంగమ్మ కి నీరాజనలు అందించామని ఆ గంగమ్మ ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి ఈ ప్రాంత రైతులందరూ సుభిక్షంగా పంటలు పండించుకోవాలని అమ్మవారిని పూజించామని 80 మేకపోతులను నైవేద్యంగా పెట్టి సుమారు 7000 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలియజేశారు. ఈ కార్యక్రమానిక భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆ గంగమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ వైభోగుల కొండబాబు యాదవ్, వైభోగుల శ్రీనివాస యాదవ్ జగ్గంపేట శ్రీకృష్ణ యాదవ్ సంఘం అధ్యక్షుడు మొరుకుర్తి రాజు యాదవ్, వైభోగుల వీరపండు, వైభోగుల సతీష్, వైభోగుల వీరబాబు అధిక సంఖ్యలో యాదవ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.




## స్టిక్ మనోహర్ కు 'జాదు స్వాభిమాన్ లైఫ్ టైం అచీవ్మెంట్' అవార్డు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** ప్రముఖ మెజీషియన్ ఎస్ మనోహరరావు (స్టిక్ మనోహర్) జాదు స్వాభిమాన్ శ్రీ జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు. జాదూగర్ ఎస్ కే నిగమ్ 78 వ పుట్టిన రోజు సందర్భంగా షాహిద్ స్మారక్ కల్చరల్ వింగ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మధ్యప్రదేశ్ జబల్ పూర్ లో వేడుక నిర్వహించారు. దీనిలో మేజిక్ రంగంలో విశేషమైన సేవలందిస్తున్న మనోహర్ కు స్వాభిమాన్ దివాస్ - 2026 పేరుతో లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును జబల్ పూర్ మేయర్ జగత్ బహదూర్ సింగ్ అన్ను, ఎంపీ ఆశిష్ దుబే, మాజీ మంత్రి లఖన్ గంగోరియా, మాజీ మంత్రి, ఎమ్మెల్యే అజయ్ వైష్ణోయ్ సమక్షంలో అందజేశారు. విజయ్ జైస్వాల్, శ్రీ వాత్సవ్ తదితరులు పాల్గొన్నారు. మనోహర్ పురస్కారం అందుకున్న సందర్భంగా పలువురు మెజీషియన్లు, న్యాయ వాదులు, రాజమహేంద్రవరం నగర ప్రముఖులు పలువురు అభినందనలు తెలియజేశారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 125వజయంతి



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 16..** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు ఆధ్వర్యంలో చరిత్ర విభాగం అధ్యాపకుడు రాయుడు శ్రీను అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు , ఆధ్యాపకులు మరియు విద్యార్థులు పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు మరియు వారి గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. ఆయన హరిజనుల సంక్షేమం మరియు సమాన హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేశారు. సమాజంలో సమానత్వం, మానవత్వం మరియు సోదరభావం నెలకొనాలని ఆయన విశ్వసించారు అని తెలియజేశారు.తదుపరి కొంతమంది విద్యార్థులు పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలు మరియు వారి సేవల గురించి ప్రసంగించారు. కార్యక్రమం ముగింపులో చరిత్ర విభాగం అధ్యాపకుడు రాయుడు శ్రీను మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు త్యాగస్ఫూర్తి, దేశభక్తి మరియు సమాజానికి చేసిన సేవలను స్మరించుకుంటూ విద్యార్థులు వారి ఆదర్శాలను అనుసరించాలని సూచించారు.

## కాకినాడ జిల్లాలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు...



**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** పొట్టి శ్రీరాములు 125 వ జయంతి ని కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఘనంగా సోమవారం జరిగాయి. కాకినాడ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొని అమరాజీవి పొట్టి శ్రీ రాములకు ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో తన జీవితాన్నే ఆత్మార్పణం చేసిన గొప్ప మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఈ సందర్భంగా తెలిపారు.. స్వాతంత్ర సమర యోధుడు ఆంధ్ర రాష్ట్ర అవతరణ మూల పురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు 125 జయంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ సీబీఎం స్కూల్ సెంటర్, ఫెలోషిప్ చర్చ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ పట్టణ శాసనసభ్యుడు వనమాడి వెంకటేశ్వరరావు,(కొండబాబు) మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొని పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను జిల్లా అంతట ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు ప్రజలకు కోసం తన జీవితాన్నే అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు బాటలు వేసిన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఆయన చేసిన త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు ప్రజలందరిని ఏకం చేసిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాముల గౌరవార్థం 58 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించనున్నారని ఆయన తెలిపారు. విగ్రహంతో పాటు స్మృతి వనం ఏర్పాటు కోసం ప్రభుత్వం 6.80 ఎకరాల స్థలాన్ని కేటాయించి పనులు చేపట్టిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధనలో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని భవిష్యత్ తరాలకు గుర్తుండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాలను రాష్ట్ర మంతట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి చిక్కాల రామ చంద్రరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష, ఆయన చూపిన త్యాగం తెలుగు ప్రజల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, ఎంహెచ్ఓ డా. పృద్విచరణ్, ది యాంగ్ మన్ వైశ్య అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కోనసీమ రైల్వే పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ఎంపీ హరీష్ బాలయోగి**

**అమలాపురం( మనసులోమాట) మార్చి 16:** లోక్‌సభలో రైల్వే డిమాండ్స్ పై జరిగిన చర్చలో అమలాపురం ఎంపీ జి. ఎం. హరీష్ బాలయోగి మాట్లాడారు. ఈ సందర్భంగా కోటిపల్లినర్సాపురం రైల్వే లైన్ పై ప్రత్యేక శ్రద్ధ చూడాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు లాస్ట్ మైల్ కనెక్టివిటీపై ప్రస్తావన 2026-27 సంవత్సరానికి రైల్వే మంత్రిత్వ శాఖకు సంబంధించిన గ్రాంట్లపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ఎంపీ హరీష్ రైల్వే కనెక్టివిటీ బలోపేతం దేశ ఆర్థిక వృద్ధి , ప్రాంతీయ అభివృద్ధికి ఎంత ముఖ్యమో ప్రస్తావించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కోటిపల్లినర్సాపురం రైల్వే లైన్ ప్రాజెక్ట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈ ఏడాది రైల్వే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన రూ. 10,134 కోట్ల నిధులను ఆయన స్వాగతించారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని కొనసాగించడానికి మెరుగైన రైల్వే కనెక్టివిటీ ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నం, కృష్ణపట్నం, గంగవరం, కాకినాడ వంటి ప్రధాన పోర్టులతో పాటు దీర్ఘమైన తీరరేఖ కలిగిన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో ప్రధాన లాజిస్టిక్స్, ఎగుమతుల కేంద్రంగా ఎదగడానికి గొప్ప అవకాశాలు ఉన్నాయన్నారు. పోర్టులు, పారిశ్రామిక ప్రాంతాలు మరియు అంతర్గత జిల్లాల మధ్య రైల్వే సరుకు రవాణా కనెక్టివిటీ బలోపేతం చేయడం వలన వాణిజ్యం, ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన అన్నారు. లాస్ట్ మైల్ రైల్వే కనెక్టివిటీ ప్రాధాన్యతను వివరించిన ఆయన, ఆంధ్రప్రదేశ్‌లో ఆమోదం పొందిన పలు రైల్వే ప్రాజెక్టులు విజయవాడగూడూరు, భద్రాచలంకొవ్వూరు, కర్నూలునంద్యాల, గుంతకల్ గుంటూరు వంటి మార్గాలు ఇప్పటికీ పూర్తి కాలేదని, ఇవి కనెక్టివిటీ లోటును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా కోటిపల్లినర్సాపురం రైల్వే లైన్ గురించి మాట్లాడుతూ, ఇది కొనసీమ ప్రాంత ప్రజల దీర్ఘకాల ఆకాంక్ష అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే వ్యవసాయ ఉత్పత్తులు, చేపల ఉత్పత్తులు, పర్యాటకం స్థానిక పరిశ్రమలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని, అలాగే కొనసీమ ప్రాంతం దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లతో మరింత సమర్థవంతంగా అనుసంధానమవుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడానికి కట్టుదిట్టమైన పర్యవేక్షణ వ్యవస్థలను అమలు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణను మరింత విస్తరించాలని సూచించారు. ఇటీవలి కాలంలో స్టేషన్ పునర్నిర్మాణ ప్రాజెక్టులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలను కూడా పెంచుతున్నాయని ఆయన చెప్పారు. భారతీయ రైల్వేలు దేశ సమగ్రత, ఆర్థికాభివృద్ధికి ఎప్పటినుంచో శక్తివంతమైన శక్తిగా నిలిచాయని ఆయన అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయడం ద్వారా రైల్వే అభివృద్ధి ఫలితాలు ఆంధ్రప్రదేశ్ వంటి తీరప్రాంతాలు మరియు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా పూర్తిగా అందుతాయని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# కర్రి దత్తుడు కుటుంబానికి తుమ్మలపల్లి రమేష్ పరామర్శ



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 16..** జగంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కిర్లంపూడి గ్రామంలో కర్రి సూర్యనారాయణమూర్తి (దత్తుడు )సతీమణి కిర్లంపూడి మాజీ సర్పంచ్ కర్రి సూర్యకుమార్ మాతృ మూర్తి ఇటీవలేస్వర్గస్తులయ్యారు. కిర్లంపూడిలో వారి స్వగృహంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాడి చిన్న బుజ్జి, బోండా నందిబాబు,నాని, కాయల మణికంత, గోకేడ పండు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దిష్ట కాలపరిమితిలో అర్జీలు పరిష్కరించాలి

**- సోమవారం పీజీఆర్ఎస్ లో 241 అర్జీలు స్వీకరణ - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయడానికి ఈ వేదిక ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ కావడమే లక్ష్యమని, అందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
అలాగే ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు కాల్ చేసి ఫిర్యాదులు నమోదు చేయవచ్చని, అలాగే 'మీ కోసం' వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అర్జీలకు కూడా వేగవంతమైన పరిష్కారం అందిస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం కీలకమని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ రెవెన్యూ క్లినిక్ ద్వారా ప్రజల నుండి అందిన అర్జీలను పారదర్శకంగా స్వీకరించి, అర్హత ఆధారంగా వేగవంతమైన పరిష్కారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా శాఖల మధ్య సమన్వయం పెంచుతూ సమస్యల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజల సమస్యలు పెండింగ్‌లో లేకుండా అధికార యంత్రాంగం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలు అందుబాటులో ఉన్న గ్రీవెన్స్ వ్యవస్థలను వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కారం చేసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 241 అర్జీలు స్వీకరించబడ్డాయి. అందులో శాఖల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా రెవెన్యూ శాఖలో 103 అర్జీలు, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో 59, హోం శాఖలో 11 అర్జీలు నమోదయ్యాయి. అదనంగా శక్తి శాఖలో 7, వ్యవసాయం మరియు సహకార శాఖలో 5, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖలో 5, పాఠశాల విద్యలో 5, పరిశ్రమలు, వాణిజ్యంలో 4, రవాణారోడ్లు భవనాల్లో 3, స్వర్ణ గ్రామంస్వర్ణ వార్డు పథకంలో 3, జలవనరుల్లో 3, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిలో 3, సామాజిక సంక్షేమంలో 3, ఉన్నత విద్యలో 2, హౌసింగ్‌లో 1, మహిళలు పిల్లలువికలాంగులువృద్ధుల సంక్షేమంలో 1, ఆరోగ్యంవైద్యం కుటుంబ సంక్షేమంలో 1 అర్జీలు అందాయి. స్వీకరించిన అన్ని అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు , ఇతర జిల్లా అధికారులు హజరయ్యారు.

# అటానమస్ ప్రతిష్ఠ పెంచేలా పనిచేశాం

**- పూర్వ విద్యార్థుల సహకారంతో అభివృద్ధి పనులు - నేక్‌గ్రేడ్, అటానమస్ స్టేటస్ నిలిచేలా కృషి**
**- అందరి సహకారంతో ప్రాంగణం పరిరక్షణ - పూర్వ విద్యార్థుల సంఘాలకు రోల్ మోడల్‌గా నిలిచాం**
**- వచ్చే నెలలో పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నికలు - ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) పూర్వ విద్యార్థుల సంఘం నేతలు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రతిష్ఠను మరింత పెంచే విధంగా తమ కార్యవర్గం ఈ ఐదేళ్ళు పనిచేశామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముళ్ళా మాధవ్ అన్నారు. స్థానిక కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, దూర విద్యా కేంద్రం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముళ్ళ మాధవ్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నికల్లో 2021లో తాము ఎన్నికయిన నాటి నుండి అందరి సహకారం తీసుకుంటూ కళాశాల ఉన్నతి కోసం అహర్నిశలు కృషి చేయటం జరిగిందన్నారు. యూజీసీ నిబంధనలు మేరకు కళాశాలకు నేషనల్ అస్సెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ నుండి ఉత్తమ ర్యాంకు సాధించడంతో పాటు, అటానమస్‌గా మరో అయిదేళ్ళు పొడిగించే విధంగా కళాశాలలో మౌళిక సదుపాయాల కల్పనకు ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థుల సహకారంతో కృషి చేయడం జరిగిందన్నారు. వివిధ సందర్భాలలో కళాశాలలో చదువుకుని ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులను ఆహ్వానించి కళాశాల అభివృద్ధికి వారి సహకారాన్ని కోరడం జరిగిందన్నారు. అందులో భాగంగా తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావు ద్వారా రూ. 42లక్షలతో తరగతి గదులు నిర్మించడం జరిగిందన్నారు. గౌతమి నేత్రాలయం అధినేత వీకే రాజు సహకారంతో రూ. 6 లక్షలతో ఇంటర్నేషల్ స్టేట్స్ స్టడీ సెంటర్ నిర్మాణం జరిపామన్నారు. ఇదే కళాశాలలో చదువుని, అధ్యాపకురాలిగా పనిచేసి పదవీ విరమణ చేసిన గంగా భవాని సహకారంతో 4 తరగతి గదులు నిర్మించామన్నారు. యూజీసీ నిబంధనలు ప్రకారం ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులను ఆహ్వానించి విద్యార్థులకు మోటివేషన్ కల్పించే దిశగా గెస్ట్ లెక్చర్‌లు ఇప్పించామన్నారు. ఇందులో భాగంగా టాటా ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ రామకోటి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్‌లతో మోటివేషన్ క్లాస్‌లు నిర్వహించామన్నారు. రామకోటి సిఫారస్సులతో కళాశాలలోని పలువురు విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించగలిగామన్నారు. కళాశాలకు అటానమస్ హోదా కొనసాగించాల్సిన అవసరం గురించి ఉన్నత స్థాయి వ్యక్తుల అభిప్రాయాలను యూజీసీ కమిటీ ముందు ఉంచడం ద్వారా మరో 5 ఏళ్ళ పాటు అటానమస్‌గా కొనసాగే విధంగా చేయగలిగామన్నారు. అలాగే నేక్ ర్యాంకింగ్‌ను నిలబెట్టేందుకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి అందరి సహకారాన్ని కోరామన్నారు. పూర్వ విద్యార్థి, గుడా ఛైర్మన్ హోదాలో ఉన్న గన్ని కృష్ణ సహకారంతో రూ. 23 లక్షలతో రోడ్లు వేయించామన్నారు. కళాశాల ప్రాంగణంలో స్టేడియం నిర్మించాలన్న నాటి ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచించే విధంగా నగరంలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రముఖులు, విద్యా సంఘాల సహకారంతో ఒత్తిడి తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవడం ద్వారా రూ. వెయ్యి కోట్ల ఆస్థిని కాపాడగలిగామన్నారు. టీచర్స్‌డే వేడుకల్లో అధ్యాపకులను సత్కరించడం, పీజీ సెట్‌లో 100 లోపు ర్యాంకులు సాధించిన వారికి అవార్డు ప్రదానం చేయడం, కళాశాల ఇంత సువిశాల ప్రాంగణంలో నిర్మాణం చేయడానికి కారకులైన మాజీ ముఖ్యమంత్రి దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు పేరిట పురస్కారాలు అందించడం, విద్యార్థులకు వ్యాసరచన పోటీలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహించే అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. గత ఏడాది పీజీలో సీట్లు మిగిలిపోవడంతో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ల సహకారంతో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళి పీజీ సెట్ వ్రాయని వారికి సీట్లు కేటాయించే విధంగా కృషి చేయగలిగామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అంటే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పనిచేసి ఒక రోల్ మోడల్‌గా నిలిచామన్నారు. వచ్చే నెలలో పూర్వ విద్యార్థుల సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యక్షులు వీఎస్ఆర్ భార్గవ్, శివలు మాట్లాడుతూ తాము కార్యవర్గంగా ఈ ఏడేళ్ళు బాధ్యతాయుతంగా పనిచేశామన్నారు. సంఘం నూతన కార్యవర్గం ఎన్నికకు ఈ నెల 31న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఓటరు లిస్టును విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 6న నామినేషన్‌ల దాఖలు, 7న పరిశీలన, 8న ఉపసంహరణ, 12న పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ దూర విద్యా కేంద్రం పై అంతస్థులో జరుగుతుందని తెలిపారు. డిగ్రీ పూర్తి అయ్యి 10ఏళ్ళు దాటి, ఉన్నత స్థానాల్లో, రాజకీయంగా పదవుల్లో, ఉన్నత వృత్తుల్లో ఉన్న వారికి సభ్యత్వాలు ఇవ్వడం జరుగుతుందని, 35 సంవత్సరాలు దాటిన వారు మాత్రమే పోటీకి అర్హులన్నారు. సభ్యత్వాల రూపేణా వసూలు చేసిన సొమ్ము రూ. 6,99,100లతో పాటు పూర్వ విద్యార్థి సుంకర స్వామినాయుడు రూ. లక్ష, ప్రొఫెసర్ రామకోటి రూ. 10వేలు అందించడం జరిగిందని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి గద్దే సుధాకర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘంలో ఎంత మంది ఎక్కువ సభ్యులు చేరితే యూజీసీ నిబంధనలు మేరకు కళాశాలకు అంత మేలు జరుగుతుందన్నారు. కళాశాలలో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా పూర్వ విద్యార్థుల సంఘంలో చేరాల్సిందిగా కోరారు. విలేకరుల సమావేశంలో కోశాధికారి సబ్బవరపు విజయలక్ష్మి, సభ్యులు రేవతి, ప్రసాద్ పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు





**కోటనందూరు (మనసులో మాట )మార్చి 16..** కోటనందూరులో జిల్లా ఆర్యవైశ్య సంఘం జాయింట్ కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ తుని నియోజకవర్గ జనరల్ సెక్రటరీ డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్యులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర సాధన కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారని, 1901 మార్చి 16న నెల్లూరు జిల్లాలో జన్మించారని, గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష చేసి తెలుగుజాతి కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప త్యాగశీలిగా ఆయన చిరస్మరణీయుడని, మన ఆర్యవైశ్య ముద్దుబిడ్డ కావడం చాలా గర్వంగా ఉందని తెలియజేశారు. 1952లో 58 రోజులు నిరాహార దీక్ష చేసి డిసెంబర్ 15 అమరజీవి అయినట్లు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 58 అడుగుల కాంశ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఈ రోజు ప్రతిష్టించడం చాలా ఆనందమని తెలియజేస్తూ, ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా వెంకట గంగాధర రంగనాయకులు, కె వీరబాబు, బత్తుల వెంకన్న బాబు, బొడ్డు కన్నయ్య శెట్టి, వెలగా కృష్ణారావు, వెలగా నాగేశ్వరరావు, తాటికొండ నానాజీ, కంకిపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

**తుని లో...**
తుని మున్సిపల్ చైర్పర్సన్ నార్ల భువన సుందరి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, తుని ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. గణపతి నగర్ పార్కులో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.



# కాకినాడ పీజీఆర్ఎస్ కు 498 అర్జీలు

**- అందిన ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో కూడిన పరిష్కారం అధికారులు చూపాలి...**
**- కాకినాడ జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి అధికారులకు ఆదేశం...**

**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలలో అందిన అర్జీలను ఎప్పటికప్పుడు, నాణ్యతతో పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో డా. టి. తిప్పే నాయక్, సీపీవో పీ. త్రినాథ్, డీఎంహెచ్ఓ డా. జె. నరసింహ నాయక్, డీఎల్పీవో పి. వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 498 అర్జీలు అందాయి.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందన్నారు
ప్రజా సమస్యలపై పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖలో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఆ సమస్య మరల పునరావృతం కాకుండా అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

# నన్నయలో నైపుణ్య శిక్షణను ప్రారంభించిన వీసీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థచే హార్డ్ వేర్, నెట్‌వర్కింగ్ కోర్స్ పై షార్ట్ టర్మ్ శిక్షణ 45 గంటల వ్యవధి గల కోర్సును వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ ప్రారంభించారు. సోమవారం యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వీసీ ప్రారంభించి వివరాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థచే ఈ కోర్సులు విద్యార్థులకు అందిస్తున్నామని విద్యార్థులందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని, నైపుణ్యాలను పెంచుకోవాలని తెలియజేశారు. సోమవారం (16నుండి) ఈ నెల 25వ తేదీ వరకు ఉదయం 9.30 నుండి సాయంత్రం 4.30 వరకూ 10 రోజుల పాటు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు చెందిన ఈసీఈ, ఈఐఈ విద్యార్థినీ విద్యార్థులకు ఈ శిక్షణ అందిస్తారని తెలిపారు. విద్యార్థులు నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని, ఉన్న స్థానాల నుండి ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి సాధన ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేసెమెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ బీ జగన్ మోహన్ రెడ్డి, ఏపీ ఎస్ఎస్ డీసీ అధికారి డాక్టర్ ఏ శ్రీరామచంద్రమూర్తి, హార్డ్ వేర్ అండ్ నెట్‌వర్కింగ్ ట్రైనింగ్ ఇన్ ఛార్జ్ పీ మహేష్ పాల్గొన్నారు.

# ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక శ్రీ పొట్టి శ్రీరాములు

**- ఘన నివాళులు అర్పించిన ఆర్యవైశ్యులు**



**కాజులూరు (మనసులో మాట) మార్చి 16..** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను సైతం అర్పించి అమరజీవిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన పొట్టి శ్రీరాములు దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు వరద శేషారావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కాజులూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని విగ్రహానికి మాజీ మండల ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి బలబద్రుని మల్లేశ్వరరావు గంగరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే మహోన్నత లక్ష్యంతో ఆయన నిరాహార దీక్ష చేసి చివరకు తన ప్రాణాలను అర్పించడం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఆయన త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని, తెలుగు ప్రజలు ఎప్పటికీ ఆయన ఋణం తీర్చలేరని అన్నారు. పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం దేశ చరిత్రలో అరుదైన ఘట్టమని, ఆయన ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజం కోసం, ప్రజల హక్కుల కోసం ఎలా పోరాడాలో ఆయన జీవితం గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం వల్లే తెలుగు ప్రజలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక



## ఉల్లాస్ ఫౌండేషనల్ లిటరేసి అండ్ న్యూమరసి అసెస్మెంట్ పరీక్షలకు మంచి స్పందన

- కాకినాడ జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి

**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** అక్షరాంధ్ర (ఉల్లాస్) ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ పరీక్షలకు మంచి స్పందన ఆంధ్రప్రదేశ్‌లో 15 మార్చి 2026న నిర్వహించిన అక్షరాంధ్ర (యు ఎల్ ఎల్ ఏ ఎస్ ) ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అభ్యాసకులు భారీగా హాజరయ్యారు. 1231 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు సుమారు 1,00,911 మంది (97.27 శాతం) వయోజనులు హాజరై, నిరక్షరాస్యత నిర్మూలనకు మద్దతు తెలిపారు.అలాగే కొన్ని మండలాల్లో 99-100 శాతం హాజరు నమోదైంది.కాకినాడ జిల్లాలో పరీక్షకు 1,03,758 మందికి గాను 1,00,911 మంది హాజరు కాగా వారిలో 97.05 శాతం మంది ఉత్తీర్ణులు అయ్యారు. కాకినాడ జిల్లాలో వయోజన అక్షరాస్యత సాధనలో భాగంగా నిర్వహించిన ఈ పరీక్ష విజయవంతం కావడం ఆనందదాయకమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు.పరీక్షకు హాజరైన వారిలో 97.05 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, 2,964 మంది మరింత మెరుగుదల అవసరంగా గుర్తించడం జరిగిందన్నారు.వారి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని క్షేత్రస్థాయిలో శిక్షకులకు సూచించడం జరిగిందన్నారు.

## ఘనంగా వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యాయనోత్సవాలు





**కొత్తపేట మనసులో మాట మార్చి 16..** కొనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి, అధ్యాయణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో తీర్థ బిందె నదీజలాల సేకరణ కార్యక్రమంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేంకటేశ్వర సహిత లక్ష్మీ హోమం నిర్వహించారు. నిత్య సేవాకాలంలో దివ్యప్రబంధ పారాయణం, సాయంత్రం గ్రామోత్సవం పల్లకీ సేవ, గరుడ వాహన సేవ, నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యం లో నిర్వహించారు. ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అన్నదాన పథకానికి రూ11వేలు విరాళం




**కొత్తపేట మనసులో మాట మార్చి 16..** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి హైదరాబాద్ కు చెందిన దేవరకొండ వినోద్ కార్తీక్, లక్ష్మి దంపతులు ఆలయ ఇఓ భాగవతుల వెంకట రమణమూర్తికి అందజేశారు. దాతలకు ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండిట్

# బుర్రిలంకలో వివాహిత హత్య కేసులో సంచలన తీర్పు

- ముద్దాయిలు నలుగురికీ జీవిత ఖైదు, జరిమానా - మీడియాకు వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** రాజమహేంద్రవరం రూరల్ కడియం మండలం బుర్రిలంక గ్రామంలో 2024 అక్టోబరులో తీవ్ర సంచలనం రేపిన వివాహిత గ్యాంగ్ రేప్, హత్య కేసులో నలుగురు ముద్దాయిలకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం..

కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన వివాహిత రౌతు కస్తూరి 2024 అక్టోబరు 15 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో నర్సరీ పని నిమిత్తం బుర్రిలంక వంతెన దగ్గరలో గల పాఠం శెట్టి రాముడు నర్సరీ లోకి పనికి వెళ్ళి సాయంత్రం 6 గంటలైనా ఇంటికి రాలేదు. ఆమె భర్త ఫోన్ చేసినా ఫోన్ స్విచ్ ఆఫ్ రావటంతో చుట్టు పక్కల ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. ఆ మర్నాడు అంటే అక్టోబరు 16న కడియం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును అనుసరించి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తులో ఉండగా 2024 అక్టోబరు 17న కస్తూరి మృతదేహం చొప్పెల్ల లాకులు వద్ద లభించింది. మృత దేహాన్ని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసును ఉమెన్ మిస్సింగ్ ఆల్టర్ టు 194 బీఎన్ఎస్ఎస్ గా కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం 2024 అక్టోబరు 30న ముద్దాయిలను గుర్తించారు. కేసును హత్య, గ్యాంగ్ రేప్ కేసుగా ఆల్టర్ చేసి కడియం మండలం బుర్రిలంకకు చెందిన ముద్దాయిలు దేవర యేసు, వెలుబండి ప్రవీణ్, లోకిన జయ ప్రసాద్, దాసరి సురేష్ లను అదే రోజు రిమాండ్ కు పంపించినట్టు ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు.

**అత్యాచారం చేసి, హత్య చేసి..**

అక్టోబరు 15న సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో నర్సరీ మొక్కల మధ్యలో మద్యం సేవిస్తూ.. నర్సరీ పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న రైతు కస్తూరి అనే వివాహితను చూశారు. ఆమె కాళ్లు, చేతులు పట్టుకుని నర్సరీ మొక్కల్లోకి తీసుకుని వెళ్లి ఆమెను నలుగురు కలిసి సామూహిక అత్యాచారం చేశారు. తరువాత ఆమెను హత్య చేసి ఆ పక్కనే గల కాలువలోకి విసిరేసినట్లు విచారణలో వెల్లడైంది. సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ 70(1), 103(1), 238 ఆర్/డబ్ల్యు 3(5) బీఎన్ఎస్ ప్రకారం నలుగురినీ అరెస్టు చేసి అక్టోబరు 30న ముద్దాయిలను జ్యుడీషియల్ రిమాండుకు పంపారు. దర్యాప్తు అనంతరం సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ నలుగురిపై ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. 8వ ఏడీజే కోర్టు జడ్జి ఈ కేసులో వాదోప వాదాల అనంతరం ముద్దాయిలు నలుగురికీ సోమవారం (ఈ నెల 16న) జీవిత ఖైదు, ఒక్కొక్క ముద్దాయికి రూ. 2000 లు చొప్పున జరిమానా, లేని యెడల ఆరు నెలల జైలు శిక్ష విధించారని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. ఈ కేసులో ముద్దాయిలకు జీవిత ఖైదు పడటంలో ముఖ్య పాత్ర వహించిన ఏపీపీ జే రాధాకృష్ణ రాజు, దర్యాప్తు అధికారి సౌత్ జోన్ డీఎస్పీ ఎస్ భవ్య కిషోర్, ఎఫ్ఐఆర్ నమోదు అధికారి కడియం ఎస్ఐ బీ నాగ దుర్గ ప్రసాద్, కోర్ట్ కానిస్టేబుల్ కే శ్రీనివాస్, (కడియం పీఎస్) దర్యాప్తునకు సహకరించి, సాక్ష్యులను కోర్టు కు హాజరు అయ్యేలా చూసిన కడియం సీఐ ఏ వెంకటేశ్వరరావు, దర్యాప్తునకు సహకరించిన హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్ వాసు, భీమారావులను జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు ప్రకటించారు.

# గొల్లలగుంటలోరైతన్నా మీకోసం వారోత్సవాలు

- ప్రారంభించిన జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 16..** వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ, ప్రతి రైతుకు ఆర్థిక అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, అందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన పంచ సూత్రాలను "రైతన్నా, మీకోసం" కార్యక్రమం ద్వారా రైతులకు చేరువ చేస్తున్నట్లు కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు , జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ తెలియజేశారు. జగ్గంపేట మండలం గొల్లలగుంట గ్రామంలో సోమవారం జరిగిన "రైతన్నా...మీకోసం" కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ఏడి గరిమెళ్ల శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఎస్ నరసింహం, ఉద్యాన అధికారిని శ్రీవల్లి తో కలిసి గ్రామంలోని పలువురు రైతుల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను, రైతన్న మీకోసం కార్యక్రమం విశిష్టతను, ఇప్పుడు పీఎం కిసాన్ 2000 రూపాయలు అన్నదాత సుఖీభవ 4000 రూపాయలు సొమ్మని అందజేయడం జరిగింది అని ప్రభుత్వం రూపొందించిన పంచ సూత్రాల ప్రాముఖ్యతను స్వయంగా వివరించారు..కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించడంతోపాటు స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల వారీగా రైతులకు డబ్బులు అందాయా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను కూడా తెలుసుకుంటూ, రైతు సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఆరువేల రూపాయల సహాయం వల్ల కోతల జరుగుతున్న ఈ సమయంలో పంట పనులకు ఈ సొమ్ము ఎంతోఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, రాయి సాయి, మండపాక అప్పన్న దొర, చింతాకులఈశ్వరరావు, రాయుడు గోవిందు, తిరుమల రాజు మురళి రాజు, దంగేటి జగన్నాథం, కులుకులూరి కృష్ణంరాజు, చిత్రపు బాబు, కలిదిండి శేఖర్ రాజు, వైభోగుల రామకృష్ణుడు, గొల్లవిల్లి రాంబాబు, రాయుడు రామకృష్ణ, రేగుళ్ల రమణ, గంజా శివన్నారాయణ అధిక సంఖ్యలో రైతులు మహిళలు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

- 138 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు
- 24,166 మంది విద్యార్థులు హాజరు - కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక హుకుంపేట జెడ్పీ హై స్కూల్ ను జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా నిర్వహణ తీరును పరిశీలిస్తూ తరగతి గదుల్లో మౌలిక సదుపాయాలు, పాఠశాల ఆవరణ పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఏర్పాట్ల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి తరగతి గదిలో సరైన వెలుతురు, గాలి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వేసవి దృష్ట్యా విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు, వైద్య శిబిరాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతున్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. జిల్లాలో సోమవారం నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు (తెలుగు పేపర్ జనరల్, కాంపోజిట్) సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 138 పరీక్షా కేంద్రాల్లో 24,424 మంది విద్యార్థులకు గాను 24,166 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదే విధంగా ఎస్ఎస్సీ ఏపీఓఎస్ఎస్ పరీక్షలు కూడా ప్రశాంతంగా, జిల్లాలోని 26 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించినట్లూ అధికారులు తెలిపారు. ఏపీఓఎస్ఎస్ పరీక్షల్లో తెలుగు సబ్జెక్టుకు 2,392 మందికి గాను 1,833 మంది, ఉర్దూకు 2 మందికి గాను 2 మంది హాజరయ్యారు. ఒరియా సబ్జెక్టుకు 1 అభ్యర్థి హాజరు కావలసి ఉండగా వారు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ హుకుంపేట జెడ్పీ హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేయగా, జిల్లా స్థాయి పరిశీలనాధి కారులు 7 కేంద్రాలు, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి 4 కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్లు సంయుక్తంగా 8 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు 69 కేంద్రాలను తనిఖీ చేశారు. తొలి రోజున మొత్తం 88 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. పదవ తరగతి రెగ్యులర్ పరీక్షలు 138 కేంద్రాల్లోను, ఎస్ఎస్సీ, ఏపీఓఎస్ఎస్ పరీక్షలు 26 కేంద్రాల్లోను ప్రశాంతంగా జరిగాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కే వాసుదేవరావు తెలిపారు.

# తాళ్లరేవులో ఘనంగా రైతన్నా మీ కోసం వారోత్సవాలు



**తాళ్ళరేవు, (మనసులో మాట) మార్చి 16:** ప్రతి రైతుకు ఆర్థిక అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, అందుకోసమే "రైతన్నా మీకోసం" వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. తాళ్ళరేవులో సోమవారం మండల వ్యవసాయాధికారిని ఎన్ ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన "రైతన్నా...మీకోసం" కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులతో కలిసి గ్రామంలోని పలువురు రైతుల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను, రైతన్న మీకోసం కార్యక్రమం విశిష్టతను వివరించారు. పీఎం కిసాన్ 2000 రూపాయలు అన్నదాత సుఖీభవ 4000 రూపాయలు సొమ్ముని అందజేయడం జరిగిందని ప్రభుత్వం రూపొందించిన పంచ సూత్రాల ప్రాముఖ్యతను తెలియజేశారు ల. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించడంతోపాటు స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల వారీగా రైతులకు డబ్బులు అందాయా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను కూడా తెలుసుకుంటూ, రైతు సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఆరువేల రూపాయల సహాయం వల్ల కోతల జరుగుతున్న ఈ సమయంలో పంట పనులకు ఈ సొమ్ము ఎంతో ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తశీ చేశారు. ఈ సందర్భంగా కొంతమంది కౌలు రైతులు తమకు నగదు జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు యాజమాన్యం నుండి కార్డులు ఇప్పించి కౌలు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళు లు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గౌతమి వి ఏ ఏ లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.




## ఎల్పిజీ గోదామును తనిఖీ చేసిన కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..




**కాకినాడ (మనసులో మాట) మార్చి 16..** కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి కాకినాడ పోర్టు పరిధిలో ఉన్న బీపీసీఎల్ బోటిలింగ్ ప్లాంట్, తిరుమల లాజిస్టిక్స్ సోమవారం తనిఖీ చేశారు. బులెట్ లోడ్స్ ను వెంటనే రీ ఫిల్లింగ్ చేసి త్వరిత గతిన గ్యాస్ ఏజన్సీ లకు సరఫరా చేయాలని ఈ సందర్భంగా జేసీ ఆదేసించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో బీపీసీఎల్ బాటిలింగ్ ప్లాంట్ మాత్రమే ఉన్నదన్నారు. మిగిలిన హెచ్పీసీఎల్, ఐవోసీఎల్ కంపనిలకు సంబంధించిన బాటిలింట్ ప్లాంట్లు విశాఖపట్నం, గుమ్మల్ల దొడ్డి లో కలవని, ఎప్పటికప్పుడు సంబంధిత ప్లాంట్ మేనేజర్లు మరియు సేల్స్ ఆఫీసర్లుతో సమన్వయము చేసుకుని, అవసరమైన మేరకు డొమెస్టిక్ సిలండర్ల ను ప్రతి గ్యాస్ ఏజన్సీకి అందుబాటులో ఉంచడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. అనంతరం ఆయన కాకినాడ పట్టణంలో గల శ్రీ ఎజన్సిస్ (హెచ్పీసీఎల్) గ్యాస్ కంపెని గోడౌన్ ను ఆకస్మికంగా తనిఖి చేసినారు. ఈ సందర్భంగా స్టాకు నిల్వల పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. సాధారణ బుకింగులు కంటే ఎక్కువ బుకింగులు వచ్చాయని అవసరం ఉన్న వారికి మాత్రమే గ్యాస్ వెంటనే సరఫరా చేయవలని జేసీ ఆదేశించారు. ప్రతి గ్యాస్ బాయ్ ను నిరంతరం పర్యవేక్షణ చేయవలెనని, బిల్లు కంటే ఎక్కువ ధర తీసుకున్నట్లయితే వెంటనే వారిపై చర్య తీసుకొనవలన్నారు. ఏటువంటి ఫిర్యాదులు అందిన గ్యాస్ బాయ్ పై క్రిమినల్ చర్య, డీలరు కు నోటీసు జారీ చేయడం జరుగుతుందని జేసీ హెచ్చరించినారు. కాకినాడ జిల్లాలో వినియోగదారులు వారికి ఎటువంటి ఇబ్బందికి గురికాకుండా నిరంతరం గ్యాసు నిమిత్తం తగు సమాచారం అందించుటకు కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో ఫోన్ నెం. 8886903611 తో కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందని జేసీ తెలిపారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, డీఎస్వో ఆర్ఎస్ఎస్.సత్యనారాయణ రాజు, కాకినాడ రూరల్ తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, ఏఎస్ఓ ప్రసన్న లక్ష్మి దేవి, సీఎస్డీటీ టి. శ్రీనివాసరావు, ఇతర రెవెన్యు అధికారులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి



**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 16:** వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు కోరారు. మండల కేంద్రమైన తాళ్ళరేవు ప్రధాన రహదారిలో చింతపల్లి శ్రీను ఏర్పాటుచేసిన వీర హనుమాన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను సుబ్బరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అత్తిలి బాబూరావు, కూటమి నాయకులు గుత్తుల సాయి, ఉంగరాల వెంకటేశ్వరరావు, కడలి ఈశ్వరి, హేమలత, చెల్లి అశోక్, కుడిపూడి శివన్నారాయణ, వాసంశెట్టి శ్రీను, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, కామాడి మాతరాజు, సిపిఎం మండల కార్యదర్శి టేకుముడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో పొట్టి శ్రీరాములు జయంతి..

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**పిఠాపురం, (మనసులో మాట)మార్చి 16:** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా శ్రీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో పిఠాపురం టిడిపి ఇన్చార్జి ఎస్ వి ఎస్ ఎన్ వర్మ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగువారి కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయమని వర్మ కొనియాడారు.

అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 16,776 రూ. 45,095 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే ప్రమాదానికి గురైన పార్టీ కార్యకర్త మహేష్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బొజ్జా సతీష్, పిల్లి చిన్న, సోము సత్యనారాయణ, అల్లవరపు నగేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
KANCHARLA



## జాతీయ రహదారిపై సమస్యాత్మక జంక్షన్లను గుర్తించిన పోలీస్ ఉన్నతాధికారులు

**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 16..** కాకినాడ జిల్లా ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎర్రవరం16 వ జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రదేశాలను ఎస్సై రామలింగేశ్వరరావు సమక్షంలో (ఏ ఆర్) కాకినాడ అడిషనల్ ఎస్పీ డి.ఎస్.పి లుసోమవారం పరిశీలించారు. అలాగే ఏలేశ్వరం మండలం పేరవరం జంక్షన్, చిన్నింపేట జంక్షన్ వద్ద జాతీయ రహదారిని పరిశీలించారు. ఈ రెండు రహదారి ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా పోలీసుల ఉన్నతాధికారులు గుర్తించారు.

## ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

### పగడ్బందీగా నిర్వహించిన అధికారులు



**అనపర్తి ( మనసులో మాట) మార్చి 16:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అనపర్తి మండలంలో 4 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 892 మందికి ముగ్గురు విద్యార్థులు ఆబ్సెంట్ కాగా 889 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి సత్తిరెడ్డి తెలిపారు. వీరిలో అనపర్తి బాయ్స్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 279 మంది, గర్ల్స్ హై స్కూల్ పరీక్ష కేంద్రంలో 219 మంది, ఓల్డ్ టౌన్ జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 155 మంది, కుతుకులూరు జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 71 మంది బిక్కవోలు మండలం, కాపవరం గ్రామంలోని పరీక్ష కేంద్రంలో పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 1 వరకు కొనసాగ నున్నాయి. మండల పరిధిలో ఏర్పాటు చేసిన 4 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తనిఖీలు నిర్వహించారు. అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ పరీక్ష నిర్వహించగా విద్యార్థులు సమయానికి హాజరై పరీక్ష రాశారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ తీసుకుని రావాలని అధికారులు తెలిపారు. పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

## మతసామరస్యం చాటిన హిందూ యువకుడు

### - ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు.



**రౌతులపూడి, ( మనసులో మాట) మార్చి 16:** హిందూ ముస్లిం భాయి భాయి అంటూ చాటి చెప్పిన సంఘటన కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం రౌతులపూడి గ్రామంలో పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటున్న ముస్లిం సోదరులకు ఉప్పంపాలెం గ్రామంలో నివాసముంటున్న కామిరెడ్డి సతీష్ అనే హిందూ యువకుడు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ముస్లింల జీవితంలో ఎంతో ప్రత్యేకమైన పవిత్రమైన మాసంగా కొలవబడే రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం నాకు చాలా ఆనందకరంగా ఉందని సతీష్ అన్నారు. రంజాన్ మాసంలో ఈరోజు వాళ్ళకి చాలా పవిత్ర రోజని ఈరోజు రాత్రంతా మేల్కొని నమాజులు ప్రత్యేక ప్రార్థనలు నివసిస్తారని హఫీజ్ సల్మాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, షేక్ మున్నా, షేక్ తానుషా వలి , హఫీజ్ నాసిర్, షేక్ వల్లి, షేక్ బషీర్ షేక్ సలీం పాల్గొన్నారు

## ఇ -ఆఫీస్ దస్త్రాల పరిష్కారంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జాయింట్ కలెక్టర్ టి. నిశాంతికి ఘన సత్కారం



**అమలాపురం( మనసులోమాట) మార్చి 16:** పరిపాలనలో వేగం, పారదర్శకత ఉన్నప్పుడే సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఫలాలు సకాలంలో అందుతాయని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు ఇ -ఆఫీస్ దస్త్రాల పరిష్కారంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి ని జిల్లా యంత్రాంగం ఘనం గా సత్కరించింది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి పరిపాలనలో తనదైన ముద్ర వేస్తూ, ఆఫీస్ దస్త్రాల పరిష్కారంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని డిఎస్ఓ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులు ఆమెను ఘనంగా సత్కరిం చారన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను సకాలంలో పరిష్కరించి, పారదర్శకమైన పాలన అందించడంలో ఆమె ప్రదర్శించిన చొరవకు కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందన్నారు. అధికారుల అభినందనలు తెలుపుతూ జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధి కారులు ఆమెను కలిసి పూలమాలలు, శాలువాల తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. జాయింట్ కలెక్టర్‌కు ఫైళ్ల పరిష్కారంలో రాష్ట్రంలో ప్రథమ స్థానం లభించడం గొప్ప విజయంగా అధికారులు అభివర్ణించారు. కోనసీమ జిల్లా లోఈ విజయం భవిష్యత్తులో అందరికీ ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నిశాంతి మాట్లా డుతూఈ విజయం కేవలం వ్యక్తిగతమైనది కాదని, జిల్లా యంత్రాంగం అంతా కలిసిక ట్టుగా సమిష్టిగా చేసిన కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ప్రజలకు సేవలను వేగంగా చేరవేయడమే తమ ప్రథమ ప్రాధాన్యతని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పి శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి దేవి శెట్టి శ్రీనివాసరావు జిల్లా ఉద్యాన అధికారి బివి రమణ వినియోగదారుల పోరం అధ్యక్షులు అరిగెల బలరామకృష్ణమూర్తి కోకోపేట్ సభ్యులు వివిధ శాఖల అధికారులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడ్కో ఇల్లు పరిశీలించిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి



**తణుకు మనసులో మాట మార్చి 16 ..** తణుకులో టిడ్కో ఇళ్ల పనులు మళ్లీ ప్రారంభం కానున్నాయని తణుకు శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తణుకు పట్టణంలో 201419లో ప్రారంభమైన 950కు పైగా టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు. తరువాత ప్రభుత్వంలో పనులు నిలిచిపోయి భవనాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నాయకత్వంలో పనులను మళ్లీ ప్రారంభించి త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామని చెప్పారు. తణుకులో సగం వరకు నిర్మాణం పూర్తైన టిడ్కో ఇళ్లు గత ప్రభుత్వంలో నిలిచిపోయి దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఇప్పుడు పనులను వేగవంతం చేసి త్వరలోనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు చెప్పారు. త్వరలో లబ్ధిదారులకు టిడ్కో ఇళు 201419లో ప్రారంభమైన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ప్రస్తుతం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనులు మళ్లీ ప్రారంభమై త్వరలోనే ఇళ్లు లబ్ధిదారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో అమరజీవికి ఘన నివాళి



**ఏలూరు, మార్చి , 16(మనసులో మాట)..** తెలుగు ప్రజల ఆత్మగౌరవం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ కొనియాడారు. అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), జేసీ అభిషేక్ గౌడ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగస్ఫూర్తి ప్రతి తరానికి ఆదర్శమని, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సేవా భావం, నిస్వార్థ త్యాగం వంటి విలువలను ఆయన చూపిన మార్గంలో కొనసాగించాలని అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఆంధ్రుల ఉనికిని జాతీయ స్థాయిలో చాటి చెప్పి, భాషా ప్రయోక్త రాష్ట్రంగా ఏర్పడడానికి తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. .1930 సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సత్య, అహింస, హరిజనోద్ధరణ ఆశయాలు కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయులన్నారు.

### ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో...

## పెద్దనాపల్లిలో రైతన్న మీకోసం...



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 16..** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో సోమవారం మండల పరిషద్ అధ్యక్షుల గొల్లపల్లి నరసింహమూర్తి( బుజ్జి) వారి ఆధ్వర్యంలో రైతన్న మీకోసం వారోత్సవాలు సోమవారం కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో భాగంగా పెద్దనాపల్లి గ్రామంలో ప్రతి రైతు ఇంటికి తిరుగుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్నటువంటి పథకాలు గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఏ.వి. రాజేష్ మాట్లాడుతూ రైతన్న మీకోసం వారోత్సవాలు యొక్క నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లాంటి ముఖ్యమైన అంశాలతో కూడినటువంటి కరపత్రాలను పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సుంకర సత్తిబాబు , ప్రత్తిపాడు ఏఎంసి డైరెక్టర్ శెట్టి చిన్నా , శెట్టి సూరిబాబు, పెద్దనాపల్లి అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.సాయి గణేష్, రైతు సోదరులు పాల్గొన్నారు.

## ఉండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులలో గందరగోళం




**ఉండి, (మనసులో మాట) మార్చ్ 16 :** పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఉండి స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులు కాస్త ఐ ఎఫ్ సి కోడ్ విషయంలో గందరగోళానికి గురవుతున్నారని చెప్పవచ్చు. ఇటీవల ఒక సీనియర్ సిటిజన్ తన కుమారుడు పనిచేసే కంపెనీ నుంచి తన తండ్రి సేవింగ్ ఖాతా కు ఉండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ కి డబ్బులు పంపించగా అవి రిజెక్ట్ అయ్యాయని కారణం తెలుసుకోగా, గూగుల్ లో ఉండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఐఎఫ్సి కోడ్ అని సెర్చ్ చేయగా ఎస్బిఐన్ 0014166 గా చూపించిందని తాను దానికే డబ్బులు పంపించాను అని చెప్పాడు. 67 సంవత్సరాలు వయసుగల ఆ పెద్దాయన బ్యాంకుకు వెళ్ళగా డబ్బులు పడలేదని బ్యాంక్ సిబ్బంది చెప్పారు. మరల బ్యాంకు చుట్టూ నాలుగు రోజులు తిరిగి తన అకౌంట్లో డబ్బులు పడలేదు నిర్ధారించుకొని తిరిగి విషయం తన కుమారునికి చెప్పగా తను పనిచేసే కంపెనీ యజమానికి విషయం చెప్పగా తను బ్యాంక్ సిబ్బందిని సంప్రదించగా ఐఎఫ్సి కోడ్ తప్పుగా చూపించిందని, దానివల్ల ట్రాన్సేషన్ క్యాన్సిల్ అయిందని మరలా కరెక్టైనా ఐఎఫ్సి కోడ్ చేయగా అమౌంట్ పడిందని ఊపిరి పీల్చుకున్నారు. వాస్తవానికి ఉండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఐఎఫ్ఎస్సి కోడ్ 0021289 గా ఉందని, ఆన్లైన్లో పాత ఐఎఫ్సి కోడ్ చూపించడంతో ప్రజలు కాస్త గందరగోళానికి అవుతున్నారని, ఈరోజుల్లో ప్రతిదీ కూడా ఏఐ వంటి ఆన్లైన్ గూగుల్ పై ఆధారపడి ఆన్లైన్ వంటి లావాదేయాలపై ప్రజలు ఎక్కువ శాతం ఆధారపడుతున్నారని, ఉండి స్టేట్ బ్యాంక్ ఐఎఫ్సి కోడ్ ఓల్డ్ చూపించడంతో సీనియర్ సిటిజన్స్ మరియు దూర ప్రాంతంలో నుంచి వృద్ధాప్యం తల్లిదండ్రులకు జీతాలు పంపించేవారు కాస్త ఇబ్బంది గురవుతున్నారని దానికి ప్రతినిమయ్య మార్గం చూపించాల్సిందిగా సామాన్య ప్రజలు సీనియర్ సిటిజన్ ఫారం సభ్యులు తదితరులు కోరుతున్నారు.



## శ్రీ దారాలమ్మ అమ్మవారి వార్షికోత్సవ జాతరకు ఏర్పాట్లు పూర్తి

**కోటనందూరు(మనసులో మాట) మార్చి 16..** తుని పట్టణ శివారులో వేంచేసియున్న శ్రీ దారాలమ్మ తల్లి అమ్మవారి ఆలయం వార్షికోత్సవ సందర్భంగా ఆలయ ధర్మకర్త రొంగల సత్తిబాబు రాజేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో ఈరోజు దారాలమ్మ తల్లి అమ్మవారి గరగలను ఒక రోజు ముందుగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి గరగలకు నివేదం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త రొంగల సత్తిబాబు మాట్లాడితూ అమ్మవారి వార్షికోత్సవ సందర్భంగా ముందుగా గరగలను తుని పట్టణం నందు ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. మరసటి రోజు భాజా భజంత్రీల నడుమ జల కళాశాలతో అమ్మవారిని ఘనంగా ఊరేగించి ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు నిర్వహించి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

## రైతన్న మీకోసం...



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 16..** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామంలో శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాలు మేరకు గ్రామం లో ఉన్నా టీ డి పి నాయకులు, కూటమి శ్రేణులు కలసి సోమవారం రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. దీని లో భాగంగా ప్రతి రైతు ఇంటికి వెళ్లి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు 5 సూత్రాలను, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ కల్పించడం,జల భద్రత,పంట ప్రణాళిక,ఆహార శుద్ధి, ప్రభుత్వ పథకాలపై వారు రైతులకు అవగాహన కల్పించారు. అలాగే మూడవ విడత అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు జమజేయడం కూడా జరిగింది. ఈ సందర్భంగా రైతులు అందరూ హర్షం వ్యక్తం చేసి ఈ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం మరల మరలా రావాలని రైతులు మాటల్లో తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బస్సా ప్రసాద్ మైరాల కనకారావు నీటి సంఘం వైస్ చైర్మన్ చిలకమర్తి మునియ్య గంగిరెడ్ల మణికంఠ , ఆకుల నాని రైతు సేవా కేంద్రం అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇరగవరం మండలం టిడిపి అధ్యక్షుడుగా బొంతు శ్రీనివాస్ బాధ్యతలు



**తణుకు మనసులో మాట మార్చి 16.** తణుకు నియోజకవర్గ పరిధిలోని ఇరగవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా బొంతు శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గం శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు .పార్టీ అభివృద్ధి కోసం, కార్యకర్తల సమన్వయంతో మరింత సమర్థవంతంగా పని చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలు ప్రారంభం

- మాల్ ప్రాక్టీస్ జరగకుండా సీసీ కెమెరాలు
- విద్యార్థులకు మంచినీటి, వైద్య సౌకర్యములు
- ఎంఈఓ ఏ. శ్రీనివాసరావు




**కోటనందూరు(మనసులో మాట) మార్చి 16..** రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనవి. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం లో కోటనందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మదర్ విద్యాసంస్థలు, పాత కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ఏ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మూడు కేంద్రాలలో 546 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయాల్సి ఉండగా ఒకరు గైర్హాజరు అయినట్లు తెలియజేశారు. పరీక్షా హాలులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు, విద్యార్థులకు మంచినీటి సౌకర్యము ఏర్పాటుచేసి, వేసవి దృష్ట్యా వైద్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. మండలంలో కోటనందూరు, బొద్దవరం, కేఇ చిన్నయ్యపాలెం, పి కొట్టాం, భీమవరపుకోట, అల్లిపూడి గ్రామాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, అల్లిపూడిలో కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం, కోటనందూరులో ప్రైవేటు విద్యాసంస్థలు మదర్ విద్యాసంస్థలు, శ్రీ చైతన్య విద్యాసంస్థలు,శ్రీ సాయి హై స్కూల్ ఉన్నాయని చిన్నయ్య పాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ములగపూడి సెంటర్ కి వెళ్లి పరీక్షలు రాస్తున్నారని, తుని మండలం పోలవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోటనందూరు సెంటర్ కి వచ్చి రాస్తున్నారని ఎంఈఓ శ్రీనివాస్ తెలియజేశారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక



## జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 96 కుటుంబాలకు

# రంజాన్ తోఫా

**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 16:** రంజాన్ మాసం పురస్కరించుకుని స్థానిక ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న మసీదులో జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. పట్టణంలోని వివిధ మసీదుల పెద్దల సహకారంతో అత్యంత నిరుపేదలైన 96 కుటుంబాలను గుర్తించి, వారికి బియ్యం, కిరాణా సామాగ్రి కూరగాయలను అందజేశారు. ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించిన సయ్యద్ కరీం, ఎండి గౌసియా, నవాబ్ కుటుంబాల సభ్యులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ జనతా ఫౌండేషన్ అధ్యక్షుడు జమ్ము కృతజ్ఞతలు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో నవాబ్, అహ్మద్, రిటైర్డ్ సీఐ వలి, శంషుద్దీన్ స్థానిక ముస్లిం యువకులు పాల్గొన్నారు. రంజాన్ వేళ పేదలకు అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు.

## గ్యాస్ కోసం తాసిల్దార్ ను ఆశ్రయించిన రెస్టారెంట్ యజమానులు



**గోకవరం (మనసులో మాట), మార్చి 16 :** గ్యాస్ కోసం తాసిల్దార్ ను రెస్టారెంట్ యజమానులు ఆశ్రయించారు. యుద్ధం కారణంగా మండల కేంద్రం గోకవరం రెస్టారెంట్ యజమానులకు కూడా కమర్షియల్ గ్యాస్ లేక ఇబ్బంది పడుతున్నామని తమకు కమర్షియల్ గ్యాస్ ఇప్పించాలని తాసిల్దార్ రామకృష్ణ ని హోటల్ యజమానులు కోరారు. లేకపోతే వ్యాపారాలు మూసుకోవాల్సిన పని ఏర్పడుతుందన్నారు. తమను నమ్ముకున్న కూలీలు రోడ్డున పడవలసి వస్తుందని వెంటనే సమస్యను పరిష్కరించాలని తాసిల్దార్ రామకృష్ణకు రెస్టారెంట్ యజమానులు మొరపెట్టుకున్నారు

## నకిలీ రిజిస్ట్రేషన్‌తో ప్రాక్టీస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన పిఠాపురం న్యాయవాదులు



**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 16 :** పిఠాపురంలో గత కొన్ని ఏళ్లుగా న్యాయవాదిగా చలామణి అవుతున్న కాళే విజయకుమార్ అనే వ్యక్తిపై పిఠాపురం బార్ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకపోయినా.. వేరొక వ్యక్తి రిజిస్ట్రేషన్ నంబర్‌ను వాడుకుంటూ కేసులు వాదిస్తున్నాడని న్యాయవాదులు ఆరోపించారు. సోమవారం మధ్యాహ్న పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ మణి కుమార్ లను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు. ఏళ్ల తరబడి నకిలీ గుర్తింపుతో ప్రాక్టీస్ చేస్తూ కోర్టును, ప్రజలను మోసం చేస్తున్న విజయ్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో పిఠాపురం బార్ అసోసియేషన్ సభ్యులు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# కిమ్స్ వైద్య కళాశాలలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలు




**అమలాపురం( మనసులోమాట) మార్చి16:** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయ స్వాతంత్ర్య సమర యోధులు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ వైద్య కళాశాలలో కిమ్స్, చైతన్య విద్యా సంస్థల స్థాపకులు, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర చైతన్య సారస్వత పరిషత్" స్థాపకులు కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) కిమ్స్ ఎం.డి రవి కిరణ్ వర్మ ఆధ్వర్యంలో కిమ్స్ వైస్ ప్రెసిడెంట్ మోహన రాజు అధ్యక్షతన జరిగిన సభలో పొట్టి శ్రీరాములు కు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు సమాజానికి, సామాన్య ప్రజానీకానికి ముఖ్యంగా తెలుగు భాషా పరిరక్షణకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు చేసిన సేవలను, కృషిని గుర్తు చేసుకున్నారు. అనంతరం మోహన రాజు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాదు. ఆయన ఒక గొప్ప సామాజిక సంస్కర్త కూడా అని ముఖ్యంగా దళితుల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించాలని ఆయన కోరుకున్నారన్నారు.

కిమ్స్ మానవ వనరుల విభాగ జనరల్ మేనేజర్ రాధా మనోహర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆహారం తీసుకోకుండా దీక్ష కొనసాగించారని చివరకు 1952 డిసెంబర్ 15న ఆయన అమరుడయ్యారన్నారు. ఆయన మరణం తరువాత ఆంధ్ర ప్రాంతంలో భారీ నిరసనలు, ఆందోళనలు జరిగాయని. ఆ పరిస్థితిని చూసి భారత ప్రభుత్వం చివరకు ఆంధ్ర రాష్ట్రం కోసం నిర్ణయం తీసుకుందని ఫలితంగా 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఇది భాష ఆధారంగా ఏర్పడిన మొదటి రాష్ట్రం అని ఆయన తెలిపారు. ఇది పూర్తిగా పొట్టి శ్రీరాములు త్యాగం వల్ల సాధ్యమైందని. అందుకే ఆయనను "అమరజీవి" అని పిలుస్తారు అని అయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య వైద్య ఉపాధ్యాయులు, కిమ్స్ సిబ్బంది, స్థానిక తెలుగు భాషా ఉపాధ్యాయులు, కవులు, పుర ప్రముఖులు, విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**కొత్తపేట మనసులో మాట మార్చి 16..** ఆత్రేయపురం ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఘణంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆత్రేయపురం వల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాసవి క్లబ్ నాయకులు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచినారు ఈకార్యక్రమంలో ఆత్రేయపురం ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు యలమర్తి వెంకటేశ్వర రావు (బాబ్జి) వాసవి క్లబ్ ఎస్ ఎస్ ఎస్ విజయం అధ్యక్షులు వెచ్చా నాగ వెంకట సుబ్రహ్మణ్యం, చార్టర్ ప్రెసిడెంట్ పేరూరి నాగేశ్వరరావు మండల అధ్యక్షులు పులవర్తి నాగేశ్వరరావు సభ్యులు వెచ్చా గోపాల కృష్ణ మూర్తి, పేరూరి శ్రీనివాస్,పులవర్తి కాశీ విశ్వనాథం, పులవర్తి బంగారయ్య, తాడేపల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన మహావీరుడు అమరజీవి పొట్టి శ్రీరాములు.

1901 మార్చి 16 న మద్రాసులో జన్మించిన శ్రీరాములు సత్యం, అహింస మార్గంలో నడిచిన మహాత్మాగాంధీ అనుయాయుడు. ఉద్యోగ విరమణ తర్వాత గాంధీజీ ఆశయాలను అనుసరిస్తూ హరిజనోద్ధరణకు, గ్రామ స్వరాజ్యానికి తన జీవితం అంకితం చేసారు ఆయన అంకితభావం అద్భుతమైనది.

భాషా ప్రాతిపదికన తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే బలమైన కోరికతో 1952లో ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నారు 58 రోజులపాటు నిరాహారదీక్ష చేసి 1952 డిసెంబర్ 15 నా తన ప్రాణాలను త్యాగం చేసి అమరజీవిగా తెలుగు ప్రజలు హృదాయాల్లో నిలిచి పోయారు ఆయన త్యాగం వృధా పోలేదు ఆయన మరణం తర్వాత వచ్చిన ఉద్యమం అక్టోబరు 1, 1953 మొదటి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు దారితీసింది. భాష కోసం, భవిష్యత్తు కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను గుర్తు చేసుకుంటూ తెలుగుభాషను, సంస్కృతిని కాపాడుకోవడమే మనం వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు.

# తాటిపర్తిలో మహిళ అనుమానాస్పద మృతి





**పిఠాపురం (మనసులో మాట) మార్చి 16:** గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని దళిత వాడ కి చెందిన గుడాల సింహాచలం (58) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు.

స్థానికుల కథనం ప్రకారం.. మృతురాలు సింహాచలం ఇంటి నుండి కేకలు వినిపించడంతో చుట్టుపక్కల వారు బయటకు వచ్చి చూశారు. ఆ సమయంలో ఆమె ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా ఒక వ్యక్తి తిరగడం గమనించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కొద్దిసేపటికే సింహాచలం మృతి చెంది ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు.

**మద్యం విక్రయాలే కారణమా?**

గ్రామంలో మద్యం ఏరులై పారుతోందని, అనేకచోట్ల బెల్ట్ షాపులు ద్వారా మద్యం విక్రయించడం వలన వేరే ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వచ్చి కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. సింహాచలం మృతిపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఇలాంటి ఘటనలు మరే మహిళకు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సమాచారం అందుకున్న గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్ వెల్లడించారు.

# ఏలేశ్వరంలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 16..** ఏలేశ్వరం పట్టణంలో నగర పంచాయతీ కార్యాలయం దగ్గర ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సోమవారం ఉభయ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ గొల్లపూడి త్రిమూర్తులు,ఏలేశ్వరం మండలం ఆర్యవైశ్య అధ్యక్షుడు,సిహెచ్చి చైర్మన్ వాగు రాజేష్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి సీనియర్ నాయకులు కౌన్సిలర్ అలమండ చలమయ్య, యువ నాయకులు బోదిరెడ్డి గోపి,మూది నారాయణస్వామి హాజరయ్యారు. ముందుగా విగ్రహానికి పాలాభిషేకం చేసి,పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రానికి చేసిన సేవలు మరుగులేనివని,58 రోజుల అమర నిరాహార దీక్ష చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి అని,తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి అని కొనియాడారు. అలాగే కూటమి ప్రభుత్వం అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెనుగొండ ఊరు పేరును వాసవి పెనుగొండ గా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది అన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు ఎండగుండి నాగబాబు,మామిడి లలిత, రుచి రమేష్,కోణాల వెంకటరమణ,రాయుడు చిన్న,ఆర్యవైశ్యలు వాగు గున్నంరాజు,మట్టే సుబ్బారావు,శరణ్య శ్రీను, ప్రగళ్లపాటి పెదబాబు,ఎల్లంపల్లి దత్తుడు,రాతికింద సతీష్,వి. కామేష్,ఏ శ్రీను,ఊర నానాజీ,వాగు బద్రిష్,పి.కామేష్,మణికంఠ,పి. సురేష్,వాగు రమేష్, నరసింహ, బలరాం, వినోద్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై రాష్ట్రస్థాయి కార్యక్రమం




**అనపర్తి, (మనసులో మాట) మార్చి 16:** విజయవాడలో నిర్వహించిన స్పెషల్ ఎంటెన్సివ్ డివిజన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ బిజెపి ఇంచార్జ్,ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే శ్రీకాంత్ శర్మ , పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి నిర్మాణం, కార్యకర్తల పాత్రపై ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యత, బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, ఎస్ ఐ ఆర్ రాష్ట్ర కన్వీనర్ , అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి వివరించారు. ఈ రాష్ట్ర కార్యశాలలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ , ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, శాసనమండలి బిజెపి పక్ష నేత సోము వీర్రాజు , శాసనసభ బిజెపి పక్ష నేత పెన్మత్స విష్ణు కుమార్ రాజు, ఎమ్మెల్సీలు ,ఎమ్మెల్యేలు , రాష్ట్ర పదాధికారులు , జిల్లా అధ్యక్షులు, బి ఎల్ ఎ 1 లు పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి, బూత్ స్థాయి వరకు కార్యకర్తలను మరింత చైతన్యవంతం చేసే దిశగా ఈ కార్యక్రమం కీలకంగా నిలిచింది.



# ముమ్మరంగా 'గాలికుంటు' నివారణ టీకాలు

**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 16:** పిఠాపురం నియోజకవర్గంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. సోమవారం పిఠాపురం మండలంలోని కుమారపురం, జములపల్లి గ్రామాలలో నిర్వహించిన టీకా పంపిణీ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయక సంచాలకులు రమేష్ చంద్ర, పిఠాపురం పశువైద్యాధికారి రంజిత్ సింగ్‌లు పాల్గొని పశువులకు టీకాలు వేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించి, వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి పశువునూ నమోదు చేసి టీకాలు వేస్తున్నారని, నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని వారు పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయ కార్యదర్శులు , రైతులు పాల్గొన్నారు

# కామవరపుకోటలోని 7 సబ్సిడీ సిలిండర్లు సీజ్ 2 హోటల్స్ పై కేసు నమోదు




**ఏలూరు, కామవరపుకోట మార్చి 16 (మనసులో మాట)..** ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలంలో పలు ప్రాంతాలలో హోటల్స్ లో వాణిజ్య అవసరాలకు గృహ అవసరాల గ్యాస్ (సబ్సిడి గ్యాస్) సిలిండర్లు వాడుచున్నట్లుగా వచ్చిన విశ్వసనీయ సమాచారశీ ప్రకారం 1) శివ గాయత్రీ హోటల్, తడికలపూడి, 2) మణికంట భోజన హోటల్, కామవరపుకోట నందు తనిఖీ చేయగా మొత్తం 7 గృహ అవసరాల గ్యాస్ (సబ్సిడి గ్యాస్) సిలిండర్లు గుర్తించి, యజమానులను ప్రశ్నించగా, వారు వ్యాపార నిమిత్తం వాణిజ్య గ్యాస్ సిలిండర్లు బదులుగా గృహ అవసరాల గ్యాస్ (సబ్సిడి గ్యాస్) సిలిండర్లు వాడుచున్నట్లు తెలియచేసారు. ఈ తనికఖీలో రు.19,806/-లు విలువ కలిగిన 7 గృహ అవసరాల గ్యాస్ (సబ్సిడి గ్యాస్) సిలిండర్లు సీజ్ చేసి యజమానుల పై నిత్యవసరవస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేయడమైనది. ఈ తనిఖీ నందు విజిలెన్సు ఇన్స్పెక్టర్ శ్రీ ఐ. ప్రసాద్ కుమార్, విజిలెన్సు తహసిల్దార్ శ్రీమతి దీ. కన్యాకుమారి మరియు రెవిన్యూ, పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**అయినవిల్లి (మనసులో మాట) మార్చి 16:** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తమ ప్రాణాలు అర్పించిన మహనీయుడు స్వాతంత్ర సమరయోధుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని అయినవిల్లి తహసీల్దార్ విద్యాపతి అన్నారు. సోమవారం అయినవిల్లి మండల తాహసిల్దార్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ డి శ్రీనివాస్ ఆర్ ఎస్ డిటి జి సుబ్రమణ్యం ఆర్ఐ ఎం ఎస్ రాయుడు, విఆర్వోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాడా'లో ప్రజా సమస్యల వెల్లువ

## - 35 అర్జీల స్వీకరణ




**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 16:** పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వినతుల వెల్లువ కొనసాగింది. పాడా పీడీ శ్రీనివాసరావు ప్రజల నుండి నేరుగా 35 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అర్జీదారులు తమ ఫిర్యాదుల స్థితిగతులను తెలుసుకోవడానికి ప్రభుత్వ హెల్ప్‌లైన్ నంబర్ 1100కు నేరుగా కాల్ చేయవచ్చని పీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో పాడా ఏపీడీ వసంత మాధవి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు సహా అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# కార్మికుల చెమట చుక్కలను తుడిచేది ఎర్ర జెండాయే..

- కష్టజీవుల కోసం నిరంతరం పోరాడేదీ ఆ జెండానే..
- కార్మికుల శ్రమను దోచుకోవడానికే 10 గంటలు పని దినాలు పెంపు
- మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేసే వరకు పోరాటం ఆగదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య పిలుపు
- మోదీ కార్మిక ద్రోహి
- మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి రాధాకృష్ణన్







**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** "ఇది ఎర్ర జెండా..కార్మికుల జెండా, కష్ట జీవుల చెమట చుక్కలను తుడిచి ఆత్మీయంగా అక్కున జేర్చుకునే జెండా..ఆపదలో వెన్నంటి ఉంటూ కొండంత ధైర్యాన్ని ఇచ్చేది ఈ ఎర్ర జెండాయే" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య అన్నారు. పాలకులు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కష్టజీవులు కు అండగా ఎర్రజెండా ఎప్పుడూ తోడూ నీడగా ఉంటుందన్నారు. సోమవారం సాయంత్రం 4 .30 గంటలకు స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 6 వ మహా సభల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు స్థానిక మున్సిపల్ స్టేడియం నుండి మున్సిపల్ కార్మిక మహా ప్రదర్శన వేలాదిగా ప్రారంభమై తాడితోట సెంటర్, బైపాస్ రోడ్డు, దేవీచౌక్, గోకవరం బస్ స్టాండు మీదుగా సుబ్రమణ్య మైదానానికి చేరుకుంది. దారి పొడవునా దిక్కులు పిక్కటిల్లేలా కార్మికులు నినాదాలు ఇచ్చారు. ఈ బహిరంగ సభకు యూనియన్ అధ్యక్షుడు అసుల రంగనాయకులు అధ్యక్షత వహించారు.

ముందుగా మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఎం రాదాకృష్ణన్ మాట్లాడుతూ.. బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ వ్యక్తులకు కార్మికుల శ్రమను దోచి పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని, దీని వల్ల యావత్ కార్మిక రంగానికి తీవ్రం నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని అన్నారు. నేటి మున్సిపల్ కార్మికులు ఆత్మ గౌరవంతో బతుకుతున్నారంటే అది ఒక్క ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే అని అన్నారు. సమ్మెలు చేయటం ద్వారానే మున్సిపల్ కార్మికులకు జీతాలు పెరిగాయని, కొన్ని హక్కులు సాధించుకున్నామని ఆయన గుర్తు చేశారు. ఈ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల హక్కులను కాల రాస్తే సహించేదే లేదని ఆయన హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య మాట్లాడుతూ..

24 గంటల్లో 8 గంటలు పని చేయడానికి, 8 గంటలకు ఆడుకోవడానికి, మనిషి అవసరాలు తీర్చుకోడానికి ఉంటే.. కానీ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆ సమయాన్ని ఎనిమిది గంటలు పని చేయించుకోండి, కార్మికుల సేవలు దోచుకోవడానికి కొన్ని గంటలు పెంచుతున్నారని చెప్పడం దారుణం అన్నారు.

మోదీ, చంద్రబాబు కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడుతూ నరేంద్ర మోడీ ఎవరి కోసం పని చేస్తున్నరో అర్థం అవుతుందని అన్నారు. ఏ కార్పొరేటర్ కోసం పని చేస్తున్నావ్.. కార్మిక వర్గంగా ఉన్నవారిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఈ దేశంలో ఉన్నటువంటి పెద్ద పెద్ద కార్పొరేట్ వారి ప్రయోజనాలు కోసం ఈ రోజు దేశంలో మోడీ పనిచేస్తున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకి గిఫ్ట్ గా మహిళపై భారం మోపేందుకే గ్యాస్ ధరలను అమాంతంగా పెంచారని, వంట గ్యాసు పై 60 రూపాయలు, కమర్షియల్ గ్యాస్ బండపై 115 రూపాయలు పెంచటం చాలా దుర్మార్గమన్నారు. ఉగాది, రంజాన్, శ్రీరామ నవమి పండగల్లో గ్యాస్ ధర పెంచి గిఫ్ట్ ఇచ్చిన మోదీకి 2029 ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎన్నికల ముందు ప్రజలకి ఇచ్చిన హామీలు మోదీ మరిచిపోయినా.. వచ్చే ఎన్నికల్లో మాత్రం మోదీకి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి కూడా రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం మాత్రం ప్రజలు మరచిపోరన్నారు. ఆంధ్రాలో గ్యాస్ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నా కూడా ధరలు పెంచి ఆదానీ అంబానీలకు, కార్పొరేట్ వ్యక్తులకు లాభం చేకూర్చే విధంగా మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గ్యాస్ ధరలు పెంచడం అంటే సామాన్య ప్రజలపై భారం మోపడమేనని, పెంచిన గ్యాస్ ధర తక్షణమే తగ్గించాలని సీపీఐ ప్రజల పక్షాన డిమాండు చేస్తోందన్నారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడి రష్యా నుండి ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు నేపథ్యంలో ఈ ధరల పెంపుదల ప్రజలపై శరాఘాతంగా మారిందని విమర్శించారు. ఈ యుద్ధాన్ని ఖండించి నిలుపుదల చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. అదాని ఫైల్స్ ఎక్కడ బయట పడతాయో అని భయపడి మోదీ దేశ భవిష్యత్తుని ట్రంప్ కాళ్ళ దగ్గర పెట్టేశారని ఏద్దేవా చేశారు. నేడు ఆ భారాన్ని ప్రజలపై నెట్టడం ఘోరమని ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సతమతమవుతున్న సామాన్యులపై వంట గ్యాస్ ధర పెంపు ములిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉందన్నారు. అలాగే ఉపాధి కోసం తోపుడు బళ్ళు ఇతర చిన్న చిన్న వ్యాపారాలతో జీవనం గడుపుకుంటున్న చిరు వ్యాపారులను వాణిజ్య సిలిండర్ ధర పెంపు తీవ్ర భారం, నష్టం కలిగిస్తుందన్నారు. అంతే కాకుండా అసంఘటిత రంగ కార్మికులు స్వల్ప ఆదాయాలు కలిగిన వారు కొనుక్కునే టిఫిన్, కర్రీ తదితర ఆహార ధరలు కూడా పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విధాలుగా ప్రజా జీవితాన్ని ఘోరంగా నష్ట పరిచే గ్యాస్ ధర పెంపును తక్షణమే ఉపసంహరించుకోపోతే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని గద్దెనెక్కిన లోకేష్ బాబు మాట మార్చి ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులను ఇప్పటికీ శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని, ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఉద్యోగ భద్రత కరువు అవుతుందని, సక్రమంగా జీతాలు మంజూరు చేయకుండా అరకొర జీతాలు మంజూరు చేస్తూ పని భారం పెంచుతూ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగ సభలో ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, ఏఐటీయూసీ నాయకులు ఏసు రత్నం పోరుమామిళ్ల సుబ్బారాయుడు, తులసేంద్ర, నెక్కంటి సుబ్బారావు కిర్ల కృష్ణారావు, తాటిపాక మధు, రేఖ భాస్కరావు, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, ఏఐటీయూసీ తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ కే రాంబాబు, యూనియన్ రాష్ట్ర నేతలు కోటి దాస్ , రాజేష్ గౌడ్, కే మల్లేశ్వరరావు సత్యనారాయణ, దొరస్వామి, భజంత్రీ శ్రీనువాస్, కామేష్, జిల్లా నాయకులు రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరావు, డీ దుర్గమ్మ, కాకి శారద తదితరులు పాల్గొన్నారు.



## 'తూర్పు'లో వయోజన అక్షరాస్యత పరీక్ష ఘన విజయం

### - 99 శాతానికి పైగా ఉత్తీర్ణత - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** అక్షరాంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న (ఆదివారం) నిరక్షరాస్య వయోజనుల కోసం ప్రాథమిక స్థాయి భాష, గణిత నైపుణ్యాల అంచనా పరీక్షను తూర్పు గోదావరి జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పరీక్షకు మొత్తం 88,647 మంది నమోదు చేసుకోగా, వారిలో 88,114 మంది ఆదివారం పరీక్షకు హాజరవ్వగా 533 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షకు హాజరైన వారిలో 87,581 మంది 99 శాతం ఉత్తీర్ణులు కాగా, 47 మందికి మరింత మెరుగుదల అవసరంగా గుర్తించడం జరిగిందని, వారి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని క్షేత్ర స్థాయిలో శిక్షకులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.హాజరు శాతం 99.40 శాతం కాగా ఉత్తీర్ణత శాతం 99.33 శాతం. గత సంవత్సరం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన "అక్షరాంధ్ర" కార్యక్రమంలో భాగంగానే ఈ ఏడాది మరో సారి అక్షరాంధ్ర పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర అక్షరాస్యత శాతాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు.

జిల్లాలో వయోజన అక్షరాస్యత సాధనలో భాగంగా నిర్వహించిన ఈ పరీక్ష విజయవంతం కావడం సంతోషకరం అన్నారు. హాజరు శాతం, ఉత్తీర్ణత శాతం రాష్ట్రంలోనే అత్యుత్తమంగా ఉండటం జిల్లా యంత్రాంగం కృషికి నిదర్శనమన్నారు. జిల్లాలో నూరు శాతం అక్షరాస్యత సాధించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. జిల్లా నోడల్ అధికారి వెంకట రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి అర్హుడికి అక్షరాస్యత కల్పించే దిశగా ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత దేశంలో అక్షరాస్యతలో అధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానం మెరుగుపర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి "అక్షరాంధ్ర" కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందనీ అక్షరాంధ్ర నోడల్ అధికారి ఏ వెంకట్రావు రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మందిని, జిల్లాలో 88,648 మందిని అక్షరాసులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

జిల్లాలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో మెప్మా, డ్వామా పీడీ డీఆర్డీఏ, పంచాయతీ రాజ్, విద్య శాఖ తదితర జిల్లా, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామన్నారు.

అక్షరాంధ్ర కార్యక్రమం విజయ విజయవంతంగా నిర్వహించడంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బంది వారి సేవలకు వివిధ స్థాయిల్లో ప్రశంసా పత్రాలు అందజేయబడతాయని వయోజన విద్యాశాఖ డైరెక్టర్ రంజిత్ బాషా , పాఠశాల విద్యా ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ తెలియజేయడం జరిగిందని తెలిపారు.

## జిల్లా కలెక్టర్ అధ్యక్షతన..

## రెండవ మీడియా అక్రెడిటేషన్ కమిటీ సమావేశం

### -121 మందికి మంజూరు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 16:** జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన తూర్పు గోదావరి జిల్లాలో రెండవ మీడియా అక్రెడిటేషన్ కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడతలో 121 మంది జర్నలిస్టులకు సంబంధించిన అక్రెడిటేషన్ దరఖాస్తులను పరిశీలించి ఆమోదించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి హేతుబద్ధత కలిగి అక్రెడిటేషన్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా ప్రతినిధులు వ్యవహరిస్తూ జిల్లా అభివృద్ధికి తమ విలువైన సూచనలు, సలహాలు అందిస్తూ స్వచ్ఛంద భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రానున్న




ఏడాది జరిగే గోదావరి పుష్కరాలు నేపథ్యంలో ప్రధాన సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, అదనపు ఎస్పీ ఎల్ చెంచు రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కే లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, ఆర్టీసీ అధికారి కుమార్, వైద్య ఆరోగ్య శాఖ, కార్మిక శాఖ అధికారులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప



## ధర్మవరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో

# అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి వివరణ

**ధర్మవరం మార్చి 16 (మనసులో మాట)..** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం సజావుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు చివరి సమావేశం అయినందున కమిషనర్ వెంకట రమణయ్య తో పాటు ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కాచెర్ల లక్ష్మి మంత్రి కు స్వాగతం పలికారు. అనంతరం వారు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ధర్మవరానికి చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ, అవకాశం ఇచ్చిన మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. తదుపరి మంత్రి సత్య కుమార్ యాదవ్




పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, భవిష్యత్ ప్రణాళికలపై కౌన్సిల్ సభ్యులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... రాయలసీమ ప్రాంతంలో, ముఖ్యంగా ధర్మవరం ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సాగు మరియు తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రజలకు అనునిత్యం నీటి సరఫరా చేస్తామని వారు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ సిటీస్ మిషన్ మరియు అమృత్ మిషన్ పథకాల ద్వారా మున్సిపాలిటీల అభివృద్ధికి సుమారు 4,000 కోట్ల నిధులు కేటాయించబడినట్లు తెలిపారు. ఈ నిధులతో పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో గతంలో సరైన రహదారులు లేకపోవడం, విద్యుత్ స్తంభాల కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉండేవని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కొత్త రహదారులు నిర్మించడం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి పనులను మున్సిపల్ కౌన్సిల్ ద్వారా విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. పట్టణంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడానికి సుమారు 110 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేతు బంధన్ స్కీమ్ పథకం కింద మంజూరు చేసిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరిహారాన్ని దశలవారీగా పంపిణీ చేయడం ద్వారా కోర్టు వివాదాలను పరిష్కరించామని చెప్పారు. ధర్మవరం పట్టణానికి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను తీసుకువచ్చామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు శంషాద్ బేగం, జయరాం రెడ్డి, కౌన్సిలర్లు, పురపాలక సంఘం అధికారులు పాల్గొన్నారు.



## ముగిసిన రిలే నిరాహార దీక్షలు

### ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హామీతో దీక్షలు విరమణ - డాక్టర్ వివేక్

**ధర్మవరం మార్చి 16 (మనసులో మాట)..** పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయ ముందు భాగాన గత 17 రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హామీతో దీక్ష విరమణ చేశామని డాక్టర్ వివేక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల కు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ పది డిమాండ్లను మంత్రికి వినతి పత్రం ద్వారా అందజేయడం జరిగిందని తెలిపారు. మా డిమాండ్లను సత్య కుమార్ యాదవ్ పరిశీలించి మొదటి 8 డిమాండ్లను తప్పనిసరిగా పరిష్కరిస్తానని తొందరలో వాటిని అమలుపరుస్తానన్న హామీలు ఇవ్వడం వల్ల దీక్షను విరమించడం జరిగిందని తెలిపారు. తదుపరి డాక్టర్ వివేక్ కు నిమ్మరసం ఇచ్చి దీక్షను మంత్రి విరమింప చేశారు. మంత్రి మాట్లాడుతూ మీ డిమాండ్లపై కూలకశంగా చర్చించి తగు చర్యలు చేపట్టడానికి మీ ద్వారా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని యావన్మంది హిందువు బంధువులను కలిసి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని వారు మరోసారి భరోసా ఇస్తూ హామీ ఇచ్చారు. తదుపరి డాక్టర్ వివేక్ తో పాటు దీక్షలో కూర్చున్న వారందరూ కూడా మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### శ్రీవారి అన్నదానానికి పలమనేరు నుండి

## 12 టన్నుల కూరగాయలు విరాళం

**పలమనేరు మార్చి 16( మనసులో మాట):** పలమనేరు నియోజకవర్గం కలియుగ దైవమైన తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామివారి నిత్య అన్నదాన ప్రసాద వితరణ కోసం పలమనేరు మార్కెట్ కమిటీ నుండి సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసల రవి ఆధ్వర్యంలో 12 టన్నుల కాయగూరలను శ్రీవారి వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....శ్రీవారి అన్నప్రసాదానికి మనం అందించే ప్రతి కాయగూర ముక్క వేలాది మంది భక్తుల ఆకలి తీరుస్తుంది. లోక రక్షకుడైన ఆ శ్రీనివాసుడికి సేవ చేసుకునే ఈ సువర్ణ అవకాశాన్ని దాతలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భక్తుల ఆకలి తీర్చే ఈ మహాత్కార్యంలో భాగస్వాములు కావడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. స్వామివారికి కాయగూరలు సమర్పించే ఈ విశేష అవకాశం మన ప్రాంతానికి నెలకు ఒక్కసారి మాత్రమే లభిస్తుంది. ఈసారి సుమారు 12 టన్నుల నాణ్యమైన కాయగూరలను సేకరించి తిరుమలకు తరలించామన్నారు. రైతులు, మండీ యజమానులు, ఆర్. రెడ్డప్ప రెడ్డి, వి.ఆర్.ఆర్ కందస్వామి రెడ్డి, సాధారణ భక్తులు తమ శక్తి మేరకు కాయగూరలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న వారి సిబ్బంది, లయన్స్ క్లబ్ చైర్మన్ జయశంకర్, యువ నాయకులు గిరిధర గోపాల్, బిఆర్సి కుమార్, గణేష్, బాలాజీ, గోవిందస్వామి, బాబు, వేణుగోపాల్ నాయుడు, మురగయ్య, వెంకటేష్, తదితరులు హాజరయ్యారు.






## నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం

**పలమనేరు మార్చి 16 (మనసులో మాట) :** సౌత్ ఇండియా స్థాయి కరాటే పోటీలలో నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల అద్భుత విజయం సాధించారు.

నేషనల్ పబ్లిక్ స్కూల్ కు చెందిన విద్యార్థులు సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్షిప్ 2026 అద్భుతమైన ప్రతిభ కనబరిచి సి.జీవన్ సాయి మొదటి స్థానం సి .మను శ్రీ రెండవ స్థానం, కే.బి.ఖ్యాతి మూడవ స్థానం ని కైవసం చేసుకొని పథకాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తీసుకువచ్చారు.

తిరుపతి నగరంలో ఇటీవల జరిగిన ఈ ప్రతిష్టాత్మక పోటీలలో వివిధ రాష్ట్రాల నుండి వేలాది మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. మన విద్యార్థులు తీవ్రమైన పోటీని ఎదుర్కొని తమ కటోర సాధన ఏకాగ్రత, క్రమశిక్షణతో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా నేషనల్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ సుకుమార్, కరస్పాండెంట్ ప్రమోద్ కుమార్, అకాడమిక్ అడ్వైజర్ చంద్రమోహన్, విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించడం ఆనందదాయకంగా ఉందని వీరు అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు.

## ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు

# ఆరోగ్య భరోసా

### 52 మందికి రూ.26.66 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందించిన మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం మార్చి 16 (మనసులో మాట)..** పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మరియు ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్య కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్న 52 మంది లబ్ధిదారులకు మొత్తం 26,66,373 విలువైన చెక్కులను మంత్రి స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ..., ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సాధారణ కుటుంబాలకు, ముఖ్యంగా పేద మరియు మధ్య తరగతి వర్గాలకు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో వైద్య ఖర్చులు చాలా పెద్ద భారంగా మారుతాయని తెలిపారు. అటువంటి సందర్భాల్లో ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక బలమైన భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసీల ద్వారా ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు 8.35 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించబడిందని, సోమవారం పంపిణీ చేసిన 26.66 లక్షలతో కలిపి మొత్తం 8.61 కోట్ల సహాయం ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అందించామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు లబ్ధిదారులు, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

## ఏపిపిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ చిత్తూరు జిల్లా కౌన్సిల్ సమావేశం

**పలమనేరు మార్చి 16( మనసులో మాట) :** పలమనేరు లోని చరణ్ కన్వెన్షన్ లోని మీటింగ్ హాల్ నందు చిత్తూరు జిల్లా అధ్యక్షులు టి. జగన్నాథం అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి సి.బలరామమూర్తి ఆధ్వర్యంలో చిత్తూరు ఈ యు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అర్జున, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.వి.మురళీధరన్, కడప జోనల్ అధ్యక్షులు పి.షౌకత్ ఖాన్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సి.మధు, జోనల్ కార్యదర్శి యన్.రాజశేఖర్, జోనల్ పబ్లిసిటీ సెక్రటరీ డి.ఓబుళరత్నం, జోనల్ కమిటీ సభ్యులు యం.జి.రెడ్డి, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సి.మధు, అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షులు సి.ఏ.బాబు, సీవీపీ జి.వి.రమణ, చిత్తూరు జిల్లా కమిటీ సభ్యులు, 4 డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ సెక్రటరీలు, డిపో నాయకులు, సీసీఎస్ డెలిగేట్స్, డిపో కమిటీ సభ్యులు, మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో ఇ.యు శ్రేణులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలమనేరు డిపో గౌరవాధ్యక్షులుగా కొనసాగుతున్న బి.సుధీర్ ని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమక్షంలో చిత్తూరు జిల్లా గౌరవాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమక్షంలో ఎంప్లాయీస్ యూనియన్ నూతన జిల్లా కమిటీని ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి.జగన్నాథం, కండక్టర్, చిత్తూరు-1డిపో, జిల్లా కార్యదర్శిగా కె.బలరామమూర్తి, డ్రైవర్, కుప్పం డిపో,వర్కింగ్ ప్రెసిడెంట్ గా యం.యం.రెడ్డి, డ్రైవర్, చిత్తూరు-1డిపో, కోశాధికారిగా వి.డి.ప్రసాద్, చిత్తూరు-1 డిపో జిల్లా పబ్లిసిటీ సెక్రటరీగా ఆర్.యస్.ఉదయ్ కుమార్, కండక్టర్, పలమనేరు డిపో, జిల్లా జాయింట్ సెక్రటరీగా ఆర్.సతీష్, కోచ్ బిల్డర్, చిత్తూరు-2 డిపో తోపాటు మరో 6 మంది కార్యవర్గ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.




## ఆకట్టుకున్న మానస నిత్య కళాకేంద్రం ప్రదర్శనలు



**ధర్మవరం మార్చి 16 (మనసులో మాట)..** పట్టణములోని శివానగర్లో గల టిటిడి కళ్యాణ మండపంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మానస నృత్య కళా కేంద్రం అధ్యక్షురాలు మానస ఆధ్వర్యంలో నాట్య ప్రదర్శన అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి సత్య కుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది. అనంతరం నాట్య ప్రదర్శన చూసినవారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇంత చిన్నటి వయసులోనే చదువుతోపాటు భారతీయ సంస్కృతిని అలవర్చుకొని ఇతరులకు నేర్పడం నిజంగా గర్వించదగ్గ విషయమని తెలుపుతూ మానసను అభినందించారు. అనంతరం మానసాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామసుబ్బయ్య, కమిషనర్ వెంకటరమణయ్య, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషా రక్షణే పొట్టి శ్రీరాములుకు నివాళి

### - పి. తులసినాథం నాయుడు

**పలమనేరు మార్చి 16( మనసులో మాట) :** తెలుగు భాషా రక్షణే పొట్టి శ్రీరాములుకు ఘనమైన నివాళి అని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు అన్నారు. సోమవారం కళామందిరంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత అసెంబ్లీ సమావేశాలలో తెలుగు మాధ్యమంలో చదువుకున్నప్పుడే విజ్ఞానం పెరుగుతుందని పేర్కొనడం పట్ల హర్షం ప్రకటిస్తున్నామన్నారు. రేపటి విద్యా సంవత్సరం నుండి తెలుగు మాధ్యమంలో బోధనకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములుకు అదే ఘనమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప,నరేంద్రబాబు, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, చంద్ర శేఖరయ్య, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.




## అబ్బురపరిచిన నాట్య ప్రదర్శన

**ధర్మవరం మార్చి 16 (మనసులో మాట)..** చిత్తూరుజిల్లాతిరుపతి లోని అన్నమాచార్య కళామందిరంలో, తి.తి.దే వారు నిర్వహించిన అన్నమయ్య 523వ వర్ధంతి మహోత్సవాలలో భాగంగా, ధర్మవరం శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువులు దుత్తలూరి



బాబుబాలాజీ శిష్యబృందం 15 మంది నృత్య విద్యార్థులచే "కళ్యాణ శ్రీనివాసం" కూచిపూడి నృత్య రూపకాన్ని కన్నుల పండుగగా ప్రదర్శించి, ప్రేక్షకుల మన్ననలను పొందారు. ఈ నృత్య నాటికలో వేంకటేశ్వర స్వామిగా కుమారి రామ లాలిత్య అన్నమయ్యగా శ్రీ బాబుబాలాజీ ప్రత్యేక ఆకర్షణంగా నిలిచారు. ఈ సందర్భంగా అన్నమయ్య కళామందిర్ నిర్వాహకులు గురువులను , శిష్యబృందాన్ని సత్కరించారు. ఇటువంటి అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేకంగా బాబు బాలాజీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గోశాలకు పశుగ్రాసం విరాళం

**పలమనేరు మార్చి 16 (మనసులో మాట):** పలమనేరు రూరల్ మండలంలోని జగమర్ల పంచాయతీ పరిధిలోని దేవళంపేటలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ వందన మల్లేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా కీలపట్ల అన్నం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గోశాలకు పలమనేరు పరిరక్షణ సమితి, దాత సేగు రాఘవయ్య సహకారంతో ఒక మినీ లారీ ఎండు వరి పశుగ్రాసాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీ.పీ.ఎస్ అధ్యక్షుడు నరసింహులు, గౌరవాధ్యక్షుడు ఆనందబాబు, కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.... వేసవి కాలంలో పశువులకు పచ్చిక లభ్యం కష్టం అయ్యే పరిస్థితుల్లో గోశాలలోని పశువుల సంరక్షణ కోసం పశుగ్రాసం సమకూర్చడం సహేతుకమని తెలిపారు.

అన్నం సొసైటీకి చెందిన శ్రీధర్ స్వామి గోశాల నిర్వహణకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొరస్వామి, జగన్నాథం, విజయకుమార్, రామచంద్ర, వీరభద్ర గౌడు, శ్రీపురం సీతారామయ్య, రెడ్డప్ప, పొన్నుడి, సాంబయ్య, శేఖర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.






# అమరజీవికి సిపిఐ నివాళి




**ఉమ్మడి అనంతపురం, (మనసులో మాట)మార్చి 16..** తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా బనగానపల్లెలో అయన విగ్రహం నికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సిపిఐ మండల కార్యదర్శి అయనను కొనియాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు శ్రీ మహాలక్ష్మమ్మ శ్రీ గురవయ్య గర్భమున జన్మించి ముంబై నగరంలో ఆరోగ్య విద్యను అభ్యసించి తర్వాత రైల్వే ఉద్యోగిగా పనిచేశారు చిన్నతనంలోని భార్య మరణించగా బంధాల వైపు విసుకు చెంది దేశ సేవ కోసం పనిచేశారు తర్వాత గాంధీజీ ఆశ్రమంలో చేరి స్వాతంత్ర ఉద్యమంలో సామాజిక కార్యక్రమాల్లో పునర్నిర్మాణంలో పాల్గొన్నారు 19 27...1930.. 1940.. కాలంలో కారాగార శిక్ష అనుభవించాడు నెల్లూరు జిల్లా వేణుగోపాలస్వామి ఆలయంలో హరిజనుల ప్రవేశం కోసం 1946 లో 23 రోజులు నిరాహార దీక్ష చేశారు 1948 లో 20 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి హరిజనభ్యుదయం సామాజిక సంస్కరణలకు కృషి చేశారు మద్రాసు నుండి విడిపోయిన తెలుగు ప్రజలందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు మద్రాస్ నగరంలో బొలుసు సాంబమూర్తి ఇంటి నుంచి దీక్ష మొదలుపెట్టారు ఢిల్లీలో పెద్ద నాయకులు ఈ విషయం పెద్దలు ఎవరూ పట్టించుకోలేదు అన్న పానీయాలు లేక ఆరోగ్యం క్షమించి 1952 డిసెంబర్ 17న కళ్ళు మూశారు ఈ వార్త విని తెలుగు ప్రజలు అట్టుడికి పోయారు అప్పటి ప్రభుత్వం తెలుగు ప్రజల చిరకాల వాంఛ అయిన ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రకటించ జరిగింది అమరజీవి పొట్టి శ్రీరాములు కల నెరవేరిందని వారు కొనియాడారు ఈ సందర్భంగా ~ాxాఖీ మండల అధ్యక్షుడు మతేష్ రైతు సంఘం సభ్యులు నారాయణ పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి పాము



**కడప జిల్లా, (మనసులో మాట)మార్చి 16..** కడప జిల్లా బి.కోడూరులోని పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి పాము రావడం కలకలం రేపింది. పామును చూసిన విద్యార్థులు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. వెంటనే అక్కడి సిబ్బంది పామును చంపి బయటపడేయడంలో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

### మహిళా అభివృద్ధి శాఖలో పథకాల నిధుల వినియోగంలో

# అక్రమాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

## - విచారణ జరపకపోతే ఉద్యమాలు చేపడతామని సాకే వినయ్ హెచ్చరిక



**పుట్టపర్తి, మార్చి 16 (మనసులో మాట)..** శ్రీ సత్యసాయి జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాకే వినయ్ కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బేటీ బచావో బేటీ పఢావో, మిషన్ శక్తి, సక్షం అంగన్వాడి పథకాల అమలులో నిధుల వినియోగంలో లోపాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 154 సక్షం అంగన్వాడి కేంద్రాల బలోపేతం కోసం 202526 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.29 లక్షలకు పైగా నిధులు విడుదల చేసినప్పటికీ, కొనుగోలు చేసిన సామగ్రిలో అనేక లోపాలు ఉన్నాయని తెలిపారు.

50 కిలోల డ్రమ్ముల బదులు 25 కిలోల డ్రమ్ములు ఇవ్వడం, కొన్ని వస్తువులు నాణ్యత లేనివిగా ఉండడం, అవసరమైన పరికరాలు అందకపోవడం వంటి సమస్యలు గుర్తించినట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సామగ్రిని నేరుగా అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉండగా, వాటిని సీడీపీఓ కార్యాలయాలకు మాత్రమే తరలించారని ఆరోపించారు. దీంతో అంగన్వాడి కార్యకర్తలు రూ.800 నుంచి రూ.2000 వరకు తమ సొంత ఖర్చుతో రవాణా చేసి వస్తువులు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

కొన్ని కొనుగోళ్లలో టెండర్ ప్రక్రియ పాటించలేదని, టెండర్ ప్రకటన లేకుండా సరఫరాదారులను ఎంపిక చేశారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ చట్టం, ఏపీ ఫైనాన్షియల్ కోడ్ మరియు జనరల్ ఫైనాన్షియల్ రూల్స్‌కు విరుద్ధమని పేర్కొన్నారు. హిందూపురం చిల్డ్రన్ హోమ్‌కు విద్యుత్ సామగ్రి కొనుగోలు వ్యవహారంలో కూడా పారదర్శకత లోపాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. టెండర్ నోటిఫికేషన్, బిడ్డర్ల వివరాలు, కంపారేటివ్ స్టేట్‌మెంట్ వంటి సమాచారం వెల్లడించలేదని తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి అవసరమైతే కాంట్రాక్టును రద్దు చేయాలని జిల్లా పరిపాలనను కోరారు. ఇప్పటికే ఫిబ్రవరి 6న ప్రజా పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ సరైన విచారణ జరగలేదని, తప్పుడు నివేదికలతో ఫిర్యాదును ముగించారని వినయ్ కుమార్ ఆరోపించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నందుకు కొంతమంది అధికారులు కక్షసాధింపు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మరియు ప్రజాసంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ మహిళా అభివృద్ధి శాఖలో జరిగిన కొనుగోళ్లపై థర్డ్ పార్టీ విచారణ జరిపించాలని, అవసరమైతే విజిలెన్స్ లేదా ఏసీబీ విచారణకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజా ధనం దుర్వినియోగం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు సాకే ఓం నాథ్, రామకృష్ణ, సీపీఎం నాయకుడు గంగాధర్, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబుల్ కుమార్, రాకేష్ భూషణ్, రెవల్యూషన్ సోషలిస్ట్ పార్టీ నాయకుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# టీకాల ద్వారా వ్యాధులకు చెక్

## - స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి.కుమార్
## - స్విమ్స్ వైద్య విజ్ఞాన సంస్థలో జాతీయ టీకా దినోత్సవం




**తిరుపతి (మనసులో మాట ):** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ టీకా దినోత్సవ అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. సోమవారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి.కుమార్ ఇతర విభాగాల అధిపతులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ, భారతదేశ సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమాలలో ఒకటి అని కొనియాడారు. పిల్లలు, గర్భిణీ స్త్రీలకు ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలను అందిస్తోందని తెలిపారు. క్షయ, ధనుర్వాతం, పోలియో, కాలేయ వాపు మరియు న్యుమోనియా వంటి వ్యాధులను టీకాల ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అందరికీ రోగనిరోధకత మానవీయంగా సాధ్యమే అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శిశువైద్య విభాగం అధిపతి డాక్టర్ పునీత్ పాటక్ మాట్లాడుతూ, శిశువు జన్మించినప్పటి నుండి నిర్ణీత కాల వ్యవధిలో వేయించుకోవాల్సిన వివిధ రకాల టీకాల వివరాలను వెల్లడించారు. పుట్టిన వెంటనే వేసే టీకాలతో పాటు, ఆరు, పది, పద్నాలుగు వారాల్లో వేయాల్సిన టీకాలు, అలాగే తొమ్మిది నెలల నుండి రెండేళ్ల లోపు వేయించాల్సిన బూస్టర్ మోతాదుల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీ స్త్రీలకు అవసరమైన టీకాలు కూడా స్విమ్స్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో టీకాలు కీలక పాత్ర పోషిస్తాయని కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్ పేర్కొన్నారు. విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని చెప్పారు. అనంతరం వివిధ విభాగాల వైద్యులు మరియు విద్యార్థులతో కలిసి వ్యాధుల నివారణ మరియు ఆరోగ్య సంరక్షణపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో నడవాలి..

## మంత్రి సత్య కుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి



**ధర్మవరం మార్చి 16 (మనసులో మాట)..** పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని వారిని ఆదర్శంగా తీసుకోవాలని ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా కళాజ్యోతి సర్కిల్ వద్దగల వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొరకు అకుంఠిత దీక్షతో 58 రోజులు కఠోర నిరాహార దీక్ష సాగించి తన ప్రాణాలను తృణప్రాయంగా తెదించి మనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తెచ్చిన గొప్ప మహనీయుడు అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి దేవాలయ కమిటీ, మహిళా మండలి, యువజన సంఘం, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల వినియోగం పై అవగాహన సదస్సు

## - ఎక్సైజ్ సీఐ చంద్రమణి




**ధర్మవరం మార్చి 16 (మనసులో మాట)..** మాదకద్రవ్యాల వినియోగంపై పట్టణములోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఎక్సైజ్ చంద్రమణి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ సురేష్ బాబు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిమాణాలు, నష్టాలు గూర్చి వివరించారు. మాదక ద్రవ్యాలపై ఉండే చట్టాలు, రీహాబిలేషన్ల సెంటర్ అండ్ గూర్చి సమాచా రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం మహాదానం అవుతుంది

## - రజిని ట్రస్ట్, రక్త బంధం ట్రస్ట్ నిర్వాహకులు కన్నా వెంకటేష్



**ధర్మవరం మార్చి 16 (మనసులో మాట,)** అన్నదానం మహాదానం అవుతుందని, ఎంతోమంది పేద ప్రజల ఆకలిని తీరుస్తుందని రజనీ ట్రస్ట్, రక్త బంధం ట్రస్ట్ నిర్వాహకులు కర్ణ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ ఆసుపత్రిలో 140 మందికి అల్పాహారాన్ని అందించడం జరిగింది. ఈ సేవా కార్యక్రమానికి దాతగా ధర్మవరం పట్టణానికి చెందిన డాక్టర్ వివేక కుల్లాయప్ప, డాక్టర్ నీరజ, జయకృష్ణ, దేవ్ విహాన్, లిసా వారి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించామని తెలిపారు. అనంతరం దాతకు ట్రస్ట్ తరపున కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు, కౌన్సిలర్ కేతా లోకేష్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



# మెరుగైన విద్యకు వైవియూ సరోవరం

## - ప్రొఫెసర్ డా.ఈశ్వర్ రెడ్డి

**వేంపల్లె, (మనసులో మాట)మార్చి 16..**మెరుగైన ఉన్నత విద్యకు యోగి వేమన యూనివర్సిటీ(వైవియూ) ఒక సరోవరం వంటిదని ప్రొఫెసర్ డా.ఈశ్వర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటైన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల యువతను దృష్టిలో ఉంచుకుని అందరికీ అందుబాటులో ఉండేలా వైవియూ ని ఏర్పాటు చేశారన్నారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియా, ప్రేమ పేరుతో జరిగే ఆకర్షణలు జీవిత లక్ష్యాలను నీరుగార్చుతాయని, విలువైన సమయాన్ని లక్ష్యసాధనకు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు గంగాధర్, నాగలక్ష్మిదేవి, మాధవరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు విడిచిన మహానేత ఆంధ్రప్రదేశ్ పితామహుడు

# పొట్టి శ్రీరాములు



**ఉమ్మడి అనంతపురం, (మనసులో మాట)మార్చి 16..** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు విడిచిన మహానేత ఆంధ్రప్రదేశ్ పితామహుడు నెల్లూరు జిల్లా ముద్దుబిడ్డ అమరజీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ఆర్థిక శాఖ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ఆదేశాల మేరకు డోన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నమస్సుమాంజలి అర్పించడం జరిగింది కార్యక్రమంలో డోన్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి డోన్ మండల అధ్యక్షులు సోమేష్ యాదవ్, జడ్పిటిసి రాజకుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, మాజీ పట్టణ అధ్యక్షులు కురుకుంద హరి, వాణిజ్యవి బాగా అధ్యక్షులు మేడ రఘు, కౌన్సిలర్లు కో ఆప్షన్ నెంబర్లు డోన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు లీడర్లు పాల్గొన్నారు.

# పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ సభ






**కర్నూలు జిల్లా, (మనసులో మాట)మార్చి 16..** మంత్రాలయం మండలం కల్లు దేవ కుంట గ్రామం హైకోర్టు సీనియర్ అడ్వకేట్ పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ సభలో పాల్గొన్న గుమ్మనూరు నారాయణ ఈరోజు హైకోర్టు సీనియర్ అడ్వకేట్ పురుషోత్తం రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు మంత్రాలయం మండలం కల్లు దేవ కుంట గ్రామం లో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ సభలో ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
KANCHARLA



## ఏపీలో పురాతత్వ అన్వేషణ

### లోక్‌సభలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం వివరణ

**న్యూఢిల్లీ/చిత్తూరు (మనసులో మాట ):** ఆంధ్రప్రదేశ్‌లోని పురాతత్వ అన్వేషణల ప్రస్తుత స్థితిగతులు, భారత జ్ఞాన్ మిషన్ లక్ష్యాలు, పురాతత్వ శాఖ సాధించిన పురోగతిపై చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర సమాధానం ఇచ్చింది. కేంద్ర సాంస్కృతిక మరియు పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ వివరాలను లిఖితపూర్వకంగా వెల్లడించారు. రాష్ట్రాల నుండి వచ్చే తవ్వకాల ప్రతిపాదనలను కేంద్రం నిశితంగా పరిశీలిస్తుందని, గతంలో చేపట్టిన పరిశోధనలకు సంబంధించిన నివేదికలను పూర్తి చేసిన వారికి మాత్రమే కొత్త ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. విదేశీ సంస్థలు లేదా వ్యక్తులతో కలిసి చేసే అన్వేషణలకు కేంద్ర హోం మరియు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల నుండి ప్రత్యేక అనుమతులు తప్పనిసరని ఆయన వివరించారు.

భారతీయ ప్రాచీన తాళపత్ర గ్రంథాల అన్వేషణ మరియు పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో ప్రకటించిన భారత జ్ఞాన్ మిషన్ ద్వారా నాలుగు వందల తొంభై ఒక్క కోట్ల అరవై ఆరు లక్షల రూపాయలను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పురాతత్వ అన్వేషణల కోసం కాంతి ఆధారిత దూర గుర్తింపు పరికరాలు, భూగర్భ రాడార్ వ్యవస్థలు మరియు డ్రోన్ల వంటి అత్యాధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సాంకేతికతపై శిక్షణ కోసం దక్షిణ భారతం నుండి పద్నాలుగు మంది అధికారులను ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలకు పంపినట్లు వెల్లడించారు.

ప్రస్తుతం తెలంగాణలోని వరంగల్ కోటతో పాటు బీహార్‌లోని రాజ్‌గిర్, హర్యానాలోని రాఖీగఢీ మరియు అరుణాచల్ ప్రదేశ్‌లోని భీష్మక్‌నగర్ వంటి ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతికతతో పరిశోధనలు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. సముద్రగర్భ అన్వేషణల కోసం ప్రత్యేక విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని, రెండు వేల ముప్పై నాటికి పురాతత్వ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని తెలిపారు. తన ప్రశ్నలకు తక్షణమే స్పందించి పూర్తి వివరాలు అందించినందుకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గుండెపోటు కథ ఆమె సృష్టే..!

## వివేకా కేసులో సునీతపై అవినాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు



**కడప (మనసులో మాట) :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, వివేకా కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబుపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సునీత ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో అసలు విచారించాల్సిన కీలక అంశాలను పక్కనపెట్టి, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విచారణను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసుకు సంబంధించి అనేక కీలక విషయాలను, తన వాదనలను ప్రజల ముందుంచారు. వివేకా హత్య జరిగిన తర్వాత 'గుండెపోటు' అనే కథనాన్ని తెరపైకి తెచ్చింది సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, బాబాయ్ నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి అని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. 2019 మార్చి 16న సిట్ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో సునీత స్వయంగా గుండెపోటు అనే అనుమానాన్ని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తన తండ్రికి గతంలో స్టెంట్ వేశారని, ఆ కారణంగానే గుండెపోటుతో బాత్రూంలో పడి మరణించి ఉండొచ్చని ఆమె చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. దీనికి బలం చేకూరుస్తూ, బీజేపీ నేత ఆదినారాయణ రెడ్డికి కూడా శివప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి వివేకా గుండెపోటుతో చనిపోయారని చెప్పిన వీడియోను అవినాశ్ ప్రదర్శించారు. తానే గుండెపోటు కథ అల్లి, ఇప్పుడు ఆ నెపాన్ని తమపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

హత్య జరిగిన ప్రదేశంలో దొరికిన లేఖ అత్యంత కీలకమైన సాక్ష్యమని, ఆ విషయం తెలిసినా సునీత, ఆమె భర్త పోలీసులకు సమాచారం ఇవ్వలేదని అవినాశ్ ఆరోపించారు. పీఏ కృష్ణారెడ్డి ద్వారా లేఖ ఫొటోలు, డెడ్ బాడీ ఫొటోలు చూసినా, అది హత్య అని స్పష్టంగా తెలుస్తున్నా విషయాన్ని దాచిపెట్టడం సాక్ష్యాలను తారుమారు చేయడమేనని అన్నారు. 2020 జులై 28న సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో లేఖ గురించి తనకు తెలుసని అంగీకరించిన సునీత, సరిగ్గా నెల రోజుల తర్వాత ఆగస్టు 27న ఇచ్చిన మరో స్టేట్‌మెంట్‌లో తనకు ఏమీ గుర్తులేదని చెప్పడం విచారణను పక్కదారి పట్టించడమేనని విమర్శించారు. ఒకసారి ఇచ్చిన వాంగ్మూలాన్ని కప్పిపుచ్చుకోవడానికి సీబీఐ మరో వాంగ్మూలం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఈ కేసులో ఎన్నో కీలకమైన అంశాలు ఉన్నప్పటికీ, వాటిపై సునీత ఎందుకు తదుపరి విచారణ కోరడం లేదని అవినాశ్ నిలదీశారు.

"నిందితుడు దస్తగిరి తన వాంగ్మూలంలో, హత్యకు ముందు వివేకాను డాక్యుమెంట్ల కోసం తీవ్రంగా కొట్టామని, వాటిని తీసుకున్నాకే చంపామని చెప్పాడు. ఆ కీలకమైన డాక్యుమెంట్లు ఏవి? వాటిని రికవరీ చేయాలని సునీత ఎందుకు అడగడం లేదు?

వివేకా రెండో భార్య షమీం, ఆమె కుమారుడు షహన్‌షాకు ఆస్తులు చెందకుండా ఉండేందుకు ఈ హత్య జరిగి ఉండవచ్చన్న కోణంలో ఎందుకు విచారణ జరపడం లేదు? వివేకా తన ఆస్తులను వారికి ఇవ్వాలనుకున్న విషయం విచారణలో స్పష్టమైంది. దీనివల్ల నష్టపోయేది ఎవరు? ఆ దిశగా దర్యాప్తు జరపాలని ఎందుకు కోరడం లేదు?

దస్తగిరి తన స్టేట్‌మెంట్‌లో వివేకాకు ఉన్న అక్రమ సంబంధాల గురించి ప్రస్తావించాడు. ఆ నేపథ్యంలో కూడా హత్య జరిగి ఉండొచ్చు కదా? ఆ కోణంలో విచారణ జరపాలని ఎందుకు అడగడం లేదు?

హత్య జరిగిన రోజు రాత్రి వివేకా ఇంటి వద్ద ఉండే అటెండర్ పండింటి రాజశేఖర్‌ను, సునీత తల్లి సౌభాగ్యమ్మ, భర్త రాజశేఖర్ రెడ్డి బలవంతంగా కానిపాకం పంపించారు. ప్రతిరోజూ ఉండే అటెండర్‌ను ఆ ఒక్కరోజే ఎందుకు పంపించాల్సి వచ్చింది? ఇది అనుమానాస్పదం కాదా?" అని అవినాశ్ ప్రశ్నించారు.

హత్యలో తానే ఉన్నానని అంగీకరించిన అప్రూవర్ దస్తగిరి బెయిల్‌ను రద్దు చేయాలని తాము కోర్టుకు వెళితే, సునీత వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేసి, లూథ్రా వంటి సీనియర్ న్యాయవాదిని పెట్టి మరీ దస్తగిరి బెయిల్‌ను ఎందుకు కాపాడుతున్నారని అవినాశ్ ప్రశ్నించారు. ఇది వారి మధ్య ఉన్న కుమ్మక్కును బయటపెడుతోందన్నారు.

ఢిల్లీలోని ఓ తెలుగు పెద్దమనిషి అండతో సీబీఐ డైరెక్టర్‌ను నియమించుకుని, చంద్రబాబుతో కలిసి సునీత ఈ కేసు విచారణను పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకున్నారని అవినాశ్ ఆరోపించారు. తాము చెప్పినట్టు వాంగ్మూలం ఇవ్వని సాక్షులను సీబీఐ విచారించలేదని, కేవలం ట్యూటర్ చేసిన సాక్షులతోనే స్టేట్‌మెంట్లు రికార్డు చేయించిందన్నారు. హిమకుంట్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని, "అవినాశ్ రెడ్డి గుండెపోటు అని చెప్పాడని నువ్వు చెప్పాలి" అని సునీత, ఆమె భర్త ఒత్తిడి చేశారని, కానీ ఆ వ్యక్తి అబద్ధం చెప్పడానికి నిరాకరించారని వివరించారు.

రాబోయే ఎన్నికల వరకు ఈ కేసును రాజకీయంగా వాడుకోవాలనేది చంద్రబాబు, సునీతల ఉమ్మడి లక్ష్యమని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. కేసు విచారణలో అనవసర పిటిషన్లు వేస్తూ ట్రయల్‌ను ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడి దయ, చట్టం ముందు తాను నిర్దోషిగా నిరూపించుకుంటానని, నిజం ఏదో ఒక రోజు తప్పకుండా బయటకు వస్తుందని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.




### పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోకి

## క్షుణ్ణంగా తనిఖీలు



**ఉమ్మడి అనంతపురం, (మనసులో మాట)మార్చి 16..** ఈరోజు నుండి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ అధికారులు మరియు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు చేపట్టారు. విద్యార్థులు ఎలాంటి సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచీలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు (ఫ్రిస్కింగ్) నిర్వహించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేస్తూ, కేంద్రాల సమీపంలో ఎవరూ గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రాల పరిసరాలలో డ్రోన్‌ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు మరియు పరీక్షలకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతరులు ఎవరూ ఉండకుండా పర్యవేక్షిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో పరీక్షలు ముగిసేంతవరకు జిరాక్స్/ప్రింటింగ్ సెంటర్లు మూసివేయించే విధంగా కూడా చర్యలు తీసుకున్నారు. పరీక్షలు కొనసాగుతున్నంతసేపు మొబైల్ పెట్రోలింగ్ బృందాలు నిరంతరం ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. పరీక్షల సమయంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నాపత్రాల తరలింపు మరియు సమాధాన పత్రాలను డిపాజిట్ చేయుటకు పటిష్టమైన ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు పరీక్షలు పూర్తయ్యేవరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా, సాఫీగా జరగేందుకు పోలీస్ శాఖ తరపున అన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

## బాధిత కుటుంబానికి భరోసా



**ఉమ్మడి అనంతపురం, (మనసులో మాట)మార్చి 16..** కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కడదరకుంట గ్రామానికి చెందిన వైయస్సార్ సీపీ సానుభూతిపరురాలు పుష్పలత టీడీపీ, పోలీసుల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం కు పాల్పడింది. విషయం తెలుసుకున్న వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పుష్పాలతను పరామర్శించారు. సందర్భంగా అధైర్య పడకండి, అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి



**ఉమ్మడి అనంతపురం, (మనసులో మాట)మార్చి 16..** నందికొట్కూరు పట్టణంలోని పీ4 ఆఫీస్ నందు నిర్వహించిన తెలుగు రాష్ట్ర ఆవిష్కరణకు కారకులైన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలలో పాల్గొన్న నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, అబ్జర్వర్ దేవళ్ళ మురళి, పట్టణ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మూర్తుజావాలి, ఎంపీడీఓ శర్మ, శ్రీనివాసులు, జిల్లా ఉపాధక్షురాలు ప్రసన్న లక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు మీనాక్షిదేవి, వనజ, వేణుగోపాల్,సురేంద్ర, మల్లికార్జున రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకాలు

### జిల్లా పోలీస్ శాఖకు దక్కిన గౌరవం - హర్షం వ్యక్తం చేసిన తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు


N. Vikram, Inspector of Police, SB, Tirupati. Seva Pathakam


N. Sekhar, ASI 598 – SB, Tirupati. Uttama Seva Pathakam


P. Srinivasa Rao, ARHC 1845 – DAR, TPT. Seva Pathakam


M. Gunasekhar, PC 848 – DCRB, Tirupati. Seva Pathakam


R. C. Obulesh Yadav, ARPC 1876 – DAR, Tirupati. Seva Pathakam


Sk. Kaja Hussain, HC 3475 – Sullurpet PS, Tirupati. Seva Pathakam


N. Rajasekhar, HC 697 – CCS, Tirupati. Seva Pathakam


R. V. Venu, ASI 2725 – Pichatur PS, Tirupati. Seva Pathakam


R. Padmavathi Devi, ASI 2831 – Alipiri PS, Tirupati. Seva Pathakam


E. Anantha Rao, HC 1214, CCS – I TownTirumala. Seva Pathakam

తిరుపతి (మనసులో మాట ): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ప్రతిష్టాత్మక సేవా పతకాలు ఈ ఏడాది తిరుపతి జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి లభించాయి. జిల్లా పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన పదిమందికి సేవా పతకాలు, ఒకరికి ఉత్తమ సేవా పతకం దక్కడం పట్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎల్. సుబ్బరాయుడు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ అవార్డులు జిల్లా పోలీస్ శాఖకు దక్కిన గౌరవమని కొనియాడారు. సేవా పతకాలు పొందిన వారిలో ఇన్‌స్పెక్టర్ ఎన్. విక్రమ్, రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ బి. తిరుపాలు, హెడ్ కానిస్టేబుల్ ఇ. అనంతరావు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. పద్మావతి దేవి, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వి. వేణు, హెడ్ కానిస్టేబుల్ ఎన్. రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ షేక్ ఖాజా హుస్సేన్, కానిస్టేబుల్ ఎం. గుణశేఖర్, రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ ఆర్. సి. ఓబులేష్ యాదవ్ మరియు రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీనివాసరావు ఉన్నారు. వీరితో పాటు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. శేఖర్ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. పతకాలు సాధించిన అధికారులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు నిబద్ధతతో సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని ఆయన కోరారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి ఇటువంటి గుర్తింపులు మరింత ఉత్సాహాన్నిస్తాయని, భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ గుర్తింపు జిల్లాలోని ఇతర సిబ్బందికి కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

మంగళవారం 17 మార్చ్ 2026




# గవర్నర్ ప్రసంగం అంతా అవాస్తవం

## బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**

ప్రభుత్వం గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రసంగంలో స్పష్టత లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. రైతుల కష్టాలు, కొత్త కొలువుల భర్తీ, ఉద్యోగుల బకాయిల ప్రస్తావన లేదని మండిపడ్డారు. విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాలు ఏళ్లు గడిచినా నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



### వర్గాల విస్మరణ

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను ప్రభుత్వం మోసం చేస్తోందని, సబ్ ప్లాన్ గురించి మాట కూడా లేదని పాయల్ శంకర్ ఆరోపించారు. రాష్ట్ర అప్పుల వివరాలు వెల్లడించలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం విస్మరించినా తాము వదిలిపెట్టబోమని, ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.

### ఎంఐఎంపై చర్యలకు డిమాండ్

సభలో వందేమాతరం ఆలపిస్తున్నప్పుడు ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని ఆయన అన్నారు. వారి తీరు సిగ్గుచేటని, దేశభక్తి లేని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే దిశగా తెలంగాణ అడుగులు
- బడ్జెట్ ప్రతి పౌరుడినీ అభివృద్ధిలో భాగస్వామిని చేస్తుంది
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగం
- తెలుగులో ప్రసంగం ప్రారంభించి ఆకట్టుకున్న గవర్నర్
- సభలో ఆరు గ్యారెంటీల అమలు కోసం బీఆర్ఎస్ సభ్యుల నిరసన



**హైదరాబాద్, మనసులో మాట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన సాగిస్తోందని, ప్రతి పౌరుడిని అభివృద్ధిలో భాగస్వామిని చేసేలా ఈ బడ్జెట్ ను రూపొందించినట్లు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. సోమవారం ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజున ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అసెంబ్లీలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించిన అనంతరం, గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడం అందరినీ ఆకట్టుకుంది.

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

తెలంగాణను ప్రపంచానికే దిక్సూచిగా నిలపడమే ప్రభుత్వ ధ్యేయమని, 'విజన్-2047' ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేశామని గవర్నర్ వివరించారు. ప్రస్తుతం దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం వాటాను అందిస్తోందని, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది కాలంలో తీసుకువచ్చిన సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

### పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ

రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్ గా మార్చే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని గవర్నర్ వెల్లడించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఏకంగా రూ. 5 లక్షల 72 వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రం ఆకర్షించిందని ఆయన తెలిపారు. 23వ బయో ఆసియా సదస్సు ద్వారా రూ. 1700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. ఐటీ ఎగుమతులు రూ. 3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని, ఈ రంగం ద్వారా సుమారు 9.39 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పకడ్బందీ ప్రణాళికలు రచిస్తున్నామని, 'హిల్ట్ పాలసీ' ద్వారా పరిశ్రమలకు భూముల బదలాయింపు ప్రక్రియను సులభతరం చేశామని పేర్కొన్నారు.

### నగరాల సమగ్రాభివృద్ధికి క్యూర్ మోడల్

పట్టణాభివృద్ధి కోసం ప్రభుత్వం 'క్యూర్ మోడల్'ను అనుసరిస్తోందని గవర్నర్ శుక్లా తెలిపారు. 2031 నాటికి రాష్ట్రంలో పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నామన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని నాలుగు పోలీస్ కమిషనరేట్లుగా విభజించామని గుర్తుచేశారు. ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ ఆస్తులను రక్షించేందుకు 'హైడ్రా' ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, తద్వారా సుమారు రూ. 60 వేల కోట్ల విలువైన ఆస్తులను కాపాడామని గవర్నర్ స్పష్టం చేశారు.

### మౌలిక సదుపాయాలకు పెద్దపీట

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు గవర్నర్ చెప్పారు. మూసీ నది ప్రక్షాళన కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించామని, తొలి దశలో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. మూసీలో మురుగునీరు చేరకుండా 39 ఎస్టీపీలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) తరహాలోనే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఏర్పాటు చేయబోతున్నామని, కాలుష్య నివారణ కోసం పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించాలని నిర్ణయించామన్నారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ ఎంఎస్ఎంఈ (మీవీజు) పార్కులను, ఓఆర్ఆర్ కు అనుబంధంగా రేడియల్ రోడ్లను నిర్మిస్తామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం చేపట్టనున్నామని, వరంగల్, ఆదిలాబాద్ లలో కొత్త విమానాశ్రయాలు రాబోతున్నాయని గవర్నర్ వివరించారు.

### సంక్షేమ పథకాల అమలు జోరు

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని గవర్నర్ వెల్లడించారు. రైతులకు అండగా నిలుస్తూ గత వానాకాలంలో రైతు భరోసా కింద రూ. 8,744 కోట్లు అందించామని, పంట రుణమాఫీ కోసం ఏకంగా రూ. 20,616 కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. కొత్తగా 15.12 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేశామని, 3.38 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 9,222 కోట్లు ఆదా అయ్యాయని, స్వయం సహాయక సంఘాలకు (ఎస్హెచ్జీ) లక్ష కోట్ల రూపాయల రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేస్తామని, కొడంగల్ ప్రాంతాన్ని పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతామని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

### పాలనలో పారదర్శకత.. నిరుద్యోగులకు భరోసా

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలు కోసం 99 రోజుల కార్యాచరణను రూపొందించామని గవర్నర్ తెలిపారు. 'ప్రజావాణి' కార్యక్రమం కింద వచ్చిన 64,697 ఫిర్యాదుల్లో ఇప్పటికే 47,670 సమస్యలను పరిష్కరించామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టీజీపీఎస్సీ సహా ఇతర నియామక సంస్థలను సంస్కరించామని, రికార్డు సమయంలో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని ఆయన స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టేందుకు 'ఈగల్' ప్రత్యేక బృందం ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలను కూడా అత్యంత ప్రశాంతంగా నిర్వహించామని గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు.

### గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలిన బీఆర్ఎస్..

అంతకుముందు అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లు ఘన స్వాగతం పలికారు. అయితే, గవర్నర్ ప్రసంగం ప్రారంభం కాగానే ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు సభలో నిరసనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ స్థానాల్లో నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించి ముగించారు.

# అసెంబ్లీలో కొలువుదీరిన తెలంగాణ తల్లి

- ఆవిష్కరించిన గవర్నర్ శుక్లా
- రాష్ట్ర ఆత్మగౌరవ ప్రతీకగా మండలి భవనం ముందు విగ్రహావిష్కరణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల సమక్షంలో వైభవంగా జరిగిన వేడుక




**హైదరాబాద్, మనసులో మాట:** శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పునరుద్ధరించిన మండలి భవనం ముందు ఈ విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్ర ఆత్మగౌరవ చిహ్నంగా నూతనంగా రూపొందించిన ఈ విగ్రహాన్ని గవర్నర్ వైభవంగా ప్రారంభించారు. ఈ చారిత్రక ఘట్టం రాష్ట్ర ప్రముఖులు, మంత్రుల సమక్షంలో అత్యంత వేడుకగా జరిగింది. అనంతరం విగ్రహం వద్ద అందరూ పుష్పాంజలి ఘటించారు.

విగ్రహ ఆవిష్కరణకు ముందు ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అసెంబ్లీ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాళులర్పించారు. దేశానికి, సమాజానికి వారు చేసిన అసమాన సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ విగ్రహం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల పోరాట పటిమకు, సంస్కృతికి, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని అభివర్ణించారు. రాష్ట్ర అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఆరు గ్యారెంటీలపై సర్కార్‌ను నిలదీస్తాం

- గన్‌పార్క్ వద్ద కేటీఆర్ ధ్వజం.. అమరులకు నివాళి
- వంద రోజుల హామీలు ఏమయ్యాయంటూ అమరవీరుల స్థూపం వద్ద నిరసన
- రైతుబంధు రాదు.. ఉద్యోగాల ఊసే లేదంటూ బిఆర్ఎస్ నేతల ఆగ్రహం




**హైదరాబాద్, మనసులో మాట:**

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై సభలో పోరాడుతామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను దారుణంగా వంచించిందని విమర్శించారు. రెండేళ్లు దాటుతున్నా హామీలకు చట్టబద్ధత కల్పించలేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో సాగుకు ముందే రైతుబంధు నిధులు జమయ్యేవని, ఇప్పుడు పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. "రాహుల్ బంధు కాదు.. రైతులకు రైతుబంధు కావాలి" అంటూ ఎద్దేవా చేశారు. రైతులకు వెన్నుపోటు పొడిచి, నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగంలో చెప్పిన మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు అసలు పొంతన లేదని నిలదీశారు. కొలువుల భర్తీ ఊసే లేదని, జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులు పింఛన్ల కోసం, కూలీలు రైతు భరోసా కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పాడిందని, ఈ వైఫల్యాలన్నింటినీ అసెంబ్లీ వేదికగా ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.

# మార్చి 31 వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

## 20న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం భట్టి

## సభా నిర్వహణ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**



తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు నిర్వహించాలని సభా నిర్వహణ కమిటీ (బీఏసీ) నిర్ణయించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభా కాలపరిమితిపై చర్చించి షెడ్యూల్ ఖరారు చేశారు. సోమవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో ప్రారంభమైన ఈ సమావేశాలు నెలాఖరు వరకు కొనసాగుతాయి.

### కీలక తేదీలు

ఖరారైన షెడ్యూల్ ప్రకారం, మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఈ నెల 20న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. దీనిపై 23 నుంచి 26 వరకు నాలుగు రోజుల పాటు చర్చలు నిర్వహించనున్నారు. చివరి రోజు మార్చి 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ చేపడతారు. సమావేశాల మధ్యలో వచ్చే ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలకు సెలవులు ప్రకటించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ పార్టీల నేతలు బీఏసీ సమావేశంలో పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# నార్సింగిలో ఘోరం

**చిన్నారిపై అత్యాచారం, హత్య**

**చాక్లెట్ ఆశచూపి తీసుకెళ్లి ఆరేళ్ల బాలిక ప్రాణం తీసిన కామాంధుడు**

**సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి అరెస్టు.. మృతదేహం స్వాధీనం**



**హైదరాబాద్, మనసులో మాట:**

హైదరాబాద్ నగరంలోని నార్సింగిలో గుండెలు పిండే విషాదం చోటుచేసుకుంది. ఓ కామాంధుడు ఆరేళ్ల చిన్నారిపై అమానుషంగా అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు. ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న బాలికకు చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మబలికి తన వెంట తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఆపై తనను పట్టిస్తుందనే భయంతో గొంతు నులిమి చంపేశాడు.

### సీసీ కెమెరాల్లో దొరికిన ఆధారాలు

చిన్నారి కనిపించకుండా పోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు రాత్రి 10 గంటలకు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. బాలికను ఒక వ్యక్తి తీసుకువెళ్తున్న దృశ్యాలు అందులో బయటపడ్డాయి. ఆ ఆధారాలతో గాలింపు చేపట్టిన పోలీసులు తక్కువ సమయంలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

### నేరాన్ని అంగీకరించిన దుర్మార్గుడు

పోలీసుల విచారణలో నిందితుడు తన క్రూరత్వాన్ని ఒప్పుకున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నిందితుడు చూపిన ప్రాంతంలో పోలీసులు చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా విచారణ వేగవంతం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ ఘటనతో బాధితురాలి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

# ప్రాణాలు తీసిన చేపల వేట

**మూసీలో మునిగి ముగ్గురు యువకుల మృతి**

**గండిపేట జలాశయం దిగువన విషాదం.. ఒకే కాలనీకి చెందిన స్నేహితుల బలి**



**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**

చేపల వేటకు వెళ్లిన ముగ్గురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటన గండిపేట జలాశయం దిగువన గల మూసీ నది పరివాహక ప్రాంతంలో చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని ఇబ్రహీంబాగ్‌కు చెందిన కార్తీక్ (25), గోవర్ధన్ (23), వెంకటేష్ (25) ఆదివారం సరదాగా చేపలు పట్టేందుకు వెళ్లారు. అక్కడ నీటి లోతు ఎక్కువగా ఉండటంతో ఊహించని విధంగా ముగ్గురూ నదిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక బృందాల సాయంతో ఆదివారం సాయంత్రం నుంచే గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో గాలింపు కష్టమైనా సోమవారం ఉదయం ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు వాటిని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన ముగ్గురు యువకులు ఒకే కాలనీకి చెందిన స్నేహితులు కావడంతో ఇబ్రహీంబాగ్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. చేతికి వచ్చిన కొడుకులు విగతజీవులుగా పడి ఉండటాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. గాంధీ ఆసుపత్రి వద్ద మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

# మెట్‌పల్లి పాఠశాల వద్ద హనుమాన్ స్వాముల ఆందోళన

**దీక్షా వస్త్రాలతో వచ్చిన విద్యార్థులకు ప్రవేశం నిరాకరణ**

**నిఖిల్ భారత్ స్కూల్ ముందు భక్తుల ధర్నా.. మెట్‌పల్లిలో ఉద్రిక్తత**

**జగిత్యాల, మార్చి 16 (మనసులో మాట):**

మెట్‌పల్లి పట్టణంలోని నిఖిల్ భారత్ స్కూల్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హనుమాన్ దీక్షలో ఉండి దీక్షా వస్త్రాలు ధరించి వచ్చిన ఐదుగురు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం లోపలికి అనుమతించకపోవడంతో వివాదం మొదలైంది. పాఠశాల నియమ నిబంధనల ప్రకారం దీక్షా వస్త్రాలతో రావడం కుదరదని యాజమాన్యం స్పష్టం చేసినట్లు సమాచారం.

### స్కూల్ ముందు ధర్నా

విద్యార్థులను అడ్డుకోవడంపై హనుమాన్ దీక్షలో ఉన్న భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్య చర్యలకు నిరసనగా స్కూల్ ముందు బైఠాయించి ధర్నాకు దిగారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా హనుమాన్ దీక్షా స్వాములు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో ఉద్రిక్తత పెరిగింది. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భక్తులతో, పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి ఈ వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

# సైబర్ నేరగాళ్ల మాయాజాలం

- వృద్ధురాలి ఖాతాకు 88 లక్షల రూపాయల కన్నం
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ నకిలీ వీడియోతో బురిడీ
- కృత్రిమ మేధస్సుతో సృష్టించిన దృశ్యాలను చూసి మోసపోయిన బాధితురాలు




**మల్కాజిగిరి, మార్చి 16 (మనసులో మాట):**

సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులతో ప్రజలను దోచుకుంటున్నారు. తాజాగా దేశ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫోటోలు, వీడియోలను వాడుకుంటూ కేటుగాళ్లు రెచ్చిపోయారు. కృత్రిమ మేధస్సు సాంకేతికతతో సృష్టించిన నకిలీ వీడియోను చూసి నిజమని నమ్మిన ఓ వృద్ధురాలు ఏకంగా 87.96 లక్షల రూపాయలు పోగొట్టుకున్న ఘటన మల్కాజిగిరిలో వెలుగుచూసింది.

### నమ్మించిన నకిలీ వీడియో

బాధిత వృద్ధురాలు సామాజిక మాధ్యమాల్లో వెతుకుతుండగా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ స్టాక్ మార్కెట్ పెట్టుబడుల గురించి వివరిస్తున్నట్లు ఉన్న ఒక వీడియో ఆమె కంటపడింది. అది నకిలీ వీడియో అని తెలియని ఆమె, సాక్షాత్తు మంత్రి గారే చెబుతున్నారు కదా అని నమ్మి ఆ వీడియో లింకును క్లిక్ చేశారు. వెంటనే సైబర్ కేటుగాళ్లు రంగంలోకి దిగారు. బాధితురాలికి వాట్సాప్ కాల్స్ చేసి తాము పెద్ద ట్రేడింగ్ సంస్థ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారు. ఒక నకిలీ యాప్ ద్వారా పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించారు.

### దఫదఫాలుగా దోపిడీ

మొదట నమ్మకం కలిగించడానికి కేవలం 60 వేల రూపాయలు పెట్టుబడి పెట్టించారు. ఆ తర్వాత లాభాలు వస్తున్నట్లు నకిలీ గ్రాఫిక్స్ తో స్క్రీన్ పై చూపించి బాధితురాలిని మభ్యపెట్టారు. అలా దఫదఫాలుగా మొత్తం 87.96 లక్షల రూపాయలు డిపాజిట్ చేయించుకున్నారు. తన ఖాతాలో భారీగా డబ్బు కనిపిస్తుండటంతో బాధితురాలు ఆ మొత్తాన్ని తీసుకోవడానికి ప్రయత్నించారు. అయితే సాంకేతిక కారణాలు చెప్తూ కేటుగాళ్లు ఆమెను అడ్డుకున్నారు. ఎంత ప్రయత్నించినా డబ్బు చేతికి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆ డబ్బు ఏ ఖాతాల్లోకి వెళ్లిందో దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి అనుమానాస్పద లింకులు లేదా కాల్స్ వస్తే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. తెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత గుర్తింపు కార్డులు ఇవ్వకూడదని హెచ్చరించారు.

# గవర్నర్ ప్రసంగం అంతా పచ్చి అబద్ధం

- బీఆర్ఎస్ నేతల ధ్వజం
- ప్రభుత్వం ఇచ్చింది చిత్తు కాగితమే.. ఆరు గ్యారెంటీలను విస్మరించారు
- మహిళలకు 2,500 రూపాయలు, రైతులకు భరోసా ఏమైందంటూ ప్రశ్నలు

**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**

తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం అంతా డొల్ల అని, అదొక చిత్తు కాగితంతో సమానమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన గవర్నర్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్పించిందని మండిపడ్డారు.



### హామీల విస్మరణ

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 వాగ్దానాల ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో లేకపోవడం ప్రజలను మోసం చేయడమేనని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. మహిళలకు ప్రతి నెలా ఇస్తామన్న 2,500 రూపాయల ఊసే లేదని, రెండేళ్లుగా వారిని వంచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు, నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగుల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని దుయ్యబట్టారు.

### ఉద్యోగాల అబద్ధాలు

కేసీఆర్ హయాంలో భర్తీ చేసిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి, తామే కొలువులు ఇచ్చామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని ఆయన ఎద్దేవా చేశారు. కేవలం 12 వేల ఉద్యోగాలకు 60 వేలని అంకెలు చెప్పి గవర్నర్‌ను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఎమ్మెల్యేలు సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి హామీలు అమలయ్యే వరకు అసెంబ్లీలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# నందిని సిద్ధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

**'అనిమేష' కవితా సంపుటికి దక్కిన అత్యున్నత గౌరవం**

**కరోనా కష్టాలు, మానవ సంబంధాల విచ్ఛిన్నతపై అద్భుత రచన**



**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**

ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిద్ధారెడ్డిని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 వరించింది. ఆయన రాసిన 'అనిమేష' కవితా సంపుటికి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం దక్కింది. కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న ఆర్థిక, సామాజిక సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతను ఈ గ్రంథంలో ఆయన హృద్యంగా ఆవిష్కరించారు.

### కాలానికి దర్పణం 'అనిమేష'

ఈ కవితా సంపుటి కరోనా కష్టకాలంలో వలస కూలీల వేదనను, ఒంటరితనాన్ని, సామాజిక కలతలను కళ్లకు కట్టింది. ఇది కేవలం అక్షరాల కూర్పు మాత్రమే కాకుండా ఒక కాలానికి దర్పణంగా నిలిచిందని సాహితీవేత్తలు కొనియాడుతున్నారు. తన కవిత్వం ద్వారా పాఠకుల్లో చైతన్యం నింపడంలో సిద్ధారెడ్డి విజయం సాధించారు.

### ఉద్యమ కవిగా గుర్తింపు

తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్‌గా సేవలు అందించిన సిద్ధారెడ్డి, మంజీరా రచయితల సంఘం ద్వారా ఎందరో కవులను ప్రోత్సహించారు. 'నాగేటి సాల్లల్ల నా తెలంగాణ' వంటి పాటల ద్వారా మలిదశ ఉద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచారు. రాష్ట్ర అస్తిత్వాన్ని, సంస్కృతిని తన కలం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారు.

### కేసీఆర్, కేటీఆర్ అభినందనలు

ఈ అవార్డు దక్కడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సిద్ధారెడ్డి కృషి యావత్ తెలంగాణకే గర్వకారణమని వారు కొనియాడారు. మట్టి వాసన తెలిసిన కవిగా, ఉద్యమకారుడిగా ఆయన ప్రస్థానానికి దక్కిన సముచిత గౌరవం ఇదని అభినందించారు.



# చర్చకు వారం రోజులేనా?

**సమావేశాల నిర్వహణపై హరీశ్ అసంతృప్తి**

**ప్రజా సమస్యలను ప్రభుత్వం నీరుగారుస్తోందని బిఆర్ఎస్ సీనియర్ నేత ఆగ్రహం**

**ఆదివారం సభ నిర్వహించినా తమకు అభ్యంతరం లేదని వెల్లడి**

**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణ తీరుపై బిఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో పనిదినాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇది ప్రజా సమస్యలపై చర్చను నీరుగార్చడమేనని ఆయన ఆరోపించారు. ఈ నెల 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి సభ నడిచేది వారం రోజులు కూడా ఉండదని హరీశ్ రావు పేర్కొన్నారు.

### సెలవులతో తగ్గిన పనిదినాలు

సమావేశాల మధ్యలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పండుగలతో పాటు రెండు ఆదివారాలు వస్తున్నాయని హరీశ్ రావు వివరించారు. ఆ ఐదు సెలవు దినాలను మినహాయిస్తే చర్చకు చాలా తక్కువ సమయం మిగులుతుందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. మార్చి 17, 18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుందని, ఆ తర్వాత మార్చి 20వ తేదీన ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని వెల్లడించారు. బడ్జెట్ వంటి కీలక అంశంపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండా ప్రభుత్వం షెడ్యూల్‌ను కుదించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### చర్చకు సమయం కావాలి

పండుగ సెలవుల వల్ల తగ్గిన పనిదినాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం మార్చి 29వ తేదీ ఆదివారం నాడు కూడా సభను నిర్వహించాలని భావిస్తోంది. దీనిపై స్పందించిన హరీశ్ రావు, ఆదివారం నాడు సభ పెట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమకు కావాల్సింది కేవలం చర్చకు తగిన సమయం మాత్రమేనని, ప్రజల పక్షాన గళం వినిపించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదింపజేసుకోవాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని విమర్శించారు.

# సభకు ఎమ్మెల్యేలంతా హాజరు కావాల్సిందే

- సీఎం రేవంత్ రెడ్డి హుకుం
- ప్రతిపక్షాల ప్రశ్నలకు దీటుగా సమాధానాలు చెప్పేందుకు సిద్ధం కావాలని ఆదేశం
- సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన సభ్యులపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**

శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పార్టీ ఎమ్మెల్యేలను ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు పూర్తి అవగాహన పెంచుకోవాలని, వారికి తగిన సమాచారం అందించేందుకు మంత్రులు సమయం కేటాయించాలని సూచించారు. సోమవారం జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో సీఎం సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలను తిప్పికొట్టేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని దగ్గర ఉంచుకోవాలని చెప్పారు.

### గైర్హాజరీపై సీరియస్

సీఎల్పీ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు రాకపోవడంపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. పార్టీ సమావేశానికి రాలేనంత బిజీగా ఉన్నారా అని నిలదీశారు. ఏదో ఒక సాకుతో సభకు గైర్హాజరు కావడాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. సభ్యులు మీడియా ప్రతినిధులతో ఇష్టానుసారం మాట్లాడవద్దని హెచ్చరించారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక రోడ్ మ్యాప్ లాంటిదని, దాని ఆధారంగానే భవిష్యత్ ప్రణాళికలు ఉంటాయని వివరించారు.

### గత పాలనపై విమర్శలు

గతంలో కేసీఆర్ హయాంలో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇచ్చేవారు కాదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అప్పట్లో సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇచ్చేవారు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కూడా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సభకు రాకుండా సస్పెండ్ చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఉందని, చర్చల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యులు చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని మార్గనిర్దేశం చేశారు.

### ప్రజా సమస్యలపై దృష్టి

ప్రస్తుత రోడ్ మ్యాప్ వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను, ఎమ్మెల్యేలను ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని, పార్టీ లైన్ దాటి ఎవరూ స్పందించకూడదని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే యాదయ్యకు ఏబీవీపీ వినతి
- దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థి సంఘం డిమాండ్



**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**

చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. మండలంలోని విద్యా సమస్యలను, విద్యార్థుల ఇబ్బందులను ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు.

### దూర భారాల చదువు

శంకర్‌పల్లి మండలం, పరిసర గ్రామాల్లో ప్రతి ఏటా ఇంటర్మీడియట్ పూర్తి చేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. అయితే మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు పైచదువుల కోసం హైదరాబాద్, సంగారెడ్డి వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇది విద్యార్థులకు తీవ్ర సమయం, ధన వృధాకు కారణమవుతోందని ఏబీవీపీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

### పేద విద్యార్థుల ఇబ్బందులు

ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేతలు పేర్కొన్నారు. స్థానికంగా కళాశాల ఉంటే పేద విద్యార్థులకు ఉన్నత విద్య సులభంగా అందుబాటులోకి వస్తుందని, మండల విద్యా అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఏబీవీపీ సేవా విభాగ్ కన్వీనర్ హృషికేష్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. శంకర్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు దిశగా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలి

- కనీస వేతనం 26 వేల రూపాయలు చేయాలని సిఐటియు నేతల వినతి
- ఐదు నెలల బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని నిరసన



**గజ్వేల్, మార్చి 16 (మనసులో మాట):**

పెరుగుతున్న ఖర్చులు, గృహ అవసరాలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచి అమలు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు సోమవారం వినతి పత్రం అందజేశారు. గత ఐదు సంవత్సరాలుగా వేతనాలు పెరగలేదని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకడంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### కార్మికుల క్రమబద్ధీకరణ

ఏళ్ల తరబడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, రోజువారీ కూలీలుగా పని చేస్తున్న కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని ఎల్లయ్య డిమాండ్ చేశారు. సుమారు 40 మంది కార్మికులకు గత ఐదు నెలలుగా జీతాలు అందలేదని, వారి కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న ముంపు గ్రామాల కార్మికులకు మున్సిపల్ జీఓ ప్రకారం పెంచిన వేతనాలను వర్తింపజేయాలని కోరారు.

### సౌకర్యాల కల్పన

కార్మికులందరికీ చట్టపరంగా అందాల్సిన పి ఎఫ్, ఇ ఎస్ ఐ వంటి సౌకర్యాలను కచ్చితంగా అమలు చేయాలని నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, యూనియన్ నాయకులు సంగపురం యాదగిరి, బచ్చలి కుమార్, నర్సింలు, స్వామి, సంతోష్ కుమార్, బాలయ్య, మల్లయ్య పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మాజీ సర్పంచ్ పేరి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం రాగిజావ పంపిణీ

**యాలాల, మార్చి 16 (మనసులో మాట):**

సోమవారం యాలాల మండల కేంద్రంలోని చలివేంద్రంలో కీర్తిశేషులు, మాజీ సర్పంచ్ పేరి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పేరి రాజేందర్ రెడ్డి రాగిజావ పంపిణీ చేశారు. మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులుగా ఉన్న రాజేందర్ రెడ్డి తన తండ్రి స్మృత్యర్థం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, 6వ వార్డు సభ్యులు శేఖర్, దూస చంద్రశేఖర్, వార్ల సులేమన్, మ్యాదరి వేణు, నర్సిరెడ్డి, బుర్నపూరి నర్సింహులు పాల్గొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా బాటసారులకు రాగిజావ పంపిణీ చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం

**కారుపై దూసుకెళ్లిన కంటెయినర్, ఇద్దరు మృతి**

**భోజనం కోసం రోడ్డు పక్కన ఆగిన స్నేహితులపైకి దూసుకొచ్చిన మృత్యువు**

**మద్యం మత్తులో వాహనం నడిపిన కంటెయినర్ డ్రైవర్ అరెస్టు**




**మేడ్చల్, మార్చి 16 (మనసులో మాట):**

ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన భోజనం కోసం కారు ఆపడమే ఆ ఇద్దరి పాలిట శాపమైంది. వేగంగా వచ్చిన ఒక కంటెయినర్ రూపంలో మృత్యువు వారిని కబళించింది. కారు నిలిపి భోజనం చేస్తున్న సమయంలో వెనుక నుంచి కంటెయినర్ బలంగా ఢీకొట్టడంతో, కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.

### అక్కడికక్కడే దుర్మరణం

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మౌలాలి ప్రాంతానికి చెందిన మహ్మద్ యూసుఫ్ ఖాన్ (51), కాప్రా సాకేత్‌కు చెందిన హుస్సేన్ (53) స్నేహితులు. వీరు ఆడి కారులో ప్రయాణిస్తూ శామీర్‌పేట సమీపంలో ఓఆర్ఆర్ పై కారును పక్కకు ఆపారు. కారు దిగి పక్కనే నిలబడి భోజనం చేస్తుండగా, వెనుక నుంచి అతి వేగంతో వచ్చిన కంటెయినర్ వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శామీర్‌పేట పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. కంటెయినర్ డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడిపినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం

**ఎగిసిపడుతున్న మంటలు**

**ఫలక్‌నుమా బస్‌డిపో సమీపంలోని ఫర్నిచర్ దుకాణాల్లో అగ్నికీలలు**

**పక్కనే గ్యాస్ గోదాం ఉండటంతో అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది**



**హైదరాబాద్, మార్చి 16 (మనసులో మాట):**

నగరంలోని ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరూక్‌నగర్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక బస్‌డిపో పక్కన ఉన్న ఒక దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు క్రమంగా పక్కనే ఉన్న ఫర్నిచర్ షాపుతో పాటు ఇతర దుకాణాలకు వేగంగా విస్తరించాయి. నల్లటి పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

### గ్యాస్ గోదాం వద్ద ఉత్కంఠ

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వాహనాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. ప్రమాదం జరిగిన చోటికి అతి సమీపంలోనే ఇండేన్ గ్యాస్ గోదాం ఉండటంతో పోలీసులు, అగ్నిమాపక అధికారులు తీవ్రంగా అప్రమత్తమయ్యారు. మంటలు అటువైపు వ్యాపించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు ఈ ప్రమాదంలో ఫర్నిచర్ దుకాణాల్లోని సామాగ్రి పూర్తిగా కాలి బూడిదైనట్లు తెలుస్తోంది. ఆస్తి నష్టం భారీగానే ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# అక్రమ అరెస్టులను ఆపాలి

**సిఐటియు డిమాండ్**

**గజ్వేల్, మార్చి 16 (మనసులో మాట):**



రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాలను కాపాడాలని, లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. అంగన్వాడీ కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, వేతనాలను పెంచాలని ఎల్లయ్య కోరారు. పని భారాన్ని తగ్గించాలని, పిల్లలకు ఫోటో క్యాప్చర్ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా అంగన్వాడీ టీచర్లకు డీఏలు ఇవ్వడం లేదని, గ్యాస్ బిల్లులు కూడా అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. గజ్వేల్ ప్రాజెక్టు పరిధిలో 30కి పైగా అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయకపోవడంతో మిగిలిన వారిపై పని భారం పెరుగుతోందని ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ టీచర్లపై జరుగుతున్న వేధింపులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. పేదలు, బలహీన వర్గాలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భాషయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు విజయ, సుభద్ర, కవిత తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మానవాళికి ముప్పుగా మారిన యుద్ధాన్ని ఆపాలి

**పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి**

**మోదీ ప్రభుత్వ తీరుపై సీపీఐ నేత సామిడి శేఖర్ రెడ్డి ధ్వజం**



**ఎల్బీనగర్, మార్చి 16 (మనసులో మాట):**

పెరిగిన వంట గ్యాస్, పెట్రోల్, నిత్యావసరాల ధరలకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎల్బీనగర్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సోమవారం హయత్‌నగర్ తహశీల్దార్ కార్యాలయం వద్ద భారీ నిరసన చేపట్టారు. హయత్ నగర్ మండల సహాయ కార్యదర్శి మర్రి శోభన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధోన్మాదం కేవలం ఆ దేశాలకే కాకుండా యావత్ ప్రపంచానికే అతిపెద్ద ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాల ద్వారా ప్రపంచ దేశాలను భయపెట్టి తమ గుప్పిట్లో పెట్టుకోవాలని అమెరికా సామ్రాజ్యవాద కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తోందని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కార్పొరేట్ల జేబుల్లోకి సామాన్యుడి సొమ్ము

ఒకప్పుడు నాలుగు వందల రూపాయలు ఉన్న వంట గ్యాస్ ధరను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వెయ్యి రూపాయలకు చేర్చిందని, ఇప్పుడు యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ రాత్రికి రాత్రే మరో అరవై రూపాయలు పెంచి సామాన్యుడి నెత్తిన పెద్ద గుదిబండ మోపారని శేఖర్ రెడ్డి విమర్శించారు. సామాన్యుల రక్తం తాగుతూ వసూలు చేస్తున్న ఈ అదనపు డబ్బు నేరుగా కార్పొరేట్ చమురు కంపెనీల జేబుల్లోకే వెళ్తోందని ఆరోపించారు. దళారులకు వత్తాసు పలకడం ఆపకపోతే రాబోయే రోజుల్లో పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు.

## ప్రపంచ శాంతి కోసం గళమెత్తాలి

యావత్ మానవాళికి నష్టం చేకూర్చే ఈ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని, ప్రపంచ శాంతి కోసం అన్ని దేశాలు కలిసికట్టుగా పాటుపడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల భజన మాని దేశ ప్రజల ప్రయోజనాల కోసం నోరు విప్పాలని, అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ శాంతిని డిమాండ్ చేయాలని స్పష్టం చేశారు. పెంచిన గ్యాస్ ధరను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ హయత్‌నగర్ మండల తహశీల్దార్ జానకికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కార్యదర్శి బోయపల్లి రాములు గౌడ్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, సీపీఐ సీనియర్ నాయకులు ఆంజనేయులు, డీహెచ్ పీఎస్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వాయి సురేందర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మండల కార్యదర్శి కొప్పుల సరిత, డీహెచ్ పీఎస్ మండల కార్యదర్శి మంద ఆదిలక్ష్మి, సోషల్ మీడియా కార్యదర్శి ఏషమళ్ళ మమత, వివిధ శాఖల కన్వీనర్లు అనిత, సౌజన్య, కళ్యాణి, సుజాత, పద్మ, బాలరాజు, చంటి వెంకట్, అంకన్న, సోమన్న, రమేష్, సామేలు, ప్రజాసంఘాల నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ నైపుణ్యాలు అందించడమే మా లక్ష్యం

**హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో ముగిసిన సర్టిఫికెట్ కోర్సు**

**విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందజేసిన ప్రిన్సిపాల్ సురేష్ బాబు**



**ఎల్బీనగర్, మార్చి 16 (మనసులో మాట):**

హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సహకారంతో "కృత్రిమ మేధస్సు (ఏఐ) జీవితం, ఉద్యోగ నైపుణ్యాల మూలాలు" అనే సర్టిఫికెట్ కోర్సును విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు కృత్రిమ మేధస్సు గురించి అవగాహన కల్పించడంతో పాటు పోటీ ప్రపంచంలో అవసరమైన జీవిత, ఉద్యోగ నైపుణ్యాలను అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని వివరించారు.

## నైపుణ్యాల పెంపు

ఈ కోర్సులో విద్యార్థులు పలు అంశాలపై జరిగిన చర్చలు, నైపుణ్యాల నిర్మాణ కార్యకలాపాలు, ఆచరణాత్మక అభ్యాస విధానాల్లో చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో డిజిటల్ అవగాహన, భావవ్యక్తీకరణ, భవిష్యత్ ఉపాధికి అవసరమైన సంసిద్ధతను పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతగానో సహాయపడింది. అనంతరం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను ప్రదానం చేశారు. మెరుగైన ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు వృద్ధి కోసం ఆధునిక నైపుణ్యాలతో విద్యార్థులను సిద్ధం చేయాలన్న కళాశాల నిబద్ధతకు ఈ చొరవ నిదర్శనమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## పీజీ ఆంగ్ల తరగతుల ప్రారంభం

కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో పీజీ (ఎంఏ ఇంగ్లీష్) కోచింగ్ తరగతులను కూడా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల ఆసక్తి మేరకు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారికి ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ డి. మాక్లా, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ మధు ధర్మపురి, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎ. దుర్గ ప్రసాద్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి. నరసింహ, డాక్టర్ పి. విజయలక్ష్మి, డాక్టర్ జి. ప్రవీణ్ కుమార్, టీఎస్కేసీ మెంటార్ వి. నాగరాజు, సర్టిఫికెట్ కోర్సు ఇన్‌ఛార్జి డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

# అదానీ కోసమే మోదీ ట్రంప్ భజన

- సీపీఐ నేత ఆందోజు రవీంద్ర చారి ధ్వజం
- ఇరాన్ పై దాడులను నిరసిస్తూ అబ్దుల్లాపూర్ మెట్ లో ధర్నా
- గ్యాస్ ధరల పెంపుతో సామాన్యులపై భారమంటూ నిప్పులు



**రంగారెడ్డి జిల్లా, మార్చి 16 (మనసులో మాట):**

అమెరికాలో అదానీ గ్రూప్ పైన నమోదైన కేసుల నుండి పెట్టుబడిదారుడు అదానీని కాపాడటం కోసమే దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా భజన చేస్తూ ట్రంప్ ముందు మోకరిల్లారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి విమర్శించారు. ఇరాన్ పైన అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న ఏకపక్ష యుద్ధానికి నిరసనగా సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవీంద్ర చారి తో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు.

## పెరుగుతున్న ధరల భారం

ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ ఇరాన్, అమెరికా యుద్ధం కారణంగా మన దేశంలో గ్యాస్ ధరలు అధికంగా పెరిగాయని మండిపడ్డారు. వంట గ్యాస్ సిలిండర్ పైన 60 రూపాయలు, వాణిజ్య సిలిండర్ పైన 100 రూపాయలకు పైగా పెంచి సామాన్యులపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత దేశ మిత్ర దేశం అయిన ఇరాన్ పైన దాడి చేసి ఆ దేశాధినేత ఖమేనీని క్రూరంగా హత్య చేసిన నియంత పోకడలను ఖండించకుండా మోదీ ఇప్పటికీ ట్రంప్ భజన చేస్తున్నారని విమర్శించారు. యుద్ధం పైన, ఖమేనీ హత్య పైన స్పందించలేని అసమర్థ ప్రధాని నరేంద్ర మోదీ అని దుయ్యబట్టారు.

## శాంతిని నెలకొల్పాలి

ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో ఏ ఒక్క ఆర్ ఎస్ ఎస్ కార్యకర్త కూడా పాల్గొనలేదని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే అణగారిన వర్గాల పైన దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఇరాన్ పైన అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఆపివేసి శాంతిని నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పబ్బతి లక్ష్మణ్, అజ్మీరా హరిసింగ్ నాయక్, అరుణ, నవనీత, రవి, డౌల రాములు, ఈశ్వర్, యాదగిరి, మధు, సైదులు ముదిరాజ్, భైరగోని రాజు గౌడ్, గణేష్, రమేష్, రవి, రమేష్ నాయక్, గోపి, దేవమ్మ, క్రాంతి, లక్ష్మి, వీరేష్, సుధాకర్, రాములు, అడవయ్య, శ్రీను, పాండు, రేణుక, కావేరి, నీలా, అనుష పాల్గొన్నారు.

# పాఠశాలలో మహా వృక్షాల నరికివేత కలకలం

## వాల్టా చట్టానికి తూట్లు

- చెట్లు నాటాలని చెప్పే ఉపాధ్యాయులే నరికేశారు
- కొమ్మలు తొలగించేందుకు కూలీలుగా మారిన విద్యార్థులు
- అధికారుల నిర్లక్ష్యం.. కేవలం జరిమానాతో సరిపెట్టే యత్నం






**నల్లగొండ, మార్చి 16 (మనసులో మాట ప్రతినిధి):ల**

ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుంటే.. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పట్టణ గురుకుల ఆంగ్ల మాధ్యమ బాలుర పాఠశాలలో ఓ విస్తుపోయే ఘటన చోటుచేసుకుంది. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులే.. ఏపుగా పెరిగిన మహా వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికేశారు.

## సెలవు దినాల్లో గుట్టుచప్పుడు కాకుండా..

ఈ పాఠశాల ఆవరణలో ఎన్నో ఏళ్లుగా వేప చెట్లు పచ్చదనాన్ని, నీడను ఇస్తున్నాయి. అయితే ఆదివారం నాడు సెలవు కావడంతో అక్కడ విధులు నిర్వహించే ప్రత్యేక అధికారిణి అంజలి పర్యావరణానికి పెను ప్రమాదం తలపెట్టారు. అక్కడి చెట్లను గుట్టుచప్పుడు కాకుండా ఓ గుత్తేదారుకు అమ్మకానికి పెట్టారు. వారు కొన్ని గంటల్లోనే భారీ వృక్షాలను నేలకూల్చారు. ప్రతిరోజూ విద్యార్థులకు ఆహ్లాదాన్ని ఇచ్చే వాతావరణం పూర్తిగా కలుషితమైంది. వృక్షో రక్షతి రక్షితః అనే మాటలు కేవలం పుస్తకాలకే పరిమితం అయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు. చెట్లు ఎండిపోయేలా ముందుగానే వాటి మొదళ్లలో యాసిడ్, బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వాల్టా

## చట్టానికి తూట్లు.. జరిమానాతో సరిపెడతారా?

చెట్లు నరకాలంటే రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరి. కానీ ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే వాల్టా చట్టానికి తూట్లు పొడిచారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ అధికారులు చెట్ల నరికివేతపై యాభై వేల రూపాయలు జరిమానా విధించగా.. పాఠశాల అధికారిణి ముప్పై వేలు కట్టేలా బేరసారాలు ఆడినట్లు సమాచారం. కేవలం జరిమానాతో సరిపెడతారా లేక వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తారా అన్నది వేచి చూడాలి. ఇదంతా అధికారుల వాటాల పంపకాల కోసమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## కూలీలుగా మారిన విద్యార్థులు

ఈ ఘటనలో మరో దారుణమైన విషయం ఏమిటంటే.. చెట్లు నరికిన తర్వాత ఆ కొమ్మలను పక్కకు వేయడానికి ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులను వాడుకున్నారు. కొద్దిగా డబ్బులు ఆశచూపి వారితో ఈ కూలీ పని చేయించినట్లు తెలిసింది. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఇంత దారుణం జరుగుతుంటే విద్యాశాఖ ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## ఎండల తీవ్రతతో ఇబ్బందులు: ప్రధాన వంటమనిషి మంజుల

చెట్లు ఉన్నప్పుడు వాతావరణం చాలా చల్లగా ఉండేదని, ఇప్పుడు వాటిని కొట్టేయడంతో వంట చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని పాఠశాల ప్రధాన వంటమనిషి మంజుల ఆవేదన వ్యక్తం చేశారు. తాగే మంచినీళ్లు కూడా వేడెక్కుతున్నాయని, వండిన అన్నం, కూరలు పాడయ్యే అవకాశం ఉందని ఆమె తెలిపారు. చెట్ల మొదళ్లలో యాసిడ్ పోసినట్లు పిల్లలు మాట్లాడుకుంటుంటే తాను విన్నానని ఆమె చెప్పారు. ఈ విషయంపై పాఠశాల ప్రత్యేక అధికారిణి అంజలిని వివరణ అడగగా.. అనుమతులు తీసుకోవాలన్న విషయం తెలియక కొట్టివేసినట్లు బదులిచ్చారు. దీనిపై జిల్లా అటవీ శాఖ అధికారికి, విద్యాశాఖ అధికారికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా వారు స్పందించలేదు.







# కోలుకున్న మార్కెట్లు

## సెన్సెక్స్, నిఫ్టీలకు భారీ లాభాలు!

- గత వారపు నష్టాల నుంచి అనూహ్య రికవరీ
- 939 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్.. 258 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- తక్కువ ధరల్లో ఉన్న షేర్లను కొనుగోలు చేసేందుకు మదుపర్ల ఆసక్తి
- బ్యాంకింగ్, ఆటో రంగాల అండతో లాభాల బాట
- అయినా సరే.. ముడి చమురు ధరలతో పొంచి ఉన్న ముప్పు

**భారత దలాల్ స్ట్రీట్ మళ్లీ పుంజుకుంది. గత వారం వరుసగా కుప్పకూలిన సూచీలు మార్చి 16 సోమవారం నాడు అనూహ్యంగా కోలుకున్నాయి. ఉదయం నుంచే సానుకూల పవనాలు వీచాయి. సెన్సెక్స్ ఒక దశలో కిందటి స్థాయి నుంచి 1,500 పాయింట్లకు పైగా ఎగబాకడం విశేషం. లాభాల స్వీకరణతో కాస్త వెనక్కి తగ్గినప్పటికీ చివరికి 939 పాయింట్ల భారీ లాభంతో 75,502 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ కూడా ఏమాత్రం తగ్గకుండా 258 పాయింట్లు పెరిగి 23,408 వద్ద ముగిసింది. మార్కెట్లు ఇంతలా కోలుకోవడానికి దారితీసిన పరిస్థితులపై ఒక విశ్లేషణ..**




బిజినెస్ డెస్క్ - మనసులో మాట

మార్కెట్లలో సోమవారం ఇంతటి సానుకూల వాతావరణం కనిపించడానికి ప్రధాన కారణం ఇన్వెస్టర్ల వ్యూహమే. గత కొద్ది రోజులుగా జరిగిన అమ్మకాల ఒత్తిడితో చాలా మంచి కంపెనీల షేర్ల ధరలు భారీగా పడిపోయాయి. సరిగ్గా ఇదే అదనుగా భావించిన పెట్టుబడిదారులు, తక్కువ ధరకు వస్తున్న నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. దీనికి తోడు దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు సైతం భారీగా నిధులను షేర్లలోకి మళ్లించారు. దీంతో ఒక్కసారిగా కొనుగోళ్ల మద్దతు లభించి సూచీలు పైకి లేచాయి.

### అంతర్జాతీయ మార్కెట్ల అండ

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా సద్దుమణగలేదు. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతూనే ఉంది. అయితే కీలకమైన సముద్ర మార్గాల్లో చమురు రవాణాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూస్తామని అమెరికా భరోసా ఇవ్వడం మార్కెట్లకు కాస్త ఊరటనిచ్చింది. ఈ ప్రకటనతో ఆసియా, యూరప్ మార్కెట్లలో సానుకూల స్పందన కనిపించింది. ఆ ప్రభావం మన దేశీయ మార్కెట్లపైనా పడి లాభాలకు బాటలు వేసింది.

### జోరు చూపించిన బ్యాంకింగ్, ఆటో రంగాలు

సోమవారం నాటి ట్రేడింగ్ లో ప్రధానంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగాలు అదరగొట్టాయి. ఆయా రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీల షేర్లు కొనుగోళ్ల మద్దతుతో భారీ లాభాలను గడించాయి. ఫార్మా, ఐటీ రంగాలు సైతం తమ వంతు సహకారం అందించాయి. ఎంపిక చేసిన కొన్ని మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లలోనూ మదుపర్లు భారీగా పెట్టుబడులు పెట్టడంతో అన్ని రంగాలు దాదాపుగా పచ్చబడ్డాయి.

### పొంచి ఉన్న ముడి చమురు ముప్పు

మార్కెట్లు ఒక్కరోజు లాభపడినంత మాత్రాన ప్రమాదం పూర్తిగా తప్పినట్లు కాదు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్ కు 100 డాలర్లు దాటి ట్రేడ్ అవుతున్నాయి. ఇవి ఇలాగే కొనసాగితే దేశంలో ఇంధన ధరలు, నిత్యావసరాల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం ఎగబాకే ప్రమాదం ఉంటుంది. అది నేరుగా కంపెనీల లాభాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రానున్న రోజుల్లో మార్కెట్లలో తీవ్రమైన ఆటుపోట్లు ఎదురయ్యే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మదుపర్లు తొందరపడి ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టకుండా, ఆచితూచి అడుగులు వేయడం మంచిదని సూచిస్తున్నారు.

# పన్ను ఆదాకు ఆఖరి అవకాశం

## పెట్టుబడులకు మార్చి 31 వరకే గడువు!




- ఆర్థిక సంవత్సరం ముగింపునకు కౌంట్ డౌన్ షురూ
- పాత పన్ను విధానం ఎంచుకున్న వారికి లాభదాయకమైన మార్గాలు
- సెక్షన్ 80సీ కింద రూ. 1.5 లక్షల వరకు మినహాయింపులు
- పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, సుకన్య సమృద్ధి యోజనల్లో ఆకర్షణీయమైన రాబడులు

బిజినెస్ డెస్క్ - మనసులో మాట

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ముగియడానికి కేవలం 15 రోజులు మాత్రమే మిగిలి ఉంది. పాత పన్ను విధానం ఎంచుకున్న వేతనజీవులు, వ్యాపారులు తమ ఆదాయపు పన్నును ఆదా చేసుకునేందుకు ఇదే ఆఖరి అవకాశం. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద గరిష్టంగా రూ. 1,50,000 వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు. ఆఖరి నిమిషంలో ఎక్కడ పెట్టుబడి పెట్టాలో అర్థం కాక గందరగోళానికి గురికాకుండా.. సురక్షితమైన, లాభదాయకమైన కొన్ని ప్లాన్స్ వివరాలు ఇక్కడ చూద్దాం.

### పీపీఎఫ్ (పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్)

దీర్ఘకాలిక పెట్టుబడులకు, ముఖ్యంగా ఎలాంటి రిస్క్ వద్దు అనుకునే వారికి ఇది అత్యుత్తమ ఎంపిక. ఇందులో పెట్టిన పెట్టుబడికి, ప్రతి ఏటా వచ్చే వడ్డీకి, గడువు తీరాక చేతికి వచ్చే మొత్తం డబ్బుకు ఎలాంటి పన్ను పడదు. దీనినే 'ఎగ్జెంప్ట్-ఎగ్జెంప్ట్-ఎగ్జెంప్ట్' అంటారు. పోస్టాఫీసుల్లో, బ్యాంకుల్లో ఈ ఖాతాను సులభంగా తెరవచ్చు. పన్ను ఆదా ప్రయోజనాలతో పాటు ప్రభుత్వ గ్యారెంటీ ఉండటం దీని ప్రత్యేకత.

### ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)

స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ ఇవి. పన్ను ఆదా చేసే పథకాల్లో అత్యంత తక్కువ లాక్-ఇన్ పీరియడ్ (కేవలం 3 ఏళ్లు) ఉన్నది దీనికే. సెక్షన్ 80సీ కింద పెట్టుబడికి పన్ను ఆదా అవుతుంది. ద్రవ్యోల్బణాన్ని మించి లాభాలు పొందాలనుకునే వారికి, కాస్త రిస్క్ తీసుకోవడానికి ఆసక్తి ఉన్న యువతకు ఇది మంచి ఆప్షన్.

### సుకన్య సమృద్ధి యోజన

మీ ఇంట్లో పదేళ్ల లోపు వయసున్న ఆడపిల్ల ఉంటే, ఆమె ఉన్నత చదువులు, పెళ్లి ఖర్చుల కోసం ఈ పథకంలో ఖాతా తెరవడం ఉత్తమం. పోస్టాఫీసు లేదా బ్యాంకుల్లో ఖాతా ప్రారంభించవచ్చు. ఇందులో పెట్టే పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం ఆకర్షణీయమైన వడ్డీని అందిస్తోంది. అలాగే సెక్షన్ 80సీ ప్రయోజనాలు కూడా వర్తిస్తాయి.

### జాతీయ పింఛను పథకం (ఎన్పీఎస్)

పదవీ విరమణ తర్వాత ఎవరిపైనా ఆధారపడకుండా ఆర్థిక భద్రత పొందడానికి ఇది అద్భుతమైన పథకం. ఇందులో అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే.. సెక్షన్ 80సీ కింద వచ్చే 1.5 లక్షల మినహాయింపునకు అదనంగా, సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద మరో రూ. 50,000 వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

### ఆరోగ్య బీమా (హెల్త్ ఇన్సూరెన్స్)

ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి. సెక్షన్ 80డీ కింద మీ కోసం, మీ కుటుంబ సభ్యుల కోసం తీసుకునే ఆరోగ్య బీమా ప్రీమియంపై రూ. 25,000 వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. వృద్ధులైన తల్లిదండ్రులకు (60 ఏళ్లు పైబడిన వారు) హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటే అదనంగా మరో రూ. 50,000 వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది.

పైన పేర్కొన్న పన్ను ఆదా పెట్టుబడులన్నీ పాత పన్ను విధానం (ఓల్డ్ ట్యాక్స్ రెజీమ్) ఎంచుకున్న వారికి మాత్రమే వర్తిస్తాయి. మీరు కొత్త పన్ను విధానం (న్యూ ట్యాక్స్ రెజీమ్) ఎంచుకుని ఉంటే.. ఇలాంటి పెట్టుబడుల ద్వారా ఎలాంటి పన్ను మినహాయింపులు లభించవన్న విషయాన్ని కచ్చితంగా గుర్తుంచుకోవాలి.

# పసిడిపై పశ్చిమాసియా సెగ

- నేలచూపుల్లో బంగారం, వెండి!
- భగ్గుమంటున్న ముడి చమురు ధరలతో ద్రవ్యోల్బణం ఆందోళనలు
- వడ్డీ రేట్ల తగ్గింపు ఇప్పట్లో లేనట్టేనన్న మార్కెట్ అంచనాలు
- అంతకంతకూ బలపడుతున్న డాలర్.. పడిపోతున్న పసిడి డిమాండ్
- హైదరాబాద్ మార్కెట్లో రూ. 1.60 లక్షలకు చేరిన తులం బంగారం
- ఈ వారం జరగనున్న కీలక దేశాల సెంట్రల్ బ్యాంకుల సమావేశాలపై ఉత్కంఠ




బిజినెస్ డెస్క్ - మనసులో మాట

పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ వాతావరణం పసిడి, వెండి ధరలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమంటుండటంతో ద్రవ్యోల్బణం మళ్లీ ఎగబాకుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రతికూల పరిస్థితుల్లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ తో పాటు ఇతర దేశాల కేంద్ర బ్యాంకులు ఇప్పట్లో వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఏమాత్రం కనిపించడం లేదు. మరోవైపు డాలర్ విలువ అంతకంతకూ బలపడుతుండటం కూడా విలువైన లోహాల డిమాండ్ పై దెబ్బకొడుతోంది. సాధారణంగా వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నప్పుడు బంగారం, వెండి కొనుగోళ్లు నెమ్మదిస్తాయి. అదే వడ్డీ రేట్లు తగ్గితే వాటికి గిరాకీ అమాంతం పెరుగుతుంది.

### దిగివచ్చిన ధరలు..

ఈ తాజా పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 5002 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఔన్సు వెండి ధర 79 డాలర్లకు చేరింది. ఇక డాలర్ తో పోలిస్తే మన రూపాయి మారకం విలువ 92.38 గా నమోదైంది. గ్లోబల్ మార్కెట్ల ప్రభావంతో దేశీయంగానూ పసిడి, వెండి ధరలు పతనమయ్యాయి. మధ్యాహ్నం 1 గంట సమయానికి హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛమైన మేలిమి బంగారం ధర రూ. 1.60 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ. 2.58 లక్షలు పలుకుతోంది.

### ఫ్యూచర్స్ లోనూ పతనం..

దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్ (మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్) లో కూడా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. మే నెలలో డెలివరీ ఇవ్వాల్సిన కిలో వెండి కాంట్రాక్టు ధర రూ. 4,232 క్షీణించి రూ. 2,55,203 వద్ద ట్రేడ్ అవుతోంది. ఏప్రిల్ నెలకు సంబంధించిన 10 గ్రాముల బంగారం కాంట్రాక్టు 1.5 శాతం పడిపోయి రూ. 1.56 లక్షల వద్ద నిలిచింది.

### ఆ సమావేశాలపైనే అందరి దృష్టి..

కాగా, ఈ వారంలో అమెరికా ఫెడ్, బ్యాంక్ ఆఫ్ జపాన్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, పీపుల్స్ బ్యాంక్ చైనా లాంటి కీలక బ్యాంకులు వడ్డీ రేట్లపై ఒక నిర్ణయం తీసుకోనున్నాయి. పెట్టుబడిదారులంతా ఈ సమావేశాల వైపే ఆసక్తిగా చూస్తున్నారు. ప్రత్యేకించి అమెరికా ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ తీసుకునే నిర్ణయం మార్కెట్లకు అత్యంత కీలకం కానుంది. అయితే, ఈ మార్చి నెలలో వడ్డీ రేట్లలో ఎలాంటి కోత ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి.

# ఫోన్‌పే పబ్లిక్ ఇష్యూ వాయిదా!

- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో షేర్ మార్కెట్లలో భారీ ఒడుదొడుకులు
- సెబీ అనుమతి ఉన్నా లిస్టింగ్ కు బ్రేక్ వేసిన వాల్‌మార్ట్ సంస్థ
- రూ. 10,000 కోట్లకు పైగా నిధుల సమీకరణ ప్రణాళికకు తాత్కాలిక విరామం
- మార్కెట్లలో స్థిరత్వం వచ్చాకే ముందుకెళ్తామన్న ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్




బిజినెస్ డెస్క్ - మనసులో మాట

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రైమరీ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల వల్ల షేర్ మార్కెట్లలో భారీగా ఒడుదొడుకులు నెలకొన్నాయి. దీంతో కొత్తగా స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టి నిధులు సమీకరించాలనుకుంటున్న కంపెనీలు తమ ప్రణాళికలను మార్చుకుంటున్నాయి. తాజాగా వాల్‌మార్ట్ నేతృత్వంలోని ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే తన పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ దక్కినప్పటికీ, పరిస్థితులు చక్కబడే వరకు వేచి చూడాలని నిర్ణయించుకుంది. మార్కెట్లలో మళ్లీ స్థిరత్వం వచ్చాకే లిస్టింగ్ ప్రక్రియను మొదలుపెడతామని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. త్వరలోనే ఈ అనిశ్చితి తొలగిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### రూ. 10,000 కోట్ల లక్ష్యానికి బ్రేక్

డిజిటల్ పేమెంట్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న ఫోన్‌పే 2016లో ప్రారంభమైంది. 2025 సెప్టెంబర్ 30 నాటికి ఈ యాప్ కు ఏకంగా 65 కోట్ల మంది రిజిస్టర్డ్ యూజర్లు ఉన్నారు. లావాదేవీలు నిర్వహించే 4.7 కోట్ల మంది వ్యాపారులతో (మర్చంట్లు) అతిపెద్ద నెట్ వర్క్ ను ఇది కలిగి ఉంది. కేవలం డిజిటల్ చెల్లింపులకే పరిమితం కాకుండా ఇన్సూరెన్స్ రంగంలో కూడా సేవలు అందిస్తోంది. దీనికి తోడు స్టాక్ బ్రోకింగ్ కోసం 'షేర్‌మార్కెట్' యాప్ ను, గూగుల్ కు ప్రత్యామ్నాయంగా 'ఇండస్ యాప్ స్టోర్' ను కూడా ఫోన్‌పే సొంతంగా నిర్వహిస్తోంది. తన వ్యాపార విస్తరణలో భాగంగా ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ. 10,000 కోట్లకు పైగా నిధులను సమీకరించాలని ఈ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు ఆ బృహత్తర ప్రణాళికకు మార్కెట్ పరిస్థితుల వల్ల తాత్కాలికంగా బ్రేక్ పడింది.

### వేచి చూస్తున్న మరో 141 కంపెనీలు

ప్రస్తుత భౌగోళిక ఉద్రిక్తతల దెబ్బ కేవలం ఫోన్‌పేకే పరిమితం కాలేదు. ఐపీఓకు రావడానికి సిద్ధంగా ఉన్న మరికొన్ని కంపెనీలు సైతం తమ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నాయి. సెబీ నుంచి అనుమతులు పొంది, లిస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సంస్థలు ఏకంగా 141 వరకు ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ కలిసి పబ్లిక్ ఇష్యూల ద్వారా రూ. 1.64 లక్షల కోట్లను సమీకరించాల్సి ఉంది. ఇందులో దాదాపు 80 కంపెనీలకు ఐపీఓను మార్కెట్లోకి తీసుకురావడానికి ఇంకా 3 నుంచి 9 నెలల గడువు మాత్రమే మిగిలి ఉంది. అయినా సరే, మార్కెట్ తీవ్రంగా ఊగిసలాడుతున్న ప్రస్తుత తరుణంలో రిస్క్ తీసుకోవడం ఎందుకని ఆయా సంస్థలన్నీ ఆచితూచి అడుగులు వేస్తున్నాయి.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# పవిత్ర గ్రంథం ఖురాన్

## శతాబ్దాల చరిత్రను మోసుకొచ్చిన ఆధ్యాత్మిక మార్గదర్శి



"మానవజాతికి నైతిక విలువలు, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించే పవిత్ర గ్రంథం ఖురాన్.! శతాబ్దాల చరిత్రను దాటుకుంటూ ప్రపంచంలోని అనేక దేశాలలో అరుదైన ఖురాన్ ప్రతులు, సూక్ష్మ పరిమాణంలోని ఖురాన్ గ్రంథాలు, భారీ పరిమాణంలో తయారైన ఖురాన్ పుస్తకాలు సంరక్షించబడుతున్నాయి. ముఖ్యంగా రంజాన్ మాసంలో మసీదులు, ఇళ్లలో పిల్లలు, మహిళలు, వృద్ధులు కలిసి ఖురాన్ పఠనం చేయడం ద్వారా విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఖురాన్‌కు సంబంధించిన అనేక విశేషాలు ఈ పవిత్ర గ్రంథానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి.!"

ఫీచర్స్ డెస్క్ - మనసులో మాట



- ప్రపంచంలో అతి ప్రాచీన ఖురాన్ ప్రతులు
- 'మక్కా'లో ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్
- సూక్ష్మ పరిమాణంలో అతి చిన్న ఖురాన్
- ఖురాన్ ఆకారంలో నిర్మితమైన మ్యూజియాలు, విశేషాలు
- రంజాన్ మాసంలో మరీ ప్రత్యేకం.. సామూహిక పఠనం కూడా









### ప్రపంచంలోని అతి ప్రాచీన ఖురాన్ ప్రతులు

ఖురాన్ చరిత్రలో అత్యంత పురాతనంగా గుర్తించబడిన ప్రతుల్లో ఒకటి 'సమర్‌కండ్' ఖురాన్. ప్రస్తుతం ఇది ఉజ్బెకిస్తాన్ దేశంలోని తాష్కెంట్ నగరంలోని హస్త్ ఇమామ్ గ్రంథాలయంలో సంరక్షించబడుతోంది. ఈ ప్రతిని 7వ శతాబ్దం కాలానికి చెందినదిగా భావిస్తున్నారు. ఈ గ్రంథం ఖలీఫా ఉస్మాన్ కాలంలో తయారైన ఖురాన్ ప్రతులలో ఒకటిగా సంప్రదాయం చెబుతుంది. అదేవిధంగా ఇరాన్‌లోని మష్హద్ గ్రంథాలయంలో కూడా ప్రాచీన ఖురాన్ ప్రతులు ఉన్నాయి. వీటి కొన్ని భాగాలు మొదటి ఇస్లామిక్ శతాబ్దానికి చెందినవిగా పండితులు భావిస్తున్నారు. ఈ పురాతన ప్రతులు ఇస్లామిక్ చరిత్ర, అరబిక్ కాలిగ్రఫీ కళ, గ్రంథ సంరక్షణ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి.



### ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్

సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో హిరా కల్చరల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఖురాన్ మ్యూజియంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్ ప్రదర్శించబడుతోంది. ఈ భారీ గ్రంథం సుమారు 312 సెం.మీ ఐ 220 సెం.మీ పరిమాణంలో, సుమారు 700 పేజీలతో రూపొందించబడింది. ఈ గ్రంథాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రపంచంలోనే అతిపెద్ద ఖురాన్‌గా గుర్తించింది. ఈ ఖురాన్ అరబిక్ కాలిగ్రఫీ, అలంకరణ కళ, బంగారు అలంకరణలతో రూపొందించబడిన అరుదైన కళాఖండంగా కూడా గుర్తింపు పొందింది.



### అతి చిన్న ఖురాన్ - సూక్ష్మ అద్భుతం

ప్రపంచంలో అత్యంత చిన్న పరిమాణంలో ఉన్న ఖురాన్ ప్రతులు కూడా ఉన్నాయి. జోర్డాన్‌లోని ఒక మ్యూజియంలో ప్రదర్శిస్తున్న ఖురాన్ సుమారు 2.5 సెం.మీ పొడవు, 1.5 సెం.మీ వెడల్పు మాత్రమే ఉంటుంది. ఈ చిన్న గ్రంథాన్ని చదవడానికి ప్రత్యేకంగా పెద్ద కంటకన్నం అవసరం అవుతుంది. అజర్బైజాన్‌లోని గంజా నగరంలోని మినియేచర్ బుక్ మ్యూజియంలో కూడా సుమారు 2 ఐ 3 సెం.మీ పరిమాణంలో ఖురాన్ ప్రతిని సంరక్షిస్తున్నారు. ఇవి ఖురాన్ పట్ల భక్తి ఎంతటి స్థాయిలో ఉందో తెలియజేసే అద్భుత కళాఖండాలు.

### ఖురాన్ గ్రంథ నిర్మాణ వైశిష్ట్యం

ఖురాన్ గ్రంథం మొత్తం 114 'సూరాలు'..వేలాది 'ఆయతు'లతో రూపొందింది. ఇందులో మానవ జీవన విధానం, నైతిక విలువలు, దయ, సత్యం, న్యాయం వంటి అంశాలు వివరించబడతాయి. అందుకే ఖురాన్‌ను ముస్లింలు కేవలం మత గ్రంథంగా కాకుండా జీవన మార్గదర్శిగా భావిస్తారు.!

### ఖురాన్ ఆకారంలో నిర్మితమైన భవనాలు

ప్రపంచంలోని కొన్ని దేశాలలో ఖురాన్‌ను ప్రతిబింబించే విధంగా మ్యూజియాలు, సాంస్కృతిక కేంద్రాలు నిర్మించబడ్డాయి. మలేషియాలోని మలక్కా నగరంలో ఉన్న అల్-ఖురాన్ మ్యూజియం ఖురాన్ చరిత్ర, అరుదైన ప్రతులు, కళా సంపదలను ప్రదర్శించే ప్రత్యేక కేంద్రంగా నిలుస్తోంది. ఈ మ్యూజియాల్లో ఖురాన్ ప్రతుల అభివృద్ధి, ఇస్లామిక్ కాలిగ్రఫీ, ప్రపంచవ్యాప్తంగా ఖురాన్ వ్యాప్తి గురించి ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

### రంజాన్ మాసంలో ఖురాన్ పఠనం

ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఖురాన్ పఠనానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలో మసీదుల్లో 'తరావీహ్' నమాజ్ సందర్భంగా ఖురాన్ సంపూర్ణ పఠనం నిర్వహిస్తారు. కుటుంబాల్లో పిల్లలు, మహిళలు, వృద్ధులు కలిసి సామూహికంగా ఖురాన్ చదవడం ఒక ఆధ్యాత్మిక సంప్రదాయంగా కొనసాగుతోంది.





### జీవిత చరమాంకంలో ఖురాన్ పఠనం

ముస్లింలలో జీవిత చివరి దశలో కూడా ఖురాన్ పఠనం చేయడం విశ్వాసానికి సంకేతంగా భావిస్తారు. ఖురాన్ వచనాలు మనసుకు శాంతిని అందిస్తాయని, ఆధ్యాత్మిక ధైర్యాన్ని ఇస్తాయని విశ్వాసం ఉంది.

### ఆధ్యాత్మిక విలువల నిధి.!

ప్రాచీన ప్రతుల నుండి సూక్ష్మ గ్రంథాల వరకూ, భారీ ఖురాన్ పుస్తకాల నుండి మ్యూజియాల వరకూ..ప్రపంచవ్యాప్తంగా ఖురాన్‌కు లభిస్తున్న గౌరవం అపారమైనది. కాలం మారినా, తరాలు మారినా ఖురాన్ సందేశం మానవాళికి నైతికత, శాంతి, సత్యం దిశగా మార్గం చూపుతూ కొనసాగుతూనే ఉంది. మొత్తంగా చూస్తే ఖురాన్ కేవలం ఒక మత గ్రంథమే కాదు..అది మానవ సమాజానికి నైతికత, కరుణ, ధర్మం, సహనం వంటి విలువలను బోధించే ఆధ్యాత్మిక మార్గదర్శి. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ పవిత్ర గ్రంథ సంప్రదాయం నేటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది విశ్వాసుల జీవితాలను ప్రభావితం చేస్తూనే ఉంది.





# నేను మనిషినే..

### నేను కూడా తప్పులు చేసి ఉండొచ్చు..

## విరాట్, రోహిత్ వివాదంపై గంభీర్ వ్యాఖ్యలు

**ముంబై:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. స్టార్ ప్లేయర్స్ విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మకు ఎప్పుడూ పొసగదని.. వారి మధ్య ఏదో జరుగుతుందని పుకార్లు షికార్లు చేయగా.. కొన్ని సార్లు అది బహిర్గతం కూడా అయ్యింది.. అయితే, విరాట్, రోహిత్‌తో తన సంబంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు గంభీర్.. గత కొంతకాలంలో తాను కూడా కొన్ని తప్పులు చేసి ఉండవచ్చని ఆయన అంగీకరించారు. అంతేకాదు.. నేను మనిషినే.. నేను కూడా తప్పులు చేసి ఉండొచ్చు అని పేర్కొన్నారు..

### రెవ్‌స్పోర్ట్జ్ కాన్‌క్లేవ్‌లో గంభీర్ వ్యాఖ్యలు

మార్చి 16న కోల్‌కతాలో జరిగిన RevSportz Conclaveలో మాట్లాడిన టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. ఆటగాళ్లతో వ్యవహరించే విషయంలో తీసుకున్న నిర్ణయాలు ఎల్లప్పుడూ మంచి ఉద్దేశ్యంతోనే తీసుకున్నానని తెలిపారు. “నేను కూడా మనిషినే. నేను తప్పులు చేయొచ్చు. ఆటగాళ్లకు కూడా తప్పులు చేసే హక్కు ఉంది. గత 18 నెలల్లో నేను కొన్ని తప్పులు చేసి ఉండవచ్చు. కానీ, నా ఉద్దేశాలు ఎప్పుడూ సరైనవే. మంచి ఉద్దేశ్యంతో తీసుకున్న తప్పుడు నిర్ణయాన్ని అంగీకరించవచ్చు. అయితే, చెడు ఉద్దేశ్యంతో తీసుకున్న నిర్ణయం మాత్రం డ్రెస్సింగ్ రూమ్‌లో ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు” అని గంభీర్ అన్నారు. అంతేకాదు.. డ్రెస్సింగ్ రూమ్ ముందు నిలబడి ఆటగాళ్ల కళ్లలోకి చూసి నిజాయితీగా మాట్లాడగలిగితేనే కోచ్‌గా తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తిస్తున్నానని గంభీర్ పేర్కొన్నారు.

### కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్ తర్వాత మార్పులు

గంభీర్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కొన్ని నెలలకే విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఈ నిర్ణయం 2024–25లో జరిగిన.. Border-Gavaskar Trophyలో భారత జట్టు నిరాశపరిచిన ప్రదర్శన తర్వాత వచ్చింది. అలాగే న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కూడా భారత్ ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో బీసీసీఐ జట్టు ప్రదర్శనను సమీక్షించి కొన్ని కొత్త మార్గదర్శకాలను అమలు చేసింది.

### యువ ఆటగాళ్లకు అవకాశాలు

కోహ్లీ, రోహిత్ టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకున్న తర్వాత భారత టెస్ట్ జట్టులో మార్పుల దశ ప్రారంభమైంది. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వగా, శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. గంభీర్, గిల్ నాయకత్వంలో భారత్ ఇంగ్లాండ్ పర్యటనలో టెస్ట్ సిరీస్‌ను డ్రా చేసుకుంది. అలాగే స్వదేశంలో వెస్టిండీస్‌పై విజయం సాధించింది. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో జట్టు పరాజయం చవిచూసింది. మరోవైపు.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. భారత జట్టుకు వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతున్నారు. ఇద్దరూ ICC Cricket World Cup 2027పై దృష్టి సారించారు. అయితే, ప్రపంచకప్ జట్టులో వారి స్థానం ప్రదర్శన ఆధారంగానే నిర్ణయిస్తామని జట్టు మేనేజ్‌మెంట్, సెలెక్టర్లు స్పష్టం చేశారు.

# పాక్ క్రికెట్‌లో సంక్షోభం

### అల్లుడిని టార్గెట్ చేసిన షాహీద్ అఫ్రిది.. • బంగ్లాదేశ్ చేతిలో పాక్ ఘోర పరాజయం..

### పాక్ సెలక్టర్లు, అల్లుడిపై షాహీద్ అఫ్రిది విమర్శలు





**ఢిల్లీ:** ఇటీవల టీ20 వరల్డ్ కప్‌లో ఘోర పరాజయాలు మరవకముందే, పాకిస్తాన్ జట్టు బంగ్లాదేశ్ చేతిలో దారుణంగా ఓడిపోయింది. బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను 2-1 తేడా పాకిస్తాన్ పరాజయాలను చవిచూసింది. దీంతో పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు ఆటగాళ్లు, సెలక్షన్ కమిటీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. పాక్ మాజీ స్టార్ షాహీద్ అఫ్రిది, తన అల్లుడు అని చూడకుండా షాహీన్ అఫ్రిదిపై విమర్శలు గుప్పించారు. ఆదివారం జరిగిన మూడో వన్డేలో సల్మాన్ అలీ ఆఘా నేతృత్వంలోని పాక్ టీమ్ ఓడిపోయింది. ఓటమి తర్వాత షాహీద్ అఫ్రిది ఒక వీడియోలో మాట్లాడుతూ.. బాబర్ అజమ్‌ను జట్టు నుంచి తప్పించడంతో పాటు తన అల్లుడు షహీన్ అఫ్రిదికి కెప్టెన్సీ అప్పగించాలనే నిర్ణయాన్ని ప్రశ్నించారు. పాక్ జట్టులో సర్జరీల పేరుతో నాశనం చేస్తున్నారని పీసీబీ సెలెక్టర్లపై షాహిద్ అఫ్రిది మండిపడ్డారు. “మీరు 2026 ౹20 ప్రపంచ కప్‌లో ప్రదర్శనలను చూశారు, ఆ తర్వాత మేము బంగ్లాదేశ్ సిరీస్‌ను కూడా 2--1తో కోల్పోయాము. నా అభిప్రాయం ప్రకారం, సెలక్షన్ కమిటీ విమర్శలకు అర్హమైనది. కమిటీలోని మీరందరూ చాలా క్రికెట్ ఆడారు, అయినప్పటికీ ఏ ఫార్మాట్‌కు ఎవరు కెప్టెన్‌గా ఉండాలో మీకు ఇంకా ఆలోచన ఉన్నట్లు లేదు” అని అఫ్రిది అన్నారు. “మీరు సర్జరీల పేరుతో చాలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. పాకిస్థాన్ దేశవాళీ క్రికెట్ ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి సరిపోవు, అలాంటి చోట రెండు మూడు మ్యాచ్‌లు ఆడిన వారికి నేరుగా పాకిస్థాన్ క్యాప్ ఇవ్వడం ఏంటి?” అని ప్రశ్నించారు. సీనియర్ ఆటగాళ్లు టీ20 వరల్డ్ కప్‌లో మంచి ప్రదర్శన చేయనప్పటికీ, వన్డేల్లో మంచి రికార్డులు కలిగి ఉన్నారని, అలాంటి వారిని పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాకిస్థాన్-బంగ్లాదేశ్ మ్యాచ్‌లో మరో వివాదం..

### వైడ్ బాల్‌కి రివ్యూ, ఐసీసీకి ఫిర్యాదు!




**ఢిల్లీ:** మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఢాకా వేదికగా ఆదివారం పాకిస్థాన్–బంగ్లాదేశ్ మధ్య జరిగిన మూడో వన్డేలో వివాదం చోటుచేసుకుంది. మ్యాచ్ చివరి ఓవర్‌లో జరిగిన ఒక ఘటన ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంపైర్ తీసుకున్న నిర్ణయం, దానిపై బంగ్లాదేశ్ జట్టు తీసుకున్న రివ్యూ కారణంగా రెండు జట్ల మధ్య వివాదం తలెత్తింది. ఇప్పటికే ఈ సిరీస్‌లోని రెండో వన్డే మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ అఘా రనౌట్ తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ విజయానికి చివరి ఓవర్‌లో 14 రన్స్ అవసరం అయ్యాయి. ఆ ఓవర్‌ను బంగ్లా స్పిన్నర్ రిషాద్ వేశాడు. తొలి రెండు బంతులకు రిషాద్ పరుగులు ఇవ్వలేదు. మూడో బంతికి రెండు రన్స్ వచ్చాయి. నాలుగో బంతికి పరుగేమీ రాలేదు. ఐదో బాల్‌ని రిషాద్ లెగ్ సాధించగా.. బంతిని షాహీన్ అఫ్రిది డౌన్ ది లెగ్ ఆడటానికి ప్రయత్నించాడు. షాట్ కనక్ట్ కాలేదు. దీంతో ఫీల్డ్ అంపైర్ వైడ్‌గా ప్రకటించాడు. వికెట్ కీపర్ లిట్టన్ దాస్ సూచన మేరకు బంగ్లా కెప్టెన్ రివ్యూ తీసుకున్నాడు. ఇక్కడే వివాదం చోటు చేసుకుంది. రివ్యూలో బంతి వైడ్ కాదని, సరైన బంతేనని థర్డ్ అంపైర్ తేల్చాడు. ఈ ఘటన తర్వాత పాకిస్థాన్ ప్లేయర్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బంగ్లా ఆటగాళ్లు మైదానంలోని బిగ్ స్క్రీన్‌పై రీప్లే చూసిన తర్వాతే.. రివ్యూకి వెళ్లారని పాక్ ఆరోపించింది. ఫీల్డ్ అంపైర్ నిర్ణయం అనంతరం 15 సెకన్లలోపే డీఆర్ఎస్ కోరాలని, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా రివ్యూకు అంపైర్ అనుమతించడంపై పాక్ అసహనం వ్యక్తం చేసింది. ఇది మ్యాచ్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. ఈ విషయంపై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వివాదంపై ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# గేల్ 175 రికార్డును బద్ధలు కొడతా

### వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ధీమా

**న్యూఢిల్లీ, మార్చి 16:** ఐపీఎల్ చరిత్రలో ‘యూనివర్స్ బాస్’ క్రిస్ గేల్ నెలకొల్పిన 175 పరుగుల భారీ స్కోరు రికార్డును బద్ధలు కొట్టడమే తన లక్ష్యమని టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం ఢిల్లీలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అట్టహాసంగా నిర్వహించిన ‘నమన్ అవార్డుల’ వేడుకలో ఈ 14 ఏళ్ల కుర్రాడు తన భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. టీమిండియా స్టార్స్ సంజు శాంసన్, హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మలతో కలిసి వేదికను పంచుకున్న ఈ బీహార్ యువ కిరణం, ప్రముఖ వ్యాఖ్యాత హర్ష భోగ్లే అడిగిన ప్రశ్నకు తడుముకోకుండా సమాధానమిచ్చాడు. ఐపీఎల్‌లో నీవు బద్ధలు కొట్టాలనుకుంటున్న అతిపెద్ద రికార్డు ఏది అని హర్ష భోగ్లే అడగ్గా, 2013లో పూణే వారియర్స్‌పై గేల్ సాధించిన చారిత్రాత్మక స్కోరును అధిగమించడమే తన లక్ష్యమని వైభవ్ తన ఆత్మవిశ్వాసాన్ని చాటాడు. వైభవ్ మాటలు కేవలం అతిశయోక్తి కాదని అతని ఇటీవలి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 అండర్–19 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై వైభవ్ సృష్టించిన విధ్వంసం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. కేవలం 80 బంతుల్లోనే 15 ఫోర్లు, 15 సిక్సర్లతో 175 పరుగులు సాధించి, అండర్–19 వరల్డ్ కప్ ఫైనల్ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతని అద్భుత బ్యాటింగ్ వల్లే భారత్ రికార్డు స్థాయిలో ఆరోసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటికే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న వైభవ్, 2025 సీజన్‌లో కేవలం 14 ఏళ్ల 32 రోజుల వయసులో గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. 35 బంతుల్లోనే వంద పరుగులు పూర్తి చేసి, క్రిస్ గేల్ తర్వాత ఐపీఎల్‌లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా, అలాగే ఒక భారతీయుడిగా ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026లో ఈ యువ వండర్ కిడ్ మరెన్ని సంచలనాలు సృష్టిస్తాడో అని విశ్లేషకులు మరియు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సెల్వ ప్రభుకు రజతం




**న్యూఢిల్లీ:** అమెరికా వేదికగా జరిగిన ఎన్‌సీఏఏ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ సెల్వ ప్రభు రజత పతకంతో మెరిశాడు. ఆదివారం జరిగిన పురుషుల ట్రిపుల్‌జంప్ ఫైనల్లో సెల్వ ప్రభు 17.05మీటర్ల ఎత్తు దూకి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. వరల్డ్ అథ్లెటిక్స్ అండర్–20 టోర్నీ రజత విజేత అయిన ప్రభు జాతీయ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన ప్రభు రెండో స్థానంలో నిలిచి సత్తాచాటాడు. జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఏఎఫ్ఐ) కఠినమైన డోపింగ్ నిబంధనలతో అథ్లెట్లు తమ జాతీయ రికార్డుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.

# పాక్ క్రికెటర్ కొనుగోలుపై విమర్శలు..

### కావ్య మారన్‌ను నిలదీసిన గవాస్కర్

**ఢిల్లీ:** ఐపీఎల్ కోసం.. పాకిస్తాన్ క్రికెటర్‌ను కొనుగోలు చేసిన విషయంపై సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ నిర్ణయంపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ స్పందిస్తూ ఫ్రాంచైజీ యాజమాన్యంపై ప్రశ్నల వర్షం కురిపించారు.. ఇంగ్లాండ్‌లో నిర్వహించే ఫ్రాంచైజీ టోర్నమెంట్ ది హండ్రెడ్ కోసం జరిగిన ఆటగాళ్ల వేలంలో, సన్‌రైజర్స్ లీడ్స్ పాకిస్తాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ను సుమారు రూ.2.34 కోట్లుకు కొనుగోలు చేసింది. సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు రాబఅ +తీశీబజూ యాజమాన్యంలో ఉంది. ఇదే సంస్థ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోని సన్‌రైజర్ హైదరాబాద్‌జట్టును కూడా నిర్వహిస్తోంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. భారతదేశం–పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో పాకిస్తాన్ ఆటగాడిని కొనుగోలు చేయడం ఎందుకు అన్న ప్రశ్నలు లేవనెత్తారు. వేలం సమయంలో హాజరైన ఫ్రాంచైజీ సీఈవో కావ్య మారన్ కూడా విమర్శలకు గురయ్యారు.







### గవాస్కర్ తీవ్ర వ్యాఖ్యలు

ఈ అంశంపై తన కాలమ్‌లో స్పందించిన సునీల్ గవాస్కర్, గత కొన్ని సంవత్సరాల్లో భారత్–పాకిస్తాన్ మధ్య జరిగిన సంఘటనలను పరిగణలోకి తీసుకుంటే ఇటువంటి ప్రతిచర్య న వా జ వం ని పేర్కొన్నారు. 2008లో జరిగిన 2008 ముంబై దాడుల తర్వాత పాకిస్తాన్ ఆటగాళ్లను ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడనివ్వలేదని ఆయన గుర్తు చేశారు. అలాగే 2019లో జరిగిన పుల్వామ అటాక్‌వంటి ఘటనలు భారతదేశంలో ప్రజల భావోద్వేగాలను ప్రభావితం చేశాయని తెలిపారు. భారత యాజమాన్యంలో ఉన్న జట్టు పాకిస్తాన్ ఆటగాడికి చెల్లించే డబ్బు అక్కడ పన్నుల రూపంలో ప్రభుత్వానికి చేరుతుందని, ఆ నిధులను ఆయుధాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశముందని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. భారత యజమాని ఒక పాకిస్తాన్ ఆటగాడికి డబ్బు చెల్లిస్తే, అది పరోక్షంగా భారత సైనికులు లేదా పౌరులపై ప్రభావం చూపే వ్యవస్థకు నిధులు సమకూర్చినట్టే అవుతుంది. ఒక టోర్నమెంట్ గెలవడం భారతీయుల ప్రాణాల కంటే ముఖ్యమా?” అని ఆయన ప్రశ్నించారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక

# ఆస్కార్ అవార్డుల వేడుకల్లో అరుదైన సంఘటన



## ఆస్కార్ అవార్డును సమానంగా గెలుచుకున్న రెండు సినిమాలు

అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ చోటు చేసుకుంది. దాదాపు 14 ఏళ్ల తర్వాత ఒకే విభాగంలో రెండు సినిమాలు సమానంగా నిలిచి ఆస్కార్ అవార్డును గెలుచుకున్నాయి. దీంతో డాల్బీ థియేటర్‌లో జరిగిన వేడుకలో ఈ సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం' కేటగిరీలో 'ది సింగర్స్' మరియు 'టు పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా' చిత్రాలు సంయుక్తంగా విజేతలుగా నిలిచాయి. ఈ అవార్డును ప్రకటించడానికి ప్రజెంటర్ కుమాయిల్ నంజియాని స్టేజ్‌పైకి వచ్చారు. అయితే ఎన్వలప్ తెరిచిన తర్వాత కొద్దిసేపు ఏమీ చెప్పకుండా ఉండడంతో అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు. కొద్దిసేపటి తర్వాత ఆయన ఈ కేటగిరీ టై అయిందని, ఇద్దరు విజేతలు అవార్డును గెలుచుకున్నారని ప్రకటించారు. దీంతో డాల్బీ థియేటర్ మొత్తం చప్పట్లతో మార్మోగిపోయింది. ఆస్కార్ చరిత్రలో ఇలా ఒకే విభాగంలో ఇద్దరు విజేతలు రావడం ఇది ఏడోసారి కావడం విశేషం. అంతేకాకుండా 2012 తర్వాత మళ్లీ ఈ తరహా టై నమోదు కావడం ఇదే మొదటిసారి. అవార్డు ప్రకటించిన తర్వాత కుమాయిల్ నంజియాని సరదాగా స్పందిస్తూ, షార్ట్ ఫిలిం అవార్డు ఇవ్వడానికి ఇప్పుడు రెట్టింపు సమయం పడుతుంది

### ఆస్కార్ చరిత్రలో టై అయిన సందర్భాలు

- **1932** ఉత్తమ నటుడు (వాలెస్ బీరీ, ఫ్రెడ్రిక్ మార్చ్)
- **1949** బెస్ట్ డాక్యుమెంటరీ (ఏ ఛాన్స్ టు లివ్, సో మచ్ ఫర్ సో లిటిల్)
- **1968** ఉత్తమ నటి (కేథరిన్ హెప్బర్న్, బార్బరా స్ట్రీసాండ్)
- **1986** బెస్ట్ ఫీచర్ డాక్యుమెంటరీ (ఆర్టీ షా: టైమ్ ఈజ్ ఆల్ యూ హావ్ గాట్, డౌన్ అండ్ అవుట్ ఇన్ అమెరికా)
- **1994** బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం (ఫ్రాంక్ కాఫ్కాస్ ఇట్స్ ఏ వండర్ ఫుల్ లైఫ్, ట్రెవర్)
- **2012** ఉత్తమ సౌండ్ ఎడిటింగ్ (స్కైఫాల్, జీరో డార్క్ థర్టీ)
- **2026** బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం (ది సింగర్స్, టు పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా)

మొత్తానికి ఆస్కార్ 2026 వేడుకల్లో జరిగిన ఈ అరుదైన సంఘటన ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది. ఒకే కేటగిరీలో రెండు సినిమాలు విజేతలుగా నిలవడం సినీ ప్రపంచంలో అరుదైన ఘట్టంగా నిలిచింది.

## ఆస్కార్‌లో ధర్మేంద్ర, కోటలకు నివాళి

అద్భుతమైన నటనతో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని.. గతేడాదిలో తుదిశ్వాస విడిచిన నటీనటులకు ఆస్కార్ నివాళులర్పించింది. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుకలో ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దిగ్గజాల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది. ఆస్కార్ వేడుక ప్రారంభంలో గతేడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులకు నివాళులర్పిస్తూ వీడియోను ప్రదర్శించారు. వారిని స్మరించుకుంటూ వారితో ఉన్న జ్ఞాపకాల గురించి కొందరు వేదికపై మాట్లాడారు. అయితే, ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తంచేస్తూ ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. సమయాభావం వల్ల వీడియోలో కొందరినే చూపారని.. ఆ తర్వాత అందరి పేర్లను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని హాలీవుడ్ మీడియా పేర్కొంది. 89 ఏళ్ల వయసులో గతేడాది నవంబర్ 24న ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్రం పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఇక 40 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన కోట శ్రీనివాసరావు గతేడాది జులై 13న మరణించిన విషయం తెలిసిందే.







## వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్

### ఆస్కార్‌లు పండించిన మూవీ

### ఏకంగా ఆరు ఆస్కార్‌లు ప్రదానం

కథలో బలం, పాత్రల మధ్య సంఘర్షణ ఉండాలే గానీ.. బాక్సాఫీసు లెక్కలతో పని లేకున్నా పురస్కారాల పంట పండుతుందని వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ సినిమా నిరూపించింది. సినీ రంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే అకాడమీ అవార్డుల్లో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఆరు 'ఆస్కార్ లు అందుకుంది. బిడ్డ నమ్మకం గెలుచుకోవడం కోసం ఓ తండ్రి పడే తపనను హృద్యంగా తీర్చిదిద్ది ఉత్తమ దర్శకుడిగానూ అవార్డు అందుకున్నారు పాల్ థామస్ అండర్సన్. బ్లాక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రంలో లియోనార్డో డికాప్రియో కీలక పాత్ర పోషించారు. విప్లవకారుల గ్రూప్ ఫ్రెంచ్ 75లో సభ్యులైన ప్యాట్ కల్హౌన్ (లియోనార్డో డికాప్రియో), పెర్ఫిడియా బేవర్లీ హిల్స్ (టియానా టేలర్) సహజీవనంలో ఉంటారు. ఓ నిర్బంధ కేంద్రం నుంచి వలసదారులను విడిపించే క్రమంలో అక్కడి కమాండింగ్ అధికారి స్టీవెన్‌ను పెర్ఫిడియా అవమానిస్తుంది. దీంతో వీరిద్దరిపైనా అతడు పగ పెంచుకుంటాడు. ఆ తర్వాత ఓ కేసులో ఆమెను పట్టుకున్న స్టీవెన్.. తనతో ఏకాంతంగా గడిపితే విడిచిపెడతానని షరతు పెడతాడు. ఇందుకు పెర్ఫిడియా అంగీకరిస్తుంది. కొంతకాలానికి ఆమె బిడ్డకు జన్మిస్తుంది. కానీ, ఆ చిన్నారిని, తన భాగస్వామి ప్యాట్‌ను వదిలేసి మళ్లీ విప్లవం బాట పడుతుంది. ఈ క్రమంలోనే స్టీవెన్ సాయంతో మెక్సికోకు వెళ్లిపోతుంది. దీంతో ప్యాట్ ఒంటరి తండ్రిగా చిన్నారి చార్లీన్‌ను పెంచుతాడు. ఈ క్రమంలో వారికి ఎన్నో అవమానాలు ఎదురవుతాయి. మరోవైపు.. అవినీతి అధికారి అయిన స్టీవెన్ అమెరికా సెక్యూరిటీ ఏజెన్సీస్‌లో అగ్రస్థాయికి ఎదుగుతాడు. 16ఏళ్ల తర్వాత పెర్ఫిడియా జన్మనిచ్చిన చిన్నారికి తానే అసలైన తండ్రినని తెలుసుకున్న స్టీవెన్.. ఆమెను చంపేందుకు కుట్రలు పన్నుతాడు. ఈ విషయం తెలుసుకున్న ప్యాట్ అలియాస్ బాబ్.. ఇన్నాళ్లూ సొంతబిడ్డగా పెంచుకున్న చార్లీన్‌ను కాపాడేందుకు ఏం చేస్తాడు? ఆ పోరాటంలో అతని ఆలోచనలు, సంబంధాలు, నైతిక విలువలు ఎలా మారతాయి? స్వార్థం తన పరిస్థితులను ఎలా మార్చేసింది? తల్లి మీద కోపం, పెంచిన తండ్రి మీద అనుమానంతో ఎటూ తేల్చుకునే స్థితిలో ఉన్న చార్లీన్ నమ్మకాన్ని ప్యాట్ ఎలా గెలుచుకోగలిగాడు? అన్నదే ఈ చిత్ర కథ. 2000 నాటి వైన్‌లాండ్ నవల ఆధారంగా దర్శకుడు పాల్ థామస్ అండర్సన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గతేడాది సెప్టెంబరు 26న వార్నర్ బ్రదర్స్ నిర్మాణ సంస్థ ఈ సినిమాను విడుదల చేసింది. బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించకపోయినా.. అండర్సన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. అటు విమర్శకుల ప్రశంసలతో పాటు అనేక పురస్కారాలు సాధించింది. తాజాగా జరిగిన ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుల్లో మొత్తం 13 విభాగాల్లో ఈ సినిమా నామినేషన్లలో నిలిచింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ క్యాస్టింగ్, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో ఆరు పురస్కారాలు అందుకుంది. తండ్రి పాత్రలో లియో తన బిడ్డ కోసం పడే తపన ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉంది.

## పగలు రాత్రి తేడా పని చేశా

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతున్న భారీ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక రాశీ ఖన్నా మీడియాతో పంచుకున్నారు.' నా కెరీర్ ఆరంభం నుంచే పవన్ కళ్యాణ్ గారి స్టార్డమ్, ఆయనకున్న 'పవనిజం' గురించి విన్నాను. ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలని కోరుకున్నాను, ఈ చిత్రంతో నా కల నెరవేరింది. పవన్ గారు చాలా నిరాడంబరంగా ఉంటారు, సెట్‌లో ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. ఆయనలోని మానవత్వం, ప్రజల పట్ల ఆయనకున్న ఆలోచనలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. ఈ సినిమాలో నేను 'శ్లోక' అనే మోడరన్ అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉండేలా దర్శకుడు హరీష్ శంకర్ డిజైన్ చేశారు. నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం, ఇందులో ఒక మాస్ సాంగ్ ఉంది, దాని షూటింగ్‌ను చాలా ఎంజాయ్ చేశాను. శ్రీలీల, నేను ఇద్దరం హీరోయిన్లము అయినప్పటికీ, ఎవరి ప్రాధాన్యత వారికుంది. దర్శకుడు హరీష్ శంకర్ గారికి మాస్ పల్స్ బాగా తెలుసు. సాధారణంగా 120 రోజులు పట్టే షూటింగ్‌ను తన ప్లానింగ్‌తో కేవలం 40 రోజుల్లోనే పూర్తి చేశారు. ఆయన అంకితభావం చూసి ఆశ్చర్యపోయాను. సెట్‌లోనే అప్పటికప్పుడు పంచ్ డైలాగ్స్ రాయడం ఆయన స్పెషాలిటీ. పవన్ కళ్యాణ్ గారి బిజీ షెడ్యూల్స్ వల్ల షూటింగ్ సమయంలో కొన్ని సర్దుబాట్లు చేయాల్సి వచ్చింది. పగలు, రాత్రి తేడా లేకుండా వరుసగా 24 గంటల షిఫ్టులు కూడా పని చేశాను. అయినా సరే, అటు పవన్ గారు, ఇటు మైత్రి మూవీ మేకర్స్ వంటి పెద్ద బ్యానర్‌లో పని చేయడం వల్ల ఆ కష్టం తెలియలేదు. ఈ సినిమా ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. 'గబ్బర్ సింగ్' చిత్రంలో పవన్ కళ్యాణ్ గారిని ఎలాగైతే చూశారో, మళ్ళీ అదే వింటేజ్ లుక్, ఎనర్జీని ఈ సినిమాలో చూస్తారు. ఉగాది పండుగ రోజున థియేటర్లలో ప్రేక్షకులకు ఇది ఒక విందు భోజనంలా ఉంటుంది.






## ఆస్కార్‌లో మెరిసిన ఈషా అంబానీ

సినీ రంగ ప్రతిష్టాత్మక వేడుక 'ఆస్కార్ 2026' అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తనయ ఈషా అంబానీ సందడి చేశారు. వింటేజ్ వాలెంటినో గౌన్‌లో రెడ్ కార్పెట్‌పై మెరిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. తన భర్త ఆనంద్ పిరమాల్‌తో కలిసి ఈషా అంబానీ ఆస్కార్ వేడుకకు హాజరయ్యారు. ఈషా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ఈవెంట్‌కు ముందు ఈషా అంబానీ అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఈ మ్యూజియంతో నీతా ముకేశ్ అంబానీ కల్చర్ సెంటర్ కలిసి పనిచేసే అంశాన్ని ఆమె చర్చించినట్లు సమాచారం. భారతీయ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై ప్రతిబింబించడంతో పాటు ఇండియన్ సినిమాకు మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఈషా అంబానీ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఆస్కార్ అవార్డుల కార్యక్రమంలో ఈషా పాల్గొనడం ఇదే తొలిసారి. ఆ మధ్య ఈమె మెట్ గాలాలో సందడి చేసిన సంగతి తెలిసిందే

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861